



www.andhrajyothy.com
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 18-8-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 124 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి తె. 3.05 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: ఉత్తరాషాఢ ఉ. 10.15 తదుపరి శ్రవణం; వర్జ్యం: మ. 1.54-3.21; దుర్ముహూర్తం: సా. 4.54-5.44; అమృతఘడియలు: రా. 10.40-12.07; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.02; సూర్యాస్తమయం: 6.35 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


## కువైత్ నుంచే భర్త నిఘా!
2

భార్యపై అనుమానంతో ఇంటిచుట్టూ సీసీ కెమెరాలు

వేధింపులు తాళలేక ఇద్దరు పిల్లలతో మహిళ ఆత్మహత్య

గ్యాస్ సిలిండర్ పేల్చుకుని సజీవ దహనం

## 2027 జాతీయ క్రీడల నిర్వహణకు రాష్ట్రం బిడ్!



నాటి ఉమ్మడి రాష్ట్ర స్థాయిలో నిర్వహణకు యోచన

అమరావతిలో క్రీడా నగరం నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ఇదో సాధనం

ఇప్పటికే పీటీ ఉషను కలిసిన ఎంపీ కేశినేని శివనాథ్

ఈ నెలలో ఆమె రాష్ట్రానికి వచ్చే అవకాశం 11



## వైద్యుల భద్రతపై కమిటీ!

నియమిస్తామని ప్రకటించిన కేంద్రం

దేశవ్యాప్తంగా స్తంభించిన ఓపీ సేవలతో తీవ్ర ఇబ్బందులు పడ్డ రోగులు

వరుసగా రెండో రోజు సీబీఐ ఎదుటకు ఆర్జీ కర్ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్

శనివారం అనంతపురంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది 2



## కరువు తీరేలా జలాలు

నిండు కుండల్లా ప్రధాన జలాశయాలు

పరవళ్లు తొక్కుతున్న కృష్ణా, గోదావరి

జగన్ పాలనలో చివరి రెండేళ్లూ వర్షాభావమే

పైగా బాబు వస్తే కరువు వస్తుందని దుష్ప్రచారం

తిరిగి ఇప్పుడు జల వ్యవస్థలకు ప్రాణం 12

రాష్ట్రంలో ఎయిర్‌పోర్టులను

## విస్తరిస్తాం

ఉన్న ఏడింటిని 14కు పెంచే యోచన

పౌర విమానయాన మంత్రి వెల్లడి

రామ్మోహన్‌తో సీఎం చంద్రబాబు భేటీ

ప్రధాన నగరాలకు ఎయిర్ కనెక్టివిటీ, హెలికాప్టర్, సీప్లేన్స్ సేవలు 11

వ్యవసాయం, వాణిజ్య రంగాల్లో డ్రోన్ల వినియోగంపై చర్చ



శనివారం ఢిల్లీలో ప్రధాని మోదీతో సమావేశమైన సీఎం చంద్రబాబు

# మీదే బాధ్యత!

## మోదీజీ.. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి సహకరించండి


పోలవరానికి నిధులు మంజూరు చేయండి

అమరావతికి త్వరగా నిధులు ఇప్పించండి

వెనుకబడిన ప్రాంతాలకు గ్రాంట్లు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఇవ్వండి

ప్రధాని మోదీకి సీఎం చంద్రబాబు వినతి

కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్, కుమార స్వామితో భేటీ



కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు వినాయకుడి ప్రతిమను బహూకరిస్తున్న చంద్రబాబు

న్యూఢిల్లీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర సమగ్రాభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రాన్ని కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లతో శనివారం చంద్రబాబు భేటీ అయ్యారు. ఆయన ప్రధానితో గంటకుపైగా చర్చలు జరిపారు. ఏపీలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆయన మోదీని కలుసుకోవడం ఇది రెండవసారి. తన లక్ష్యం ఏపీని అభివృద్ధి చేయడమేనని, ఇందుకు తోడ్పాటు అందించాల్సిన

మిగతా 11వ పేజీలో...

## చిక్కుల్లో సిద్ధూ



కర్ణాటక సీఎంపై విచారణకు గవర్నర్ అనుమతి

కేబినెట్ భేటీ అనంతరం బయటకు వస్తున్న సిద్ధరామయ్య

'ముడా' ఇంటి స్థలాల అక్రమాలపై ఫిర్యాదులు

ప్రజా ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు భారీ కుట్ర

బీజేపీ, జేడీఎస్ రాష్ట్ర నాయకులే సూత్రధారులు

గవర్నర్ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధం, చట్టవ్యతిరేకం

ప్రాసిక్యూషన్ అనుమతులపై న్యాయపోరాటం: సీఎం

తప్పుడు ఫిర్యాదుతో సీఎంను ఇరికించే కుట్ర: డీకే

అండగా ఉంటామని కాంగ్రెస్ అధిష్ఠానం భరోసా

మైసూరు, బెంగళూరు సహా రాష్ట్రమంతా నిరసనలు

బెంగళూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార(ముడా) కుంభకోణం కీలక మలుపు తిరిగింది. ఈ అంశంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యపై క్రిమినల్ కేసు నమోదు చేసేందుకు (ప్రాసిక్యూషన్) గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ శనివారం అనుమతులు ఇచ్చారు. ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాలను కుదిపేసింది. ముడాలో 14 ఇంటి స్థలాలను తన సతీమణి పార్వతి పేరిట అక్రమంగా తీసుకున్నారని సిద్దరామయ్య ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. సీఎం ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతించడంతో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. జిల్లాల పర్యటనలో ఉన్న మంత్రులంతా హుటాహుటిన బెంగళూరుకు బయల్దేరారు. సీఎం సిద్దరామయ్యపై ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇచ్చిన పత్రాలు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్, సీఎం కార్యదర్శి, అదనపు ముఖ్య కార్యదర్శి ఎల్‌కే అతీక్‌కు రాజ్‌భవన్ నుంచి అందాయి. కేంద్ర ప్రభుత్వం చేతిలో గవర్నర్ కీలుబొమ్మగా మారారని, ప్రాసిక్యూషన్ అనుమతులు

మిగతా 2వ పేజీలో...

## వేధింపుల గతం మరిచి గగ్గోలా?



గతంలో జగన్ రెడ్డి ఎంత మంది అఖిల భారత సర్వీసు అధికారులను వేధించారో మరచిపోయారు. ఇప్పుడు వెయిటింగ్‌లో ఉన్న అధికారులను కిరాయి సైనికులుగా మార్చుకొని చేయించిన అరాచకాలను మరచిపోయారు. పీఎస్సార్ ఆంజనేయులు ద్వారా మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావును ఆత్మహత్య చేసుకొనే వరకు వేధించలేదా? సొంత ఎంపీ రఘురామ కృష్ణరాజును అరెస్టు చేయించి అరికాళ్లు పగిలేలా కొట్టడంలో పీవీ సునీల్ కుమార్ పాత్ర లేదా?

స్కిల్ కేసులో విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ లక్ష్మీనారాయణ ఇంటికి వచ్చిన సీఐడీ అధికారులకు విచారణ సాఫీగా జరగడానికి సహకరించిన నాపై విధులకు ఆటంకం కలిగించానని కేసు పెట్టించింది కొల్లి రఘురామిరెడ్డి కాదా? ఆరోజు లక్ష్మీనారాయణ ఇంటికి వచ్చిన విచారణ అధికారులకు రఘురామిరెడ్డి ఎన్ని పర్యాయాలు ఫోన్ చేశారో కాల్ డేటా చూస్తే తెలుస్తుంది కదా?

చంద్రబాబు తొందర పడకుండా ఒక పద్ధతి ప్రకారం వ్యవహరిస్తున్నారు. నిర్దిష్టమైన ఆధారాలు లేకుండా ఎవరిపైనా చర్యలు తీసుకోవడంలేదు. అగ్రిగోల్డ్ భూముల కొనుగోలు వ్యవహారంలో మాజీ మంత్రి జోగి రమేశ్ కుమారుడు రాజీవ్‌ను అరెస్టు చేసిన తీరే నిదర్శనం.

మే 13న ఎన్నికలు పూర్తయిన తర్వాత విశ్రాంతి కోసం ఇటలీ వెళ్లాలని చంద్రబాబు నిర్ణయించుకున్నారు. అయితే, ఆయనను లుక్ ఔట్ నోటీసు లేకపోయినా సీఐడీ అధికారుల సూచనలతో శంషాబాద్ విమానాశ్రయంలో ఇమిగ్రేషన్ అధికారులు ఆపేశారు. అప్పుడు ఎన్నికల కోడ్ అమలులో ఉంది. విషయం తెలుసుకున్న ఏపీకి చెందిన సీనియర్ అధికారులు కల్పించుకొని విదేశాలకు వెళ్లడానికి చంద్రబాబును అనుమతించారు. అనుమతి రావడంలో అరగంట ఆలస్యం జరిగి ఉన్నా చంద్రబాబు విదేశీ పర్యటన నిలిచిపోయి ఉండేది. అధికార దుర్వినియోగం అంటే ఇదీ!

ఢిల్లీ లిక్కర్ స్కాంలో నిందితురాలిగా ఉన్న కేసీఆర్ కుమార్తె కవిత ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్నారు. తన బిడ్డ నెలల తరబడి జైలులో ఉండాల్సి రావడాన్ని కేసీఆర్ భరించలేక పోతున్నారు. ఈ క్రమంలో ఆయన బీజేపీ సహాయాన్ని అర్థించడం వాస్తవం.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో..



పోలవరం భూ సేకరణ కార్యాలయం వద్ద కాలిపోయిన పత్రాలు

## పోలవరం ఫైళ్లకు నిప్పు!

### 'మరో మదనపల్లె' దహనం?

ధవళేశ్వరం భూసేకరణ కార్యాలయం వద్ద కీలక ఫైళ్లు బుగ్గి

వాటిలో భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ చెల్లింపు వివరాలు

ఎడమ కాలువ కింద నాడు భూసేకరణలో భారీ స్కామ్

రూ.19 కోట్లు కాజేసిన అప్పటి స్పెషల్ కలెక్టరు

నకిలీ రైతుల పేరిట దందా.. అది బయటపడొద్దనే నిప్పా?

విలేకరులను చూడగానే కాలిన ఫైళ్లు ఆఫీస్‌లోకి..

అవి జిరాక్స్ కాపీలే.. వేస్ట్ తగలబెట్టాం: అధికారులు

గ్రీన్ ఇంక్ సంతకాలు ఎందుకు ఉన్నాయంటే మౌనం

వేస్ట్‌కూ అనుమతి లేకుండా నిప్పు పెట్టకూడదన్నది నిబంధన

రాజమహేంద్రవరం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ఫైళ్లను శుక్రవారం రాత్రి తగలబెట్టేశారు. కొత్త బీరువాలు కొని పాతవన్నీ క్లీన్ చేస్తూ వేస్ట్ పేపర్లను దహనం చేసినట్టు అధికారులు చెబుతున్నా, ఇది మరో మదనపల్లె ఘటనా? అనే అనుమానాలు పొగలా కమ్ముకుంటున్నాయి. తమ భూదందాలు బయటకు వస్తాయని వైసీపీ నేతలు మదనపల్లి ఆర్డీవో కార్యాలయంలోని ఫైళ్లు తగలబెట్టిన

మిగతా 12వ పేజీలో...

## బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

15 శాఖల్లో ఉద్యోగులకు ట్రాన్స్‌ఫర్లు

రేపటి నుంచి 31 వరకు నిషేధం ఎత్తివేత

ఎక్సైజ్‌లో సెప్టెంబరు 5 నుంచి బదిలీలు

పాత 13 జిల్లాల ప్రాతిపదికనే ప్రక్రియ

మార్గదర్శకాలు విడుదల చేసిన సర్కారు

అమరావతి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సాధారణ బదిలీలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. మొత్తం 15 శాఖల్లోని ఉద్యోగులను బదిలీ చేసేందుకు అంగీకరించింది. సోమవారం నుంచి ఈ నెల 31 వరకు బదిలీలపై నిషేధాన్ని తాత్కాలికంగా ఎత్తేస్తూ ఆదేశాలు ఇచ్చింది. ఇదేసమయంలో బదిలీలకు సంబంధించిన మార్గదర్శకాలను

మిగతా 11వ పేజీలో...



డ్యామ్ వద్ద అమరుస్తున్న చివరి స్టాప్‌లాగ్ ఎలిమెంట్



## రైతుల కోసమే ఆరాటం

నీటిని కాపాడాలని ఇద్దరు సీఎంలు కోరారు

కొలతల తేడాతో తొలి రోజున నిస్పృహ కలిగింది

నా అంచనాపై నమ్మకంతో ముందుకెళ్లా: కన్నయ్య

## 'స్టాప్‌లాగ్' సక్సెస్

తుంగభద్ర జలాశయంలో నిలిచిన నీరు

విజయవంతంగా 5 ఎలిమెంట్ల అమరిక

డ్యామ్ వద్ద పండగ వాతావరణం

రియల్ హీరో కన్నయ్య నాయుడికి, ఇంజనీర్లు, కార్మికులకు సన్మానం

గేట్లు మొత్తం దించేసిన అధికారులు

తుంగభద్రలో ప్రస్తుతం 72 టీఎంసీలు

ఎగువన వర్షాలతో కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కరువు సీమ రైతుల్లో ఖరీఫ్ ఆశలు సజీవం

(రాయదుర్గం/బళ్లారి/కర్నూలు - ఆంధ్రజ్యోతి)

'తుంగభద్ర'కు నీటి భరోసా దక్కింది. 'ఆపరేషన్ స్టాప్ లాగ్' వందశాతం విజయవంతమైంది. కరువు సీమ రైతుల ఖరీఫ్ ఆశ సజీవంగా నిలిచింది. హొస్పేటలోని తుంగభద్ర జలాశయంలో కొట్టుకుపోయిన 19వ గేటు స్థానంలో.. స్టాప్ లాగ్ ఏర్పాటు ప్రక్రియ శనివారం విజయవంతంగా పూర్తయింది. క్రస్ట్‌గేట్ నిపుణుడు కన్నయ్యనాయుడు నేతృత్వంలో ఇంజనీర్లు, కార్మికులు మూడు రోజులపాటు పడిన శ్రమ ఫలించింది. శుక్రవారం రాత్రి అత్యంత

మిగతా 12వ పేజీలో...

## రాష్ట్రానికి జ్వరం!



### వింత వైరస్‌తో ఇబ్బందులు

రక్త పరీక్షలోనూ తేలని కారణం

బాధితుల్లో చిత్రమైన లక్షణాలు

100 నుంచి 101 డిగ్రీలపైనే జ్వరం

తీవ్రమైన ఒళ్లు నొప్పులు, వాంతులు

కొంత మందిలో ప్లేట్‌లెట్స్ డౌన్

వైద్యులకూ అంతుచిక్కని జ్వరాలు

రోజురోజుకూ పెరుగుతున్న బాధితులు

పొరుగు రాష్ట్రాలకు బాధితుల పయనం

అమరావతి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): అకస్మాత్తుగా జ్వరం వస్తుంది. అది కూడా 100 నుంచి 101 డిగ్రీల పైనే టెంపరేచర్ ఉంటుంది. దీనికితోడు తీవ్రమైన ఒళ్లు నొప్పులు, మంచం మీద నుంచి కూడా లేవలేని పరిస్థితి. కొంత మందికి వాంతులు.. మరికొంత మందికి జలుబు, దగ్గు, తీవ్రమైన తలనొప్పి లక్షణాలు కనిపిస్తున్నాయి. చాలా మందికి అకస్మాత్తుగా ప్లేట్‌లెట్స్ పడిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రోగం

మిగతా 2వ పేజీలో...



## 'అందరూ' ఎవరు జోగి!?

అగ్రి గోల్డ్ భూములు కొన్నది మీ కుటుంబం ఒక్కటే కదా?

సీఐడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న వాటిని నిషేధ జాబితాలో చేర్చారు 11

సామాన్యులకు రిజిస్ట్రేషన్ అసాధ్యం

అధికారంతో చుట్టబెట్టింది మీరు కాదా

సర్వే నంబరు 88లో భూమిపై ప్రకటన

స్వీయ సవరణతో సర్వే నంబరు 87లో భూములు రిజిస్ట్రేషన్ చేయించలేదా?

అన్నీ తెలిసి చక్కబెట్టింది నిజం కాదా?

## నిజాలు 'ఢమాల్'

డయాఫ్రమ్ వాల్‌పై రోతపత్రిక రాతలు

నిపుణుల బృందం నివేదిక వక్రీకరణ

బాబు హయాంలోనే దెబ్బతిందని గోల

2020లోనే డ్యామేజ్ అని తేల్చిన కేంద్రం

జగన్ ప్రభుత్వానికి రాసిన లేఖలో వెల్లడి

2018లో దెబ్బతింటే ఐదేళ్లు ఏం చేసినట్టు?



12

### డయాఫ్రమ్‌వాల్ బాధ్యతలు బావర్‌కే

కేంద్రాన్ని కోరిన రాష్ట్రం

2018లో ఎల్ అండ్ టీతో కలిసి నిర్మించింది ఈ సంస్థే

### భారీగా నిధుల మళ్లింపు

పోలవరానికి కేంద్రం 8,382 కోట్లు ఇచ్చింది

వైసీపీ ఖర్చు చేసింది రూ.4,167 కోట్లే

మిగతా నిధులేమయ్యాయో జగన్ చెప్పాలి?

పోలవరం ఫైళ్లు తగలబెట్టినవారిని వదలం

ఎంత పెద్దవారున్నా కఠినంగా శిక్షిస్తాం

మంత్రి నిమ్మల రామానాయుడు హెచ్చరిక

# ఏమిటీ ముడా స్కామ్

(బెంగళూరు-ఆంధ్రజ్యోతి)


టీజే అబ్రహం

మైసూరులో దశాబ్దాల క్రితం సిటీ ఇంప్రూవ్‌మెంట్ ట్రస్టు బోర్డు (సీఐటీబీ) ఉండగా.. దాని స్థానంలో 1987లో మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) ఏర్పడింది. సీఎం సిద్దరామయ్య బావమరిది మల్లికార్జునస్వామి కెసరె గ్రామం సర్వే నం.464లో ఉన్న 3.16 ఎకరాల వ్యవసాయ భూమిని 2004లో కొనుగోలు చేశారు. సదరు భూమిని మల్లికార్జునస్వామి మైసూరుకు చెందిన నింగాబింగ్ జౌరా చిన్న కుమారుడు దేవరాజ్ నుంచి కొనుగోలు చేసినట్లు రికార్డులు ఉన్నాయి. అది దేవరాజ్ పిత్రార్జితం. కాగా, మల్లికార్జునస్వామి ఆడపడుచు లాంఛనంగా, సిద్దరామయ్య భార్య పార్వతికి దానవిక్రయం చేశారు. సదరు భూమిని ముడా స్వాధీనం చేసుకుని, పార్కు ఏర్పాటు చేసింది. పరిహారంగా ఆమెకు 14 ఇళ్ల స్థలాలు కేటాయించింది. ముడాలో వేలాది స్థలాలు ఖాళీగా ఉన్నాయి. కానీ, సిద్దరామయ్య అభివృద్ధి చెందిన విజయనగర లే అవుట్‌లో ఇంటి స్థలాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యేగా ముడాకు రాసిన సిఫారసు లేఖను జేడీఎస్ ఇటీవలే బహిర్గతం చేసింది. ప్రస్తుతం ఈ ఇంటి స్థలాల విలువ రూ.70 కోట్లకుపైగానే పలుకుతోంది. తమ భూమి స్వాధీనం చేసుకున్నందుకు 50:50 నిష్పత్తిలో ఇంటి స్థలాలు దక్కాయని, ఇందులో ఎక్కడా అవినీతి, అక్రమం లేదని పలు సందర్భాల్లో సిద్దరామయ్య వివరణ ఇచ్చారు. కెసర పరిధిలో ఇప్పటికీ చదరపు అడుగు రూ.2-3 వేలు పలుకుతుండగా, విజయనగర్ లే అవుట్‌లో రూ.10-12 వేల వరకూ ధర పలుకుతున్న ఇంటి స్థలాలను సిద్దరామయ్య పొందారని, సదరు భూములు దళితులకు చెందినవని ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ ఆరోపిస్తున్నాయి.

### గవర్నర్‌కు ఫిర్యాదులతో..

ముడా ఇంటి స్థలాలను అక్రమంగా పొందిన సీఎం సిద్దరామయ్యను ప్రాసిక్యూట్ చేయాలని సామాజిక కార్యకర్త టీజే అబ్రహాం, మైసూరుకు చెందిన మరో సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ, బెంగళూరు నాగరభావి నివాసి ప్రదీప్ కుమార్ రాజ్‌భవన్‌కు ఫిర్యాదులు చేశారు. జూలై 26న టీజే అబ్రహాం సమగ్ర వివరాలతో గవర్నర్‌ను కలిసి ప్రాసిక్యూషన్ కోరారు. ఆ మరుసటి రోజే సీఎం సిద్దరామయ్యకు గవర్నర్ నోటీసులు జారీ చేశారు. కాగా, ముడా ఇంటిస్థలాల అక్రమంలో సీఎం సిద్దరామయ్యను ప్రాసిక్యూట్ చేయాలని గవర్నర్ అనుమతులు ఇవ్వడంతో 2011 నాటి ఘటన పునరావృతమైందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అప్పటి సీఎం యడియూరప్ప డీ నోటిఫికేషన్‌లో అక్రమాలకు పాల్పడ్డారని న్యాయవాది సిరాజిన్ బాషా గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో నాటి గవర్నర్ హంసరాజ్ భరద్వాజ్ ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇచ్చారు.

# చిక్కుల్లో సిద్దూ!

(మొదటి పేజీ తరువాయి)




థావర్‌చంద్ గహ్లోత్

ఇవ్వడం ప్రజాప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర అని, బీజేపీ, జేడీఎస్‌కు చెందిన రాష్ట్ర నాయకులు కొందరు ఈ కుట్రకు సూత్రధారులని సీఎం సిద్దరామయ్య మండిపడ్డారు. రాజీనామా చేసేంత తప్పు తానేమీ చేయలేదని స్పష్టం చేశారు. శనివారం బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. ఉత్తరాఖండ్, జార్ఖండ్, ఢిల్లీలో చేసిన తరహాలోనే కర్ణాటకలోనూ కుట్ర పన్నారని ఆరోపించారు. ప్రాథమికంగా తనపై ఎటువంటి ఆరోపణలు లేవన్నారు. గవర్నర్ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని, చట్ట వ్యతిరేకమని దుయ్యబట్టారు, ప్రాసిక్యూషన్ అనుమతులపై న్యాయ పోరాటం చేస్తానని అన్నారు. ఫిర్యాదు వచ్చిన ఒక్కరోజులోనే షోకాజ్ నోటీసులు ఇచ్చారని, గవర్నర్ నుంచి ఈ విధమైన ప్రక్రియ ఊహించలేదని అన్నారు. రాజకీయ వేధింపుల్లో భాగంగానే ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతులు ఇచ్చారని అన్నారు. తన రాజీనామా కోరే నైతికత బీజేపీకి లేదన్నారు. కేంద్రమంత్రి కుమారస్వామి, మాజీ మంత్రులు మురుగేశ్ నిరాణి, శశికళ జొల్లె, జనార్దన్‌రెడ్డిపై రాజ్‌భవన్‌కు ఫిర్యాదులు అందినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవని గుర్తు చేశారు. కుమారస్వామి గనుల యజమానులకు అనుకూల అనుమతులు ఇచ్చారని, దీనిపై విచారణ జరిపించాలని లోకాయుక్త సూచించినా ఎటువంటి చర్యలు లేవని సిద్దరామయ్య విమర్శించారు.

### అధిష్ఠానం అండగా ఉంటుంది : ఏఐసీసీ

సిద్దరామయ్యకు అధిష్ఠానం అండగా ఉంటుందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, పార్టీ కర్ణాటక వ్యవహారాల ఇన్‌చార్జ్ సుర్జేవాలా అన్నారు. ఢిల్లీ నుంచి సీఎంకు ఫోన్ చేసిన ఆయన.. ఎటువంటి ఆందోళన అవసరం లేదని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ మేరకు ఓ లేఖను కూడా పంపారు. కర్ణాటక ప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగా ఇచ్చిన తీర్పును కాలరాసే విధంగా పీఎంవో, హోంశాఖ వ్యవహరించాయన్నారు. మరోవైపు, మంత్రులు, న్యాయనిపుణులతో సిద్దరామయ్య సాయంత్రం 5గంటలకు అత్యవసరంగా భేటీ అయ్యారు. సీఎంపై విచారణకు గవర్నర్ ఆదేశాలతో పార్టీ అగ్ర నేతలు అప్రమత్తమయ్యారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీ బెంగళూరుకు రానున్నారు. వారు ఆదివారం బెంగళూరులో సీఎంతో చర్చలు జరపనున్నారు.

### రాష్ట్రమంతటా భారీ బందోబస్తు

గవర్నర్ విచారణకు అనుమతులు ఇచ్చిన నేపథ్యంలో రాష్ట్రమంతటా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బెంగళూరులో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు 'చలో రాజ్‌భవన్‌కు సిద్ధం కాగా.. పోలీసులు అడ్డుకున్నారు. మైసూరులో కాంగ్రెస్ కార్యకర్తలు, సిద్దరామయ్య అభిమానులు ద్విచక్రవాహనానికి నిప్పుపెట్టి ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో ముడా కార్యాలయంతో పాటు వివిధ ప్రాంతాల్లో సాయుధ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

### న్యాయపోరాటానికి క్యాబినెట్ నిర్ణయం

సీఎం సిద్దరామయ్య ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతించిన నేపథ్యంలో శనివారం రాత్రి కర్ణాటక క్యాబినెట్ అత్యవసరంగా సమావేశమైంది. గవర్నర్ ప్రాసిక్యూషన్ అనుమతి నిర్ణయాన్ని క్యాబినెట్ ఖండించింది. సీఎంకు మద్దతుగా ఉండాలని, న్యాయ పోరాటం చేయాలని తీర్మానించింది. గవర్నర్ నిర్ణయం రాజ్యాంగ, చట్ట వ్యతిరేకమని క్యాబినెట్‌లో తీర్మానించినట్లు సిద్దరామయ్య చెప్పారు. గవర్నర్ల ద్వారా ప్రజాస్వామ్య ప్రభుత్వాలను అస్థిరం చేసే కుట్రలు చేయడం కేంద్రానికి సరికాదన్నారు.

### ఫిర్యాదుదారు కేవియట్ దాఖలు

సిద్దరామయ్యపై ఫిర్యాదుదారుల్లో ఒకరైన ప్రదీప్ కుమార్ హైకోర్టులో కేవియట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ గవర్నర్ నేరుగా సీఎం ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇచ్చారని, కోర్టు ద్వారా స్టే పొందే అవకాశం ఉంటుందని అన్నారు. అందుకే ముందుగానే కేవియట్ దాఖలు చేశానని తెలిపారు.

### తప్పుడు ఫిర్యాదుతో కుట్ర: డీకే

రాజ్‌భవన్ వేదికగా తప్పుడు ఫిర్యాదుతో సీఎం సిద్దరామయ్యను ఇరికించాలనే కుట్ర సాగిందని, ముఖ్యమంత్రికి అండగా ఉంటామని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. ముడా ఆరోపణలపై ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇచ్చిన వెంటనే పలువురు సహచర మంత్రులతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. సిద్దరామయ్య తమ ముఖ్యమంత్రి అని, ఆయన అదే హోదాలోనే ఉంటారని, ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గేది ఉండదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ మాత్రమే కాదని, 'ఇండియా' కూటమి మొత్తం ముఖ్యమంత్రికి అండగా ఉంటుందని అన్నారు. రాజ్‌భవన్‌ను బీజేపీ ఆఫీస్‌గా మార్చుకున్నారని, దానిపై పోరాటం చేస్తామని చెప్పారు. బీసీ నేత ఒకరు రెండోసారి ముఖ్యమంత్రి అయ్యారని, ఆయన ఎదుగుదలను ఓర్వలేకనే బీజేపీ భారీ కుట్ర పన్నిందని మండిపడ్డారు. ప్రాథమిక విచారణలు జరపకుండానే ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇవ్వడం సరికాదన్నారు.

## లోకం తీరు




### వాట్సాప్ స్టేటస్‌కు లైక్ ఆప్షన్

వాషింగ్టన్, ఆగస్టు 17: ఇన్‌స్టాగ్రామ్ తరహాలో స్టేటస్‌ను లైక్ చేసే ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు దిగ్గజ మెసేజింగ్ యాప్ వాట్సాప్ ప్రకటించింది. అంతేకాదు.. తన మాతృసంస్థ 'మెటా'కు చెందిన 'మెటా ఏఐ వాయిస్'తో వాట్సాప్ ను అనుసంధానించి, వినియోగదారులు రియల్-టైమ్ వాయిస్ సంభాషణల్లో పాల్గొనేలా వీలు కల్పించనున్నట్లు తెలిపింది. మొదటి ఫీచర్‌ను ప్రస్తుతం పరిమిత సంఖ్యలో 2.24.17.21 బీటా వెర్షన్ వాట్సాప్ యూజర్లకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు.. వీరు స్టేటస్‌లను నేరుగా లైక్ చేసేలా స్క్రీన్ దిగువన 'హార్ట్' ఎమోజీ ఉంటుందని పేర్కొంది. దాన్ని క్లిక్ చేస్తే.. స్టేటస్ లైక్ అవుతుందని, తమ స్టేటస్‌ను ఎవరెవరు లైక్ చేశారనే దాన్ని వినియోగదారులు 'వ్యూస్' ఆప్షన్‌లో చూసుకోవచ్చని వివరించింది. రియల్-టైమ్ వాయిస్ సంభాషణల విషయంలో మెటాతో కలిసి పరిశోధనలు చేస్తున్నట్లు వెల్లడించింది.

# వైద్యుల భద్రతా చర్యలపై కమిటీ!

» నియమిస్తామని ప్రకటించిన కేంద్రం

న్యూఢిల్లీ, ఆగస్టు 17: డాక్టర్లు, ఇతర ఆరోగ్య సిబ్బంది భద్రతకు తీసుకోవాల్సిన చర్యల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ పేర్కొంది. సంబంధిత నిపుణులు, రాష్ట్ర ప్రభుత్వాలు తమ అభిప్రాయాలను కమిటీకి తెలపవచ్చునని వెల్లడించింది. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం జరిగిన ఆర్జీ కర్ వైద్యకళాశాల, ఆస్పత్రిపై 40మంది దుండగులు దాడి చేసి.. విధ్వంసం సృష్టించిన నేపథ్యంలో మంత్రిత్వశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. హత్యాచార ఘటన, ఆస్పత్రిపై దాడికి నిరసనగా భారత వైద్య మండలి (ఐఎంఏ) పిలుపు మేరకు శనివారం ఉదయం 6 గంటల నుంచి 24 గంటల పాటు దేశవ్యాప్తంగా ఆస్పత్రుల్లో 'నాన్ ఎమర్జెన్సీ' సర్వీసులు నిలిచిపోయాయి. ఫలితంగా ఓపీలు నిలిచిపోవడంతో రోగులు ఇబ్బందులుపడ్డారు. కాగా వైద్యుల భద్రతకు సంబంధించి ఐఎంఏ ఐదు డిమాండ్లు చేస్తోంది. ఎపిడమిక్ డిసీస్ యాక్ట్ 1897ను అనుసరించి 2019లో హాస్పిటల్ ప్రొటెక్షన్ బిల్లులో 2023లో పొందుపర్చిన సవరణలను అమలు చేయాలని, అప్పుడు వైద్యుల భద్రత పటిష్ఠం అవుతుందని ఐఎంఏ అంటోంది. వైద్యుల జీవన స్థితిగతులు, పనివేళలకు సంబంధించి పరిస్థితులను గణనీయంగా మెరుగుపర్చాలని డిమాండ్ చేస్తోంది. ఆర్జీ కర్ ఆస్పత్రిలో హత్యాచారానికి గురైన వైద్యురాలు అప్పటికే వరుసగా 36 గంటలపాటు విధుల్లో ఉండటం, విశ్రాంతి తీసుకునేందుకు సరైన ఏర్పాట్లేవీ లేకపోవడం.. ఫలితంగానే ఆమె పట్ల ఘోరం జరిగిందని ఓ వైద్యుడు పేర్కొన్నారు. ఏ వైద్యుడైనా 8 గంటలు లేదా 12 గంటల వరకు నిర్విరామంగా పనిచేయగలరు. కానీ.. 36 గంటలపాటు ఎలా పనిచేయగలరు? ఈ స్థాయి పని ఒత్తిళ్లు అటు వైద్యులకు గానీ.. రోగులకు గానీ మంచిది కాదు అని చెప్పారు.

## మెప్మా డైరెక్టర్‌గా ఎన్.తేజ్ భరత్

అమరావతి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలువురు ఐఏఎస్‌లను ప్రభుత్వం బదిలీ చేసింది. మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.తేజ్‌భరత్‌ను నియమించింది. ఈ మేరకు సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ వి.అభిషేక్‌ను బదిలీ చేసిన ప్రభుత్వం చిత్తూరు జిల్లా జేసీగా నియమించింది. టెక్కలి సబ్ కలెక్టర్ ప్రభాకర్ జైన్‌ను పాడేరు సబ్ కలెక్టర్‌గా నియమించి, పాడేరు ఐటీడీఏ పీవోగా అదనపు బాధ్యతలు అప్పగించింది. మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనాను కాకినాడ జేసీగా నియమించింది. ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ అనంతపురం జాయింట్ కలెక్టర్, కందుకూరు సబ్ కలెక్టర్ జి.విద్యాధరి కర్నూలు మున్సిపల్ కమిషనర్‌గా నియమించింది. కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవను మన్యం పార్వతీపురం సబ్ కలెక్టర్‌గా నియమించి, పార్వతీపురం ఐటీడీఏ పీవోగా అదనపు బాధ్యతలు అప్పగించింది. పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ ఏటపాక సబ్‌కలెక్టర్‌గా నియమించి, చింతూరు ఐటీడీఏ పీవోగా కూడా అదనపు బాధ్యతలు అప్పగించింది.

# రాష్ట్రానికి జ్వరం!

(మొదటి పేజీ తరువాయి)

ఏమిటో తెలుసుకుందామని రక్తపరీక్షలు చేయించుకున్నా.. వాటిలోనూ కారణం ఏవిటో తేలడం లేదు. కొంత మందిలో డెంగీ లక్షణాలు, మరికొంత మందిలో చికెన్ గున్యా లక్షణాలు.. డయేరియా.. టైఫాయిడ్ లక్షణాలు కనిపిస్తున్నాయి. అసలు ప్రజలకు వస్తున్న జ్వరాలు ఏమిటన్న దానిపై డాక్టర్లకు కూడా అంతుపట్టడం లేదు. కానీ, రాష్ట్రంలో జ్వరపీడితుల సంఖ్య మాత్రం రోజు రోజుకు భారీగా పెరుగుతోంది. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలోనూ వింత వైరస్ విజృంభించడంతో విచిత్ర లక్షణాలతో ప్రజలు తీవ్ర అనారోగ్యం బారినపడుతున్నారు. వింత రోగాలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రయివేటు ఆస్పత్రులు కూడా వైరస్‌ను గుర్తించలేకపోతున్నాయి. వింత రోగాల వల్ల ప్రాణాపాయ పరిస్థితి లేదు కానీ అజాగ్రత్తగా ఉంటే మాత్రం ప్రమాదంలోకి నెడుతోందని వైద్యులు చెబుతున్నారు. అసలు ఇది ఏ వైరస్? ఈ లక్షణాలు ఏ వైరస్‌కు సంబంధించినవి? అసలు ఈ లక్షణాలు ఎందుకు వస్తున్నాయి? అన్న దానిపై ఆరోగ్యశాఖ ఇప్పటి వరకు దృష్టిపెట్టలేదు. రాష్ట్రంలో నానాటికీ జ్వరాలు పెరుగుతున్నా ఆరోగ్యశాఖ మంత్రి ఇప్పటికీ స్పందించక పోవడం గమనార్హం.

### వైసీపీ నిర్వాకంతోనేనా?

గత ప్రభుత్వం ఆరోగ్యశాఖను, గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్యాన్నీ పూర్తిగా విస్మరించింది. ఈ కారణంగానే ఈ రోజు ఈ పరిస్థితి నెలకొందన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు ఆరోగ్యశాఖ ముందుగానే స్పందించి నివారణ చర్యలు చేపట్టాలి. రెండు, మూడు నెలల నుంచి రాష్ట్రంలో వింత రోగాలు అధికంగానే ఉన్నాయి. కానీ, గత ప్రభుత్వం ముందస్తు నివారణ చర్యల్లో పూర్తిగా విఫలం అయింది. అప్పుడే వింత రోగాలు, జ్వరాలపై జాగ్రత్తలు తీసుకుని ఉంటే ప్రస్తుతం పరిస్థితి ఇలా ఉండేది కాదని వైద్య నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రంలో డయేరియా, టైఫాయిడ్‌తో ప్రారంభమైన అనారోగ్య సమస్యలు.. నేడు జ్వరాలు ప్రబలేందుకు దారితీశాయన్న వాదన వినిపిస్తోంది.

### ప్లేట్‌లెట్స్ పడిపోతున్నాయి

అసలు ప్రజలకు వచ్చే జ్వరం ఏమిటన్నది ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది. కొంత మందికి అకస్మాత్తుగా జ్వరాలు వస్తున్నాయి. ఆ వెంటనే తీవ్రమైన ఒంటి నొప్పులతో బాధపడుతున్నారు. రెండు, మూడు రోజుల పాటు ఈ లక్షణాలతో బాధపడుతున్న వారిలో మూడు నాలుగు రోజుల్లో రక్తంలో ప్లేట్‌లెట్స్ పడిపోతున్నాయి. సాధారణంగా వారం రోజుల పాటు డెంగీ తీవ్రంగా ఉంటనే ప్లేట్‌లెట్స్ తగ్గుతాయి. కానీ వింత జ్వరాల వల్ల విచిత్రంగా ప్లేట్‌లెట్స్ తగ్గిపోతున్నాయి. ఆస్పత్రుల్లో చేరి వైద్యం చేయించుకుంటున్నా.. అసలు రోగం ఏమిటన్నది గుర్తించలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం.. మెడికల్ కాలేజీల్లో ఉన్న సీక్వెన్సీ ల్యాబ్స్‌ను ఉపయోగించి జ్వరాలు ప్రబలడానికి గల కారణాలు గుర్తించాలి. జ్వరాలకు గల కారణాలు గుర్తిస్తే, ఆ తర్వాత దానికి సంబంధించిన వైద్యం అందుబాటులోకి తీసుకురావచ్చు. ఆరోగ్యశాఖ అధికారులు ఆదిశగా ఆలోచన చేయాలి. రాష్ట్రంలో అన్ని బోధనాసుపత్రుల్లో ల్యాబ్స్ అందుబాటులో ఉన్నాయి. వాటిని ఆరోగ్యశాఖ పూర్తిస్థాయిలో ఉపయోగించడం లేదు. దీంతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పీహెచ్‌సీ) నుంచి బోధనాసుపత్రుల వరకు ప్రతి ఆస్పత్రిలో జ్వరపీడితుల కోసం ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.


వెంకయ్యనాయుడు జీవన ప్రస్థాన ఛాయాచిత్ర ఆంగ్ల గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, గవర్నర్ అబ్దుల్ నజీర్, వెంకయ్యనాయుడు దంపతులు

## సేవా ప్రస్థానమంటే అంకెలు కాదు

» వెంకయ్యనాయుడుది స్ఫూర్తిదాయక ప్రయాణం

» ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ప్రశంస

» స్వర్ణభారత్ ట్రస్ట్ 23వ వసంతోత్సవాలకు హాజరు

నెల్లూరు(ఆంధ్రజ్యోతి)/వెంకటాచలం, ఆగస్టు 17: సేవా ప్రస్థానం అంటే అంకెలు కాదని, అది ఒక స్ఫూర్తిదాయక ప్రయాణమని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ వ్యాఖ్యానించారు. స్వర్ణభారత్ ట్రస్ట్ సేవలే ఇందుకు నిదర్శనమని కొనియాడారు. నెల్లూరు జిల్లా వెంకటాచలంలో మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు స్థాపించిన స్వర్ణభారత్ ట్రస్ట్ 23వ వార్షికోత్సవానికి ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ శనివారం సతీసమేతంగా విచ్చేశారు. వారికి గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ దంపతులు, రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, బీద మస్తాన్‌రావు తదితరులు స్వాగతం పలికారు. ట్రస్ట్ ఆవరణలో కొత్తగా నిర్మించిన పరిపాలనా భవనాన్ని ప్రారంభించి మొక్కలు నాటారు. స్వర్ణభారత్ ట్రస్ట్ - భగవాన్ మహావీర్ వికలాంగుల సహాయ సమితి సంయుక్త ఆధ్వర్యంలో వికలాంగులకు కృత్రిమ అవయవాలను అమర్చారు. వెంకయ్యనాయుడు జీవన ప్రస్థాన ఛాయా చిత్ర ఆంగ్ల గ్రంథాన్ని ఆవిష్కరించారు. అనంతరం ధన్‌ఖడ్ మాట్లాడుతూ వెంకయ్యనాయుడు ఆలోచనలు మహోన్నతమైనవని కొనియాడారు. కాగా, ప్రభుత్వ సహకారం లేకుండా 23 ఏళ్లపాటు ట్రస్ట్‌ను మహాయజ్ఞంలా నిర్వహించారంటూ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్‌ను అభినందించారు. అనంతరం ట్రస్ట్ ప్రస్థానం గురించి వెంకయ్య వివరించారు.

# చైనా బీఆర్ఐ ప్రమాదకరం

## ఆసియా దేశాలను అప్పుల్లో ముంచేస్తోంది.. గ్లోబల్ సౌత్ సదస్సులో మోదీ



న్యూఢిల్లీ, ఆగస్టు 17: ఉగ్రవాదం, తీవ్రవాదం, వేర్పాటువాదం అతి పెద్ద ముప్పుగా పరిణమించాయని, వీటి నుంచి మన సమాజాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ నొక్కి చెప్పారు. శనివారం జరిగిన 'గ్లోబల్ సౌత్ దేశాల గళం' సదస్సులో వర్చువల్‌గా ఆయన ప్రసంగించారు. గ్లోబల్ సౌత్ దేశాలకు పరస్పర వాణిజ్యం, సమ్మిళిత వృద్ధి, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో భారత్ సహకరిస్తుందని తెలిపారు. ఆయా దేశాలు ఐక్యంగా ఉండడం ద్వారా ఆరోగ్య, ఆహార, ఇంధన భద్రత విషయంలో తలెత్తుతున్న సవాళ్లను అధిగమించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారతదేశ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(డీపీఐ) వినియోగాన్ని వేగవంతం చేసేందుకు ఏర్పాటు చేసిన సామాజిక ప్రభావ నిధికి ప్రాథమికంగా 25 మిలియన్ డాలర్ల(దాదాపు రూ.200 కోట్లు) సహకారాన్ని ప్రకటించారు. ఇతర దేశాలతో అభివృద్ధి భాగస్వామ్యం పంచుకునేందుకు భారత్ దేశ సొంత అభివృద్ధి, అనుభవాల ఆధారంగా గ్లోబల్ డెవలప్‌మెంట్ కంపాక్ట్(జీడీసీ)ను ప్రధాని ప్రతిపాదించారు. ఇది గ్లోబల్ సౌత్ దేశాలు ప్రతిపాదించిన అభివృద్ధి ప్రాధాన్యాలపైనా దృష్టి పెడుతుందన్నారు. అభివృద్ధి పేరుతో అప్పులు చేస్తున్న దేశాలకు కూడా గ్లోబల్ డెవలప్‌మెంట్ కంపాక్ట్ ఎలాంటి భారం మోపదని తెలిపారు. భాగస్వామ్య దేశాలకు సుస్థిరాభివృద్ధిలో సహకారం అందిస్తుందన్నారు. చైనా ప్రతిపాదిత బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్(బీఆర్ఐ)ని ప్రధాని మోదీ తీవ్రంగా విమర్శించారు. దీనివల్ల నిలకడలేని ప్రాజెక్టులకు వేల కోట్ల రూపాయల రుణాలు ఇవ్వడం ద్వారా ఆసియా, ఆఫ్రికా దేశాలను అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేస్తోందని అన్నారు. బీఆర్ఐకి ప్రత్యామ్నాయంగా గ్లోబల్ డెవలప్‌మెంట్ కంపాక్ట్‌ను అందిపుచ్చుకోవాలన్నారు. దీనివల్ల వాణిజ్యం వృద్ధి చెందుతుందని, సుస్థిరాభివృద్ధిలో సామర్థ నిర్మాణం పెరుగుతుందని, సాంకేతికతను ఇచ్చిపుచ్చుకోవచ్చని, ప్రాజెక్టుల కోసం రాయితీ రుణాలు, గ్రాంట్లను పొందే అవకాశం ఉంటుందని వివరించారు. వాణిజ్య కార్యకలాపాలను బలోపేతం చేసేందుకు రూ.21కోట్ల (2.5 మిలియన్ డాలర్లు)తో ప్రత్యేక నిధి ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. అదేవిధంగా వాణిజ్య విధానాలపై శిక్షణకు రూ.8 కోట్ల(1 మిలియన్ డాలర్లు)తో మరోనిధిని ఏర్పాటు చేస్తున్నామన్నారు.

### గ్లోబల్‌కు జనరిక్ ఔషధాలు

గ్లోబల్ సౌత్ దేశాలకు చౌక ధరలకే సమర్థవంతమైన జనరిక్ ఔషధాలను అందుబాటులో ఉంచుతామని ప్రధాని మోదీ తెలిపారు. 'ఆరోగ్య మైత్రి' కింద ఆఫ్రికా, పసిఫిక్ ఐలాండ్ దేశాలకు డయాలిసిస్ మిషన్లను, ప్రాణాధారిత ఔషధాలను అందించామని, అదేవిధంగా ఆసుపత్రులు, జన్ ఔషధి కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. గ్లోబల్ సౌత్ దేశాల్లో తలెత్తిన ఉద్రిక్తతలు, సంఘర్షణలపై ప్రధాని ఆందోళన వ్యక్తం చేశారు. 'ఇది చాలా తీవ్రమైన విషయం' అని వ్యాఖ్యానించారు. సవాళ్లను అధిగమించేందుకు గ్లోబల్ సౌత్ దేశాలు ఐక్యంగా ఉండాలన్నారు.

### ఎన్నో సవాళ్లు

"మనం ఇప్పటికే అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాం. వాతావరణ మార్పులు, ఉగ్రవాదం, తీవ్రవాదం, వేర్పాటువాదాలు మన సమాజాలకు తీవ్ర సవాళ్లుగా పరిణమించాయి" అని ప్రధాని మోదీ తెలిపారు. సాంకేతికత కారణంగా తలెత్తుతున్న సామాజిక సవాళ్లు పుట్టుకొస్తున్నాయన్నారు. గత శతాబ్దపు పాలన, సంస్థలు ఈ శతాబ్దపు సవాళ్లతో పోరాడలేక పోతున్నాయని తెలిపారు. 2022లో జీ-20 సదస్సుకు నేతృత్వం వహించిన భారత్.. గ్లోబల్ సౌత్ గళాన్ని వినిపించే వేదికను సృష్టించిందన్నారు.

## సవాళ్లను అధిగమించి సంపన్న దేశంగా మార్చండి

» వీఐటీ స్నాతకోత్సవంలో యువ పట్టభద్రులకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పిలుపు

చెన్నై, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్ యువ పట్టభద్రులపైనే ఆధారపడి ఉందని, స్వాతంత్ర్యదిన శత వార్షికోత్సవాల్లోపు దేశాన్ని సంపన్న దేశంగా మార్చే బాధ్యత యువతపైనే ఉందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 'వీఐటీ చెన్నై' క్యాంపస్‌లో శనివారం ఉదయం జరిగిన స్నాతకోత్సవంలో ఆయన పాల్గొని సందేశమిచ్చారు. నాణ్యమైన విద్యనందించడంలో వీఐటీ విద్యాసంస్థలు ముందంజలో ఉన్నాయన్నారు. వీఐటీ వ్యవస్థాపక ఛాన్స్‌లర్ డాక్టర్ జి.విశ్వనాథన్ అధ్యక్షోపన్యాసం చేస్తూ.. విద్యను రాష్ట్ర జాబితా నుంచి ఉమ్మడి జాబితాకు మార్చేటప్పుడు తాను ఆ నిర్ణయానికి మద్దతుగా ఓటు వేశానని, ప్రస్తుతం విద్యకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశించినంతమేరకు నిధులు విడుదల చేయడం లేదని విచారం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో నాణ్యమైన విద్యనందిస్తుండటం వల్లే తమ సంస్థల్లో చదివిన విద్యార్థులకు 90 శాతం దాకా ప్లేస్‌మెంట్లు లభిస్తున్నాయన్నారు.

# నిలిచిన వైద్యసేవలు

» వైద్యురాలి హత్యాచారంపై నిరసనల వెల్లువ

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)



రిలే దీక్షల శిబిరంలో హోంమంత్రి వంగలపూడి అనిత

కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం ఘటనకు నిరసనగా దేశవ్యాప్తంగా వైద్య సేవలను నిలిపివేశారు. నిందితులకు కఠిన శిక్ష వేయడంతోపాటు వైద్యులకు రక్షణ కల్పించేలా చట్టాలు తీసుకురావాలన్న డిమాండ్‌తో శనివారం ఉదయం ఆరు నుంచి ఆదివారం ఉదయం ఆరు గంటల వరకు వైద్య సేవల బంద్‌కు ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) పిలుపునిచ్చింది. దీంతో శనివారం ఉదయం నుంచి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఓపీ, ఐపీ సేవలను నిలిపివేసి వైద్యులు నిరసన తెలిపారు. విశాఖపట్నంలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన రిలే నిరాహార దీక్షా శిబిరంలో 1500 మంది వరకూ జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఆ దీక్ష శిబిరంలో పాల్గొని సంఘీభావం తెలిపారు. బీజేపీ మహిళా మోర్చా బీచ్‌రోడ్డులో భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించింది. విజయనగరం జిల్లా వ్యాప్తంగానూ వైద్యులు శనివారం విధులను బహిష్కరించారు. డాక్టర్లు ఐఎంఏ నుంచి కలెక్టరేట్ వరకూ మౌన ప్రదర్శన నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లాలోనూ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి నుంచి వందలాది మంది వైద్యులు, సిబ్బంది ర్యాలీ చేశారు. అనంతపురంలోనూ జిల్లా సర్వజన వైద్యశాల నుంచి సప్తగిరి సర్కిల్, క్లాక్ టవర్ మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. పార్వతీపురం మన్యం జిల్లాలోనూ వైద్యులు ర్యాలీలు నిర్వహించారు.

### ఆమెకు న్యాయం వేగంగా జరగాలి: లోకేశ్

అమరావతి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కోల్‌కతా ఘటనపై మంత్రి నారా లోకేశ్ శనివారం ఎక్స్‌లో స్పందించారు. 'ఆ యువ వైద్యురాలు పడిన నరకయాతనను తలుచుకుంటే మాటలు రావడం లేదు. ఆ క్రూరత్వాన్ని ఖండించడానికి ఏం చేసినా తక్కువే. ఆమెకు న్యాయం వేగంగా జరగాలి. ప్రతి మహిళ గౌరవాన్ని కాపాడానికి, భద్రతను ఇవ్వడానికి ఒక సమాజంగా మనమంతా ఐకమత్యంగా సాగాలి. యువకులు, పురుషులందరికీ నా సందేశం ఒక్కటే... మంచి మనిషిగా ఉండడమే మనం చేయగలిగిన అత్యంత ప్రభావవంతమైన నిరసన' అని లోకేశ్ అన్నారు.

## మెడికోపై అత్యాచారం, హత్య మానవాళిపై తీవ్రమైన దాడి: షర్మిల

అమరావతి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): 'కోల్‌కతాలో మెడికోపై జరిగిన దారుణ అత్యాచారం, హత్య మానవాళిపై ఒక తీవ్రమైన దాడి, మాయని మచ్చ' అని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. శనివారం ఎక్స్ వేదికగా ఆమె స్పందించారు. 'కోల్‌కతా ఘటన ఓ పాశవిక చర్య. రోజులు గడుస్తున్నా కేసులో పురోగతి కనిపించడం లేదు. మానవజాతి సిగ్గుపడే ఈ సంఘటనలో పూర్వాపరాలు బయటకు వస్తుంటే వెన్నులో వణుకు పుడుతోంది. మనుషులుగా ఎంత దిగజారుతున్నామో తలచుకుంటే సిగ్గేస్తుంది. ఒక మహిళగా ఈ ఘటన తీవ్రంగా కలచివేసింది. ఒక ఆడపిల్ల తల్లిగా నాలో లోతైన భయాన్ని నింపింది. ఆ మెడికో కుటుంబానికి న్యాయం జరగాలని ఆకాంక్షిస్తున్నా' అని షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు.

### వైద్యుల ఆందోళనకు సీపీఐ సంఘీభావం

కోల్‌కతాలో వైద్యురాలిపై అఘాయిత్యాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా డాక్టర్లు, జూనియర్ డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బంది చేస్తున్న ఆందోళనకు సీపీఐ సంఘీభావం ప్రకటించింది. శనివారం ఉదయం నుంచి వైద్యులు చేపట్టిన 24 గంటల నిరసనకు మద్దతు తెలుపుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ నల్లని వస్త్రాలు ధరించి నిరసన తెలిపారు. ప్రత్యేక చట్టం ద్వారా వైద్యులకు రక్షణ కల్పించాలని కోరారు.

# కువైత్ నుంచే భర్త నిఘా!

» భార్యపై అనుమానంతో ఇంటిచుట్టూ సీసీ కెమెరాలు

» వేధింపులు తాళలేక ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్య


తల్లీబిడ్డల మృతదేహాలు

రాయచోటి టౌన్, ఆగస్టు 17: కువైత్ వెళ్లిన భర్త అక్కడి నుంచే నిఘా పెట్టి, వేధిస్తుండడాన్ని భరించలేని ఓ తల్లి తన ఇద్దరి పిల్లలతో కలిసి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాద ఘటన శనివారం ఉదయం అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలో చోటు చేసుకుంది. రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్ కథనం మేరకు.. లక్కిరెడ్డిపల్లె మండలం బి.యర్రగుడి హరిజనవాడకు చెందిన యర్రగుడి రాజా, రమాదేవి దంపతులకు కుమారుడు ప్రభువ మనోహ (8), కుమార్తె మన్విత (6) ఉన్నారు. వీరు ఐదేళ్లుగా రాయచోటి పట్టణంలో నివాసం ఉంటున్నారు. రాజా టైలరింగ్ చేసేవాడు. సంపాదన చాలకపోవడంతో భార్యభర్తలు కువైత్ వెళ్లారు. పిల్లలను రాజా తల్లిదండ్రులు చూసుకునేవారు. ఈ క్రమంలో రాజా తల్లి అనారోగ్యంపాలవడంతో వారు స్వగ్రామమైన బి.యర్రగుడి హరిజనవాడకు వెళ్లి అక్కడే ఉంటున్నారు. పిల్లలను చూసుకోవడానికి వారికి ఇబ్బందిగా ఉండడంతో భార్యాభర్తలు కువైత్ నుంచి ఇండియాకు వచ్చారు. రమాదేవి పిల్లలతో పాటు తిరిగి రాయచోటిలో ఉండగా రాజా సంవత్సరం క్రితం కువైత్ వెళ్లాడు. అయితే అతడు భార్యపై అనుమానం పెంచుకు న్నాడు. ఈ నేపథ్యంలో కువైత్ వెళ్లడానికి ముందే ఇంట్లో, ఇంటిచుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాడు. అతడు కువైత్ వెళ్లినప్పటి నుంచి ఆమెకు రోజూ ఫోన్ చేసి వేధించేవాడు. భర్త వేధింపులు ఎక్కువయ్యాయని రమాదేవి తరచూ తమ కుటుంబ సభ్యులకు చెప్పేది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రికూడా రాజా ఫోన్ చేసి రమాదేవితో గట్టిగా మాట్లాడాడు. ఇద్దరి మధ్యా వాగ్యుద్ధం నడిచిన విషయం సీసీ కెమెరాల్లో ఉందని సమాచారం. శనివారం ఉదయం 6 గంటల 5 నిమిషాలకు రమాదేవి తన అన్న గాలివీటి నారాయణకు ఫోన్ చేసి.. తన భర్త ఇంటిచుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాడని, రోజూ ఫోన్ చేసి వేధిస్తున్నాడని, ఈ వేధింపులు భరించలేకుండా ఉన్నానని, మిమ్మల్ని వదిలి వెళుతున్నాను అంటూ వాయిస్ మేసెజ్ పంపింది. ఆయన వెంటనే తెలిసిన వారికి ఫోన్ చేసి తమ చెల్లెలి ఇంటికి వెళ్లి చూడమని చెప్పారు. ఆ లోగానే రమాదేవి కిచెన్‌లోంచి గ్యాస్ సిలిండర్ బెడ్‌రూంలోకి తీసుకొచ్చి.. గ్యాస్ లీక్ చేసి అగ్గిపుల్ల వెలిగించేసింది. సిలిండర్ పేలడంతో ఇద్దరు పిల్లలు నిద్రలోనే కన్నుమూశారు. రమాదేవి కూడా సంఘటన స్థలంలోనే చనిపోయారు. అగ్నిమాపకశాఖ శకటం వచ్చేసరికి తల్లీబిడ్డలు మంటల్లో సజీవ దహనమయ్యారు.

# అరకు అందాలు అద్భుతం

**» సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి**



గిరిజన సంప్రదాయ పద్ధతిలో వివాహం చేసుకుంటున్న జస్టిస్ జేకే మహేశ్వరి దంపతులు

అరకులోయ, ఆగస్టు 17: అరకులోయ అందాలు, కేకే లైన్‌లో రైలు ప్రయాణం, బొర్రా గుహలు అద్భుతంగా ఉన్నాయని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి అన్నారు. ఏజెన్సీ సందర్శన నిమిత్తం శనివారం ఆయన కుటుంబ సమేతంగా విశాఖపట్నం నుంచి రైలులో అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ చేరుకున్నారు. వారికి జేసీ ఎంజే అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్ స్వాగతం పలికారు. ముందుగా అరకులోయలోని గిరిజన మ్యూజియం, కళా గ్రామం సందర్శించారు. అనంతరం పెదలబుడు పంచాయతీలోని గిరి గ్రామ దర్శినిని సందర్శించారు. అక్కడ గిరిజన సంప్రదాయం ప్రకారం వస్త్రాలను ధరించి జస్టిస్ మహేశ్వరి దంపతులు వివాహం చేసుకున్నారు. ఈ వివాహ వేడుకను జరిపించిన నిర్వాహకులను జస్టిస్ దంపతులు అభినందించారు. ధింసా కళాకారులతో నృత్యం చేశారు. అక్కడ నుంచి అనంతగిరి మండలంలో గల బొర్రా గుహలను సందర్శించారు.







తిరుమల ఆలయం ముందు కుటుంబసభ్యులతో జస్టిస్ పంకజ్ మిథాల్

## శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

తిరుమల, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పంకజ్ మిథాల్ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో స్వామివారిని దర్శించుకున్న ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

## అప్పన్న సేవలో జస్టిస్ జ్యోతిర్మయి



జస్టిస్ జ్యోతిర్మయికి స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఏఈఓ

సింహాచలం, ఆగస్టు 17: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి కుటుంబ సభ్యులతో కలిసి వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం దర్శించుకున్నారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న న్యాయమూర్తి గోత్రనామాలతో అంతరాలయంలో పూజలు నిర్వహించారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, ఏఈఓ ప్రసాదాలు అందజేశారు.

## టీటీడీ పరిపాలనా భవనంలో స్వల్ప అగ్నిప్రమాదం



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన దస్త్రాలు

తిరుపతి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో శనివారం మధ్యాహ్నం స్వల్ప అగ్ని ప్రమాదం జరిగింది. భవనంలోని రెండవ అంతస్తులో బైపాస్ రోడ్ల విభాగం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కర్ కార్యాలయంలో మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో కార్యాలయ సిబ్బంది గదికి వెలుపల గడియపెట్టి భోజనానికి వెళ్లారు. మంటలతో పొగలు రావడం చూసి భద్రతా సిబ్బంది అప్రమత్తమై అగ్నిమాపక సాధనాలతో మంటలు ఆర్పేందుకు యత్నించారు. అయినా అదుపులోకి రాకపోవడంతో అగ్నిమాపక కేంద్రానికి సమాచారమిచ్చారు. అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలు ఆర్పివేశారు. కార్యాలయంలో దేవుడి పటం వద్ద వుంచిన దీపం ప్రమాదవశాత్తూ కింద పడడంతో దస్త్రాలు కాలిపోయినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. మంటల్లో పాక్షికంగా కాలిపోయిన దస్త్రాలన్నీ పాతవేవని ప్రాథమికంగా నిర్ధారించారు.

## ఏజెన్సీ అందాలు చూసేందుకు వచ్చి..

**» రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి.. యువతికి తీవ్రగాయాలు**

అనకాపల్లి టౌన్, ఆగస్టు 17: పాడేరు ఏజెన్సీ అందాలు చూసేందుకు హైదరాబాద్ నుంచి వచ్చిన బృందంలో ఒకరు శుక్రవారం రాత్రి అనకాపల్లి బైపాస్ జంక్షన్‌కు సమీపంలో ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో మృతిచెందారు. మరో యువతి తీవ్రంగా గాయపడింది. ట్రాఫిక్ సీఐ వి.పైడపునాయుడు కథనం మేరకు.. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్న ఏడుగురు శుక్రవారం విశాఖ చేరుకున్నారు. వారిలో ఐదుగురు రెండు ద్విచక్ర వాహనాలపై అల్లూరి జిల్లా పాడేరు సమీపాన గల వంజంగి పర్యాటక ప్రాంతాన్ని చూసేందుకు బయలుదేరారు. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా చందానగర్‌కు చెందిన పురాలశెట్టి శరత్‌కుమార్ (24), ములుగు జిల్లాకు చెందిన యువతి మరో వాహనంపై వస్తున్న స్నేహితుల కోసం సర్వీస్ రోడ్డులో వేచి చూస్తుండగా విశాఖ నుంచి హైదరాబాద్ వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో శరత్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. యువతి తీవ్రంగా గాయపడడంతో అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రథమ చికిత్స అనంతరం విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.




# ఆంధ్రజ్యోతి తలంబ్రాలు

## వరుడు కావలెను



★ రెండవ మ్యాచ్ /విడో / 45y/Govt. Job/ Own Villa / Rents / Lands / మంచి ఆస్తి, ఆర్థికంగా స్థిరపడిన అందమైన వధువుకు కుల ప్రసక్తి లేని వరుడు కావలెను. ఫోన్ : 9676896226 AJH-002575

★ 55y / రెండవ పెళ్ళి / విడో / ఫెయిర్ / GOVT.JOB / పిల్లలు లేరు / సొంత ఇల్లు రెంట్స్ / వెల్ సెటిల్డ్ / ఎలాంటి బాదరబందీలేని అందమైన వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్ : 7993376608 AJH-4265

★ 59y / రెండవ పెళ్ళి / విడో / ఫెయిర్ / GOVT. ఫ్యామిలీ పెన్షనర్ / పిల్లలు లేరు / సొంత ఇల్లు రెంట్స్ /వెల్ సెటిల్డ్ / ఎలాంటి బాదరబందీలేని ఏకైక వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 9030858258 AJH-4265

★ కుల పట్టింపు లేదు / కమ్మ / 42y/5'6"/ విడో / కార్డియాలజీ / మంచి ఆస్తి గల వధువుకి 1వ, 2వ వరుడు కావలెను. send me details వాట్సాప్ : 8501815711 AJH-002508

★ కుల పట్టింపు లేదు / కమ్మ / 2nd మ్యారేజ్ / 43y/5'5"/ డాక్టర్ / రేడియాలజిస్ట్ / మంచి ఆస్తి గల వధువుకు 1వ, 2వ వరుడు కావలెను. వాట్సాప్ : 9542494557 AJH-002508

★ రెడ్డి 2nd, కుల, మత, ఆస్తి పట్టింపు లేదు / Q: డిగ్రీ / ఎత్తు 5.4, బిజినెస్‌లు గల అందమయిన వధువుకి వరుడు కావలెను. 1st/2nd . అన్ని కులాల వారి కి సంబంధాలకై ఫోన్ : 9032596676 AJH-16348

★ రెడ్డి 2nd విడో (కుల/మత/ఆస్తి) ప్రసక్తి లేదు. 30y/ డిగ్రీ / సొంత ఇల్లు & ప్రాపర్టీలు / వెల్‌సెటిల్డ్ అందమైన వధువుకి 1వ/2వ వరుడు కావలెను. అన్ని వయస్సుల వారికి సంబంధాలకై ఫోన్ : 9392332143 AJH-16348

★ రెడ్డి విడో / కుల, ఆస్తి, ప్రసక్తి లేదు / 35y / B.Com / Pvt. Job కలిగిన అందమయిన వధువుకి వరుడు కావలెను. All caste marriage Available. Ph: 8121347478 AJH-16348

★ కమ్మ / Unmarried / 28y/5'4"/Gynecologist / ట్రాన్స్ పోర్ట్ బిజినెస్ / మంచి ప్రాపర్టీ గల అందమైన వధువుకు కుల పట్టింపు లేని వరుడు కావలెను. Ph: 9493443837 AJH-16348

★ వడ్డెర / CA / చార్టెడ్ అకౌంటెంట్ / మంచి జీతం / 5'4" ఎత్తు / 26 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 9618579861 AJH-16347

★ SC మాల / ఏకైక కుమార్తె / M.Sc / Govt. Food Inspector / Good Salary / 5'3"ఎత్తు / 26 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 8897389698 AJH-16347

★ 2వ పెళ్ళి / బ్రాహ్మణ / 30y / 5'3" / డిగ్రీ / Pvt. జాబ్ / అందమైన వధువుకు తగిన జాబ్ / బిజినెస్ / పురోహితం వరుడు కావలెను. ఫోన్ : 9701743336 AJH-16347

★ ఆస్తి, కుల పట్టింపులేదు / రెడ్డి, విడో, 30y / 5'3" / డిగ్రీ / మంచి ప్రాపర్టీ కలిగి పిల్లలు లేని వధువుకు వరుడు కావలెను. మీ ఫోటోలు వాట్సాప్‌లో సెండ్ చెయ్యండి. ఫోన్ : 9133640971 AJH-16347

★ బ్రాహ్మణ / 27y/5'4"/ 1st మ్యారేజ్ / Q:10th Class / Own Business / 2nd మ్యారేజ్ also OK, పౌరోహితం also OK. వరుడు కావలెను. ఫోన్ : 9347422789 AJH-002575

★ [illegible] సెల్: 98480 49875. AJD:186547

★ కుల, ఆస్తి పట్టింపు లేదు / విడో / 57 Y / Govt. జాబ్ / ఓన్ బిజినెస్ / రెంట్స్ / Lands / మంచి ప్రాపర్టీ, ఎలాంటి బాదరబంది లేని వధువుకు వరుడు కావలెను. సంప్ర. 86880 47144 AJB-368

★ విశ్వబ్రాహ్మిన్స్ (ఆచారులు) : 27 సం॥రాలు, సొంత ఇల్లు, ఫాదర్ కార్పెంటర్ వర్క్, బ్రదర్ మ్యారేడ్‌గా ఉన్న అమ్మాయికి సాంప్రదాయ వరుడు కావలెను. సెల్ : 91213 29753 AJL_195785

★ చౌదరి : 1st మ్యారేజ్, 27 సం॥రాలు, 5.4 డిగ్రీ, సొంత ఇల్లు, స్థిరాస్తి, ఫాదర్ బిజినెస్ ఉన్న అమ్మాయికి ఏదైనా జాబ్ లేదా బిజినెస్ వరుడు కావలెను. సెల్ : 91213 29753 AJL_195785

★ యాదవ్స్ (పూరి, ఎర్ర, అల్లి) గొల్లలు : మొదటి సంబంధం, రెండవ సంబంధం, వయస్సు 25 To 40 సం॥రాలు,10 to డిగ్రీ, చదివిన అమ్మాయిలకు వరులు కావలెను. సెల్ : 91213 29753 AJL_195785

★ (పద్మశాలి) దేవాంగులు :1995 B.Tech సొంత ఇల్లు ఉన్న అమ్మాయికి ఏదైనా బిజినెస్ లేదా సాఫ్ట్‌వేర్ అబ్బాయి ఆంధ్ర, తెలంగాణాలలో సాంప్రదాయ కుటుంబ వరుడు కావలెను. సెల్ : 91213 29753 AJL_195785

★ తొగట వీరక్షత్రియ : 1st మ్యారేజ్, 26 సం॥రాలు, సొంత ఇల్లు, డిగ్రీ, స్థిరాస్తి ఉన్న అమ్మాయికి ఏదైనా జాబ్ లేదా బిజినెస్ వరుడు కావలెను. సెల్ : 91213 29753 AJL_195785

★ బలిజ : మొదటి సంబంధం 26సం॥రాలు, డిగ్రీ, ప్రైవేట్ జాబ్, సొంత ఇల్లు, బ్రదర్స్, ఫాదర్ వ్యవసాయం ఉన్న అమ్మాయికి సాంప్రదాయ కుటుంబ వరుడు కావలెను. సెల్ : 91213 29753 AJL_195785

★ వెలమ, తెలగ, కాపు : 1st మ్యారేజ్, 2వ పెళ్లి, 26 To 45 సం॥రాల వారికి, ఆంధ్ర, తెలంగాణాలలో ఏదైనా సంబంధం కావలెను. సెల్ : 91213 29753 AJL_195785

★ రెడ్డి : 27 సం॥రాలు, డిగ్రీ, సొంత ఇల్లు ఫాదర్ వ్యవసాయం, టైలరింగ్ ఉన్న అమ్మాయికి సాంప్రదాయ కుటుంబ వరుడు కావలెను. సెల్ : 91213 29753 AJL_195785

**గమనిక**

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. మీరు జరిపే లావాదేవీలకు ఆంధ్రజ్యోతి పత్రిక బాధ్యత వహించదు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

తలంబ్రాలు ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
**9985921380, 9703618806, 9985921386**

## వధువు కావలెను



★ రెడ్డి / 30y / 5'6"/ ప్లాంట్ ఆపరేటర్ / సొంత ఇల్లు / పొలం గల వరునికి తగిన వధువు కావలెను. నో బ్రోకర్స్. డైరెక్ట్ సంప్ర: 6303172635 / 9346867507 AJH-4265

★ డైరెక్ట్ / కుల పట్టింపు లేదు / మున్నూరుకాపు / 32y / 5'8"/Bhmct/ లెక్చరర్ / హైదరాబాద్ / మంచి జీతం / ఆస్తి గల వరునికి 1వ / 2వ తగిన వధువు కావలెను. ఫోన్ : 9440122661 AJH-4265

★ పద్మశాలి (కుల ప్రసక్తి లేదు) / 44y / 5'8"/SW ENG మంచి జీతం / పెళ్లి కాని వరునికి SW/ పీజీ వధువు కావలెను. డైరెక్ట్ /(నో బ్రోకర్స్)/ Whatsapp 9912252833 AJH-002508

★ SC/ మాల హిందూ / B.TECH,MS 30 / USA H1B వీసా and 140 MNC మంచి జీతం / 6 ఫీట్ ఎత్తు బాగా స్థిరపడిన కుటుంబానికి చెందిన వరుడికి తగిన వధువుకావలెను. 9705960270 AJH-002508

★ SC మాల / B.TECH/ C.Govt. Exq. ఇంజనీర్ / మంచి జీతం / 5'8" ఎత్తు / 31 సం.ల వరుడికి వధువు కావలెను. ఫోన్ : 8897389698 AJH-16347

★ గౌడ / B.TECH/ C.Govt. G.S.T. ఇన్స్‌పెక్టర్ / మంచి జీతము / 5'10" ఎత్తు / 30 సం.ల అందమైన వరుడికి వధువు కావలెను. ఫోన్ : 7032058965 AJH-16347

★ 2వ పెళ్ళి / B.Com/ Govt. ఎంప్లాయి / TSSPDCL / మంచి జీతము / 5'7" ఎత్తు / 35 సం.ల వరుడికి వధువు కావలెను. ఫోన్ : 9963757612 AJH-16347

★ యాదవ / M.Tech/ VLSI / డిజైనింగ్ ఇంజనీర్ / AMD / మంచి జీతము / 5'9" ఎత్తు / 29 సం.ల అందమైన వరుడికి వధువు కావలెను. ఫోన్ : 9963757612 AJH-16347

★ పద్మశాలి / ప్రభుత్వ ఉద్యోగి / M.Sc, B.Ed., 47y/5'5"/ మొదటి వివాహం / కుల పట్టింపు లేదు. వధువు ప్రభుత్వ ఉద్యోగినియై ఉండాలి. రెండవ వివాహమైనా OK. పిల్లలు లేని వారై ఉండాలి. డైరెక్టుగా సంప్రదించండి. ఫోన్ : 9949447956 AJH-002575

★ బలిజ /35 yrs, డిగ్రీ, జాబ్ - కంప్యూటర్ ఆపరేటర్ @ మెడికల్ ఏజెన్సీ, కరీంనగర్లో స్వంత గృహం వున్న అబ్బాయికి తగిన వధువు కావలెను. డైరెక్ట్ కాంటాక్ట్ : 9440378427 JH-002575

★ చేనేత సామాజిక వర్గం / కుల పట్టింపు లేదు / 28y/5'5"/B.Tech(NIT)MNC కంపెనీలో, మంచి జీతం గల వరునికి తగిన వధువు కావలెను. నో బ్రోకర్స్. డైరెక్ట్ సంప్ర: 9553582479 AJH-4265

★ క్యాస్ట్ నో బార్ : 35 సంవత్సరాలు పురోహితం చేస్తున్న బ్రాహ్మణ వరుడుకు నెలకు మంచి ఆదాయం కలిగి & స్థిరాస్తి కలిగి ఉన్న వరునకు మొదటి, రెండవ వధువు కావలెను. ఫోన్ నెంబర్ : 9676036234. AJG-1716

★ డైరెక్టు - నోబ్రోకర్స్ - పద్మశాలి-తిరుపతి 62Y- 5.3-విడోవర్ Govt. Retired H.M., Pension, 60,000/- P.M. వెల్‌సెటిల్ - వరునకు తగిన FC/BC వధువు కావలెను. Ph : 83747 47256 AJT - 4198

★ నాయుడు / కాపు కులానికి చెందిన, వ్యాపారంలో స్థిరపడ్డ 37 సం.ల యువకునికి అదే కులానికి చెందిన సాంప్రదాయ వధువు కావలెను. కట్నం ప్రసక్తి లేదు. సంప్రదించండి: 9059682221, 9441069388 AJZ-197524

**కళ్యాణ వేదిక**

★ AP&TSలో అన్ని కులాలకు సంబంధించి 1వ / 2వ / లేటు / డైవర్సుడ్ వివాహముల కొరకు వధూవరులు మమ్ములను సంప్రదించగలరు. 9959004400. వెంకటేశ్వర మ్యారేజ్ బ్యూరో, కొత్తగూడెం. AJH-4265

★ Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE / Govt / Doctors / MNC / Matches / Late & 2nd Matches కై సంప్ర: Ph: 9704656103 / 9494809254 (Whatsapp) AJH-4265

★ లక్ష్మీ మ్యారేజ్ బ్యూరో / కేవలం చౌదరి కులస్తులకు మాత్రమే. పెళ్ళి సంబంధాలు చూడబడును. ప్రొ. జాస్తి సైదారావు. ఫోన్ : 9182731506/9705588313 AJH-4265

★ సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే / అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర: 8688006130 / 8555980066 AJH-002576

**కమ్మ మ్యారేజ్ బ్యూరో**
**(కమ్మాస్ & చౌదరీస్)**
**C. PRASHANTHI : 9100999850**
ప్రొఫైల్స్ : డాక్టర్స్ / సాఫ్ట్‌వేర్స్ / బిజినెస్ / గవర్నమెంట్ /
B.Tech / M. Tech / MBA / MCA / MS / USA / UK / Australia / Canada / Singapore / Newzealand / Germany / BDS / MDS / MBBS / MD / MS / DM / MCH ఇండియా & అబ్రాడ్స్
1వ, 2వ లేట్ సంబంధాలు కలవు.

**వధువు కావలెను**

★ కమ్మ: 1989 / 6feet / B.E. / Own Business / 50 Cr Share Property గల వరుడికి Well Settled & సాఫ్ట్‌వేర్ వధువు కావలెను. Ph: 9100999850

★ కమ్మ: 1996 / 5.10 / MS (UK) / 80 Cr Share Property గల వరుడికి India (or) UK లో ఉన్న Good Looking వధువు కావలెను. Ph: 9100999850

★ కమ్మ: 1995 / 6 feet / MBA / Pilot / 50 Cr Share Property గల వరుడికి Well Settled & Good Looking సాఫ్ట్‌వేర్ (or) డాక్టర్ వధువు కావలెను. Ph: 9100999850

★ కమ్మ డాక్టర్: 1991 / 5.10 / DM Oncology / 200 Cr Share Property Well Settled Family గల వరుడికి డాక్టర్ (or) సాఫ్ట్‌వేర్ వధువు కావలెను. Ph: 9100999850

★ కమ్మ డాక్టర్: 1994 / 6 feet / MS General Surgery / 10 Crs Property గల వరుడికి డాక్టర్ వధువు కావలెను. Ph: 9100999850

★ కమ్మ IPS: 1991 / 5.10 / B.E. MSC BITS Pilani / 100 Cr Share Property గల వరుడికి సాఫ్ట్‌వేర్ (or) డాక్టర్ Good Looking వధువు కావలెను. Ph: 9100999850

★ కమ్మ డాక్టర్: 1995/ 5.9 / MS Ortho / 20 Cr Share Property గల వరుడికి డాక్టర్ వధువు కావలెను. Ph: 9100999850

★ కమ్మ డాక్టర్: 1994/ 5.10 / MS General Surgery/Own Hospital / 100 Cr Share Property గల వరుడికి డాక్టర్ (or) సాఫ్ట్‌వేర్ వధువు కావలెను. Ph: 9100999850

★ కమ్మ USA: 1995/ 5.10 / B.Tech MS (USA) / 50 Crs Share Property గల వరుడికి ఇండియా (or) USA లో ఉన్న వధువు కావలెను. Ph: 9100999850

★ కమ్మ UK: 1996/ 5.7 / MBBS UK / UK Citizen / 40 Crs Share Property గల వరుడికి ఇండియా (or) UK లో ఉన్న డాక్టర్ / Software వధువు కావలెను. Ph: 9100999850

**వరుడు కావలెను**

★ కమ్మ డాక్టర్ : 1995 / 5.1 / MD Radiology / 60 Cr Share Property గల వధువుకి Well Settled బిజినెస్ (or) డాక్టర్ వరుడు కావలెను Ph: 9100999850

★ కమ్మ డాక్టర్ : 1994 / 5.5 / MD Anaesthesia / 50 Cr Property / Only Daughter / Well Settled Family గల వధువుకి డాక్టర్ వరుడు కావలెను. Ph: 9100999850

★ కమ్మ : 1993 / 5.7 / B.Arch / 75 Cr Share Property గల వధువుకి సాఫ్ట్‌వేర్ (or) బిజినెస్ (or) డాక్టర్ వరుడు కావలెను Ph: 9100999850

★ కమ్మ : 1999 / 5.7 / MS (UK) / 25 Cr Share Property గల వధువుకి ఇండియాలో ఉన్న సాఫ్ట్‌వేర్ వరుడు కావలెను Ph: 9100999850

★ కమ్మ డాక్టర్: 1996 / 5.7 / MD Anaesthesia / 10 Cr Share Property గల వధువుకి బిజినెస్ (or) డాక్టర్ వరుడు కావలెను Ph: 9100999850

★ కమ్మ : 1994 / 5.6 / MBA / 12 Cr Share Property గల వధువుకి సాఫ్ట్‌వేర్ (or) బిజినెస్ వరుడు కావలెను Ph: 9100999850

★ కమ్మ డాక్టర్: 1993 / 5.4 / DM Gastro / 30 Cr Share Property గల వధువుకి Well Settled డాక్టర్ వరుడు కావలెను Ph: 9100999850

★ కమ్మ డాక్టర్ : 1995 / 5.7 / DM Neurology / 5 Cr Share Property గల వధువుకి Good Looking డాక్టర్ వరుడు కావలెను Ph: 9100999850

★ కమ్మ డాక్టర్: 1992 / 5.7 / MCH Plastic Surgery / 20 Cr Share Property గల వధువుకి డాక్టర్ (or) బిజినెస్ వరుడు కావలెను. Ph: 9100999850

★ కమ్మ USA : 1995 / 5.7 / B.Tech MS (USA) / 10 Cr Share Property గల వధువుకి India (or) USA లో ఉన్న డాక్టర్ (or) సాఫ్ట్‌వేర్ వరుడు కావలెను. Ph: 9100999850

**శారద వివాహ వేదిక**
Mail: saradamatrimony1@gmail.com, website: www.saradaram.com
**EXCLUSIVE CHOWDARY COMMUNITY**
Hyderabad. Phone: 9849413031

**కమ్మ ప్రత్యేకం**

**వధువు కావలెను**

★ కమ్మ ప్రత్యేకం : 40 B.Tech 15 Cr / 43 MSc 50 Cr / 10 Cr B.Tech 24L PA 39 / 15 Cr B.Tech MS 35 / 20 Cr B.Tech MS 33 / 50 Cr B.Tech 30 / 5 Cr B.Tech 29 / 20 Cr B.Tech MBA 25 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : USA Citizens 30 Cr B.Tech MS 29 / 50 Cr. B.Tech MS 27 / 15 Cr. B.Tech MS 40 / 100 Cr. USA Doctor 34 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 500 Cr. MBBS MD 34 / 100 Cr MBBS MD 25 / 50 Cr MBBS MD Pediatrics / 20 Cr MBBS MD 30 / 15 Cr MBBS MD GS 31 / 20 Cr MBBS MD Pediatrics 29 / 10 Cr MBBS MD GM 35 / 20 Cr MBBS MD Ortho 34 / వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం :(రెండో పెళ్ళి): 31 B.Tech IIT MS Business Hyderabad 20 Cr / 37 B.Tech 30 Cr Hyd / 40 B.Tech 15 Cr 38L PA Hyderabad / 50 Cr Business 40 Hyderabad / 15 Cr B.Tech 40 Hyderabad రెండో పెళ్ళి వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం :(USAరెండో పెళ్ళి): 50 Cr USA Doctor 35 / 15 Cr USA Green Card 40 / B.Tech MS 40 Cr / 15 Cr Doctor Canada / 35 B.Tech MS / 45 B.Tech MS USA / 48 B.Tech MS / 38 B.Tech MS / 32 B.Tech MS వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 15 Cr B.Tech 40 India / 15 Cr B.Tech MS USA Citizen / 30 Cr B.Tech MS 38 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 1 Cr to 500 Cr 24 to 45 B.Tech / M.Tech / MS / CA / PG Doctors India / USA /ఆస్ట్రేలియా U.K. వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 30 Cr B.Tech 28 / 20 Cr B.Tech IIT 29 / 10 Cr B.Tech 35 / 50 Cr Business 32 / 40 Cr B.Tech MS 31 / 20 Cr B.Tech 25 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 70 Cr MBA 29 Business / 50 Cr B.Tech 30 Business / 100 Cr B.Tech MS 29 Business / 50 Cr B.Tech 27 / 20 Cr B.Tech Business వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం Australia: 20 Cr B.Tech MS 29 PR / 5 Cr B.Tech MS 28 / 2 Cr B.Tech MS 32 / 3 Cr B.Tech MS 30 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

**వరుడు కావలెను**

★ కమ్మ ప్రత్యేకం : 15Cr B.Tech 26 / 70Cr Architecture 30 / 50Cr B.Tech MS 25 / 20 Cr B.Tech 25 వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : డాక్టర్స్ India 20Cr MS General 31/15Cr Dermatology 35 / 10Cr Radiology & Gynic & Skin Doctor and ENT Dental డాక్టర్స్ వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 50 Cr B Tech MS 29/30Cr B.Tech MS 27/100Cr B.Tech MS 29/20Cr B.Tech MS 28/40 Cr B.Tech MS 25 వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : రెండవ పెళ్ళి, 40 B.Tech MS Business in India / 20 Cr. 35 B.Tech Hyderabad / 25 Cr. 35 PG Doctor వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 25 B.Tech MS / 27 B.Tech MS / 29 B.Tech MS / 31 B.Tech MS / 33 B.Tech MS / 35 B.Tech MS వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 30Cr B.Tech 28 / 20Cr B.Tech MBA 32 / 20Cr B.Tech 25 / 50Cr MBBS PG Doctor Hyderabad వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : రెండో పెళ్ళి 29 B.Tech MS USA / 42 B.Tech MS / 35 B.Tech MS India / 32 B.Tech MS USA వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 10 Cr 25. B.arch, MS. UK. US/10Cr. BBA 28/ 29.BTech / MS / Amazon, 300k USA. అందమైన యూఎస్. UK. India. Well settled వధువులకి వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 27 B.Tech Irland / 26 B.Tech MS UK / 27 CA India వధువుకి 25 to 45 USA వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం. రెండో పెళ్ళి : 40 B.Tech MS Business in India. 20 Cr. / 35 B.Tech Hyderabad. 25 Cr. / 35 PG Doctor. అందమైన వధువులకి తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

▪ఆర్కే RK



కొత్తపలుకు

# వేధింపుల గతం మరచి గగ్గోలా?

జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు హద్దులు మీరి ప్రవర్తించిన పదహారు మంది ఐపీఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం వెయిటింగ్‌లో ఉంచడంతో పాటు ప్రతిరోజూ డీజీపీ ఆఫీస్‌కు వచ్చి రిపోర్ట్ చేసి సాయంత్రం వరకు కూర్చోవాలని ఆదేశించింది. దీనిపై జగన్ రెడ్డి రోత మీడియా గురివింద సామెతను తలపిస్తూ గుండెలు బాదుకుంటోంది. గతంలో జగన్ రెడ్డి ఎంత మంది అఖిల భారత సర్వీసు అధికారులను వేధించారో మరచిపోయారు. ఇప్పుడు వెయిటింగ్‌లో ఉన్న అధికారులను అప్పట్లో కిరాయి సైనికులుగా మార్చుకొని చేయించిన అరాచకాలను మరచిపోయారు. పీఎస్సార్ ఆంజనేయులు ద్వారా మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావును ఆత్మహత్య చేసుకొనే వరకు వేధించలేదా? సొంత ఎంపీ రఘురామ కృష్ణరాజును అరెస్టు చేయించి అరికాళ్లు పగిలేలా కొట్టడంలో పీవీ సునీల్ కుమార్ పాత్ర లేదా? ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారంటూ ఢిల్లీ, హైదరాబాద్‌లో విలేఖరుల సమావేశాలు పెట్టి నిబంధనలు ఉల్లంఘించిన సంజయ్‌కు ఏమి శిక్ష విధించాలి? రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన తర్వాత కొల్లి రఘురామి రెడ్డి, రిషాంత్ రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలవడానికి కూడా ప్రయత్నించకపోవడం సమర్థనీయమా? అఖిల భారత సర్వీసు అధికారులకు రాజకీయ అనుబంధాలు అవసరమా? అంతెందుకూ, స్కిల్ కేసులో విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ లక్ష్మీనారాయణ ఇంటికి వచ్చిన సీఐడీ అధికారులకు విచారణ సాఫీగా జరగడానికి సహకరించిన నాపై విధులకు ఆటంకం కలిగించానని కేసు పెట్టించింది కొల్లి రఘురామిరెడ్డి కాదా? ఆరోజు లక్ష్మీనారాయణ ఇంటికి వచ్చిన విచారణ అధికారులకు రఘురామిరెడ్డి ఎన్ని పర్యాయాలు ఫోన్ చేశారో కాల్ డేటా చూస్తే తెలుస్తుంది కదా? ఇలాంటి అధికారులకు జగన్ రోత మీడియాతో పాటు తెలంగాణకు చెందిన మాజీ ఐపీఎస్ అధికారి, ప్రస్తుత బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వత్తాసు పలకడం వింతగా ఉంది. సదరు అధికారులు జగన్ హయాంలో అరాచకంగా ప్రవర్తించినప్పుడు ఇదే ప్రవీణ్ కుమార్‌కు తప్పు అని చెప్పడానికి నోరు రాలేదు. పరిటాల రవి హత్య జరిగినప్పుడు ఇదే ప్రవీణ్ కుమార్ అనంతపురం జిల్లా ఎస్పీగా పనిచేశారన్న విషయం మరచిపోకూడదు. బీఎస్పీ ఎన్నికల చిహ్నం ఏనుగును ఎక్కి దొరల గడీలను బద్దలు కొడతానన్న ఇదే ప్రవీణ్ కుమార్ ఇప్పుడు అదే దొర పంచన చేరారు. మొత్తానికి ప్రవీణ్ కుమార్ రాజకీయాల్లోకి వచ్చి తన విశ్వసనీయతను తానే దెబ్బతీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో నాడు జరిగింది ఒప్పు అయితే ఇప్పుడు జరుగుతున్నది కూడా ఒప్పే.

> ఇప్పటివరకు చాలా మందికి తెలియని ఒక విషయం చెప్పాలి. మే 13న ఎన్నికలు పూర్తయిన తర్వాత విశ్రాంతి కోసం కుటుంబంతో పాటు ఇటలీ వెళ్లాలని చంద్రబాబు నిర్ణయించుకున్నారు. లుక్ ఔట్ నోటీసు లేకపోయినా సీఐడీ అధికారుల సూచనలతో ఆయనను శంషాబాద్ విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు ఆపేశారు. అప్పుడు ఎన్నికల కోడ్ అమలులో ఉంది. విషయం తెలుసుకున్న ఏపీకి చెందిన సీనియర్ అధికారులు కల్పించుకొని విదేశాలకు వెళ్లడానికి చంద్రబాబును అనుమతించారు. అనుమతి రావడంలో అరగంట ఆలస్యం జరిగి ఉన్నా చంద్రబాబు విదేశీ పర్యటన నిలిచిపోయి ఉండేది. అధికార దుర్వినియోగం అంటే ఇదీ! జగన్ రెడ్డి విదేశాలకు వెళ్లాలంటే కోర్టు అనుమతి కావాలి. చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేసినప్పుడు న్యాయస్థానం అలాంటి షరతులేవీ విధించలేదు. అయినా అధికారం ఉందికదా అని చంద్రబాబును విదేశాలకు వెళ్లకుండా అడ్డుకొనే ప్రయత్నం చేశారు. చంద్రబాబు విషయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అధికారులను శిక్షించాలా? వద్దా?

## జగన్‌కు, చంద్రబాబుకు తేడా ఇది..

వాస్తవానికి చంద్రబాబు నాయుడు తొందరపడకుండా ఒక పద్ధతి ప్రకారం వ్యవహరిస్తున్నారు. నిర్దిష్టమైన ఆధారాలు లేకుండా ఎవరిపైనా చర్యలు తీసుకోవడంలేదు. అగ్రిగోల్డ్ భూముల కొనుగోలు వ్యవహారంలో మాజీ మంత్రి జోగి రమేశ్ కుమారుడు రాజీవ్‌ను అరెస్టు చేసిన తీరే ఇందుకు నిదర్శనం. అగ్రిగోల్డ్ వ్యవహారంలో ఉభయ రాష్ట్రాలకు చెందిన సామాన్య మదుపరులు నష్టపోయారు. ఈ సంస్థ ఆస్తులను సీఐడీ అధికారులు జప్తు చేశారు. అలాంటి ఆస్తులలో ఒకదాని సర్వే నంబర్ మార్పించి మరీ జోగి రమేశ్ కుటుంబం సొంతం చేసుకుంది. ఇది నేరం మాత్రమే కాదు– పాపం కూడా. పైపెచ్చు అందరూ ఎలా కొన్నారో నేనూ అలాగే కొన్నానని జోగి రమేశ్ చెప్పడం వింతగా ఉంది. అంటే అగ్రిగోల్డ్ భూములను వైసీపీకి చెందిన చాలా మంది సొంతం చేసుకునే ప్రయత్నం చేశారన్న మాట. 2014 తర్వాత ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇదే అగ్రిగోల్డ్‌కు చెందిన హాయ్ లాండ్ భూమిని ప్రస్తుత మంత్రి లోకేశ్ సొంతం చేసుకున్నారని జగన్ రెడ్డి ఆరోపించడం నిజం కాదా? ఐదేళ్ల అధికారంలో ఉండి కూడా ఆ విషయంలో తప్పు జరిగినట్టు తేల్చలేదు. ఇప్పుడు అలా కాదే! పక్కా ఆధారాలతో చంద్రబాబు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తన ఇంటిపై దాడి చేయబోయిన జోగి రమేశ్‌ను పద్ధతి ప్రకారం విచారించడానికి చంద్రబాబు చర్యలు తీసుకున్నారు. ఆనాటి దౌర్జన్యం నిజం కాదని చెప్పగలరా? తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయాన్ని ధ్వంసం చేసిన వారిపై కూడా చట్ట ప్రకారమే చర్యలు తీసుకుంటున్నారు. అదే జగన్ రెడ్డి అయితే, ముందు నిందితులు అందరినీ జైల్లో వేయండి, విచారణ సంగతి తర్వాత చూద్దాం అనేవారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి కేసులో నిందితుడైన దేవినేని అవినాశ్‌పై లుక్ ఔట్ నోటీసులు ఉన్నప్పటికీ దుబాయ్ వెళ్లే ప్రయత్నం చేయగా శంషాబాద్ విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు ఆపేశారు. ఇక్కడ నిబంధనల అతిక్రమణ జరగలేదు. ఇప్పటివరకు చాలా మందికి తెలియని ఒక విషయం చెప్పాలి. మే 13న ఎన్నికలు పూర్తయిన తర్వాత విశ్రాంతి కోసం కుటుంబంతో పాటు ఇటలీ వెళ్లాలని చంద్రబాబు నిర్ణయించుకున్నారు. లుక్ ఔట్ నోటీసు లేకపోయినా సీఐడీ అధికారుల సూచనలతో ఆయనను శంషాబాద్ విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు ఆపేశారు. అప్పుడు ఎన్నికల కోడ్ అమలులో ఉంది. విషయం తెలుసుకున్న ఏపీకి చెందిన సీనియర్ అధికారులు కల్పించుకొని విదేశాలకు వెళ్లడానికి చంద్రబాబును అనుమతించారు. అనుమతి రావడంలో అరగంట ఆలస్యం జరిగి ఉన్నా చంద్రబాబు విదేశీ పర్యటన నిలిచిపోయి ఉండేది. అధికార దుర్వినియోగం అంటే ఇదీ! జగన్ రెడ్డి విదేశాలకు వెళ్లాలంటే కోర్టు అనుమతి కావాలి. చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేసినప్పుడు న్యాయస్థానం అలాంటి షరతులేవీ విధించలేదు. అయినా అధికారం ఉందికదా అని చంద్రబాబును విదేశాలకు వెళ్లకుండా అడ్డుకొనే ప్రయత్నం చేశారు. చంద్రబాబు విషయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అధికారులను శిక్షించాలా? వద్దా? వెయిటింగ్‌లో ఉన్న పదహారు మంది ఐపీఎస్ అధికారులపై ప్రభుత్వం ఏయే కేసులు పెట్టబోతున్నదో తెలియదు. నిజంగానే వారిలో హద్దులు మీరి వ్యవహరించిన వారు ఉంటే శిక్ష తప్పదు. జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొత్తలో ఈ పదహారు మందిలో ఒక అధికారి అధికారిక సమావేశంలో మాట్లాడుతూ "ఎన్నికల్లో ఒక అద్భుతం జరిగింది. జీసస్ కృపతో మెరుపులా మీరు ముఖ్యమంత్రిగా ఆవిర్భవించారు" అని పొగడ్తల వర్షం కురిపించారు. ఒక ఐపీఎస్ అధికారి ముఖ్యమంత్రిని ఇలా ప్రశంసించడం సమర్థనీయమా? అఖిల భారత సర్వీసు అధికారులను ఈ దుష్టసంస్కృతి నుంచి బయట పడేయాలి. ప్రవీణ్‌కుమార్ వంటివారు ఆ దిశగా కృషి చేస్తే మంచిది. చెడును సమర్థిస్తే మనకు కూడా ఆ మకిలి అంటుకుంటుంది!

## కారు.. కమలం 'కలిసి' పోతాయా?

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను కాసేపు పక్కన పెట్టి, తెలంగాణలో చోటుచేసుకుంటున్న పరిణామాల విషయానికి వద్దాం. 'త్వరలోనే భారతీయ జనతా పార్టీలో భారత రాష్ట్ర సమితి విలీనమవుతుంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గవర్నర్ పదవి ఇస్తారు. కవితకు బెయిల్ కూడా వస్తుంది'.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా ఢిల్లీలో చేసిన వ్యాఖ్యలు ఇవి. "అదేమీ కాదు! కాంగ్రెస్ పార్టీలోనే బీఆర్ఎస్ విలీనమవుతుంది. కేసీఆర్‌కు ఏఐసీసీ పదవి, కేటీఆర్‌కు పీసీసీ అధ్యక్ష పదవి, హరీశ్‌కు రాష్ట్రంలో మంత్రి పదవి లభిస్తాయి'.. ఇవి కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రధాన పాత్ర పోషించిన ఒకప్పటి తెలంగాణ రాష్ట్ర సమితి, ప్రస్తుత భారత రాష్ట్ర సమితి నిజంగానే రెండు జాతీయ పార్టీలలో ఏదో ఒక దానిలో విలీనంకాక తప్పదా? తొమ్మిదిన్నరేళ్లు అధికారంలో ఉండిన బీఆర్ఎస్‌కు అలాంటి పరిస్థితి ఏర్పడిందా? తెలంగాణ రాజకీయాల్లో అసలేం జరగబోతోంది? ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్‌కు ఈ దుస్థితి ఎందుకు వచ్చింది? విలీనం వార్తలను బీఆర్ఎస్ ముఖ్యులు ఎందుకు గట్టిగా ఖండించలేకపోతున్నారు? కేసీఆర్ మనసులో ఏముంది? వంటి ప్రశ్నలు ప్రస్తుతం చర్చనీయాంశంగా ఉన్నాయి. జాతీయ రాజకీయాలలో చక్రం తిప్పాలని, కేంద్రంలో బీజేపీని గద్దె దించుతానని కొంతకాలం క్రితం వరకు ప్రతిజ్ఞలు చేసిన కేసీఆర్ ఇంత బలహీనంగా ఎందుకు మారిపోయారు? కేసీఆర్ బలహీనతను అడ్డుపెట్టుకొని బీఆర్ఎస్‌ను మింగేయడానికి భారతీయ జనతా పార్టీ ప్రయత్నిస్తున్నట్టు వస్తున్న వార్తలలో వాస్తవం ఉందా? విలీనం వార్తలలో ఎంత నిజముంది? నిజమే అయితే తెర వెనుక ఏమి జరిగింది? అన్నది ఇప్పుడు తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం! ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో నిందితురాలుగా ఉన్న కేసీఆర్ కుమార్తె కవిత ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్నారు. తన బిడ్డ నెలల తరబడి జైలులో ఉండాల్సి రావడాన్ని కేసీఆర్ భరించలేక పోతున్నారు. గుండెల్లో అగ్నిపర్వతం పెట్టుకొని బయటకు గంభీరంగా ఉంటున్నానని ఆ మధ్య కేసీఆర్ వ్యాఖ్యానించారు కూడా! ఈ నేపథ్యంలో తన బిడ్డ కవితను బెయిల్‌పై విడిపించుకునేందుకు కేసీఆర్ చేయని ప్రయత్నం లేదు. ఈ క్రమంలో ఆయన బీజేపీ సహాయాన్ని అర్థించడం వాస్తవం. కేటీఆర్, హరీశ్ రావులు రెండు మూడు సార్లు ఢిల్లీ వెళ్లి మంత్రాంగం కూడా నడిపారు. రాజకీయ వర్గాలలో ప్రచారం జరుగుతున్నట్టుగా వారిరువురూ ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాలను కలవలేదు. మరెవరిని కలిసుంటారు? బీజేపీతో రాజీ కుదర్చడానికి చొరవ తీసుకున్న ప్రముఖుడు ఎవరు? ఆయనకు ప్రధాని మోదీ వద్ద నిజంగా అంత పలుకుబడి ఉందా? వంటి సందేహాలు సహజంగానే కలుగుతాయి. ఈ మొత్తం వ్యవహారంలో ఒక ప్రముఖ వ్యక్తి కీలక పాత్ర పోషించారు. ఆయన ప్రస్తుతం ఒక రాష్ట్రానికి గవర్నర్‌గా కూడా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం–బీజేపీ మధ్య పొత్తు కుదరడంలో కూడా ఆయనే ప్రధాన పాత్ర పోషించారు. సదరు గవర్నర్‌పై ప్రధాని మోదీకి గురి ఉంది. అదే సమయంలో ఆరెస్సెస్ ప్రముఖులతో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. దీంతో ఆరెస్సెస్ ప్రోద్బలంతో ఆ గవర్నర్ తెలుగుదేశం పార్టీతో మాట కలిపారు. చంద్రబాబు పొడగిట్టని ప్రధాని మోదీకి అదే సమయంలో నచ్చజెప్పారు. ఫలితంగా సదరు గవర్నర్‌కు, చంద్రబాబుకు మధ్య చర్చలు జరిగాయి. ఈ చర్చలలో స్థూలంగా ఏకాభిప్రాయం కుదరడంతో చంద్రబాబు ఢిల్లీ వెళ్లి హోం మంత్రి అమిత్ షాను కలిశారు. ఆ తర్వాత ఏం జరిగిందో అందరికీ తెలిసిందే.




> గతంలో జగన్ రెడ్డి ఎంత మంది అఖిల భారత సర్వీసు అధికారులను వేధించారో మరచిపోయారు. ఇప్పుడు వెయిటింగ్‌లో ఉన్న అధికారులను అప్పట్లో కిరాయి సైనికులుగా మార్చుకొని చేయించిన అరాచకాలను మరచిపోయారు. పీఎస్సార్ ఆంజనేయులు ద్వారా మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావును ఆత్మహత్య చేసుకొనే వరకు వేధించలేదా? సొంత ఎంపీ రఘురామ కృష్ణరాజును అరెస్టు చేయించి అరికాళ్లు పగిలేలా కొట్టడంలో పీవీ సునీల్ కుమార్ పాత్ర లేదా? ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారంటూ ఢిల్లీ, హైదరాబాద్ లో విలేఖరుల సమావేశాలు పెట్టి నిబంధనలు ఉల్లంఘించిన సంజయ్‌కు ఏమి శిక్ష విధించాలి. రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన తర్వాత కొల్లి రఘురామి రెడ్డి, రిషాంత్ రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలవడానికి కూడా ప్రయత్నించకపోవడం సమర్థనీయమా? అఖిల భారత సర్వీసు అధికారులకు రాజకీయ అనుబంధాలు అవసరమా? అంతెందుకూ, స్కిల్ కేసులో విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ లక్ష్మీనారాయణ ఇంటికి వచ్చిన సీఐడీ అధికారులకు విచారణ సాఫీగా జరగడానికి సహకరించిన నాపై విధులకు ఆటంకం కలిగించానని కేసు పెట్టించింది కొల్లి రఘురామిరెడ్డి కాదా?

## ఇదీ జరిగింది...

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకోవడం లాభించినందున తెలంగాణలో కూడా మంత్రాంగం నడపవలసిందిగా సదరు గవర్నర్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశించినట్టు తెలిసింది. అప్పటికే ఆరెస్సెస్ సీనియర్ నాయకులు కూడా ఆయనకు ఆ బాధ్యత అప్పగించారు. దీంతో రంగంలోకి దిగిన గవర్నర్ భారత రాష్ట్ర సమితి ముఖ్యులకు సంకేతాలు పంపారు. అప్పటికే మద్యం కేసులో అరెస్టయి కవిత జైలులో ఉన్నారు. దీంతో మానసికంగా కుంగిపోయిన కేసీఆర్ తన పార్టీ తరఫున మంతనాలు జరపడానికి కేటీఆర్, హరీశ్ రావును పురమాయించారు. మొదటి దఫా చర్చలలో పెద్దగా పురోగతి లేకపోయినా... రెండో పర్యాయం జరిపిన చర్చలలో మాత్రం ఎవరికి ఏమి కావాలన్న దానిపై స్పష్టత ఏర్పడింది. భారత రాష్ట్ర సమితికి ఏమి కావాలో తెలిసిందే కనుక తమకు ఏమి కావాలో రెండో దఫా చర్చల సందర్భంగా సదరు గవర్నర్‌తో పాటు ఆరెస్సెస్ నాయకులు స్పష్టం చేశారు. జైలులో ఉన్న కవిత విషయంలో సహాయ సహకారాలు లభించాలంటే భారత రాష్ట్ర సమితిని భారతీయ జనతా పార్టీలో విలీనం చేయాలని లేదా పొత్తు పెట్టుకుంటున్నట్టు ప్రకటించాలని, ప్రతిగా కేసీఆర్‌కు గవర్నర్ పదవి ఇస్తారని, హరీశ్ రావుకు కేంద్ర మంత్రి పదవి ఇస్తామని ఆ గవర్నర్‌తో పాటు ఆరెస్సెస్ ప్రతినిధులు ప్రతిపాదించారు. ఆ తర్వాత దశలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా హరీశ్ రావును నియమిస్తామని కూడా ప్రతిపాదించినట్టు తెలిసింది. కేటీఆర్ భవిష్యత్ విషయమై ఎటువంటి చర్చా జరగలేదని అంటున్నారు. కేసీఆర్ కుటుంబం రాజకీయాల నుంచి నిష్క్రమించాలన్నది బీజేపీ పెద్దల అభిమతంగా ఉన్నట్టు చెబుతున్నారు. అయితే చర్చలు ఏకపక్షంగా ఉండటం, తమకు షరతులు విధించడాన్ని బీఆర్ఎస్ ముఖ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. పార్టీని విలీనం చేయాలని కోరవద్దని, పొత్తు పెట్టుకొని ముందుకు వెళదామని బీఆర్ఎస్ ముఖ్యులు ప్రతిపాదించారు. ఈ దశలో చర్చలు అప్పటికి ముగిశాయి. ఢిల్లీ చర్చల వివరాలను కేటీఆర్, హరీశ్‌రావు తమ నాయకుడు కేసీఆర్‌కు వివరించారు. భారతీయ జనతా పార్టీలో తమ పార్టీని విలీనం చేయడం ఆత్మహత్యాసదృశం అవుతుందని భావిస్తున్న కేసీఆర్ అండ్ కో అప్పటి నుంచి మౌనంగా ఉంటున్నారు.

> బీఎస్పీ ఎన్నికల చిహ్నం ఏనుగును ఎక్కి దొరల గడీలను బద్దలు కొడతానన్న ఇదే ప్రవీణ్ కుమార్ ఇప్పుడు అదే దొర పంచన చేరారు. మొత్తానికి ప్రవీణ్ కుమార్ రాజకీయాల్లోకి వచ్చి తన విశ్వసనీయతను తానే దెబ్బతీసుకున్నారు.

## అస్తిత్వం కోల్పోయేందుకు సిద్ధమా?

కవిత బెయిల్ పిటిషన్ ఈ నెల 28న సుప్రీం కోర్టులో విచారణకు రానుంది. ఆ రోజు కవితకు బెయిల్ లభించవచ్చునని బీఆర్ఎస్ నాయకులు ఆశగా ఉన్నారు. అదే జరిగితే బీజేపీతో తదుపరి చర్చలు ప్రస్తుతానికి ఉండకపోవచ్చు. లిక్కర్ కేసులో కవితకు ఉపశమనం లభించాలంటే ఆమె అప్రూవర్‌గా మారాలన్న షరతు కూడా బీజేపీ ప్రముఖులు విధించినట్టు తెలిసింది. ఈ నెల 28న కవితకు బెయిల్ లభిస్తే బీజేపీకి లొంగిపోవాల్సిన అవసరం కేసీఆర్‌కు ఉండదు. అయితే, కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నందున కేసీఆర్ లేదా కేటీఆర్‌కు ముప్పు లేకపోలేదు. దీంతో బీఆర్ఎస్ ముఖ్యులు ప్రస్తుతానికి గుంభనంగా ఉంటున్నారు. తెలంగాణలో శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు కూడా ఇటీవలే జరిగినందున బీఆర్ఎస్‌తో ఇప్పుడే పొత్తు పెట్టుకొని ప్రయోజనం ఏమిటన్నది బీజేపీ ముఖ్యుల అభిప్రాయంగా ఉంది. యూటర్న్ తీసుకోవడంలో కేసీఆర్‌కు ట్రాక్ రికార్డు ఉన్నందున అయనను నమ్మి ఇప్పుడే పొత్తు ప్రకటించి ప్రయోజనం ఉండదని కమలనాథులు భావిస్తున్నారు. రాష్ట్ర విభజన సమయంలో అప్పటి టీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తానని కాంగ్రెస్ పెద్దల్ని నమ్మించి కేసీఆర్ యూటర్న్ తీసుకోవడాన్ని బీజేపీ ముఖ్యులు గుర్తు చేస్తున్నారు. ఈ కారణంగా విలీనం ప్రతిపాదననే ముందుకు తీసుకు వెళ్లాలని వారు భావిస్తున్నారు. అయితే, కేవలం కవితకు ఉపశమనం లభించేందుకు తెలంగాణ రాజకీయాల్లో కీలకంగా ఉన్న బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసి అస్తిత్వం కోల్పోవడానికి కేసీఆర్ అండ్ కో సుముఖంగా లేరు. అలాగని భారతీయ జనతా పార్టీతో సంబంధాలను చెడగొట్టుకోవడానికి కూడా వారు సిద్ధంగా లేరు. ఈ కారణంగానే విలీనం వార్తలపై కేసీఆర్ అండ్ కో ఘాటుగా స్పందించడం లేదు.

> తెలంగాణలో శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు కూడా ఇటీవలే జరిగినందున బీఆర్ఎస్‌తో ఇప్పుడే పొత్తు పెట్టుకొని ప్రయోజనం ఏమిటన్నది బీజేపీ ముఖ్యుల అభిప్రాయంగా ఉంది. యూటర్న్ తీసుకోవడంలో కేసీఆర్‌కు ట్రాక్ రికార్డు ఉన్నందున ఆయనను నమ్మి ఇప్పుడే పొత్తు ప్రకటించి ప్రయోజనం ఉండదని కమలనాథులు భావిస్తున్నారు. రాష్ట్ర విభజన సమయంలో అప్పటి టీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తానని కాంగ్రెస్ పెద్దల్ని నమ్మించి కేసీఆర్ యూటర్న్ తీసుకోవడాన్ని బీజేపీ ముఖ్యులు గుర్తు చేస్తున్నారు. ఈ కారణంగా విలీనం ప్రతిపాదననే ముందుకు తీసుకు వెళ్లాలని వారు భావిస్తున్నారు. అయితే, కేవలం కవితకు ఉపశమనం లభించేందుకు తెలంగాణ రాజకీయాల్లో కీలకంగా ఉన్న బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసి అస్తిత్వం కోల్పోవడానికి కేసీఆర్ అండ్ కో సుముఖంగా లేరు. అలాగని భారతీయ జనతా పార్టీతో సంబంధాలను చెడగొట్టుకోవడానికి కూడా వారు సిద్ధంగా లేరు. ఈ కారణంగానే విలీనం వార్తలపై కేసీఆర్ అండ్ కో ఘాటుగా స్పందించడం లేదు.

## కర్మఫలం...

కర్మ ఫలాన్ని ఎవరూ తప్పించుకోలేరని అంటారు. కేసీఆర్ పరిస్థితి కూడా ప్రస్తుతం అలాగే ఉంది. అధికారంలో ఉన్నప్పుడు ఓటుకు నోటు కేసులో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జైలుకు పంపి ముప్పుతిప్పలు పెట్టారు. ఒక్కగానొక్క కుమార్తె వివాహ వేడుకలను కూడా దగ్గరుండి జరిపించుకోలేని పరిస్థితి రేవంత్ రెడ్డికి కల్పించారు. ఇప్పుడు కేసీఆర్ ప్రతిపక్షంలో కూర్చోవలసిరాగా, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి స్థానంలో కూర్చున్నారు. లిక్కర్ కేసులో చిక్కుకున్న కవిత జైలు పాలయ్యారు. దీంతో కేసీఆర్ జుట్టు బీజేపీ చేతికి చిక్కింది. ఎమ్మెల్యేల కొనుగోలుకు ప్రయత్నించారని ఆరెస్సెస్ ముఖ్యుడు బీఎల్ సంతోష్‌ను కూడా అరెస్టు చేయాలని అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ ప్రయత్నించారు. ఇప్పుడు పరిస్థితులు తారుమారయ్యాయి. కర్మ మనల్ని వదలదని అనడానికి ఇంతకంటే నిదర్శనం ఏమి కావాలి? ప్రగల్భాలకు పోవడం రాజకీయ నాయకులకు అలవాటే. మామీద కేసులు పెట్టి జైలుకు పంపుతారా? దమ్ముంటే ఆ పని చెయ్యండి! అని సవాళ్లు విసురుతారు. నిజంగా అదే జరిగితే మాత్రం తట్టుకోలేరు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు స్కిల్ కేసులో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబును జైలుకు పంపారు. ఆ పరిణామం చంద్రబాబును బాగా కుంగదీసింది. అయితే ప్రజల నుంచి అనూహ్యమైన మద్దతు రావడంతో చంద్రబాబు వెంటనే కోలుకున్నారు. తెలంగాణను కనుసైగలతో పాలించిన కేసీఆర్ ఇప్పుడు తన బిడ్డ జైలులో ఉండటాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. ఈ పరిణామం తనను మానసికంగా కుంగదీస్తోందని ఆయనే చెప్పుకొంటున్నారు. ఈ కారణంగానే తెలంగాణ రాజకీయాలను శాసించాలనుకున్న కేసీఆర్ బీజేపీతో రాజీకి తలవొంచాల్సిన పరిస్థితి. కవిత జైలులో ఉండివుండకపోతే బీజేపీతో సయోధ్యకు ప్రయత్నించాల్సిన అవసరం కేసీఆర్‌కు ఉండేది కాదు. అధికారంలో ఉన్నప్పుడు విర్రవీగిన కేసీఆర్‌లో ఇంత బేలతనం చూస్తామని అనుకున్నామా? అధికారం అనుభవించడానికి అలవాటుపడిన నాయకులలో పోరాట పటిమ పోతున్నందునే ఈ దుస్థితి! కవితకు ఇవాళ కాకపోతే రేపు బెయిలు లభిస్తుంది. అయితే బిడ్డపై ఉన్న మమకారంతో ఆయన రాజీ బేరాలకు దిగజారారు. తెర వెనుక ఏం జరిగిందో ఇప్పుడు తెలిసి పోయింది కనుక విలీనం లేదా పొత్తు ప్రతిపాదనలు ముందుకు వెళతాయా? లేదా? అన్నవి ప్రస్తుత ప్రశ్నలు. బీఆర్ఎస్‌ను విలీనం చేసుకోవడం వరకు బీజేపీ రాష్ట్ర నాయకులకు అభ్యంతరాలు లేవు. పొత్తు పెట్టుకోవాలన్న ప్రతిపాదనను మాత్రం వ్యతిరేకిస్తున్నారు. అయితే, రాష్ట్ర నాయకులకు కేంద్రంలో పెద్దగా పలుకుబడి లేదు. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలను ప్రభావితం చేయగలిగిన శక్తి తెలుగు నాట బీజేపీ నాయకులు ఎవరికీ లేదు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకోవాలని రాష్ట్ర నాయకులు ఎంత మంది వాదించినా పట్టించుకోని బీజేపీ కేంద్ర పెద్దలు.... చివరికి సొంత సమాచారం ఆధారంగానే పొత్తుకు సుముఖత వ్యక్తం చేశారు. అప్పట్లో పొత్తు కుదర్చడంలో కీలక పాత్ర పోషించిన సదరు గవర్నర్ వల్లనే ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీకి ఆరు లోక్‌సభ స్థానాలు కేటాయించారు. అందులో మూడు స్థానాలను ఆ పార్టీ గెలుచుకుంది. తెలంగాణ విషయంలో కూడా బీజేపీ కేంద్ర పెద్దలు ఏమనుకుంటారో అదే జరుగుతుంది. ఈటల రాజేందర్, బండి సంజయ్ వంటి వారి మాటలను పెద్దగా పట్టించుకోరు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ భవిష్యత్తు ఏమిటి? ప్రచారంలో ఉన్నట్టుగా విలీన ప్రక్రియ పూర్తవుతుందా? పరిస్థితులు అనుకూలంగా మారే వరకు కొంత తలొగ్గుతూ ఉన్నప్పటికీ ఆ తర్వాత కేసీఆర్ యూటర్న్ తీసుకుంటారా? అన్న ప్రశ్నలకు సమాధానం లభించాలంటే వేచివుండక తప్పదు. తెర వెనుక ఏమి జరుగుతున్నదో తెలుసు కనుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం నాడు ఢిల్లీలో తాజా వ్యాఖ్యలు చేశారు. అందులో కొన్ని అతిశయోక్తులు ఉన్నప్పటికీ విలీనం లేదా పొత్తుకు సంబంధించిన చర్చలు జరిగాయి కనుక చివరకు ఏం జరుగుతుందో స్పష్టం కావాలంటే ఇంకొంత కాలం ఆగాల్సిందే. కేంద్ర ప్రభుత్వ సహకారం లేకుండానే కవితకు బెయిల్ లభించినా భారతీయ జనతా పార్టీపై ఇదివరకటిలా కత్తులు దూసే పరిస్థితిలో కేసీఆర్ అండ్ కో ఉండలేరు. కేసీఆర్ కుటుంబం రాజకీయాల్లో ఉండకూడదని బీజేపీ పెద్దలు కోరుకుంటున్నట్టు చెబుతున్నారు. ప్రాంతీయ పార్టీలపై ప్రధాని మోదీకి వ్యతిరేక భావం ఉన్న విషయం తెలిసిందే. ప్రస్తుతానికి తెలంగాణలో బీజేపీ సేఫ్ జోన్‌లో ఉంది. కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలో ఉండగా, బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంది. దీంతో బీఆర్ఎస్ పరిస్థితి చెంపదెబ్బ, గోడదెబ్బ చందంగా ఉంది. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేటాడుతున్నారు. కేసీఆర్ అండ్ కో తమ జుట్టును బీజేపీ చేతికి అందించారు. ఈ రెండు పార్టీలనూ ఎదుర్కొంటూ బీఆర్ఎస్‌ను బతికించుకోగల స్థితిలో కేసీఆర్ ఉన్నారా? తనలో పోరాట పటిమ సన్నగిల్లిందని గుర్తించి, అంగీకరించి తన పార్టీని బీజేపీకి అప్పగించి విశ్రాంతి తీసుకుంటారా? అదే జరిగితే కేటీఆర్, హరీశ్ రావుల భవితవ్యం ఏమిటి? వారిద్దరే కాదు, పార్టీని నమ్ముకొని అనేక మంది నాయకులు ఉన్నారు. వారి పరిస్థితి ఏమిటి? మున్ముందు కేసీఆర్ వేయబోయే అడుగులను బట్టి ఈ ప్రశ్నలకు సమాధానం లభిస్తుంది.

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

---

# సంపద పెంచటం ఎలా?

డెబ్బయ్యో దశకం తొలినాళ్లలో మన గరిష్ఠ ఆదాయ పన్ను రేటు 97.75%. రూ.2,00,000 వార్షిక ఆదాయం దాటినవారంతా అంత పన్నూ (85% ఆదాయ పన్ను, 15% పన్నుపై సర్‌ఛార్జి) చెల్లించాల్సి వచ్చేది. 1985 వరకు మనకు వారసత్వ పన్ను ఉండేది. 2015 వరకు సంపద పన్ను ఉంది. ఈ రెండు పన్నుల ఆదాయం అంతంతమాత్రం కాగా, వాటి వసూలు ఖర్చు మాత్రం ఆదాయాన్ని మించి పోయేది! దీంతోపాటు, అధిక పన్నుల జమానా అధికారులకు అక్రమార్జన అవకాశమైంది. ఆదాయాన్ని దాచిపెట్టి లాభపడటానికి, నల్లడబ్బు ఆర్థిక వ్యవస్థకి దారితీసింది.

తమ శ్రమకు, నైపుణ్యానికి తగ్గ ఫలితాల్ని ఒక వ్యక్తి అనుభవించలేకపోతే కష్టపడటానికి ప్రోత్సాహకం ఉండదు. వ్యవస్థాపక చొరవ ఆవిరైపోతుంది. పని చేసే ఆసక్తి అంతరించిపోతుంది. కొత్త పెట్టుబడులు, ఆవిష్కరణలు, అభివృద్ధి మందగిస్తాయి. పేదరికం కొనసాగుతుంటుంది. ఆదాయాన్ని, సంపదను ఎలా దాచి పెట్టాలి, ఆస్తుల్ని తర్వాతి తరానికి అనధికారికంగా ఎలా బదిలీ చేయాలి లాంటి అంశాల మీద శక్తియుక్తుల్ని అనుత్పాదకంగా వెచ్చించటం ఎక్కువవుతుంది. ఒక విజయవంతమైన ఎంటర్‌ప్రెన్యూరో, ఆవిష్కర్తో, సంపద సృష్టికర్తో అలాంటి తిరోగమన ధోరణుల్ని భరించాల్సిన అవసరం ఈవేళ లేదు. వ్యాపారానికి ఎక్కడ ఎక్కువ సానుకూలతలుంటే అక్కడికి తరలిపోతారు. వారిని ఏదీ ఆపలేదు. కాబట్టి వారసత్వ పన్నునో, సంపద పన్నునో, ఇష్టారాజ్యంగా అధిక పన్నులనో విధించటం వల్ల ఆదాయాలు రావు సరికదా, అభివృద్ధికి గండిపడుతుంది. వెనిజువెలా, ఉత్తర కొరియా, తూర్పు జర్మనీ, డెంగ్ జియావో పింగ్ ముందుకాలంనాటి చైనా, సోవియట్ యూనియన్, ఇంకా పలు దేశాలు సంపద పంపిణీ ప్రయోగాన్ని భారీ స్థాయిలో చేశాయి. ఆర్థిక ఫలితాల్లో బలవంతపు సమానత్వాన్ని సాధించేందుకు ప్రయత్నించాయి. ఏం జరిగిందో చూశాం.

1991 నుండి ఈ మూడు దశాబ్దాలలో, భారత్‌లో దిగువనున్న 50 శాతం జనాభా ఆదాయాలు నాలుగు రెట్లు పెరిగాయి. అంతకుముందు కంటే ఎక్కువ ఆదాయాలు, మెరుగైన రహదారులు, విద్యుత్, మొబైల్ ఫోన్లు, టెలివిజన్, ఇంటర్‌నెట్, డిజిటల్ బదిలీలు ఎరగని కుటుంబం భారత్‌లో దాదాపు లేదు. కానీ నిజమైన పేదరికం ఇంకా కొనసాగుతోంది. కోట్ల మంది ఇప్పటికీ రెక్కాడితేగానీ డొక్కాడని స్థితిలో, రేపేంటి అనే అభద్రతలోనే ఉన్నారు. అటువంటి వాతావరణంలో, తాత్కాలిక వ్యక్తిగత పథకాలకు బలమైన ఆదరణ ఉంటుంది. అయితే సంక్షేమ చర్యలు ఆర్థికంగా ఆచరణసాధ్యంగా ఉండాలి. వచ్చే తరానికి ఆస్తుల్ని నిర్మించకుండా, తాత్కాలిక పథకాల కోసం ఎడాపెడా అప్పులు చేయలేం. సంక్షేమమే పరిపాలన కాకుండా, మౌలిక వసతులు, పెట్టుబడుల ప్రోత్సాహం, పోటీ, అధిక ఆర్థికాభివృద్ధిని జోడించాలి. అప్పుడు మాత్రమే పేదలకు శాశ్వత ప్రాతిపదికన ఆదాయాలు పెరుగుతాయి. పేదరికం తొలగుతుంది. అన్ని వర్గాల ప్రజల జీవన నాణ్యత మెరుగవుతుంది. కాబట్టి, అసలైన సవాలు "పంచటం ఎలా" కాదు; "పేదల ఉత్పాదకతను పెంచటం ఎలా, వారికి నిజమైన అవకాశాన్ని అందించటమెలా". పేదల్లో అత్యధికులు సంపద సృష్టిలో భాగమయ్యామని భావించనంత వరకూ, అభివృద్ధి నుంచి తమకు అర్థమయ్యే రీతిలో లాభం పొందనంత వరకూ, మన రాజకీయాలు అభివృద్ధికి వ్యతిరేకంగానే సాగుతుంటాయి. ప్రజల్లో ఎక్కువ శాతానికి ఎదిగే అవకాశాలు స్పష్టంగా అందుబాటులోకి వచ్చినప్పుడు మాత్రమే ఆర్థికాభివృద్ధికి మెజారిటీ ఓట్లు పడతాయి. కాబట్టి వచ్చే 10–15 సంవత్సరాలు మన ప్రజాస్వామ్యానికి, మన ఆర్థిక వ్యవస్థకి అత్యంత కీలకం.

> సంక్షేమ చర్యలు ఆర్థికంగా ఆచరణసాధ్యంగా ఉండాలి. వచ్చే తరానికి ఆస్తుల్ని నిర్మించకుండా, తాత్కాలిక పథకాల కోసం ఎడాపెడా అప్పులు చేయలేం. ఆర్థిక ప్రగతిని వేగవంతం చేయాలి. ఆర్థిక క్రమశిక్షణ, మౌలిక వసతులు, పెట్టుబడులకు ప్రోత్సాహం, నియంత్రణల తొలగింపు కోసం తదేకంగా కృషి చేయాలి.



ఆర్థిక ప్రగతిని వేగవంతం చేయటానికి వీలైన ప్రతిదీ మనం చేయాలి. అభివృద్ధి ఒక్కటే సరిపోదు. ఇప్పటికీ చాలామంది జీవనప్రమాణాలని నిర్ణయించటంలో తలసరి ఆదాయం అత్యంత కీలకమైనది. అధిక అభివృద్ధిని కొనసాగించాలంటే, ఆర్థిక క్రమశిక్షణ, మౌలిక వసతులు, పెట్టుబడులకు ప్రోత్సాహం, నియంత్రణ అడ్డుగోడల తొలగింపు కోసం మనం తదేకంగా కృషి చేయాలి. అభివృద్ధిని వేగవంతం చేసేందుకు, అందులో పేదలకు మరింత సమాన భాగస్వామ్య అవకాశాలు అందించేందుకు నాలుగు కీలక విభాగాల మీద మనం దృష్టి సారించాలి. మొదటిది– ఉత్పత్తిలో కీలక పాత్ర వహించే భూమి, కార్మిక చట్టాల సంకెళ్లను తొలగించాలి. మరిన్ని పెట్టుబడులు ప్రవహించేలా, మరింత ఉపాధిని సృష్టించేలా చేయాలి. అభివృద్ధికి దన్నుగా నిలిచే కనీస స్థాయి చట్టబద్ధపాలన పరిస్థితుల్ని నెలకొల్పాలి. ఒప్పందాలు సరిగా అమలయ్యేలా చేయటం, వివాదాల్ని వేగంగా పరిష్కరించటం జరగాలి. రెండోది– మన ప్రజల ఉత్పాదకత, సంపాదనా సామర్థ్యాన్ని పెంచేందుకు జాతీయ స్థాయిలో విద్యారంగంలో ఓ బృహత్తర ప్రయత్నం కావాలి. పిల్లల నమోదు, మౌలిక వసతులు చాలవు, నాణ్యమైన పాఠశాల విద్యాప్రమాణాలు మన మంత్రం కావాలి. ప్రజలకు జేబుఖర్చు లేకుండా నాణ్యమైన ఆరోగ్యం, ముఖ్యంగా ప్రాథమిక స్థాయిలో, ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యంతో అందుబాటులో ఉండాలి. మూడోది– అభివృద్ధి, ఉపాధి అవకాశాలకు చోదక శక్తులయ్యే 3000 చిన్న పట్టణాల సహజ అభివృద్ధిని ప్రోత్సహించాలి. గ్రామాల మధ్య అటువంటి పట్టణీకరణ వల్ల తక్కువ నైపుణ్యాలున్న కోట్లాది మంది కార్మికులు ఎక్కడో దూరంగా ఉన్న పెద్ద నగరాలకు వలస పోవాల్సిన, దుర్భర పరిస్థితుల మధ్య బిక్కుబిక్కుమంటూ బతకాల్సిన అవసరం లేకుండా ఉపాధి లభిస్తుంది. గ్రామీణ–పట్టణ ప్రాంతాల మధ్య అగాధం తొలగాలి, అనుసంధానం పెరగాలి. ప్రభుత్వాలు ఒక్కసారి మౌలిక వసతుల్ని నిర్మించి, పట్టణ ప్రణాళికను నిర్దేశిస్తే చాలు, ఇళ్ల నిర్మాణం, వాణిజ్యం, పరిశ్రమలు వంటివి ప్రైవేటు రంగం చూసుకుంటుంది. చివరిగా– రైతుకి, వినియోగదారునికి మధ్య అడుగడుగునా దళారులు లేకుండా మార్కెట్ గొలుసును కుదించాలి. రిటైల్ చెయిన్లు, పంట ఉత్పత్తుల నిల్వ, ప్రాసెసింగ్, కాంట్రాక్ట్ వ్యవసాయం, ఎగుమతులను ప్రోత్సహించటం ద్వారా వ్యవసాయాన్ని ఆధునీకరించాలి. సమ్మిళిత అభివృద్ధిని ప్రోత్సహించటానికి, అభివృద్ధిని, ప్రగతిని కోరుకునే మెజారిటీని సృష్టించటానికి ఇవన్నీ అవసరం.

▪ డాక్టర్ జయప్రకాష్ నారాయణ్
లోక్‌సత్తా వ్యవస్థాపకులు



## కలిసికట్టుగా..

కోల్‌కతాలో ట్రైనీ పీజీ విద్యార్థిని హత్యాచార ఘటనను ఖండిస్తూ జిల్లావ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు, వెటర్నరీ కళాశాల విద్యార్థులు శనివారం నిరసన తెలిపారు. గన్నవరంలోని బుద్ధవరం రోడ్డులో ఉన్న వెటర్నరీ హాస్పిటల్ నుంచి ర్యాలీగా బయల్దేరి గాంధీబొమ్మ సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ మానవహారం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొవ్వొత్తులు వెలిగించి పీజీ విద్యార్థినికి నివాళులర్పించారు. - గన్నవరం



పవిత్రోత్సవాల ఉదకశాంతి కార్యక్రమంలో పాల్గొన్న ఈవో రామారావు

# పవిత్రోత్సవాలు ప్రారంభం

### నేటి ఉదయం 9 తర్వాత దర్శనానికి అనుమతి

* ఈనెల 20 వరకు అన్ని ఆర్జిత సేవలు రద్దు

**వన్‌టౌన్, ఆగస్టు 17 :** ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. శనివారం సాయంత్రం జరిగిన ఉదకశాంతి కార్యక్రమంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆదివారం ఉదయం వేకువజామున సుప్రభాత సేవ తరువాత అమ్మవారికి స్నపన నిర్వహిస్తారు. పవిత్రోత్సవాలు, దసరా, ఉగాది తదితర ఉత్సవాల్లో మాత్రమే అమ్మవారికి స్నపన నిర్వహిస్తారు. మంత్రోచ్చారణ నడుమ అమ్మవారి మూలవిరాట్‌కు స్నపనాభిషేకం నిర్వహించి బాలభోగాన్ని నివేదిస్తారు. అలంకరణ చేసిన తరువాత ఉదయం 9 గంటల నుంచి మాత్రమే దర్శనానికి అనుమతిస్తారు. పవిత్రోత్సవాలు మంగళవారం వరకు జరగనున్నాయి. అప్పటి వరకు ఆలయంలో జరిగే అన్ని ఆర్జిత సేవలను రద్దు చేశారు. ప్రత్యక్ష, పరోక్ష ఆర్జిత సేవలు మూడు రోజుల పాటు నిర్వహించబోమని దేవస్థానం అధికారులు తెలిపారు. తెలిసికాని, తెలియకకాని దేవస్థానానికి వచ్చే భక్తుల వల్ల ఏమైనా ఇబ్బందులు తలెత్తితే ఆ దోషాలు తొలగిపోవటం కోసం ఏడాదికోసారి శ్రావణ మాసంలో శుద్ధ త్రయోదశి నుంచి పౌర్ణమి వరకు ఈ పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. ఆలయమంతా శుద్ధ జలంతో కడిగిన తరువాత మంత్రాలతో పవిత్రం చేస్తారు. శనివారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పవిత్ర మాలలను ధరింపజేశారు. 20వ తేదీ ఉదయం పూర్ణాహుతి అనంతరం మాలలను తీస్తారు. కాగా, పవిత్రోత్సవాల సందర్భంగా శనివారం నిర్వహించిన ఉదకశాంతి కార్యక్రమంలో ఈవో కేఎస్ రామారావు పాల్గొన్నారు.

# ఇంకెన్నాళ్లీ 22ఏ



త్వరలో జరగబోయే రెవెన్యూ సదస్సులు భూ సమస్యలను పరిష్కరించేలా ఉండాలన్న భావన ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ఏళ్ల తరబడి సామాన్య, మధ్యతరగతి వర్గాల అపరిష్కృత భూ సమస్యలకు తక్షణం కానీ, నిర్ణీత సమయంలోపు కానీ పూర్తిచేసేలా ఈ సదస్సులు ఉండాలని కోరుతున్నారు. ముఖ్యంగా 22ఏ కింద చేర్చిన పేదల నివేశ స్థలాల సమస్యలు తీర్చాల్సిన అవసరముందని, సర్వే తప్పిదాల సవరణ, భూ రికార్డుల బలోపేతం, రెవెన్యూ వ్యవస్థ పనితీరు మెరుగుపరిచే అనేక అంశాలపై ఓ నిర్ణయం తీసుకోవాలన్న వినతులు ప్రజల నుంచి వస్తున్నాయి.

## పాతికేళ్లు దాటినా నిషేధిత జాబితాలోనే నివేశన స్థలాలు

### సాగు భూముల పరిస్థితీ అంతే..

- కాలనీలుగా రూపాంతరం చెందినా నిరర్థకమే..
- తాజాగా రెవెన్యూ సదస్సుల కోసం ఎదురుచూస్తున్న పేదలు
- తమ భూములకు మోక్షం కలిగించాలని వేడుకోలు

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ) :** 1999 నుంచి టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయాల్లో దశలవారీగా పేదలకు ఆవాస స్థలాలు ఇచ్చారు. భూములు కొని, లే అవుట్లు వేసి పేదలకు ప్లాట్లుగా పంపిణీ చేశారు. ప్రస్తుతం అవి అభివృద్ధి చెందిన కాలనీలుగా రూపాంతరం చెందాయి. ఇలాంటి కాలనీలన్నింటినీ నిషేధిత భూముల జాబితాలో చేర్చారు. ఫలితంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో లే అవుట్లు వేసిన కాలనీల్లో పక్కా ఇళ్లు నిర్మించుకున్నప్పటికీ అవి నిరర్థక ఆస్తులుగా మారాయి. దీంతో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునే పరిస్థితి లేదు. దాదాపు పాతికేళ్లు గడిచినా వాటిపై లబ్ధిదారులకు యాజమాన్య హక్కులు లేవు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పదేళ్లు దాటిన ఆవాస స్థలాలకు యాజమాన్య హక్కులు కల్పించమని జీవో ఇచ్చారు. కానీ, అమలు కాలేదు. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో కూడా పదేళ్ల ఆవాస స్థలాలు, 20 ఏళ్లు పూర్తి చేసుకున్న వ్యవసాయ భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలని గజిట్ నోటిఫికేషన్ ఇచ్చినా అమలు కాలేదు. ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ల నిలిపివేత ఆదేశాల పేరుతో ఆవాస స్థలాల సమస్యను నెలల తరబడి పెండింగ్‌లో ఉంచారు. ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టబోయే రెవెన్యూ సదస్సులు ఆ సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయాలని ప్రజలు భావిస్తున్నారు.

### ఆదాయానికి మార్గం

ప్రతి నియోజకవర్గంలో ఇలాంటి నివేశనా స్థలాలు ఐదువేలకు పైగా ఉన్నాయి. వీరందరికీ న్యాయం చేస్తే ప్రభుత్వానికి ఆదాయం కూడా వస్తుంది. యాజమాన్య హక్కులు రాగానే రిజిస్ట్రేషన్ చేసుకునే వీలు కలుగుతుంది. లబ్ధిదారులంతా తమ కుటుంబ సభ్యుల పేరుతో గిఫ్ట్ రిజిస్ట్రేషన్లు చేసుకుంటారు. తద్వారా ప్రభుత్వానికి భారీ ఆదాయం కూడా వస్తుంది. పేదలకు కేటాయించిన స్థలాలను నిషేధిత భూముల్లో ఉంచడాన్ని కోర్టులు కూడా తప్పుబడుతున్నాయి. కోర్టు మెట్లెక్కిన వారికి రిజిస్ట్రేషన్లు చేయమనే ఆదేశాలు ఇస్తున్నాయి.

### సమస్యలకు పరిష్కారం చూపాలి

రైతులకు ఇచ్చిన సాగు భూముల పట్టాల పరిస్థితి కూడా అపరిష్కృతంగానే ఉంది. ఈ పట్టాలు అందుకుని 30 నుంచి 40 ఏళ్లు దాటుతున్నా ఇంకా నిషేధిత జాబితాలోనే ఉన్నాయి. అలాగే, ప్రభుత్వం ఇచ్చిన ఆవాస స్థలాలు, సాగు భూములను అమ్మేసుకున్న వారు కూడా ఉన్నారు. ఇవి చాలామంది చేతులు మారాయి. ఇలాంటి వాటిపై కూడా ఏదో ఒక పరిష్కార మార్గాన్ని సూచించాల్సిన అవసరం ఉంది. అలాగే, దాదాపు వందేళ్ల తర్వాత భూముల రీ సర్వే చేపట్టారు. అది సమగ్రంగా జరగలేదు. చాలాచోట్ల పొరపాట్లు జరిగాయి. రీ సర్వేను రద్దు చేసినప్పటికీ గతంలో జరిగిన పొరపాట్లను సరిద్దుకోవటానికి పరిష్కార మార్గాన్ని చూపాలి. రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు, అర్జీలు, సమస్యలను క్రోడీకరించటం ద్వారా భూ రికార్డుల బలోపేతానికి చర్యలు తీసుకునే అవకాశం కలుగుతుంది.



ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంగా పవిత్ర సంగమం

దసరా ఉత్సవాల నాటికి తీర్చిదిద్దుతాం
* నిత్య నవహారతులిస్తాం..
* రహదారిని పటిష్టంగా నిర్మిస్తాం..
* పవిత్ర సంగమంలో కలెక్టర్ సృజన

6లో..

## భూములు తీసుకోవద్దు

- తీసుకుంటే ఆత్మహత్యలే శరణ్యం
- పోరంబోకు భూములు సాగు చేసుకుంటున్న కోడూరు రైతుల వినతి



వెలగలేరులో అక్రమ మైనింగ్ (ఇన్‌సెట్‌లో) రాత్రిపూట తవ్వకాలు

# వెలగలేరులో అక్రమ తవ్వకాలు

### మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరుల ఆగడాలు

- భారీ మట్టి తవ్వకాలపై రెవెన్యూ యంత్రాంగానికి ఫిర్యాదు
- అక్రమ క్వారీయింగ్ ప్రాంతంలో రెవెన్యూ అధికారుల పరిశీలన
- భారీగా తవ్వకాలు జరిగాయని నిర్ధారణ
- రెవెన్యూ అధికారులు వెళ్లిపోగానే మళ్లీ తవ్వకాలు

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ) :** అక్రమ క్వారీయింగ్‌పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపినా జి.కొండూరు మండలం వెలగలేరులో మాత్రం నిరాటంకంగా సాగుతోంది. గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అనుచరులు ఇష్టానుసారంగా క్వారీయింగ్‌కు పాల్పడుతున్నారు. దీనిపై శనివారం రెవెన్యూ యంత్రాంగానికి ఫిర్యాదు అందింది. రంగంలోకి దిగిన రెవెన్యూ అధికారులు శనివారం మధ్యాహ్నం అక్రమ క్వారీయింగ్ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. అధికారులు వస్తున్నారన్న సమాచారంతో నిర్వాహకులు పరారయ్యారు. ఈ సందర్భంగా అధికారులు సర్వే నిర్వహించగా, సర్వే నెంబర్ 513లో మట్టి తవ్వకాలు జరిగాయని గుర్తించారు. ప్రభుత్వం క్వారీల అనుమతుల సమీక్షకు నిర్దేశించిన నేపథ్యంలో ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కడా తవ్వకాలు జరగట్లేదు. వెలగలేరులో మాత్రం యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. ఐదేళ్ల వైసీపీ హయాంలో వంశీ అనుచరులు దాదాపు 100 ఎకరాల పైచిలుకు అక్రమంగా మట్టి తవ్వకాలకు పాల్పడ్డారు. వీటిపై జిల్లా యంత్రాంగానికి అనేకసార్లు ఫిర్యాదులు వెళ్లాయి. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రభుత్వం మారినా తవ్వకాలు యథేచ్ఛగా సాగుతుండటంతో స్థానిక టీడీపీ నాయకుడు మెండెం జమలయ్య శనివారం ఉదయం రెవెన్యూ యంత్రాంగానికి ఫిర్యాదు చేశారు. స్పందించిన రెవెన్యూ అధికారులు హుటాహుటిన తనిఖీలు జరిపారు. స్థానికంగా ఉన్న వారిని విచారణ చేయగా, ఎక్స్‌కవేటర్లను హడావిడిగా తీసుకెళ్లారని చెప్పారు. స్థానిక వీఆర్వో గతంలో వైసీపీకి తొత్తుగా పనిచేశాడని, అతనే క్వారీ నిర్వాహకులకు ముందస్తు సమాచారం ఇచ్చి ఉంటాడన్న అనుమానాలను గ్రామస్థులు చెబుతున్నారు. కాగా, రెవెన్యూ అధికారులు వెళ్లిపోగానే మళ్లీ అక్రమ తవ్వకాలు జరపడం గమనార్హం.

### ఆగని బ్రదర్స్ ఆగడాలు

మాజీ ఎమ్మెల్యే వంశీ అనుచరులుగా ముద్రపడిన మైనింగ్ మాఫియా బ్రదర్స్ కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారు. వెలగలేరులో దాదాపు 100 ఎకరాలకు పైగా అక్రమంగా తవ్వకాలు సాగించారని ఫిర్యాదులు వచ్చాయి. అసైన్డ్, కొండవాగు, పోరంబోకు, ఫారెస్ట్ భూములు.. ఇలా వేటినీ వదలకుండా అక్రమంగా తవ్వేశారు. ఈ బ్రదర్స్ గతంలో కొత్తూరు తాడేపల్లి, అంబాపురం, వెలగలేరులో సాగించిన అక్రమ తవ్వకాలపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)లో కేసు నమోదైంది. ఎన్‌జీటీ తీవ్రంగా స్పందించటంతో అప్పటి అధికారులు చర్యలకు దిగారు. సబ్ కలెక్టర్ అదితిసింగ్ క్వారీయింగ్ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించటానికి వస్తే రోడ్డుకు అడ్డంగా గండి కొట్టించారు. ఈ బ్రదర్స్‌లో ఒకరు ఈ పనిచేశారని అప్పట్లో ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. ప్రభుత్వం మారినా, విధానాలు మారినా మళ్లీ వంశీ అనుచరులు అక్రమ క్వారీయింగ్ చేస్తున్నా మైనింగ్, రెవెన్యూ శాఖలు పట్టించుకోవటం లేదు.

# జెట్ వేగం



జక్కంపూడిలోని జెట్‌సిటీకి మోక్షం

- పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు
- టిడ్కోకు ఏడాది టార్గెట్
- ఇండస్ట్రియల్ త్రీ కాంప్లెక్స్‌లు నిర్మించాలని నిర్ణయం

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ) :** జక్కంపూడి ఎకనమిక్ టౌన్‌షిప్ (జెట్) సిటీకి మోక్షం కలగనుంది. ఇక్కడి జీప్లస్‌త్రీ ఇళ్ల బ్యాలెన్స్, మౌలిక సదుపాయాల పనులు పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకు టిడ్కోకు ఏడాది సమయాన్ని కేటాయించింది. ఈ ఇళ్ల నిర్మాణం దాదాపు పూర్తయినా తుదిదశ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని టిడ్కో అధికారులు తగిన ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

### వైసీపీ హయాంలో సర్వనాశనం

గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి రాజధాని ప్రాంతంలో ఆర్థిక నగరంగా జెట్‌సిటీ నిర్మాణానికి కృషి చేసిన సంగతి తెలిసిందే. విజయవాడ బైపాస్‌కు అత్యంత సమీపంలో ఈ జెట్‌సిటీని అభివృద్ధి చేయాలని సంకల్పించారు. విజయవాడ రూరల్ మండలంలో ఉన్న జక్కంపూడి, వేమవరం గ్రామాల్లో తలపెట్టిన ఈ ప్రాజెక్టు కోసం గతంలో టీడీపీ ప్రభుత్వం మొదటి దశలో 149.81 ఎకరాలు కేటాయించింది. 'వాక్ టు వర్క్' నినాదంతో టౌన్‌షిప్‌లోనే గృహ నిర్మాణం, ఇండస్ట్రియల్ కాంప్లెక్స్‌లు నిర్మించాలని నిర్ణయించింది. అన్ని వర్గాల ప్రజలు నివసించేలా ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీ బహుళ అంతస్తుల భవనాలను నిర్మించ తలపెట్టింది. తొలిదశలో 50 వేల మంది పేదల కోసం ఇళ్ల నిర్మాణం చేపట్టాలన్న దిశగా అప్పట్లో టీడీపీ ప్రభుత్వం అడుగులు వేసింది. ఇందులో భాగంగా జీప్లస్‌త్రీ విధానంలో ముందుగా 15 వేల ఇళ్లకు టెండర్లు పిలిచింది. స్థలాభావం రీత్యా 10 వేల ఇళ్ల పనులకే శ్రీకారం చుట్టారు. 6 వేల పైచిలుకు ఇళ్లు నిర్మించారు. వాక్ టు వర్క్ విధానంలో పేదలు పనిచేయటానికి వీలుగా మూడు ఇండస్ట్రియల్ కాంప్లెక్స్‌లు నిర్మించాలనుకున్నారు. తొలిదశ పనులకు రూ.143.37 కోట్లకు అనుమతులిచ్చారు. మొదటగా ఫుట్‌వేర్ ఇండస్ట్రీస్ కోసం ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను చేపట్టింది. ఈ కాంప్లెక్స్ స్కెలిటెన్ పనులు పూర్తయ్యాయి. వైసీపీ వచ్చాక ఆ పనులన్నింటినీ నిలిపివేసింది. తాజాగా ఈ కాంప్లెక్స్‌తో పాటు మిగిలిన రెండు కాంప్లెక్స్‌లను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మూడు కాంప్లెక్స్‌లు పూర్తై సంబంధిత వ్యాపార వర్గాలకు కేటాయిస్తే దాదాపు రూ.1,600 కోట్ల టర్నోవర్ జరుగుతుందన్నది ప్రభుత్వ అంచనా. అలాగే, 13 వేల మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయి.



'మోతా'దుకు మించి శబ్దాలు చేస్తూ ధ్వనికాలుష్యం కలిగిస్తున్న వాహనాలకు కళ్లెం వేయడానికి ట్రాఫిక్ పోలీసులు అడుగులు వేస్తున్నారు. ఖరీదైన వాహనాలను కొనుగోలు చేసి వాటి సైలెన్సర్లను మార్పు చేయించుకుని విచ్చలవిడిగా వ్యవహరిస్తున్న యువతకు చెక్ పెట్టాలని నిర్ణయించి కార్యాచరణ రూపొందించారు.

# సైలెన్సర్లు.. ఇక సైలెన్స్

### భారీ శబ్దాలు చేసే సైలెన్సర్ల కట్టడికి చర్యలు

- సర్వీస్ సెంటర్లు, మెకానిక్‌లతో ట్రాఫిక్ పోలీసుల సమావేశం
- సైలెన్సర్లు మార్చిన వారిపై కేసులు పెడతామని హెచ్చరిక

**(ఆంధ్రజ్యోతి-విజయవాడ) :** నగరంలో ఇప్పటి వరకు ట్రాఫిక్ పోలీసులు నిర్వహిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భారీ శబ్దాలతో హారన్లు మోగిస్తూ పట్టుబడిన వారికి జరిమానాలు విధిస్తున్నారు. ఆయా వాహనాల సైలెన్సర్లను తొలగించి రోడ్డు రోలర్‌తో తొక్కిస్తున్నారు. కాగా, ఇలాంటి కేసుల్లో వాహనదారులను మాత్రమే కాకుండా భారీశబ్దాలు చేసే సైలెన్సర్లు అమర్చిన సర్వీసు సెంటర్ల నిర్వాహకులు, మెకానిక్‌లను కూడా చేర్చాలని పోలీసులు భావిస్తున్నారు. ఈ ప్రక్రియను వెంటనే అమలు చేయకుండా ముందుగా కౌన్సెలింగ్ నిర్వహించి ఆ తర్వాత యాక్షన్ మొదలుపెట్టే యోచనలో ఉన్నారు.

### సర్వీస్ సెంటర్ల నిర్వాహకులకు కౌన్సెలింగ్

నగరంలో భారీ శబ్దాలు చేస్తూ తిరుగుతున్న వాహనదారులపై మోటారు వెహికల్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తున్నారు. ఆయా వాహనాలకు ఉన్న భారీ శబ్దాలు చేసే సైలెన్సర్లను తొలగించి రోడ్డు రోలర్‌తో తొక్కిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం 297 బుల్లెట్లకు ఉన్న భారీ శబ్దాలు చేసే సైలెన్సర్లను తొలగించి రోడ్డు రోలర్‌తో తొక్కించారు. ఇలా కొన్నాళ్లుగా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. అయినా బుల్లెట్‌బాబుల తీరు మాత్రం మారడం లేదు. పోలీసులు కొత్త సైలెన్సర్లను తీసేసినా, మళ్లీ సర్వీసింగ్ సెంటర్లకు, మెకానిక్‌ల వద్దకు వెళ్లి భారీ శబ్దాలు చేసే సైలెన్సర్లను అమర్చుకుంటున్నారు. ఇలాంటి కేసుల విషయంలో వాహనదారులపై చర్యలు తీసుకుంటున్నారు. వారికి జరిమానాలు విధిస్తున్నారు. అయినా మార్పు రాకపోవడంతో ట్రాఫిక్ పోలీసులు రూటు మార్చారు. ఇక నుంచి వాహనదారులతో పాటు సర్వీస్ సెంటర్ల నిర్వాహకులు, మెకానిక్‌లపైనా కేసులు నమోదు చేయాలని నిర్ణయించారు. ఇలాచేస్తే నగరంలో బుల్లెట్ల పేలుడుకు ఫుల్‌స్టాప్ పడుతుందని భావించారు. ముందుగా సర్వీసింగ్ సెంటర్ల నిర్వాహకులు, మెకానిక్‌లకు కౌన్సెలింగ్ ఇవ్వాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగా వారితో ట్రాఫిక్ విభాగాధికారులు సమావేశాలు నిర్వహిస్తున్నారు. నగరంలోని ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమావేశపు హాల్లో ట్రాఫిక్ డీసీపీ కె.చక్రవర్తి, ఏడీసీపీ ప్రసాద్ శనివారం సమావేశం నిర్వహించారు. వారికి కొత్త మోటారు వెహికల్ చట్టం గురించి అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాలు భారీ శబ్దాలు చేసే సైలెన్సర్లను అమర్చితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## రూ.45 లక్షల విలువైన 390 సెల్‌ఫోన్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు

6లో..



మచిలీపట్నంలో మెడికల్ కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న వైద్యులు, ఐఎమ్ఏ ప్రతినిధులు

## ఆస్పత్రుల్లో నిలిచిన వైద్యసేవలు

- కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారానికి వ్యతిరేకంగా ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు విధుల బహిష్కరణ
- నిందితులపై కఠినచర్యలు తీసుకోవాలని ఐఎంఏ డిమాండ్

**మచిలీపట్నం టౌన్, ఆగస్టు 17:** ఐఎంఏ పిలుపుమేరకు మచిలీపట్నంలో శనివారం పలు ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు వైద్య సేవలు నిలిపివేశారు. కోల్‌కతా ప్రభుత్వ కళాశాల ఆస్పత్రిలో విధి నిర్వహణలో ఉన్న వైద్యురాలిపై సామూహిక హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలంటూ మెడికల్ కళాశాల వద్ద ధర్నా చేశారు. ధర్నాలో ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ కె.శివప్రసాద్, డాక్టర్ బి.కేశవకృష్ణ, డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడారు. కోల్‌కతా ఘటనపై సీబీఐ ఆధ్వర్యంలో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద కూడా వైద్యులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అరుణ్, డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ మహేష్, డాక్టర్ హిమబిందు పాల్గొన్నారు. అనంతరం వైద్యులు పురవీధుల్లో నిరసన ర్యాలీ చేశారు. జిల్లా ప్రభుత్వాస్పత్రి వద్ద నిర్వహించిన నిరసన ప్రదర్శనలో వైద్యులు, నర్సులు పాల్గొన్నారు. వైద్యులు, నర్సులు మానవహారం నిర్వహించారు. వైద్యుల రక్షణకు కేంద్ర ప్రభుత్వం కఠిన చట్టాలు రూపొందించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. వైద్యులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. సీఐటీయూ నాయకుడు బి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఆస్పత్రుల్లో వైద్య సేవలందకపోవడంతో రోగులు నానా అవస్థలు పడ్డారు.

## దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి

**వన్‌టౌన్, ఆగస్టు 17:** ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కిరణ్మయి కుటుంబ సభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో ఈవో రామారావు, అర్చక బృందం స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం శేషవస్త్రం, ప్రసాదం, ఆశీర్వచనం, అమ్మ వారి చిత్రపటం అందజేశారు.



జస్టిస్ కిరణ్మయికి దుర్గమ్మ పుస్తకాన్ని అందజేస్తున్న ఈవో రామారావు

### దుర్గమ్మను దర్శించుకున్న దేవదాయ శాఖ కమిషనర్

కనకదుర్గమ్మను దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయమర్యాదలతో ఈవో రామారావు, అర్చక బృందం స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం శేషవస్త్రం, ప్రసాదం, ఆశీర్వచనం, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

## రేపు గిరి ప్రదక్షిణ

**వన్‌టౌన్:** దుర్గామల్లేశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో శ్రావణపౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆలయ ఈవో కె.ఎస్.రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5.55 గంటలకు ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం వద్ద గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుందని, కుమ్మరిపాలెం, నాలుగు స్తంభాల సెంటర్, సితార, కబేళ, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, నెహ్రూబొమ్మ సెంటర్, బ్రాహ్మణవీధి మీదుగా 7కిలోమీటర్ల పొడవునా యాత్ర కొనసాగి ఉదయం 9 గంటలకు మహామండపం వద్దకు చేరుతుందని ఆయన పేర్కొన్నారు.

## సుబ్బారాయుడికి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు పూజలు

**మోపిదేవి, ఆగస్టు 17:** సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు శనివారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో సత్కరించింది. స్వామి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ పర్యవేక్షకుడు బి.సత్యనారాయణ అందజేశారు.




జస్టిస్ ఏవీ రవీంద్రబాబుకు ప్రసాదం అందిస్తున్న ఆలయ పర్యవేక్షకుడు



స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లను మీడియాకు చూపుతున్న కృష్ణా ఎస్పీ ఆర్.గంగాధరరావు, పోలీస్ అధికారులు

## రూ.45 లక్షల విలువైన 390 సెల్‌ఫోన్లు స్వాధీనం

**మచిలీపట్నం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి):** ఇటీవలకాలంలో చోరీ అయిన, పోగొట్టుకున్న రూ.45 లక్షల విలువైన 390 సెల్‌ఫోన్లను కృష్ణాజిల్లా సీసీఎస్ విభాగం పోలీసులు స్వాధీనం చేసుకున్నారని ఎస్పీ ఆర్.గంగాధరరావు తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మచిలీపట్నం సీసీఎస్ పోలీస్‌స్టేషన్ ద్వారా 92, గుడివాడ సీసీఎస్ పోలీస్‌స్టేషన్ ద్వారా 202, పెనమలూరు సీసీఎస్ పోలీస్‌స్టేషన్ ద్వారా 96 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని యజమానుల వివరాలు సేకరించినట్లు ఎస్పీ తెలిపారు. మచిలీపట్నం సీసీఎస్ డీఎస్పీ సుభాష్, సీఐలు రమణమ్మ, మోజెస్ సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకోవడంలో కృషి చేశారని, వారికి త్వరలో రివార్డులు అందజేస్తామని ఎస్పీ తెలిపారు. యజమానులకు ఎస్పీ పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను అందజేశారు. సెల్‌ఫోన్లు చోరీ అయితే 94906 17573నెంబరుకు హాయ్, లేదా హెల్ప్ అని సందేశం పంపితే పోలీస్‌శాఖనుంచి ఎంఎంటీ ఎస్ ద్వారా ఒక లింక్ వస్తుందన్నారు. ఈలింక్‌లో సెల్‌ఫోన్ వివరాలు పంపితే పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రికవరీ చేస్తారని ఆయన తెలిపారు. ఎవరికైనా సెల్‌ఫోన్లు దొరికితే తాము చోరీ చేయలేదని వాటిని వాడినా నేరమే అవుతుందన్నారు. దొరికిన ఫోన్లను సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలనిసూచించారు.



ధర్మాబాద్ కోర్టుకు హాజరవుతున్న దేవినేని ఉమా, తెలంగాణ ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్, హనుమంత్ షిండే

## బాబ్లీ కేసులో మహారాష్ట్ర కోర్టుకు దేవినేని ఉమా

**జి.కొండూరు, ఆగస్టు 17:** ఉమ్మడి ఏపీలో 2010 నాటి బాబ్లీ ప్రాజెక్టు కేసులో మహారాష్ట్రలోని ధర్మాబాద్ కోర్టుకు శనివారం మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, తెలంగాణ ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, హనుమంత్ షిండే హాజరయ్యారు. ఈ కేసులో ఏపీ సీఎం చంద్రబాబుతో సహా మరో 16 మందికి గతంలోనే నోటీసులు జారీ అయ్యాయి. ఆకేసులో ఉమాతోపాటు తెలంగాణ ఎమ్మెల్యేలు విచారణకు హాజరు కాగా విచారణను అక్టోబరు 19కి వాయిదా వేస్తూ కోర్టు తీర్పు వెలువరించింది.



# వరినాట్లకు కూలీల కొరత

కూలీలు దొరక్కపోవడంతో నాగాయలంక మండలం రేమాలవారిపాలెంలో దమ్ము చేసి ఖాళీగా ఉంచిన చేలు

- దివి రైతాంగం ఇబ్బందులు
- నాలుగేళ్లుగా ఈ ప్రాంతంలో బెంగాల్ తరహా నాట్లు
- సంప్రదాయ పద్ధతితో పోలిస్తే తక్కువ నారుతోనే నాట్లు
- ఈ ఏడాది బెంగాల్ నుంచి తగ్గిన కూలీల రాక
- నారు చాలక ఆందోళనలో రైతులు

**అవనిగడ్డ:** నాలుగేళ్లుగా దివిప్రాంత రైతాంగం బెంగాల్ తరహా నాట్ల విధానంలో వరిసాగు చేస్తోంది. ఈ ఏడాది బెంగాల్ నుంచి కూలీలు తక్కువగా వచ్చారు. దీంతో కూలీల కొరత, దానికి తోడు నారు కొరత ఏర్పడింది. దీంతో రైతులకు కొత్త కష్టాలు వచ్చి పడ్డాయి. సంప్రదాయ పద్ధతిలో నాట్లకు ఎకరాకు 50 పోగుల నారు అవసరమవుతుంది. బెంగాల్ తరహాలో నాట్లకు 15 పోగుల్లోపే నారు సరిపోతుంది. నారుమడి తక్కువగా పోసుకునే అవకాశం ఉండటం, బెంగాల్ తరహా సేద్యంతో దిగుబడులు అధికంగా ఉండటంతో నాగాయలంక, కోడూరు, మోపిదేవి మండలాల్లో రైతులు నాలుగేళ్లుగా బెంగాల్ నాట్లకే మొగ్గుచూపుతున్నారు. గత ఏడాది ఎకరాకు బెంగాల్ తరహాలో నాట్లు వేసేందుకు రూ.4200 మొత్తం ఖర్చు అయింది. స్థానికంగా ఉన్న దళారులు బెంగాల్ నుంచి నాట్లు వేసే కూలీలను ఇక్కడికి తీసుకొచ్చి రైతుకు, కూలీలకు మధ్య సంధానకర్తలుగా ఉండి వ్యవసాయ పనుల్లో సాయపడేవారు. గత ఏడాది కొందరు దళారులు రైతులు చెల్లించిన మొత్తాన్ని కూలీలకు సకాలంలో ఇవ్వకపోవడంతో ఈ ఏడాది బెంగాల్ కూలీల రాక సగానికి సగం తగ్గిపోయింది. దీంతో కూలీలకు భారీ డిమాండ్ ఏర్పడింది.

### అమాంతం పెరిగిన కూలిరేట్లు

బెంగాల్ తరహా నాట్లు వేసేందుకు సన్నద్ధమై దివి ప్రాంత రైతులు ఆ తరహా నాట్లకు అవసరమైన మేరకే నారుమడులను సిద్ధం చేసుకున్నారు. సగానికి సగం కూలీలు ఈ ఏడాది జిల్లాకు రాకపోవటంతో నాట్లు వేసేందుకు రైతులు హైరానా పడుతున్నారు. ఈ ఏడాది ఆరంభంలో ఎకరాకు రూ.4,200 నాటుకు రైతు ఖర్చు చేయగా, కూలీల డిమాండ్ ఏర్పడటంతో దళారులు కూలిరేట్లను అమాంతంగా పెంచేశారు. ఎకరాకు రూ.5 వేల నుంచి ఐదున్నర వేల మధ్య డిమాండ్ చేస్తున్నారు. స్థానిక కూలీలతో నాట్లు వేయించాలంటే బెంగాల్ విధానం కంటే నాలుగు రేట్లు అధికంగా నారు అవసరమవుతుంది. దీంతో రైతులు చేసేది లేక దళారులు అడిగిన మొత్తాన్ని చెల్లించేందుకు సిద్ధపడుతున్నారు.

### అదును దాటాక నాట్లేస్తే దిగుబడిపై ప్రభావం

ఇప్పటికే నారుమళ్లుపోసి నెలరోజులు పూర్తవుతుందని రైతులు చెబుతున్నారు. అదును దాటిన తర్వాత నాట్లు వేస్తే ఆ ప్రభావం దిగుబడిపై పడుతుందని, బెంగాల్ కూలీలను కాదని స్థానిక కూలీలతో నాట్లు వేయించుకుందామంటే నారులేదని, దళారుల అత్యాశ కారణంగా తమకు ఈ పరిస్థితి దాపురించిందని రైతులు అంటున్నారు. దివి ప్రాంతంలో 70 వేల ఎకరాల్లో సాగు జరుగుతుండగా, అందులో సగానికి సగం బెంగాల్ తరహా నాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు. ఈ ఇబ్బందుల్లో ఈ ఏడాది నాట్లు సకాలంలో పూర్తవుతాయో లేదో అర్థం కాని పరిస్థితిగా ఉంది.

## నమ్మకానికి మారుపేరు సోనోవిజన్

- ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కితాబు

**వన్‌టౌన్, ఆగస్టు 17:** నమ్మకానికి, నాణ్యతకు సోనోవిజన్ మారుపేరని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. విజయవాడ ఏలూరు రోడ్డులోని సోనోవిజన్ షోరూమ్‌లో శనివారం నిర్వహించిన లక్కీ డ్రా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. రూ.2 వేల కోట్ల పైచిలుకు టర్నోవర్‌తో తెలుగు రాష్ట్రాల్లో 29 బ్రాంచ్‌లను సోనోవిజన్ నిర్వహిస్తోందని, పారదర్శకత, నమ్మకం, విక్రయానంతర సేవల్లో మంచి పేరు తెచ్చుకోవడంతోనే అది సాధ్యమైందని ఆయన తెలిపారు. మేనేజింగ్ పార్టనర్ భాస్కరమూర్తి తండ్రి జనార్దన్‌మూర్తి దగ్గర నుంచి వారి వ్యాపారం అంచెలంచెలుగా పెరుగుతూ వచ్చిందన్నారు. లక్కీడ్రా పారదర్శకంగా జరిగిందని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ అమ్మకాల సందర్భంగా కొనుగోలుదారులకు సోనోవిజన్ లక్కీడ్రా నిర్వహించిందని మొదటి బహుమతిగా హుండా అమేజ్ కారును అందించామని, మేనేజింగ్ పార్టనర్ పి.భాస్కరమూర్తి తెలిపారు. దీంతోపాటుగా ఎల్‌ఈడీ టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్‌మెషీన్లు బహుమతులుగా అందిస్తున్నామని ఆయన తెలిపారు. గౌరవ అతిథులు ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రూ.2,500 నుంచి 22,500 వరకు క్యాష్‌బ్యాక్ ఆఫర్లు ఉన్నాయని, ఒక ఈఎంఐ రిఫండ్ ఉందని, శక్తి మేరకు మెరుగైన సేవలు అందిస్తామని హామీ ఇస్తున్నామని ఆయన తెలిపారు.




లక్కీ డ్రా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొండా ఉమా

### విజేతలు వీరే..

లక్కీడ్రాలో విజయవాడ ఆంజనేయవాగుకు చెందిన కనక సింహాచలం (కూపన్ నెం.135784)కు అమేజ్ కారు, సింగ్‌నగర్‌కు చెందిన డి.రెడ్డినాయుడు(కూపన్‌నెం.120388)కు ఎల్‌ఈడీ టీవీ, ఇదే ప్రాంతానికి చెందిన జె.వర్ధనం(కూపన్‌నెం.113430)కు రిఫ్రిజిరేటర్, విజయవాడ కొత్తపేటకు చెందిన షేక్ రేష్మా(కూపన్‌నెం.63521)కు వాషింగ్ మెషిన్ లభించింది.



పవిత్ర సంగమం ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

## ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంగా పవిత్ర సంగమం

- దసరా ఉత్సవాల నాటికి తీర్చిదిద్దుతాం
- నిత్య నవహారతులిస్తాం: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 17:** దసరా ఉత్సవాల నాటికి ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమాన్ని ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దుతామని, నిత్య నవహారతులకు సిద్ధం చేస్తామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన అన్నారు. కృష్ణా-గోదావరి నదులకు నవ హారతులు ఇచ్చేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లను శనివారం అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. సీఎం చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా పవిత్ర సంగమం ప్రాంతాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. ఇబ్రహీంపట్నం నుంచి పవిత్ర సంగమం వరకు 1.7 కిలోమీటర్ల ప్రధాన రహదారిని అభివృద్ధి చేసి, భవిష్యత్‌లో రోడ్డు దెబ్బతినకుండా కాలవగట్లను పటిష్ఠ పరుస్తామన్నారు. జేసీ నిధిమీనా, కృష్ణారావు, ఎల్.రమ, కొండపల్లి మున్సిపల్ కమిషనర్ బి.రమ్యకీర్తన, శివప్రసాద్‌రాజు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ బాలాజీ

## వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా జిల్లా ప్రణాళిక రూపొందించండి

- అధికారులకు కృష్ణా కలెక్టర్ బాలాజీ ఆదేశం

**మచిలీపట్నం, ఆగస్టు 17( ఆంధ్రజ్యోతి):** వికసిత్ ఆంధ్రప్రదేశ్-2047లో భాగంగా మండలం, డివిజన్, జిల్లాస్థాయిలో అభివృద్ధి రంగాలను గుర్తిస్తూ కృష్ణాజిల్లాకు ప్రణాళికను రూపొందించాలని అధికారులను కలెక్టర్ బాలాజీ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో శనివారం జిల్లా అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఏటా 15 శాతం వృద్ధిని సాధించే లక్ష్యంతో ముసాయిదా విజన్‌ను ఆంధ్రప్రదేశ్ తయారు చేస్తోందన్నారు. 2024 అక్టోబరు 2న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ పత్రాలను విడుదల చేస్తారని తెలిపారు. 2024-29నాటికి ఏడాదికి 15శాతం వృద్ధిరేటు ఉండేలా ప్రత్యేక విజన్‌తో ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. గుజరాత్ ప్రభుత్వం ఈ తరహా ప్రణాళికను ఇప్పటికే సిద్ధం చేసిందని, నమూనాను పరిశీలించి, జిల్లా పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికను రూపొందించాలన్నారు. గుర్రపుడెక్కను వినియోగించి క్లాత్‌ను తయారుచేసే వీలుందని, పర్యాటక, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి, ఉపాధి అవకాశాల మెరుగయ్యేలా, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా ప్రణాళిక ఉండాలన్నారు. జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులతో డాక్యుమెంట్‌ను తయారు చేయాలన్నారు. వికసిత్ ఆంధ్ర ప్రదేశ్-2047 ప్రణాళిక రూపకల్పనలో విధి, విధానాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సీపీవో గణేష్, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ వివరించారు. సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రణాళికను 31లోగా పంపండి

- అధికారులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన ఆదేశం

**కృష్ణలంక, ఆగస్టు 17:** రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యాలకు అనుగుణంగా జిల్లా దార్శనికత-కార్యాచరణ ప్రణాళిక(2024-29)ను ప్రతి శాఖా రూపొందించి ఈనెల 31లోగా సీపీవో కార్యాలయానికి అందించాలని అధికారులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన సూచించారు. శుక్రవారం నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వికసిత్ ఆంధ్రా-2047, జిల్లా దార్శనికత- కార్యాచరణ ప్రణాళిక(2024-29) రూపకల్పనపై నిర్వహించిన వర్క్‌షాపులో ఆమె మాట్లాడారు. జిల్లా ప్రణాళిక రూపకల్పన నోడల్ అధికారులు సీపీఎం వై.శ్రీలత, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమల అధికారి ఎ.సుధాకర్, జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీకుమార్ తమకు కేటాయించిన శాఖలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. 2024- 29కు వృద్ధి, జీఎస్‌డీపీ లక్ష్యాలు, జీడీడీపీ, తలసరి ఆదాయం, జిల్లా ఆర్థిక స్వరూపం, శాఖల వారీగా వివరిస్తూ ప్రణాళిక రూపకల్పనకు సూచనలు చేశారు. పౌరసరఫరాల డీఎం జి.వెంకటేశ్వర్లు, సమగ్ర శిక్ష అదనపు పీడీ జి.మహేశ్వరరావు, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇ.కిరణ్మయి, డ్వామా పీడీ జె.సునీత, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, వీఎంసీ అదనపు కమిషనర్ కేవీ సత్యవతి, డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని, డీఈవో యు.వి.సుబ్బారావు, డీపీవో ఎన్‌వీ శివప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు.

## భూములు తీసుకోవద్దు

- తీసుకుంటే ఆత్మహత్యలే
- పోరంబోకు భూములు సాగు చేసుకుంటున్న కోడూరు రైతుల వినతి



తహసీల్దార్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందిస్తున్న రైతులు

**జి.కొండూరు, ఆగస్టు 17:** "50 ఏళ్లుగా మామిడి మొక్కలు సాగు చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నాం. ప్రభుత్వం మా ఆధీనంలో ఉన్న భూములను తీసుకుంటే రోడ్డున పడతాం. మాకు ఆత్మహత్యలే శరణ్యం" అని కోడూరు గ్రామానికి చెందిన 60 మంది రైతులు శనివారం తహసీల్దార్ సీహెచ్ వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందించారు. కోడూరులో రెవెన్యూ పోరంబోకు భూమి 120 ఎకరాలు ఉండగా బడుగు, బలహీన వర్గాలకు చెందిన రైతులు అందులో మామిడి సాగు చేసుకుంటున్నారు. ఆర్డీవో ఆదేశాలతో తహసీల్దార్, రెవెన్యూ అధికారులు ఆ భూములను పరిశీలించడంతో రైతులకు అనుమానం వచ్చి ఆరా తీయగా ప్రభుత్వానికి ఆభూమి అవసరమని చెప్పడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. భూములు తీసుకోవద్దని రైతులు తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. బాణావతు గాంధీ, కొనతం బోస్, దూరు విజయ్, గుడిపూడి వెంకటేశ్వరరావు, గారె విజయ్, బాణావతు నాగేశ్వరరావు, మన్నె కోటిబాబు, గోళ్ల కృష్ణ, వంగూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### ప్రభుత్వం భూములు కావాలంది..పరిశీలించి నివేదిక పంపాం

విజయవాడ సబ్‌కలెక్టర్ ఆదేశాల మేరకు కోడూరులో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించాం. ప్రభుత్వానికి భూమి కావాల్సి ఉన్నందున పరిశీలన చేసి నివేదికను పైకి పంపాం. పూర్తి వివరాలు ఉన్నతాధికారులు వెల్లడిస్తారు. **- వెంకటేశ్వర్లు, తహసీల్దార్**

## సయ్యద్ నూర్జహాన్ దంపతులకు అభినందన

**పెనుగంచిప్రోలు, ఆగస్టు 17:** అంగన్వాడీ కేంద్రం ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న కిట్లను సద్వినియోగం చేసుకుని ఆదర్శవంతంగా నిలిచిన అనిగండ్లపాడుకు చెందిన సయ్యద్ నూర్జహాన్ దంపతులను ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఢిల్లీలోని ఎర్రకోట వద్ద కేంద్ర ప్రభుత్వం పురస్కారం అందించి అభినందించింది. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న కిట్లను సద్వినియోగం చేసుకున్న వారిలో 15 మందిని ఎంపిక చేశారు. అందులో సయ్యద్ నూర్జహాన్ దంపతులు ఉన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో సాయి హర్ష ప్రత్యేకంగా వారిని అభినందించారు. ఆస్పిరేషనల్ బ్లాక్ కో-ఆర్డినేటర్ మోహన్ సందీప్ పాల్గొన్నారు.



కేంద్రం నుంచి పురస్కారం అందుకున్న దంపతులను అభినందిస్తున్న ఎంపీడీవో సాయి హర్ష

## బోగస్ సర్టిఫికెట్లతో దివ్యాంగ పింఛన్లు

- సామాజిక తనిఖీలో గుట్టురట్టు



కె.కొత్తపాలెం గ్రామసభలో బోగస్ పింఛన్ల వివరాలు వెల్లడిస్తున్న డీఆర్పీ కిరణ్ కుమార్

**మోపిదేవి, ఆగస్టు 17:** గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన సామాజిక తనిఖీలో బోగస్ సర్టిఫికెట్ల ద్వారా దివ్యాంగ పింఛన్ పొందుతున్నవారి గుట్టురట్టైంది. కొద్ది రోజులుగా మోపిదేవి మండలంలోని గ్రామాల్లో 17వ విడత ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ బృందం తనిఖీలు నిర్వహిస్తోంది. శనివారం కె.కొత్తపాలెం, కొక్కిలిగడ్డ, పెదప్రోలులో సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించారు. కె.కొత్తపాలెంలో 15, కొక్కిలిగడ్డలో 6, పెదప్రోలులో నలుగురు బోగస్ సర్టిఫికెట్ల ద్వారా దివ్యాంగ పింఛన్ పొందుతున్నట్లు తనిఖీ బృందం గుర్తించింది. చెవుడు ఉన్నట్లు సర్టిఫికెట్లు పొంది మూడేళ్లుగా ఆయా గ్రామాల్లో లబ్ధిదారులు దివ్యాంగుల పింఛన్ తీసుకున్నట్లు తనిఖీ బృందాలు వెల్లడించాయి. కొక్కిలిగడ్డలో డీఆర్డీయే డ్వాక్రా గ్రూపుల్లో వీవోఏగా పనిచేస్తూ పింఛన్ పొందుతున్నట్లు, పెదప్రోలులో ఆశా వర్కర్లుగా పని చేస్తున్న ముగ్గురు దివ్యాంగ పింఛన్ పొందుతున్నట్టు గుర్తించాయి. తనిఖీల్లో భాగంగా ఇంటికి వెళ్లి పింఛన్ లబ్ధిదారులను ఆరా తీశాయి. సాధారణ వ్యక్తుల మాదిరిగా మాట్లాడటం, పనులు చేసుకోవడం, సర్టిఫికెట్లు చూపించమనగా నిరాకరించటంతో బోగస్ పింఛన్ లబ్ధిదారులుగా నిర్ధారించినట్లు తనిఖీ బృందాలు గ్రామసభల్లో వెల్లడించాయి. కె.కొత్తపాలెంలో 167 మంది దివ్యాంగుల పింఛన్ పొందుతుండగా, వారిలో 15 మంది బోగస్ లబ్ధిదారులుగా గుర్తించామని తెలిపాయి. మరో 45 మంది మూడు రోజులపాటు గ్రామంలో తనిఖీ బృందానికి అందుబాటులోకి రాలేదని తెలిపాయి. కె.కొత్తపాలెం, పెదప్రోలు, కొక్కిలిగడ్డ, మోపిదేవి, పెదకళ్లేపల్లి గ్రామాల్లో ఇప్పటికే రూ.30 వేలకు దివ్యాంగుల సర్టిఫికెట్ తీసుకొచ్చి పింఛన్లు పొందుతున్నట్లు అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. సర్పంచ్‌లు కొక్కిలిగడ్డ మాధవి, దిడ్ల జానకి రాంబాబు, పోలిమెట్ల ఏసుబాబుల అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభల్లో సామాజిక తనిఖీ డీఆర్పీలు ఎం.కిరణ్‌కుమార్, విజయకుమార్, అనిష్‌కుమార్‌లు నివేదికలను గ్రామసభల్లో వెల్లడించారు.

## 11 మందికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు

**మచిలీపట్నం టౌన్, ఆగస్టు 17:** జిల్లా పరిషత్‌లో పనిచేస్తున్న 11 మంది జూనియర్ అసిస్టెంట్లను సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తూ జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, జడ్పీ సీఈవో ఆనందకుమార్‌లు ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం జడ్పీ హైస్కూలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న షేక్ సర్దార్‌ను మచిలీపట్నం హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా నియమించారు. కాజ జడ్పీ హైస్కూల్‌లో పని చేస్తున్న జి.విజయకుమారిని విజయవాడ పీఐయూ డివిజన్ సీనియర్ అసిస్టెంట్‌గా, గూడూరు జడ్పీ హైస్కూల్‌లో పని చేస్తున్న జయకర్‌ను డ్వామా కార్యాలయంలో, బాపులపాడు ఎండీవో కార్యాలయంలో పనిచేస్తున్న కృష్ణవేణిని మైలవరం పంచాయతీరాజ్ సబ్‌డివిజన్‌లో, విజయవాడ రూరల్ ఎండీవో కార్యాలయంలో పనిచేస్తున్న విజయబాబును ఉయ్యూరు మండల పరిషత్ కార్యాలయం, సీపీఆర్‌లో పనిచేస్తున్న చంద్రమౌళిని పెనమలూరు ఆర్‌డబ్ల్యుఎస్ సబ్‌డివిజన్‌లో, గన్నవరం ఎండీవో కార్యాలయంలో పనిచేస్తున్న రాజేష్‌ను పమిడిముక్కల ఎండీవో కార్యాలయంలో, గన్నవరం ఎండీవో కార్యాలయంలో పనిచేస్తున్న కె.ప్రసన్నజ్యోతిని విజయవాడ రూరల్ ఎండీవో కార్యాలయంలో, విజయవాడ సబ్‌డివిజన్ పీఆర్‌ఐలో పనిచేస్తున్న ఎం.ఝాన్సీలక్ష్మిని గన్నవరం ఎండీవో కార్యాలయంలో, జడ్పీలో పనిచేస్తున్న కృష్ణశ్రావణిని విజయవాడ పీఐయూ డివిజన్‌లో, ముసునూరు జడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తున్న భూక్యా శ్రీనివాస్‌ను గుడివాడ ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్‌లో సీనియర్ అసిస్టెంట్లుగా నియమించారు. ఉత్తర్వులిచ్చిన కార్యక్రమంలో కృష్ణాజిల్లా మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ నాయకుడు జోస్యుల లలితప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులు

**గవర్నర్‌పేట, ఆగస్టు 17:** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని, సెప్టెంబరు 8న హైదరాబాద్‌లో జాతీయ స్థాయిలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ రత్న, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు-2024 ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అభ్యర్థుల ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సర్వేజనా సుఖినో భవంతు(సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవాసంస్థ) వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా విజ్ఞాన బోధనతో పాటు సాహిత్య, సాంస్కృతిక, కళా, క్రీడా రంగాల్లో ఉత్తమ పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యా బోధనతో పాటు కల్చరల్, స్పోర్ట్స్, ఆర్ట్స్, యోగా టీచర్లు కూడా దరఖాస్తు చేయవచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు అర్హతను తెలియజేసే సర్టిఫికెట్లు, ఫొటోలు, పత్రికల క్లిప్పింగ్స్ జిరాక్స్ కాపీలతో పాటు 4 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు దరఖాస్తుకు జతచేసి ఈనెల 31లోగా సంస్థ కార్యాలయానికి చేరేలా పంపాలని, వివరాలకు 96523 47207 నెంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

## పీఆర్సీ కమిషన్ నియమించాలి

- ఉద్యోగులకు వేతన సవరణ చేయాలి: ఏపీ ఎన్జీవో ప్రధాన కార్యదర్శి పురుషోత్తమ నాయుడు

**మోపిదేవి, ఆగస్టు 17:** పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని, ఉద్యోగులకు వేతన సవరణ చేయాలని ప్రభుత్వాన్ని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ పురుషోత్తమనాయుడు డిమాండ్ చేశారు. శనివారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకుని, ఆయన విశేష పూజలు చేశారు. జిల్లా, దివి డివిజన్ నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు, సామాన్యులు తమ హక్కైన నిరసన కూడా తెలపలేని దుస్థితిలో గడిపారన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఉద్యోగులు, ప్రజలు ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలనపై ఎంతో ఆశతో ఉన్నారన్నారు. ఉద్యోగులు అడగకుండానే ఐఆర్ పెంచి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వం నుంచి బకాయిలు పడిన ఏపీజీఎల్ వంటి ఎన్నో బకాయిలను ఉద్యోగుల ఖాతాల్లోకి జమ చేయమని ఉద్యోగుల సంఘం తరఫున వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని ఆయన తెలిపారు. సంఘ అధ్యక్షుడు ఉల్లి కృష్ణ, చల్లపల్లి, అవనిగడ్డ యూనిట్ అధ్యక్షులు తోట సుధాకర్, ఎస్.సురేష్, పెన్షన్ల అసోసియేషన్ దివి యూనిట్ కార్యదర్శి అబ్దుల్ అజీజ్, చల్లపల్లి యూనిట్ ప్రధాన కార్యదర్శి పివి.మాధవేంద్రరావు, పంచాయతీ కార్యదర్శులు ఉప్పాల వెంకటేశ్వరరావు, రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### బ్రాయిలర్ ధరలు

| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 111, 120, 131 |
| చికెన్ విత్ స్కిన్ | 216 |
| చికెన్ స్కిన్‌లెస్ | 226 |

**నెక్ కోడిగుడ్డు ధర**
విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.96

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

**గవర్నర్‌పేట, ఆగస్టు 17:** మొగల్రాజపురం సెక్షన్‌లో పలు ఫీడర్ పరిధుల్లో విద్యుత్ మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం ఆదివారం ఉదయం 6.00 గంటల నుంచి 10.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కారంమిల్లు రోడ్డు, బాడవపేట, జాన్‌వీధి, జక్రయ్య వీధి, ఆంజనేయులు వీధి, స్టేడియం వాటర్ ట్యాంక్ రోడ్డు, బందరు రోడ్డు, ఇందిరాగాంధీ స్టేడియం, వెటర్నరీ హాస్పిటల్, ఆర్అండ్ బీ గెస్ట్ హౌస్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

## పేకాట శిబిరంపై దాడి: రూ.41 వేలు స్వాధీనం

**పాయకాపురం, ఆగస్టు 17 :** పాతపాడు గ్రామ శివారుల్లో పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం రాత్రి దాడి చేశారు. వివరాల ప్రకారం పాతపాడు శివారుల్లోని పోలవరం కాల్వ వెంబడి పేకాట జరుగుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 41 వేలు స్వాధీనపరచుకుని నున్న రూరల్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# అద్భుతాల సృష్టికర్త చంద్రబాబు

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

**పటమట, ఆగస్టు 17 :** కేంద్ర ప్రభుత్వ సహకారంతో సీఎం చంద్రబాబు రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం చేసి అద్భుతాలను సృష్టించనున్నారని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 12వ డివిజన్ అయ్యప్పనగర్ ట్రెజరీ ఎంప్లాయీస్ కాలనీ ఏరియాలో శనివారం గద్దె రామ్మోహన్ పర్యటించారు. డ్రెయినేజీ సమస్యలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్న క్యాంటీన్ల పునరుద్ధరణతో ప్రజలందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. చంద్రబాబు పరిపాలన చూసి విదేశీ పారిశ్రామిక వేత్తలు మన రాష్ట్రంలో తమ పరిశ్రమలను స్థాపించడానికి ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడంతో పాటు అమరావతిని అభివృద్ధి చేసి చూపిస్తారని చెప్పారు. కార్పొరేటర్లు పొట్లూరి సాయిబాబు, ముమ్మనేని ప్రసాద్, నడికుదిటి సూర్యనారాయణ, మోటూరి బుచ్చిబాబు, హయాత్‌ఖాన్, కె. లక్ష్మీప్రసాద్, వై. రవీంద్ర, కె. సాంబశివరావులు పాల్గొన్నారు.


12వ డివిజన్‌లో డ్రెయినేజీ సమస్యలను పరిశీలిస్తున్న గద్దె రామ్మోహన్

## కమ్మవారి ఐక్య సేవా సమితి ఆర్థిక సహాయం



**పాయకాపురం, ఆగస్టు 17 :** కాలేయ వ్యాధితో బాధపడుతున్న సెంట్రల్‌కు చెందిన తుమ్మల సత్య చికిత్స నిమిత్తం కమ్మవారి ఐక్య సేవా సమితి అధ్యక్షుడు శనివారం ఆర్థిక సహాయం అందజేశారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పరుచూరి రామకృష్ణ రూ. 50 వేలు ఆర్థిక సహాయాన్ని సభ్యుల ద్వారా సత్య నివాసంలో అందించారు. సమితి సభ్యులు పరుచూరి ప్రసాద్, ఉప్పలపాటి ప్రవీణ్, తుమ్మల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



# రుతుస్రావ సమస్యలు-పరిశుభ్రతపై అవగాహన



**వన్‌టౌన్, ఆగస్టు 17 :** రుతుస్రావ సమస్యలను అధిగమించటంపై శనివారం వన్‌టౌన్‌లోని పామర్తి సుందరమ్మ బాలికల ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బీయింగ్ సోషల్ ఏక్ నయీ షూరూరత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏపీలో ప్రప్రథమంగా రుతుస్రావ అంశాలు, పరిశుభ్రతపై ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్ ముఖ్య అతిథిగా పాల్గొని 242మంది విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్స్‌ను అందించారు. బీవీడీపీ గ్రూప్స్ ఛైర్మన్ డీఎస్‌వీ రాఘవ్, రఘువర్‌లు శానిటరీ కిట్లను స్పాన్సర్ చేశారు. మేపిల్‌బేర్ కెనడియన్ ప్రీస్కూల్ కరస్పాండెంట్ భార్గవి రాఘవ సామాజిక చైతన్య కార్యక్రమంపై స్కిట్ ప్రదర్శించారు. న్యూస్టార్ మోడరన్ థియేటర్ గ్రూపు దిలీప్ బృందం యోగా అంశాలపై అవగాహన కల్పించారు. వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం గురూజీ దుర్గాభవానీ బృందం రుతుస్రావ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు ఇచ్చారు. సత్యనారాయణపురం త్రిపుర హాస్పటల్ గైనకాలజిస్టు డాక్టర్ రబియా బాస్రీ వివిధ అంశాలపై విద్యార్థినులకు సూచనలు చేశారు. రాయన అరుణ కుమార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. హైస్కూల్ హెచ్‌ఎం డి.రత్నకుమారి, విద్యాదాత ఫౌండేషన్ ఛైర్మన్ తమ్మిన రవీంద్ర పాల్గొన్నారు.





## బార్ అండ్ రెస్టారెంట్ వద్ద సీపీఐ ధర్నా

**అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 17 :** కండ్రిక కాలనీకి చెందిన నాగేశ్వరరావు అజిత్‌సింగ్‌నగర్‌లోని రూపా లక్ష్మీసాయి బార్‌లో మద్యం సేవిస్తూ కుప్పకూలి మృతి చెందిన ఘటనపై విచారణ జరపాలని కోరుతూ సీపీఐ నేతలు శనివారం బార్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి కేవీ భాస్కర రావు మాట్లాడుతూ నాగేశ్వరరావు మృతికి నకిలీ మద్యం కారణమా? లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే విషయమై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. నేతలు లింగాబత్తిన శివకుమార్, కంది ఆదినారాయణ, పాపారావు, గురవయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## మర్యాదపూర్వక కలయిక

**చిట్టినగర్, ఆగస్టు 17:** ఏపీజేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వేంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్రను ఆయన చాంబర్‌లో ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా వీఎంసీ యూనిట్ కార్యవర్గ సభ్యులు కలిసి పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలియజేశారు. బొప్పరాజు వేంకటేశ్వర్లు ఉద్యోగుల సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందిచారని తెలియజేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో యూనిట్ జిల్లా అధ్యక్షుడు టి.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సలీం అహ్మద్, శివరామ్‌ప్రసాద్, పలువురు కార్యవర్గ సభ్యులు ఉన్నారు.



## విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ


**భవానీపురం, ఆగస్టు 17 :** 44వ డివిజన్ విద్యాధరపురం లేబర్ కాలనీలోని గొల్లపల్లి నాగేశ్వరరావు వీఎంసీ హైస్కూల్‌లోని 450 మంది విద్యార్థినీ విద్యార్థులకు శనివారం వెయ్యి లాంగ్ నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. స్థానికులు రెడ్డిపల్లి రాజు, అనిల్‌కుమార్‌లు స్వచ్ఛందంగా సమకూర్చగా వీటిని టీడీపీ సీనియర్ నాయకుడు బొమ్మసాని సుబ్బారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, మాజీ కార్పొరేటర్ అబ్దుల్ ఖాదర్‌లు పంపిణీ చేశారు. లయన్స్ గెలాక్సీ క్లబ్ సభ్యుడు నారిండి కిషోర్, హెచ్‌ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## నేడు మెగా రుణమేళా

**లబ్బీపేట, ఆగస్టు 17:** సామాన్య ప్రజలకు రుణాల విషయమై అవగాహన కల్పించేందుకు ఆదివారం మెగా రుణ మేళా నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ అధ్యక్షుడు గుడిపాటి కిషోర్, రుణ మేళా ప్రోగ్రాం ఛైర్మన్ సతీష్ కుమార్ తెలిపారు. బందర్‌రోడ్డులోని ఒక హోటల్ శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6 వరకు వివంత హోటల్‌లో ఈ మేళా జరుగుతుందని, 25 బ్యాంకులకు సంబంధించిన ప్రతినిధులు ఈ మేళాలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా రుణ మేళా బ్రోచర్‌ను ఆవిష్కరించారు. క్లబ్ విజయవాడ ప్రతినిధులు బత్తుల సుందర్ రెడ్డి, నందూరి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# దిక్సూచి DIKSUCHI

## నేషనల్ లా స్కూల్లో లీగల్ ప్రోగ్రామ్‌లు



బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ(ఎన్ఎల్ఎస్ఐయూ)- మాస్టర్ ఆఫ్ బిజినెస్ లాస్(ఎంబీఎల్), పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. వీటిని ప్రొఫెషనల్ అండ్ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్(పీఏసీఈ) కింద బ్లెండెడ్ లెర్నింగ్ ఫార్మాట్‌లో నిర్వహిస్తారు. ఆన్‌లైన్ సెషన్స్, హైబ్రిడ్ ప్రోగ్రామ్స్ ఉంటాయి.

**మాస్టర్ ఆఫ్ బిజినెస్ లాస్(ఎంబీఎల్):** ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో పది కోర్సులు ఉంటాయి. మొదటి ఏడాది కాంట్రాక్ట్ లా, బ్యాంకింగ్ లా, కార్పొరేట్ లా, ఇండస్ట్రియల్ రిలేషన్స్ లా, ఎన్విరాన్‌మెంటల్ లా కోర్సులు; రెండో ఏడాది ఇన్వెస్ట్‌మెంట్ లాస్, ఇన్సూరెన్స్ లాస్, ఇంటర్నేషనల్ కమర్షియల్ ట్రాన్సాక్షన్స్ అండ్ ఫారిన్ ట్రేడ్, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లాస్, టాక్సెస్ ఆన్ కార్పొరేషన్స్ కోర్సులు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు లా ఆఫీసర్, లీగల్ అసిస్టెంట్, లీగల్ అడ్వైజర్‌గా రాణించవచ్చు.

**పీజీ డిప్లొమా:** ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో ఆర్బిట్రేషన్ లా, చైల్డ్ రైట్స్ లా, కన్జ్యూమర్ లా అండ్ ప్రాక్టీస్, సైబర్ లా అండ్ సైబర్ ఫోరెన్సిక్స్, ఎన్విరాన్‌మెంటల్ లా, హ్యూమన్ రైట్స్ లా, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ లా, మెడికల్ లా అండ్ ఎథిక్స్, టాక్సేషన్ లా స్పెషలైజేషన్‌లు అందుబాటులో ఉన్నాయి. స్పెషలైజేషన్‌ను అనుసరించి ఈ ప్రోగ్రామ్ జర్నలిస్ట్‌లు, అడ్వకేట్‌లు, రైట్స్ యాక్టివిస్ట్‌లు, డాక్టర్‌లు, నర్స్‌లు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్‌లు, హెల్త్ వర్కర్‌లు, ఎన్విరాన్‌మెంటల్ ప్రొఫెషనల్స్, ఎన్‌జీఓలు, లీగల్-ఎడ్యుకేషనల్-రీసెర్చ్ విభాగాలకు చెందిన ప్రొఫెషనల్స్‌కు ఉపయుక్తంగా ఉంటుంది. పూర్తి సమాచారం కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

**అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. సీఏ, సీఎస్, ఐసీడబ్ల్యూఏఐ కోర్సులు పూర్తిచేసినవారు; ఓపెన్ యూనివర్సిటీలలో చదివినవారు; డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా డిగ్రీలు పొందిన వారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 10
- **వెబ్‌సైట్:** https://pace.nls.ac.in/

డా.ఎన్‌టీఆర్‌యూహెచ్ఎస్ అనుబంధ కళాశాలల్లో

## మేనేజ్‌మెంట్ కోటా

విజయవాడలోని డా.ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(డా.ఎన్‌టీఆర్‌యూహెచ్ఎస్)- మెడికల్, డెంటల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో మేనేజ్‌మెంట్, ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వర్సిటీకి అనుబంధంగా ఉన్న ప్రైవేట్ అన్ ఎయిడెడ్ నాన్ మైనారిటీ, మైనారిటీ మెడికల్&డెంటల్ కళాశాలల్లో బీ కేటగిరీ, సీ కేటగిరీ(ఎన్ఆర్ఐ) సీట్లు; తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలోని శ్రీ పద్మావతీ మెడికల్ కాలేజ్ ఫర్ ఉమెన్‌లోని ఎన్ఆర్ఐ సీట్లు; నూతనంగా అనుమతించిన ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లోని కాంపిటెంట్ అథారిటీ కోటా(సెల్ఫ్ ఫైనాన్సింగ్/ఎన్ఆర్ఐ) సీట్లు భర్తీ చేయనున్నారు. ప్రభుత్వ/ప్రైవేట్ కళాశాలలు, సీట్ల వివరాల కోసం సంస్థ వెబ్‌సైట్‌లో చూడవచ్చు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

**అర్హత:** అభ్యర్థులు గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ(బోటనీ, జువాలజీ)/బయోటెక్నాలజీ ఉత్తీర్ణులై ఉండాలి. ఓబీసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. నీట్ యూజీ 2024 అర్హత పొంది ఉండాలి. ఇందులో జనరల్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 720-162; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 161-127; జనరల్/ఈడబ్ల్యూఎస్ దివ్యాంగులకు 161-144 స్కోర్‌ను కటాఫ్‌గా నిర్దేశించారు. విద్యార్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి.

- ఎన్ఆర్ఐలు, ఎన్ఆర్ఐల రక్త సంబంధీకులు మాత్రమే ఎన్ఆర్ఐ కోటా సీట్లకు అప్లయ్ చేసుకోవాలి. నూతన మెడికల్ కళాశాలల్లోని సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లకు స్థానికులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 21
- **వెబ్‌సైట్:** https://drntr.uhsap.in

## డా.వైఎస్సార్‌ఏఎఫ్‌యూలో బీఆర్క్



కడపలోని డా.వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ(డా.వైఎస్సార్‌ఏఎఫ్‌యూ)- బీఆర్క్ డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, నాన్ మైనారిటీ, మైనారిటీ కళాశాలల్లో నాటా 2024 స్కోర్ ఆధారంగా లోకల్, నాన్ లోకల్ కేటగిరీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు.

**కళాశాలలు-సీట్లు**

- ఆంధ్ర యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, విశాఖపట్నం-44 కన్వీనర్ కోటా సీట్లు
- డా.వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ, కడప-44 కన్వీనర్ కోటా సీట్లు
- ఏఎన్‌యూ కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్, గుంటూరు-44 కన్వీనర్ కోటా సీట్లు
- ఎంఆర్‌కే కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్, భీమవరం- 15 కన్వీనర్ కోటా సీట్లు, 6 మేనేజ్‌మెంట్ కోటా సీట్లు
- చదలవాడ అరుణ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్, తిరుపతి-28 కన్వీనర్ కోటా సీట్లు, 12 మేనేజ్‌మెంట్ కోటా సీట్లు

**అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ/బయాలజీ/టెక్నికల్ ఒకేషనల్ సబ్జెక్ట్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మాటిక్స్ ప్రాక్టీసెస్/ఇంజనీరింగ్ గ్రాఫిక్స్/బిజినెస్ స్టడీస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. ఏ కోర్సులోనైనా కనీసం 45 శాతం మార్కులు ఉండాలి. నాటా 2024 అర్హత తప్పనిసరి.

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1500; బీసీ అభ్యర్థులకు రూ.1300; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 19
- **సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 20
- **ఈ మెయిల్ ద్వారా కరెక్షన్స్:** ఆగస్టు 21 నుంచి 22 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** ఆగస్టు 26 నుంచి 27 వరకు
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 29
- **ఎంపికైన అభ్యర్థుల రిపోర్టింగ్:** ఆగస్టు 30 నుంచి సెప్టెంబరు 2 వరకు
- **మిగిలిన సీట్ల వివరాలు వెల్లడి:** సెప్టెంబరు 2
- **వెబ్‌సైట్:** www.ysrafu.ac.in, https://apsche.ap.gov.in/arch/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/sS6GAamలో చదవండి.

# నవ్య | చిత్రజ్యోతి



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'హరిహర వీరమల్లు'. నిధి అగర్వాల్ కథానాయిక. శనివారం ఆమె పుట్టిన రోజు సందర్భంగా చిత్రబృందం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది.



## హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్‌లో వారియర్ స్టోరీ

ప్రభాస్ కొత్త చిత్రం శనివారం ఉదయం మొదలైంది. హను రాఘవపూడి దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ అధినేతలు నవీన్ యర్నేని, రవిశంకర్ వై నిర్మిస్తున్నారు. ఇన్‌స్టాలో తన వీడియోలతో అందరినీ ఆకట్టుకొన్న ఇమాన్వీ ఎస్మాయిల్ ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా కాన్సెప్ట్ పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఇందులో 'పరిత్రాణాయ సాధూనాం' అంటూ భగవద్గీత శ్లోకాన్ని ప్రచురించారు. 'ఆపరేషన్ జెడ్' అని మరొక చోట పేర్కొన్నారు. అలాగే ఈ సినిమా క్లాప్ బోర్డ్ మీద కోల్‌కతా హౌరా బ్రిడ్జ్, సుభాష్ చంద్రబోస్ 'ఆజాద్ హింద్ ఫౌజ్' పతాకం, చార్మినార్.. ఉండడం ఆసక్తిరేకెత్తిస్తోంది. 1940 బ్యాక్‌డ్రాప్‌లో జరిగే ఈ చిత్రకథలో ప్రభాస్ వారియర్‌గా ఓ పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్నారు. మిథున్ చక్రవర్తి, జయప్రద కీలక పాత్రలు చేస్తున్నారు. భారీ బడ్జెట్‌తో ప్రతిష్ఠాత్మకంగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్, ఫొటోగ్రఫీ: సుదీప్ చటర్జీ, ఎడిటింగ్: కోటగిరి వెంకటేశ్వరరావు.

## మెల్‌బోర్న్‌లో మువ్వన్నెల రెపరెపలు



మెల్‌బోర్న్‌లో జరుగుతున్న ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్‌కు రామ్‌చరణ్ గౌరవ అతిథిగా హాజరైన విషయం తెలిసిందే. సినీ పరిశ్రమకు ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా ఆర్ట్ అండ్ కల్చర్ బ్రాండ్ అంబాసిడర్ పురస్కారాన్ని శనివారం అందుకున్నారు. ఏటా ఈ పురస్కారం అందుకున్న వ్యక్తులు భారత జాతీయ పతాకాన్ని ఎగురవేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో శనివారం ఫెడరేషన్ స్క్వేర్‌లో ఘనంగా జరిగిన వేడుకల్లో రామ్‌చరణ్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు.

### ఐఎఫ్ఎఫ్ఎం పురస్కారాల ప్రధానం

ఐఎఫ్ఎఫ్ఎం చిత్రోత్సవాల్లో విజేతలకు పురస్కారాలను ప్రదానం చేశారు. చందు ఛాంపియన్ చిత్రానికి గాను కార్తిక్ ఆర్యన్ ఉత్తమ నటుడి పురస్కారం స్వీకరించారు. ఉత్తమ దర్శకుడి పురస్కారాన్ని కబీర్‌ఖాన్, నిథిలన్ స్వామినాథన్ (మహారాజా)తో కలసి అందుకున్నారు. ఉత్తమ నటిగా పార్వతి తిరువోతు, ఉత్తమ చిత్రంగా 'ట్వల్త్ ఫెయిల్' పురస్కారాలను దక్కించుకున్నాయి. క్రిటిక్స్ విభాగంలో ఉత్తమ నటుడి పురస్కారం విక్రాంత్‌మాసేకు దక్కింది. సంగీత దర్శకుడు ఏ. ఆర్ రెహమాన్ విశిష్ట పురస్కారం స్వీకరించారు.

## ప్రేక్షకులు దూరమైంది అందుకే

- దిల్‌రాజు



'ప్రేక్షకుల్ని చెడగొట్టింది మేమే.'మీరు ఇంట్లోనే కూర్చోండి.. నాలుగు వారాల్లో సినిమాను ఓటీటీలో చూపిస్తాం' అని వారిని థియేటర్‌కు రాకుండా చేసుకున్నాం' అని నిర్మాత దిల్‌రాజు కీలక వ్యాఖ్యలు చేశారు. 'రేవు' చిత్రం ఈ నెల 23న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో దిల్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'సినిమా తీయడం గొప్ప కాదు. ప్రేక్షకుడిని థియేటర్‌కు తీసుకురావడం ముఖ్యం' అన్నారు. 'రేవు' సినిమా కాన్సెప్ట్ బాగుంది. ఈ చిత్రాన్ని చూసి నేనూ రివ్యూ రాస్తా' అన్నారు దిల్ రాజు. నిర్మాతల్లో ఒకరైన మురళి మాట్లాడుతూ 'ఒక మంచి చిత్రంతో నా సినీ జర్నీ మొదలైంది. మా సినిమాను చూసి ఆదరించండి' అని కోరారు. తక్కువ బడ్జెట్‌లోనే ఎంత అద్భుతంగా సినిమా తీయవచ్చో దర్శకుడు హరినాథ్ నిరూపించారు' అని ప్రభు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ నిర్మాత పర్వతనేని రాంబాబు పాల్గొన్నారు.

## గాయని పి. సుశీలకు అస్వస్థత



ప్రముఖ గాయని పి. సుశీల శనివారం అస్వస్థతకు గురయ్యారు. కడుపు నొప్పితో ఆమె చెన్నైలోని కావేరి ఆస్పత్రిలో చేరారు. ప్రస్తుతం ఆమెకు చికిత్స అందుతోంది. ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. కొంతకాలంగా సుశీల అనారోగ్యంతో బాధపడుతున్నారు.

## ఇన్ ప్రోగ్రెస్



### 'ఆయ్' టీమ్‌కు ఎన్టీఆర్ అభినందనలు

నార్నే నితిన్, నయన్ సారిక జంటగా రూపొందిన 'ఆయ్' చిత్రం ఇటీవల విడుదలై సూపర్ హిట్ టాక్ సాధించింది. ఈ సినిమాకు పాజిటివ్ రివ్యూలు కూడా రావడంతో టీమ్‌ను అందరూ ప్రశంసిస్తున్నారు. శనివారం యూనిట్ సభ్యులు జూనియర్ ఎన్టీఆర్‌ను కలుసుకుని ఆయన అభినందనలు పొందారు. బాక్సాఫీసు దగ్గర గట్టి పోటీ ఉన్నప్పటికీ 'ఆయ్' హిట్ కావడంతో ఎన్టీఆర్ వారిని అభినందించారు. నార్నే నితిన్, నయన్ సారిక, అంకిత్ కొయ్య, నిర్మాతలు బన్నీ వాసు, ఎస్.కె.ఎన్. శనివారం ఎన్టీఆర్‌ను కలిశారు.

### రోషన్ హీరోగా 'ఛాంపియన్'



నటుడు శ్రీకాంత్ తనయుడు రోషన్ హీరోగా నటించే కొత్త చిత్రం 'ఛాంపియన్' షూటింగ్ శనివారం మొదలైంది. నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ ప్రదీప్ అద్వైతం ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకొనే ఈ చిత్రం షూటింగ్ ను దర్శకుడు నాగ్‌అశ్విన్ తొలి క్లాప్ ఇచ్చి ప్రారంభించారు. సరికొత్త పాత్రలో రోషన్‌ను ప్రజెంట్ చేయడానికి ఓ విభిన్నమైన స్ర్కిప్ట్‌ను దర్శకుడు ప్రదీప్ సిద్ధం చేశారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: ఆర్. మది, కళా దర్శకుడు: తోట తరణి, నిర్మాణం: స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్.

### భయపెట్టేందుకు సిద్ధం



అరుల్ నిధి, ప్రియా భవానీ శంకర్ జంటగా నటించిన హారర్ థ్రిల్లర్ 'డిమోంటి కాలనీ 2'. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఈ నెల 23న విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం తెలిపింది. అజయ్ ఆర్ జ్ఞానముత్తు దర్శకత్వంలో విజయ్ సుబ్రహ్మణ్యన్, ఆర్. సి రాజ్‌కుమార్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

# ఆదివారం



అలనాటి కథ

## ఆఫ్రికాలో ఫ్రెంచ్ కవిత్వం!

ఆఫ్రికా అనగానే మనకు నల్ల జాతీయులు.. దట్టమైన అడవులు.. జంతువులు గుర్తుకు వస్తాయి. కానీ గొప్ప ఫ్రెంచ్ రచయితలలో చాలా మంది ఆఫ్రికా నుంచి వచ్చారని చాలా తక్కువ మందికి తెలుసు. అంతే కాదు.. ఇప్పటికి ఆఫ్రికాకు చెందిన చాలా దేశాల్లో ఇప్పటికీ ఫ్రెంచ్ మాట్లాడతారు.. కొన్ని వందల సంవత్సరాలు అనేక ఆఫ్రికా దేశాలపై ఫ్రెంచ్ జాతీయుల ఆధిపత్యమే దీనికి కారణం.. మడ్గాస్కర్.. ఒక అందమైన దేశం. ఆ దేశంలో ఒక సమావేశానికి హాజరు కావటానికి నాకు ఆహ్వానం వచ్చినప్పుడు- అక్కడి పరిస్థితు లేమీ నాకు తెలియవు. కానీ ఆఫ్రికా ఖండంలో అనేక మంది గొప్ప రచయితలు రాజకీయ నాయకులుగా మారారని మాత్రం తెలుసు. నాకు నచ్చిన పుస్తకాల్లో కెన్యాకు చెందిన జోమో కెన్యెట్టా రాసిన - 'ఏ ఫెస్ ది మౌంటెన్' ఒకటి. కెన్యెట్టా మంచి గొప్ప రచయితే కాదు ప్రజల ఆదరణ పొందిన రాజకీయ నాయకుడు కూడా! అందుకే ఆయనను ఆ దేశ ప్రజలు ప్రధానిని చేశారు. నేను మడ్గాస్కర్‌కు వెళ్లిన సమయంలో - ఆ దేశ విదేశాంగ మంత్రి రబంబమినజర్- ఆఫ్రికాలోనే ఒక గొప్ప కవి. డేవిడ్ డావ్, ఎమ్మి సిజైర్‌లతో కలిసి ఆయన ఒక సాహితీ ఉద్యమాన్నే నిర్మించాడు. అలాంటి- రబంబమినజర్‌ను నేరుగా కలిసే అవకాశం రావటంతో నా ఉత్సాహానికి అవధులు లేవు. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. మడ్గాస్కర్ అధికారిక భాష ఫ్రెంచ్. స్థానిక భాష మలగాసే. ప్రజల్లో చాలా మంది ఈ రెండు భాషలతో పాటు- ఇంగ్లీషు కూడా మాట్లాడతారు. నేను మడ్గాస్కర్‌లో దిగిన వెంటనే ఆ దేశ ప్రభుత్వ ప్రతినిధి ఒకరు మమల్ని ఎయిర్‌పోర్టులో రిసీవ్ చేసుకున్నారు. హోటల్‌కు తీసుకువెళ్లారు. ఆ మర్నాడు- మమల్ని రబంబమినజర్- డిన్నర్‌కు ఆహ్వానించారని చెప్పారు.

ఈ మర్నాడు రాత్రి నేను రబంబమినజర్ ఇంటికి డిన్నర్‌కు వెళ్లాను. ఆయన ఇంటి పేరు క్వింట్. చుట్టు అందమైన గార్డెన్లు. మధ్యలో కళాత్మకంగా కట్టుకున్న ఇల్లు అది. కాసేపు పిచ్చాపాటి మాట్లాడుకున్న తర్వాత మేము డిన్నర్ టేబుల్ దగ్గరకు వెళ్లాం. ఆ డిన్నర్ టేబుల్ మీద అందమైన పువ్వులు.. తాజా పళ్లు ఉన్నాయి. మొత్తం టేబుల్ నంతా ఎంబ్రైడరీ క్లాత్‌తో అలంకరించారు. నేను చూసిన అది అందమైన డిన్నర్ టేబుల్స్‌లో అది ఒకటి. సాధారణంగా యూరప్‌లోని ప్రజలు తమ సంస్కృతి గొప్పదని భావిస్తూ ఉంటారు. అలాంటి వారందరూ ఆ టేబుల్‌ను చూస్తే- ఆఫ్రికాలో ఒక చిన్నదేశం సంస్కృతి సంప్రదాయాల పరంగా ఎంతగొప్పగా

> మడ్గాస్కర్ వెళ్లిన వారు తప్పనిసరిగా చూడాల్సిన వాటిలో అండాపియవరత్రా ప్యాలెస్ మ్యూజియం ఒకటి. దీనిలో మడ్గాస్కర్ చరిత్రను చెప్పే 1466 ఎగ్జిబిట్స్ ఉంటాయి. ఇవి మనకు మడ్గాస్కర్ చరిత్రను కళ్లకు కట్టినట్లు చూపిస్తాయి.



ఎదిగిందో అర్థమవుతుందనిపించింది. రబంబమినజర్- భార్య ఒక ఫ్రెంచ్ జాతీయురాలు. ఆ రోజు నాపై ఆమె చూపించిన ఆదరణ, అభిమానం నేను మర్చిపోలేను. మా డిన్నర్ పూర్తయింది.. మేమందరం డ్రాయింగ్ రూమ్‌కు వచ్చాం. "మీరు ఏదైనా ఒక కవిత్వాన్ని వినిపిస్తారా?" అని ఆయనను అడిగాను. ఆయన వెంటనే అంగీకరించి- ఒక ఫ్రెంచ్ కవితను మెలాగిస్ భాషలో చదవటం మొదలుపెట్టారు. ఆయన గొంతు సెక్సాఫోన్ లా మోగుతోంది. నాకు ఫ్రెంచ్ భాష రాదు. మెలాగిస్ భాష కూడా రాదు. కానీ ఆ కవిత్వంలో ఏదో తెలియని తియ్యదనం ఉంది. కొద్ది సేపు మేమందరం తన్మయత్వంలో మునిగిపోయాం! ఆ కవిత పూర్తి అయిన తర్వాత- "ఈ కవితను ఇంతకు ముందు ఎప్పుడు చదివారు?" అని అడిగాను. ఆయన ఒక నిమిషం ఆలోచించారు. "నా భార్య ఫ్రాన్స్‌లో ఉండేది. తనను మడ్గాస్కర్‌కు వచ్చి ఉండమని అభ్యర్థిస్తూ రాసిన కవిత్వం ఇది. ఎనిమిదేళ్ల క్రితం తన ముందు చదివా. ఇంత కాలం తర్వాత మళ్లీ చదివా!" అన్నారు. కొన్ని సార్లు భాష తెలియక పోయినా - భావం దానంతట అదే వ్యక్తమవుతుంది. అలాంటి అరుదైన సంఘటన అది. ఇప్పటికీ నా కళ్ల ముందు మెదులుతూనే ఉంటుంది.


• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్


---

సండే సెలబ్రిటీ

**హీరో కొత్తవాడైనా, సూపర్‌స్టార్ రజనీకాంత్ అయినా... తన సిద్ధాంతాలకు అంగుళం కూడా పక్కకు జరగకుండా కథ నడిపించే విలక్షణ దర్శకుడు పా.రంజిత్. 'తంగలాన్'తో సరికొత్త ప్రపంచాన్ని వెండి తెరపై ఆవిష్కరించిన ఆయన 'నవ్య'తో పంచుకున్న సినీ విశేషాలు...**





ఆ తరహా

# సినిమాలెవ్వరూ తీయలేదు

**'తంగలాన్'కు ఎలాంటి రెస్పాన్స్ వస్తోంది?**

మేము ఊహించిన దానికన్నా ఎక్కువ రెస్పాన్స్ వస్తోంది. మన సమాజంలోని అన్ని వర్గాల వారు ఈ సినిమాను చూసి ప్రశంసిస్తున్నారు. మేము చెప్పాలనుకున్న విషయాన్ని వారు అర్థం చేసుకుంటున్నారు. నా ఉద్దేశంలో ఇలాంటి సినిమాను ఇప్పటిదాకా ప్రేక్షకులు చూడలేదు. ఇదొక కొత్త తరహా సినిమా.

**మీరు తీసే సినిమాలు, వాటిలో. చెప్పే కథలు భిన్నంగా ఉంటాయి. మీరు ఈ తరహా కథలను ఎంచుకోవటానికి కారణమేదైనా ఉందా?**

నేను ఒక సినిమాను 'ఎందుకు తీయాలనుకుంటున్నాను' అని ప్రశ్న వేసుకున్నప్పుడు - 'నా కథను నేను ప్రేక్షకులకు చెప్పాలనుకుంటున్నాను' అనే సమాధానం వస్తుంది. 'నా కథను ఎందుకు చెప్పాలనుకుంటున్నాను?' అని మళ్లీ ప్రశ్న వేసుకుంటే - 'ఇతరులు ఎవరు నా కథను సినిమా రూపంలో తీయరు కాబట్టి...' అనే సమాధానం లభిస్తుంది. సుమారు వందేళ్ల సినిమా చరిత్రలో- ఈ తరహా సినిమాలను ఎవరు తీయలేదు. అందువల్ల సినిమాల దర్శకత్వ విషయంలో 'నా పాత్ర ఏమిటి?' అనే విషయాన్ని ఎప్పటికప్పుడు బేరీజు వేసుకుంటాను.

> నిర్మాణాత్మకమైన విమర్శను నేను ఎప్పుడూ కోరుకుంటాను. దాని నుంచి నేర్చుకుంటాను. విమర్శ నన్ను తీర్చిదిద్దుతుంది. అయితే బాధ్యత లేకుండా చేసే విమర్శలను నేను పట్టించుకోను. ఎవరైనా నన్ను అన్నప్పుడు బాధపడతాను.

**మీ సినిమా ప్రస్థానం ఎలా మొదలైంది?**

నేను కాలేజీలో చదువుకొనే రోజుల్లో పెయింటర్ అవ్వాలనుకొనేవాడిని. ఆ సమయంలో నేను కొన్ని ఫిల్మ్ ఫెస్టివల్స్‌కు వెళ్లాను. అక్కడ అనేక విదేశీ సినిమాలు చూశాను. అవి ఆ దేశ సంస్కృతి సంప్రదాయాలను, రాజకీయ సిద్ధాంతాలను, సమాజంలోని వాతావరణాన్ని కళ్లకు కట్టినట్లు చూపించేవి. అయితే అవి నేను చూసిన తమిళ సినిమాలకు భిన్నంగా ఉండేవి. 'ఈ సినిమాలు భిన్నంగా ఎందుకు ఉన్నాయి?' అనే ప్రశ్న నన్ను తొలిచివేయటం మొదలెట్టింది. నా దేశం గురించి, ప్రజల గురించి, సంస్కృతి గురించి పుస్తకాలు, కథలు చదవటం ప్రారంభించాను. రకరకాల రాజకీయ సిద్ధాంతాల గురించి తెలుసుకున్నాను ఈ క్రమంలో నన్ను బాబా సాహెబ్ అంబేడ్కర్ సిద్ధాంతాలు, కమ్యూనిస్టు సిద్ధాంతాల పట్ల అమితంగా ప్రభావితుడినయ్యాను. అంబేడ్కర్ నాకు చాలా నేర్పారు. ఆయన సిద్ధాంతాలలో ఉన్న సారాన్ని, నా జీవితాన్ని ప్రజలకు సినిమా రూపంలో చెప్పాలని నిర్ణయించుకున్నా. అంబేడ్కర్ అప్పటి దాకా ఉన్న దారి నుంచి బయటకు వచ్చి... ఒక కొత్త పంథాను చూపించారు. రకరకాల పద్ధతులను అనుసరించారు. ఆయన రాజకీయాలను నేను అవగాహన చేసుకున్నాను. ఇక్కడ ఇంకో విషయాన్ని కూడా చెప్పాలి. కళలు, ప్రజలు ఎందుకు కలసి పనిచేయాలనే విషయంపై మావో అనేక పుస్తకాలు రాశారు.

> నా ఆలోచనలను ఎటువంటి ఫిల్టర్స్ లేకుండా చెప్పగలగటమే స్వేచ్ఛ అంటే! అయితే అది చాలా కష్టమైన విషయం. అన్నిసార్లు నేను అనుకున్నది చెప్పలేను.

**తొలి రోజుల్లో మీరు అనుకున్న రీతిలో సినిమా తీయటం సులభమయిందా? ఏవైనా కష్టాలు ఎదురయ్యాయా?**

నేను సినిమా రంగానికి రాక ముందు 'సినిమా తీయటం ఇంత సులభమా?' అనిపించేది. నాకు అనేక ఆలోచనలు ఉండేవి. సినీ రంగానికి వచ్చిన తర్వాత సినిమా తీయటం ఎంత కష్టమో అర్థమయింది. తొలి రోజుల్లో నేను వెంకట ప్రభు అనే డైరక్టర్ దగ్గర పనిచేశా. ఆయన నాకు విపరీతమైన స్వేచ్ఛను ఇచ్చారు. నేను అనేక విషయాలు ఆయనతో చర్చించేవాడిని. అప్పుడే నేను సినిమాలు చేయగలననే నమ్మకం వచ్చింది. నా తొలి సినిమా - నా కథే! ఆ తర్వాత 'అట్టకత్తి', 'మద్రాసు' సినిమాలు తీశాను.

**మీ తరహా కథలను చెప్పి స్టార్స్‌ను ఒప్పించటం కష్టమయిందా?**

మొదట్లో చాలా కష్టమయ్యేది. వాస్తవానికి మొదట్లో నాకు పెద్ద నటులతో సినిమా తీయాలని ఉండేది కాదు. ఎందుకంటే వారు నా కథల్లో కలగజేసుకొనే అవకాశం ఉంది. అంతే కాకుండా నా దగ్గర మాస్ మసాలా స్టోరీలు కూడా ఏవీ లేవు. అందువల్లే మొదట్లో నేను ఒక మంచి ప్రొడ్యూసర్ కోసం వెతికేవాడిని. అదృష్టవశాత్తు నాకు సి. కుమార్ దొరికారు. ఆయనకు కూడా సినీ రంగం కొత్తే! మేమిద్దరం కలిసి 'అట్టకత్తి' తీశాం. దీనితో నాకు మంచి పేరు వచ్చింది. ఆ తర్వాత 'మద్రాసు' స్క్రిప్ట్ తయారుచేసుకున్నా. ఇది పూర్తిగా పొలిటికల్ ఫిల్మ్. ముందు కార్తీతో చేద్దామనుకున్నాం.

కానీ ఆయన బిజీగా ఉండటం వల్ల డేట్స్ కుదరలేదు. ఇతర హీరోలకు చెప్పాను. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. పెద్ద హీరోలతో చేయాలంటే- కాంబినేషన్స్ కుదరాలి. హీరోలకు టెక్నీషియన్స్ విషయంలో కొన్ని చాయిస్‌లు ఉంటాయి. వాటినే కోరుకుంటారు. కానీ నేను నా టీమ్‌తోనే చేయాలని అనుకునేవాడిని. చివరకు మళ్లీ కార్తీనే పెట్టుకున్నాం. ఇక్కడ అర్థం చేసుకోవాల్సిన విషయం ఒకటుంది. నా తరహా సినిమాలకు ఒక మోడల్ లేదు. అంటే అవి ఆడుతాయో లేదో, వాటిని ఎన్ని డబ్బులు వస్తాయో తెలీదు. కాబట్టి అందరూ భయపడేవారు. 'మద్రాసు' ఒక మోడల్‌ను క్రియేట్ చేసింది. ఆ తర్వాత నాతో పనిచేయటానికి అనేకమంది ముందుకు వచ్చారు.

**'కాలా', 'కబాలి' - ఈ రెండు సినిమాలలో- సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో పనిచేశారు కదా! మీ అనుభవాలేమిటి?**



రజనీకాంత్ సార్‌తో పనిచేయటం భిన్నంగా ఉంటుంది. నేను ఆయన సినిమాలు చాలా చూశాను. కానీ ఆయనతో సినిమా చేసే ముందు ఆయనను ఒక స్టార్ అనుకోలేదు. ఒక ఆర్టిస్టు అనుకున్నానంతే! 'కబాలి'లో నేను ఎలా అనుకున్నానో ఆయన అలా చేశారు. నేను తొలిసారి ఆయనకు 'కబాలి' స్క్రిప్ట్ చెప్పినప్పుడు ఆయన చాలా ఎగ్జైట్ అయ్యారు. "దీనిలో నాకు వయస్సు ఎక్కువ. నాకు ఎలాంటి డ్యూయెట్స్ లేవు. ఎక్కువ ఫైట్స్ లేవు. పైగా నాకో కూతురు ఉంది. వాస్తవానికి దగ్గరగా ఉంది. నేను ఫ్రెష్‌గా చేద్దామనుకుంటున్నా. ఈ కథ తప్పకుండా చేస్తా" అన్నారు. అయితే అక్కడ ఆయనకు నేను ఒక షరతు పెట్టాను. "సర్... ఇది నా స్క్రిప్ట్. దీనిలో ఎలాంటి మార్పులు చేయను. మీకు ఇష్టమయితే చేద్దాం. లేకపోతే ఇక్కడితో వదిలేద్దాం" అన్నాను. ఆయన నా షరతుకు అంగీకరించారు. ఆ సినిమాలో ఆయన నాకు పూర్తిగా సహకరించారు. 'కబాలి' తర్వాత ఆయన పేరు మరింత పెరిగింది. సినిమా హిట్ అయిన తర్వాత ఆయన దగ్గరకు వెళ్తే- "నీతో తొమ్మిది సినిమాలు చేయాలనుంది. చేద్దామా" అన్నారు. నేను షాక్ తిన్నా. 'కాలా' తర్వాత కూడా ఆయన అదే మాట మీద ఉన్నారు. ఆయనకు నా రాజకీయ సిద్ధాంతాలు, పనితీరు అర్థమయ్యాయి.

> హైరార్కీని తొలగించాలనుకుంటాను. మానవ వ్యవస్థ నన్ను నిలవనివ్వదు. దీని నుంచి బయటకు వెళ్లిపోవాలనుకుంటాను. ఎటువంటి హైరార్కీని నేను సహించలేను. కొన్నిసార్లు మనకు తెలియకుండానే హైరార్కీలో నివసిస్తూ ఉంటాం. అలాంటి సమయాల్లో నన్ను నేను సరిచేసుకుంటూ ఉంటా. ఇది జీవితాంతం నిరంతరంగా జరిగే ప్రక్రియ. దీన్ని ప్రాక్టీస్ చేయటం చాలా కష్టం.

> ప్రస్తుత పరిస్థితుల్లో భారత దేశానికి అంబేడ్కర్ దృష్టి కోణం చాలా అవసరం. అంబేడ్కర్ ఒక ఆధునిక భారత దేశాన్ని నిర్మించాలని అనుకున్నాడు. కుల వ్యవస్థను కూకటి వేళ్లతో సహా పెకిలించాలనుకున్నాడు. వ్యవస్థను సంపూర్తిగా మార్చాలనుకున్నాడు. ఆయన నిర్మించాలనుకున్న ఆధునిక భారతంలో ఎటువంటి అసమానతలు ఉండవు. 'క్యాస్ట్ ఇన్ ఇండియా' లాంటి పుస్తకాలు చదివితే మనకు ఆయన దృష్టి కోణం అర్థమవుతుంది. "మేము ఆధునికులం" అని చెప్పుకొనేవారిలో ఎక్కువమంది ఆయన పుస్తకాలను చదవరు. చాలామంది ఆయన దళితుల కోసం మాత్రమే అనుకుంటారు. అది చాలా తప్పు, ఆయన ఆధునిక భారత దేశ ప్రజలందరివాడు.

> కులం ఆధునికతను అల్లుకుపోతోంది. కులం అనేది మనకు పల్లెటూర్లలో కనిపిస్తుంది. పట్టణాలలో పైకి కనిపించదు. మన దేశంలో నివసించే ప్రతి వ్యక్తిలోను ఈ కుల భావన ఉంటుంది. చాలామందికి కులం ఒక సంపద లాంటిది. ఇది హోదా ఇస్తుంది. అందువల్లే దాన్ని వదలుకోవటానికి ఎవరు ఇష్టపడరు. నా ఉద్దేశంలో అంబేడ్కర్ సిద్ధాంతాలను అనుసరిస్తే- దీన్ని సమూలంగా నిర్మూలించగలం.

**త్వరలో ఏ సినిమాలు చేయబోతున్నారు?**

'తంగలాన్' విజయాన్ని ఆస్వాదిస్తున్నా. తమిళంలో ఒకటి, హిందీలో ఒకటి సినిమాలు చేయాలి. హిందీలో 'బిర్సా ముండా' జీవిత కథను తీస్తున్నా.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

---

## అలాంటప్పుడే... ఇక్కడ నిలబడగలం!

**ఈ బాలీవుడ్ బ్యూటీ కథానాయికగానే కాదు పలు బ్రాండ్ల అంబాసిడర్‌గా కూడా బిజీనే. ఆమే అనన్య పాండే. తొంబైల్లో బాలీవుడ్‌లో వెలుగొందిన నటుడు చుంకీ పాండే కూతురీమె. అనన్య పాండే గురించి కొన్ని విశేషాలు..**

అనన్య పాండేకి పెద్దగా హిట్స్ లేవు. అయినా సరే ఈ సినిమా నేపథ్యముండే ఈ బాలీవుడ్ భామ ఎక్కడా తగ్గట్లేదు. ముఖ్యంగా ఆమెకి సోషల్ మీడియాలో ఉండే హవా అంతా ఇంతా కాదు. రెండున్నర కోట్ల మంది ఆమెను ఫాలో అవుతున్నారు. చిన్ననాటి ఫొటోలనుంచి.. ఎండోర్స్‌మెంట్స్ విశేషాలు, ప్రయాణాలు, వ్యక్తిగత జీవితాన్ని ఇన్‌స్టాలో షేర్ చేస్తుంటుంది. బాలీవుడ్ కథానాయికగానే ట్యాగ్ వేసుకోవటానికి ఆమె ఇష్టపడుతుంది.

**వారినుంచే నేర్చుకున్నా..**

అనన్యపాండే తండ్రి నటుడు. ఇక తల్లి భావన ఎంటర్‌ప్రూనర్. 'ఏ రిలేషన్‌షిప్ అయినా నిలబడాలంటే వారి మధ్య స్నేహం ఉండాలి. అమ్మానాన్నలను చూస్తే ప్రేమ, పెళ్లి గొప్పతనం అర్థం అవుతుంది. మా అమ్మమ్మ,తాతయ్య.. ఇలా పెద్దవారినుంచి ఎలా ఉండాలో నేర్చుకున్నా. వారిదగ్గరే స్ట్రాంగ్ మెంటాలిటీ ఏర్పడింది. నా చెల్లెలు రైసాతో చిన్నప్పుడు భలే గొడవపడేదాన్ని. ఇప్పుడు తనే మంచి స్నేహితురాలైంది. స్టార్స్‌కి చప్పట్లు కొట్టేవాళ్లెక్కువ. నిజమైన విషయాలు తెలీవు. నా చెల్లెలు మొఖం మీదనే చెబుతుంది. ఇకపోతే అమ్మానాన్న కూడా అంతే. చిన్నప్పటినుంచి ఒకేలా పెంచారు మా ఇద్దరినీ. ఏదైనా సినిమా బాగలేకున్నా మా పేరెంట్స్ క్రిటిక్స్ అవతారమెత్తుతారు. నేను యాక్టింగ్‌లో ప్రూవ్ చేసుకుంటే ప్రశంసిస్తారు. ఇట్లాంటి వాతావరణంలో ఉన్నా కాబట్టే హాయిగా ఉన్నా.

**సులువుగా నటినయ్యాను..**

'నాలుగేళ్ల వయసులో ధీరుభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చేర్పించారు. సుహానా ఖాన్(షారుఖ్ ఖాన్ కూతురు), షనయా కపూర్( సంజయ్ కపూర్ కూతురు).. నా స్నేహితులే. వారితో కలిసి చదివా. మేం ఆరుమంది గ్యాంగ్. ఇప్పటికీ స్కూల్‌మేట్స్ నా స్నేహితులు. వారి దగ్గర పాపులర్ హీరోయిన్ అనే గర్వం నాకుండదు. నేను హీరోయిన్ అని వారు గర్వంగా చెబుతారు. ఇప్పటికీ ఆ స్నేహం అలానే కొనసాగుతోంది. కొత్తగా ఉండటం.. కొత్త విషయాలు తెల్సుకోవటం ఇష్టం. ఫ్యాషన్ వాల్డ్ అంటే పిచ్చి. ఒకసారి ఇటలీలో ఫ్యాషన్ షూట్‌కు వెళ్లాను. ఆ షూట్‌లో పాస్తా బాగా లాగించేదాన్ని. అప్పుడే కరణ్ జోహార్ గారి నుంచి పిలుపొచ్చింది. ఆ చిత్రమే 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2'. సినిమా నేపథ్యం ఉండటం వల్ల ఈ అవకాశం వచ్చింది. అయితే నటన రాకుంటే అంతటితో ఆగిపోయేదాన్ని కదా! ప్రతిభ ఉందని అవకాశం ఇచ్చారు. అలా తొలి చిత్రానికే ఫిల్మ్‌ఫేర్‌లో బెస్ట్ ఫిమేల్ డెబ్యూట్ అవార్డు వచ్చింది. ఇక్కడ సినిమా బ్యాక్‌గ్రౌండ్ లాంచింగ్‌కే ఉపయోగపడుతుంది. ఆ తర్వాత పని చేయాల్సిందే' అంటుంది అనన్య.



**విలువైన జ్ఞాపకాలను...**

'పతి పత్నీ ఔర్ వో', 'ఖాలీ పీలీ', 'లైగర్' చిత్రాలు ఆమెను నిరాశ పరిచాయి. 'డ్రీమ్ గాళ్ 2' తో విజయం అందుకుంది. ఆ తర్వాత నటించిన రెండు చిత్రాలు ఆడలేదు. దీంతో సోషల్ మీడియాలో ఆమెను ఐరన్‌లెగ్ అంటూ.. అంత స్థాయి లేదంటూ దుయ్యబట్టారు. చాలా రియాక్టయ్యింది. అయితే నెగటివిటీ ఎక్కువ ఉండే చోటు ఉండకూడదని.. అన్‌ఫాలో చేసింది. బ్లాక్ చేసింది. మ్యూట్ చేసింది. 'ఎందుకో సోషల్ మీడియాలో ఎక్కువ సమయం గడపటం వల్ల నన్ను నేను కోల్పోతున్నాననే భావన వచ్చింది. అందుకే కొన్నాళ్లు దూరం ఉన్నా. కోపం తగ్గాక మరీ ఎక్కువగా సోషల్ మీడియాలో లేను. నటిని కాబట్టి తప్పదు. సింగిల్‌గా ఎంజాయ్ చేయటం, స్నేహితులతో చిల్ అవ్వటం.. మాల్దీవ్స్ లాంటి ప్రాంతాల్లో తాబేళ్లతో కలసి ఈత కొట్టడం.. ఇలా నాకంటూ నేను విలువైన జ్ఞాపకాలను పోగు చేసుకుంటాను' అంటుందీమె. 'సోషల్ మీడియాలో ఏం రాసినా.. మాట్లాడినా లక్షల మందికి చేరువవుతుంది. అందుకే తక్కువగా మాట్లాడుతా. నెగటివిటీని స్ప్రెడ్ చేయకుండా ఉండటమే మంచిదని నా అభిప్రాయం. జనాల ఆలోచనలు ఎలా ఉన్నాయనే దాని కంటే కెరీర్‌లో ఎలా మెరుగవ్వాలి.. మంచి అవకాశాలను ఎలా చేజిక్కించుకోవాలని ఆలోచించటమే నా ముందున్న టాస్క్. ఇదే పెద్ద బాధ్యత నా జీవితానికి!' అంటుంది అనన్య.

**అదే నా లక్ష్యం..**

'మహిళల్ని సినిమాల్లో ప్రొజెక్ట్ చేసే విధానంలో తప్పుంది. దాదాపు ఎక్కువ చిత్రాల్లో బేకార్ పాత్రలను క్రియేట్ చేసేవారు. ఎప్పుడైతే జనాలు కొత్త కథలు చూడాలనుకున్నారో అప్పుడే కథలు మారాయి. యూట్యూబ్, ఓటీటీ.. లాంటి డిజిటల్ రెవల్యూషన్ తర్వాత అనేక భాషల సినిమాలను చూస్తున్నారు. అందుకే మంచి మహిళా పాత్రలను రాస్తున్నారిప్పుడు. ఓటీటీల్లో మంచి చిత్రాలొస్తున్నాయి. ఏదేమైనా హిట్ ఉంటేనే ఇక్కడ నిలబడగలం. ప్రేక్షకుల మెప్పు ఉంటేనే రాణించగలం. లేకుంటే కష్టమే! ఇంకో విషయం ఏంటంటే ఫేమ్ శాశ్వతం కాదు. అందుకే ఇవ్వన్నీ పట్టించుకోను. ఫేమ్ అనేది నటనకు వచ్చే బై ప్రొడక్ట్ మాత్రమే. సరిగా నటించకపోతే ప్రేక్షకుల నుంచి తిరస్కరణకు గురవుతాం. నేను సంతోషంగా సినీ కెరీర్‌ను ఎంచుకున్నా కాబట్టే సినిమాలు చేస్తున్నా. షూటింగ్ సమయంలో కొత్త డ్రెస్‌లు, ఆభరణాలు వేసుకున్నాక ఫొటోలకి ఫోజివ్వటం ఆనందాన్నిస్తుంది. ఈతరంలో నటిని కావటం అదృష్టమే. మంచి పాత్రలు వస్తున్నాయి. ప్రేక్షకులకు నామీద అభిమానం ఉన్నంత వరకే మేం ఇక్కడ నిలబడగలం. అందుకే కష్టపడాలి. ప్రేక్షకుల అభిమానం పొందాలి. లక్ష్యమిదే!'


---

## ఈ వారమే విడుదల

**ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు**





| ఓటీటీ వేదిక | సినిమా/సిరీస్ | విడుదల తేదీ | ఓటీటీ వేదిక | సినిమా/సిరీస్ | విడుదల తేదీ |
|---|---|---|---|---|---|
| **నెట్‌ఫ్లిక్స్**<br>ఇన్‌కమింగ్<br>ది ఫ్రాగ్ | హాలీవుడ్ మూవీ<br>కొరియన్ సిరీస్ | ఆగస్టు 23<br>ఆగస్టు 24 | **లయన్స్ గేట్ ప్లే**<br>ఇన్ ది ల్యాండ్ ఆఫ్ సెయింట్స్ అండ్ సిన్నర్స్ | తెలుగు డబ్బింగ్ | ఆగస్టు 23 |
| **అమెజాన్ ప్రైమ్**<br>యాంగ్రీ యంగ్‌మెన్: ది సలీమ్-జావేద్ స్టోరీ<br>ఫాలో కర్ లో యార్<br>కల్కి 2898 ఏడీ<br>రాయన్ | హిందీ సిరీస్<br>రియాలిటీ షో<br>తెలుగు చిత్రం<br>తెలుగు డబ్బింగ్ | ఆగస్టు 20<br>ఆగస్టు 23<br>ఆగస్టు 23<br>ఆగస్టు 23 | **జియో సినిమా**<br>డ్రైవ్ ఎవే డాల్స్<br><br>**ఆపిల్ టీవీ ప్లస్**<br>పాచింకో | హాలీవుడ్ మూవీ<br><br>కొరియన్ సిరీస్ | ఆగస్టు 23<br><br>ఆగస్టు 23 |
| **హెచ్‌బీవో మ్యాక్స్**<br>జీజీ ప్రిసిక్ట్ | కొరియన్ సిరీస్ | ఆగస్టు 22 | **డిస్నీ ప్లస్ హాట్‌స్టార్**<br>గర్ర్... | మలయాళ చిత్రం | ఆగస్టు 20 |




## సలీం-జావేద్ స్టోరీ

ప్రముఖ బాలీవుడ్ సినీ రచయితలు సలీంఖాన్, జావేద్ అక్తర్ జీవితం ఆధారంగా యాంగ్రీ యంగ్ మెన్ పేరుతో డాక్యుమెంటరీ రూపొందించారు. సల్మాన్‌ఖాన్, ఫర్హాన్ అక్తర్ నిర్మించారు. నమ్రతారావ్ దర్శకత్వం వహించారు. సెలబ్రిటీ స్టేటస్ సాధించిన తొలి తరం భారతీయ స్క్రీన్ రైటర్‌లుగా ఖ్యాతి గడించిన ఈ ఇరువురు అగ్నిపథ్, జంజీర్, షోలే, డాన్ లాంటి ఎన్నో బ్లాక్‌బస్టర్‌లు ఇచ్చారు. తమ శక్తిమంతమైన రచనల ద్వారా ఎన్నో విప్లవాత్మక మార్పులతో హిట్ ఫార్ములాకు పర్యాయపదంగా నిలిచారు. వారి సినీ ప్రస్థానాన్ని ఈ డాక్యుమెంటరీలో ఆవిష్కరించనున్నారు.



# బిజినెస్



### ఆదిత్య బిర్లా సన్ లైఫ్ నిఫ్టీ డిఫెన్స్ ఇండెక్స్ ఫండ్

ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఏఎంసీ లిమిటెడ్ (ఏబీఎస్ఎల్ఏఎంసీ).. నిఫ్టీ ఇండియా డిఫెన్స్ ఇండెక్స్ ఫండ్ పేరుతో కొత్త ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఇండెక్స్ ఫండ్. దీనికి నిఫ్టీ ఇండియా డిఫెన్స్ ఇండెక్స్ బెంచ్‌మార్క్‌గా ఉండనుంది. ఇండెక్స్ ఆధారిత పెట్టుబడుల ద్వారా దీర్ఘకాలంలో మెరుగైన రిటర్నులు అందించే విధంగా ఈ ఫండ్‌ను రూపొందించింది. ఏరో స్పేస్, షిప్‌బిల్డింగ్, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న కంపెనీల్లో ఈ ఫండ్ పెట్టుబడులు పెట్టనుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 23. కనీస పెట్టుబడి రూ.500.

### డీఎస్‌పీ ఎంఎఫ్ ఈటీఎఫ్, ఇండెక్స్ ఫండ్

డీఎస్‌పీ మ్యూచువల్ ఫండ్.. భారత్‌లోనే తొలిసారిగా నిఫ్టీ టాప్ 10 ఈక్వల్ వెయిట్ ఇండెక్స్ ఫండ్, ఈటీఎఫ్ ఫండ్‌ను విడుదల చేసింది. నిఫ్టీ మార్కెట్ క్యాపిటలైజేషన్ ఆధారంగా టాప్ 10 భారతీయ కంపెనీల్లో ఈ ఫండ్స్ సమానంగా ఇన్వెస్ట్ చేస్తాయి. ఈ న్యూ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 30. ఈ ఫండ్‌కు నిఫ్టీ టాప్ 10 ఈక్వల్ వెయిట్ టీఆర్ఐ బెంచ్‌మార్క్‌గా ఉండనుంది. డీఎస్‌పీ నిఫ్టీ టాప్ 10 ఈక్వల్ వెయిట్ ఇండెక్స్ ఫండ్ కనీస పెట్టుబడి రూ.100. కాగా ఈటీఎఫ్ ఫండ్ కనీస పెట్టుబడి రూ.5,000. దీర్ఘకాలంలో లాభాలు ఆర్జించాలనుకునే వారికి ఈ ఫండ్స్ అనుకూలంగా ఉండనున్నాయి.

2030 నాటికి అదనంగా

# 14.8 కోట్ల ఉద్యోగాలు అవసరం

## ఉపాధి కల్పనలో భారత్ వెనుకబడింది.. మరిన్ని కీలక సంస్కరణలు చేపట్టాలి

- విద్యా వ్యవస్థను పునరుద్ధరించాలి..
- ప్రైవేట్ పెట్టుబడులు మరింత పెరగాలి..
- పన్నుల పరిధిని విస్తృతం చేయాలి..
- ఐఎంఎఫ్ డిప్యూటీ ఎండీ గీతా గోపీనాథ్



న్యూఢిల్లీ: ఉద్యోగాల కల్పన విషయంలో భారత్ జీ-20 సభ్య దేశాలన్నింటికంటే వెనకబడిందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గీతా గోపీనాథ్ అన్నారు. దేశ జనాభా వృద్ధి దృష్ట్యా, 2030 నాటికి 14.8 కోట్ల అదనపు ఉద్యోగాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో శనివారం నిర్వహించిన డైమండ్ జూబ్లీ ఉత్సవాల కార్యక్రమంలో గీతా గోపీనాథ్ ప్రసంగించారు. ఆ సందర్భంగా ఆమె ప్రస్తావించిన మరిన్ని ముఖ్యాంశాలు..

● 2010తో ప్రారంభమైన దశాబ్దంలో భారత్ సగటున 6.6 శాతం జీడీపీ వృద్ధిని నమోదు చేయగా.. ఈ కాలానికి ఉద్యోగాల కల్పన రేటు మాత్రం 2 శాతానికి పరిమితమైంది. జీ 20లోని ఇతర దేశాలతో పోలిస్తే భారత ఉద్యోగాల కల్పన చాలా తక్కువగా ఉంది.

● జనాభా వృద్ధికి సంబంధించి భారత అంచనాలను బట్టి చూస్తే, 2030 నాటికి అదనంగా 6 కోట్ల నుంచి 14.8 కోట్ల ఉద్యోగాలు సృష్టించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం 2024 సంవత్సరంలో ఉన్నాం. కాబట్టి, వచ్చే ఆరేళ్లలో భారీ స్థాయిలో ఉద్యోగాల కల్పన జరపాల్సి ఉంది.

● భారీ స్థాయిలో ఉద్యోగాలు సృష్టించేందుకు భూ సంస్కరణలు, కొత్త కార్మిక చట్టాలను అమలు చేయాల్సి ఉంటుంది. దేశంలో ప్రైవేట్ పెట్టుబడులూ ప్రస్తుత 7 శాతం వృద్ధికి అనుగుణంగా లేవు. కాబట్టి, ప్రైవేట్ ఇన్వెస్ట్‌మెంట్లను మరింత పెంచాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం మాత్రం మౌలికాభివృద్ధి కోసం భారీగా పెట్టుబడులు పెడుతోంది.

● దేశ కార్మికశక్తి నైపుణ్యాన్ని మెరుగుపర్చేందుకు విద్యా వ్యవస్థను పునరుద్ధరించాలి. అలాగే, దేశంలో వ్యాపార నిర్వహణను మరింత సులభతరంగా మార్చడంతో పాటు నియంత్రణ వ్యవస్థలను మెరుగుపర్చాలి. పన్నుల పరిధిని విస్తృతం చేయాల్సిన అవసరం ఉంది.

● ప్రస్తుత గరిష్ఠ వృద్ధి పథకంలో నిలకడగా కొనసాగడంతో పాటు కోట్లలో ఉద్యోగాల కల్పనకు మరిన్ని కీలక సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉంది. అంతర్జాతీయ సరుకు రవాణా వ్యవస్థలో భారత్ కీలకంగా మారాలంటే దిగుమతి సుంకాలను తగ్గించాల్సి ఉంటుంది.

● పన్ను విషయంలో భారత్ కూడా ఇతర వర్ధమాన దేశాల స్థాయిలోనే ఉంది. ప్రత్యక్ష పన్నుల కంటే పరోక్ష పన్నుల రూపంలోనే ప్రభుత్వానికి అధిక ఆదాయం సమకూరుతోంది. వ్యక్తిగత ఆదాయ పన్ను పరిధిని మరింత విస్తృతం చేయడం ద్వారా ఆదాయం పెంచుకోవచ్చని వర్ధమాన దేశాలకు సూచిస్తున్నాం.

● పన్ను ఆదాయాన్ని పెంచుకునేందుకు జీఎస్‌టీ రేట్లను మరింత హేతుబద్ధీకరించడంతో పాటు నిబంధనలను సరళీకరించాల్సిన అవసరం ఉంది. తద్వారా స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)ని మరో 1.5 శాతం మేర పెంచుకునే అవకాశం ఉంటుంది.

**మరిన్ని మార్గాల్లో ఐఎంఎఫ్‌తో భాగస్వామ్యం**
**సీతారామన్**

గీతా గోపీనాథ్ శనివారం సీతారామన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఐఎంఎఫ్‌తో మరింతగా భాగస్వామ్యమయ్యేందుకు మరిన్ని మార్గాలను అన్వేషించేందుకు భారత్ సిద్ధంగా ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ సందర్భంగా అన్నారు. ఆర్థిక స్థిరీకరణ లక్ష్యాల సాధనకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం విధానపరమైన చర్యలు కొనసాగిస్తున్నందుకు సీతారామన్‌ను గోపీనాథ్ అభినందించారు.

### బ్యాంక్ డిపాజిట్ల మొత్తం సొమ్ములో మహిళా ఖాతాదారుల వాటా 21%

**బ్యాంక్ ఖాతాల్లో 36% మహిళలవి: ఎన్‌ఎస్‌ఓ**

న్యూఢిల్లీ: దేశంలోని మొత్తం బ్యాంక్ ఖాతాల్లో మహిళలవి 36 శాతమని జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌ఓ) తాజా నివేదిక వెల్లడించింది. కానీ, దేశంలోని బ్యాంక్ ఖాతాల్లో జమైన మొత్తం డిపాజిట్లలో మహిళా ఖాతాదారుల వాటా 21 శాతమేనని తెలిపింది. ఎన్‌ఎస్‌ఓ డేటా ప్రకారం.. 2023 మార్చి నాటికి దేశంలో మొత్తం 252 కోట్ల బ్యాంక్ ఖాతాలుండగా.. అందులో 91.77 కోట్ల ఖాతాలు (36.4 శాతం) ఖాతాలు మహిళలవి. కాగా, మొత్తం బ్యాంక్ అకౌంట్లలోని రూ.187 లక్షల కోట్ల సొమ్ములో మహిళల ఖాతాదారులకు చెందినవి రూ.39 లక్షల కోట్లు. అనగా 20.8 శాతానికి సమానం. మరో ఆసక్తికరమైన విషయమేమిటంటే, మహిళలు, పురుషుల బ్యాంక్ డిపాజిట్ల సొమ్ములో అంతరం గ్రామాల్లో పోలిస్తే, మెట్రో నగరాల్లోనే అధికం. మెట్రో నగరాలకు చెందిన బ్యాంక్ బ్రాంచ్‌ల్లోని మొత్తం డిపాజిట్లలో కేవలం 16.5 శాతం (రూ.1.9 లక్షల కోట్లు) మాత్రమే మహిళవి. కాగా, గ్రామీణ ప్రాంతాల బ్రాంచ్‌ల్లో ఈ వాటా 30 శాతం (రూ.5.91 లక్షల కోట్లు)గా ఉంది. గ్రామాలు, సెమీ-అర్బన్ ప్రాంతాల్లో అధిక శాతం జన్ ధన్ ఖాతాలు మహిళల పేరిట ఉండటం ఇందుకు కారణం కావచ్చని పేర్కొంది. ప్రతి నలుగురు బ్యాంక్ ఉద్యోగుల్లో ఒకరు మహిళని ఎన్‌ఎస్‌ఓ నివేదిక వెల్లడించింది. బ్యాంక్‌ల్లోని మహిళా ఉద్యోగుల సంఖ్య 4.41 లక్షలుగా ఉండగా.. 13.2 లక్షల మంది పురుష ఉద్యోగులు పని చేస్తున్నారు. 34,879 మంది మహిళా ఉద్యోగులు సీనియర్ మేనేజ్‌మెంట్ పదవుల్లో ఉండగా.. 1.86 లక్షల మంది పురుష ఉద్యోగులు ఈ పొజిషన్‌లో ఉన్నట్లు ఎన్‌ఎస్‌ఓ తెలిపింది.



ఆంధ్రప్రదేశ్, పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరంలో కెనరా బ్యాంక్ రీజినల్ కార్యాలయాన్ని బ్యాంక్ ఎండీ, సీఈఓ కే. సత్యనారాయణ రాజు శనివారం నాడు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఖాతాదారులకు బ్యాంక్ అందిస్తున్న వివిధ పథకాలు, సాధించిన అభివృద్ధి గురించి వివరించారు. బ్యాంకుల విలీనం అనంతరం కెనరా బ్యాంక్ వ్యాపారం రూ.16 లక్షల కోట్ల నుంచి రూ.23 లక్షల కోట్లకు పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వస్తు సేవల పన్ను - వడ్డీ కట్టనవసరం లేని సందర్భాలు..

ఇదీ GST



రాంబాబు గొండాల

జీఎస్‌టీ చట్టంలో కొన్ని ఉల్లంఘనలకు ముఖ్యంగా చెల్లించాల్సిన పన్ను సకాలంలో చెల్లించకపోయినా లేదా చెల్లించాల్సిన పన్ను కంటే తక్కువ కట్టినా, అర్హత ఉన్న క్రెడిట్ కంటే ఎక్కువ తీసుకున్నా లేదా రివర్స్ చేయాల్సిన మొత్తం కంటే తక్కువ రివర్స్ చేసినా.. ఇలా వివిధ సందర్భాల్లో అసలుతో పాటుగా వడ్డీ కూడా చెల్లించాల్సి ఉంటుంది. అయితే, పన్ను చెల్లింపుదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కొన్ని సందర్భాల్లో వడ్డీ నుంచి మినహాయింపు ఇవ్వటం జరిగింది. ఈ వడ్డీ మినహాయింపు లేదా వెసులుబాటు ఏ సందర్భాల్లో వర్తిస్తుంది? దీనికి గల నియమ నిబంధనలు ఏమిటి? తదితర వివరాలు మీ కోసం..

మొదటిది, పన్ను చెల్లింపునకు సబంధించినది. సాధారణంగా చెల్లిచాల్సిన పన్ను ఆలస్యంగా చెల్లించినప్పుడు, ఆలస్యమైన కాలానికి గాను వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ పన్ను మొత్తాన్ని ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) ద్వారా చెల్లిస్తే ఆ మేర వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదు. ఇక్కడ గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే, రిటర్న్ ఆలస్యంగా దాఖలు చేసినప్పటికీ సంబంధిత నెలకు సంబంధించిన సరఫరాలు లేదా అమ్మకాలు సరిగ్గా చూపించాలి. అంటే ఒక నెలకు సంబంధించిన అమ్మకాలను వేరే నెల రిటర్న్‌లో చూపితే, సదరు పన్నును ఐటీసీ ద్వారా చెల్లించినప్పటికీ వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఈ మినహాయింపు పొందాలంటే చెల్లించాల్సిన పన్నును డిపార్ట్‌మెంట్ ఏదేనీ చర్య తీసుకోవటానికి ముందే చెల్లించాలి. అలాగే ఇటీవల జరిగిన జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశంలో ఈ మినహాయింపు ఐటీసీ ద్వారా చెల్లించిన పన్నుకు మాత్రమే కాకుండా నగదు ద్వారా అంటే క్యాష్ లెడ్జర్ ద్వారా జరిపే చెల్లింపులకు వర్తింప చేయాలని ప్రతిపాదించారు. కాకపోతే, రిటర్న్ దాఖలు చేసే గడువు నాటికి క్యాష్ లెడ్జర్‌లో ఉన్న బ్యాలెన్స్‌కు మాత్రమే ఈ మినహాయింపు లభిస్తుంది. ఉదాహరణకు జూన్ నెల రిటర్న్ దాఖలు చేయటానికి గడువు తేదీ జూలై 20. ఈ జూన్ రిటర్న్ ఆలస్యంగా దాఖలు చేసినప్పటికీ సంబంధిత పన్నును మాత్రం జూలై 20 నాటికి ఉన్న బ్యాలెన్స్ ద్వారా చెల్లించినట్లయితే ఎలాంటి వడ్డీ చెల్లించనవసరం లేదు. అయితే, ఈ క్యాష్‌కు సంబంధించిన వడ్డీ మినహాయింపునకు సంబంధిత నోటిఫికేషన్ జారీ కావాల్సి ఉంది.

మరొక మినహాయింపు.. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌కు సంబంధించినది. ఒక వ్యక్తి అర్హత లేని క్రెడిట్ తీసుకుని కొంతకాలం తర్వాత రివర్స్ చేశాడనుకుందాం. అలాంటి సందర్భంలో ఆ క్రెడిట్ తీసుకున్న తేదీ నుంచి కాకుండా వాడుకున్న తేదీ నుంచి వడ్డీ లెక్కించాలి. ఉదాహరణకు ఒక వ్యక్తి ఒక రూ.లక్ష మేర ఐటీసీని అర్హత లేకున్నా తీసుకున్నాడనుకుందాం. అలా పొరపాటున తీసుకున్న క్రెడిట్‌ను కొంతకాలం తర్వాత రివర్స్ చేశాడనుకుందాం. కానీ, ఇలా తీసుకున్న రూ.లక్ష క్రెడిట్‌ను ఈ మధ్య కాలంలో (తీసుకున్న దగ్గర నుంచి రివర్స్ చేసే వరకు) పన్ను చెల్లింపునకు గానీ ఇతరత్రా చెల్లింపులకు గానీ వాడలేదనుకుంటే తను ఈ రూ.లక్ష మీద ఎలాంటి వడ్డీ చెల్లించనవసరం లేదు. ఒకవేళ రూ.20,000 మేర వాడుకున్నాడనుకుంటే.. వడ్డీ ఈ రూ.20 వేల మీద మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. అది కూడా క్రెడిట్ తీసుకున్న తేదీ నుంచి కాకుండా వాడుకున్న తేదీ నుంచి మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది.

ఇక మూడోది.. ఇటీవలి బడ్జెట్‌లో చేసిన ప్రతిపాదన. ఫ్రాడ్ లాంటి మోసపూరిత ఉల్లంఘనలు కాకుండా, సాధారణ ఉల్లంఘనల్లో పన్ను చెల్లింపునకు సంబంధించి ఒక వ్యక్తికి నోటీస్ లేదా ఆర్డర్ అందినప్పుడు సదరు వ్యక్తి ఆ పన్ను మొత్తాన్ని నిర్ణీత గడువు లోపు చెల్లించినప్పుడు దానికి సంబంధించిన వడ్డీ, పెనాల్టీలు చెల్లించనవసరం లేదు. అంటే సంబంధిత నోటీస్ లేదా ఆర్డర్‌లో పన్నుతో పాటు వడ్డీ, పెనాల్టీ ఉన్నప్పటికీ పన్ను మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. ఇది ఎంతో మందికి ఊరట కలిగించే అంశం. అయితే ఈ మినహాయింపు 2017 జూలై నుంచి 2020 మార్చి మధ్య కాలానికి సంబంధించిన డిమాండ్‌లకు మాత్రమే వర్తిస్తుంది. అయితే దీనికి కూడా సంబంధిత నోటిఫికేషన్ జారీ కావాల్సి ఉంది.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

**బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)**

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 72,770 ▲ | 66,700 ▲ | 91,000 ▲ |
| ముంబై | 70,604 ▼ | 64,673 ▼ | 81,510 ▲ |

**ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)**

| 18వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 445 | విజయవాడ | 496 |
| వరంగల్ | 447 | గోదావరి | 496 |
| చిత్తూరు | 493 | విశాఖపట్నం | 500 |
| | | డజను గుడ్లు రూ. | 66 |

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 100 | విజయవాడ | 108 |
| వరంగల్ | 100 | గుంటూరు | 108 |
| కరీంనగర్ | 100 | ఒంగోలు | 108 |
| మహబూబ్‌నగర్ | 100 | చిత్తూరు | 111 |
| కర్నూలు | 100 | నెల్లూరు | 111 |
| విశాఖపట్నం | 104 | | |
| గోదావరి | 108 | అనంతపురం | 108 |

# స్పోర్ట్స్

### అన్‌క్యాప్‌డ్ ప్లేయర్‌గా ధోనీ?

**ఐపీఎల్‌లో అమల్లోకి రానున్న పాత రూల్!**



న్యూఢిల్లీ: మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ వచ్చే ఏడాది ఐపీఎల్‌లో ఆడతాడా? లేదా? అనేది భారత క్రికెట్ అభిమానుల మదిని తొలిచే సందేహం. దీన్ని నివృత్తి చేసేలా బీసీసీఐ చర్యలు కనిపిస్తున్నాయి. ఎందుకంటే వచ్చే ఏడాది జరిగే ఐపీఎల్ వేలంలో పాత అన్‌క్యాప్‌డ్ నిబంధనను తిరిగి తీసుకొచ్చే అవకాశం ఉందని సమాచారం. అదే జరిగితే.. ఎంఎస్ అన్‌క్యాప్‌డ్ ప్లేయర్‌గా చెన్నై సూపర్ కింగ్స్ తరఫున బరిలోకి దిగే అవకాశం ఉంటుంది. అంతర్జాతీయ అనుభవం లేని దేశవాళీ ప్లేయర్‌ను అన్‌క్యాప్‌డ్ అని పిలుస్తారు. అలాగే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికి ఐదు అంతకన్నా ఎక్కువ సంవత్సరాలు గడిచిన క్రికెటర్ కూడా అన్‌క్యాప్‌డ్ కేటగిరీ కిందికే వస్తాడు. అందుకే ఈ రూల్ అమల్లోకి వస్తే ఎక్కువ లాభపడేది సీఎస్‌కేనే. ధోనీ ప్రస్తుత ధర రూ.12 కోట్లు కాగా, రిటైన్ చేసుకుంటే రూ.4 కోట్లు మాత్రమే ఇవ్వాల్సి ఉంటుంది. మిగిలిన సొమ్మును వేలంలో ఇతర ఆటగాళ్ల కోసం వినియోగించుకోవచ్చు. 2008 నుంచి 2021 వరకు ఈ అన్‌క్యాప్‌డ్ రిటెన్షన్ పాలసీ అమల్లో ఉన్నా ఆ తర్వాత బోర్డు తొలగించింది. మరోవైపు ఈ రూల్‌ను అమలు చేయాలంటూ బీసీసీఐకి తాము విజ్ఞప్తి చేయలేదని సీఎస్‌కే సీఈవో కాశీ విశ్వనాథన్ స్పష్టం చేశాడు. ఆ రూల్ ఉండొచ్చని బీసీసీఐ స్వయంగా తమతో చెప్పిందని, కానీ ప్రకటన చేయలేదని అన్నాడు. అంతేకాకుండా ఈసారి ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనను ఎత్తివేయచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి.

### పంజాబ్ కింగ్స్‌లో లుకలుకలు

**కోర్టుకెక్కిన ప్రీతి జింటా**



న్యూఢిల్లీ: ఐపీఎల్ ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్ యాజమాన్యంలో విభేదాలు నెలకొన్నాయి. సహ యజమాని మోహిత్ బర్మన్ తన వాటాలను మరో పార్టీకి అమ్మకుండా నిరోధించాలని కోరుతూ బాలీవుడ్ నటి ప్రీతి జింటా పంజాబ్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ ఫ్రాంచైజీలో జింటాకు 23శాతం వాటాలుండగా, మిగతా నలుగురి కంటే ఎక్కువగా బర్మన్‌కు 48శాతం వాటా ఉంది. దీంట్లో నుంచి 11.5 శాతం వాటాను యూఎస్‌కు చెందిన కంపెనీకి బర్మన్ అమ్మాలనుకుంటున్నట్టు జింటా ఆరోపిస్తోంది. ముందస్తు ఒప్పందం ప్రకారం ఎవరు వాటాలను అమ్మాలనుకున్నా ప్రస్తుత ప్రమోటర్లకు ముందుగా ఆఫర్ చేయాల్సి ఉంటుంది. వారు కాదంటేనే థర్డ్ పార్టీని సంప్రదించాలి. మరోవైపు ఈ కేసు విచారణ ఈనెల 20న జరుగనుంది.

వినేశ్ ఫొగట్ భావోద్వేగం

# మీ ప్రేమాభిమానాలు వేయి స్వర్ణాలకన్నా మిన్న

**స్వదేశం చేరిన రెజ్లర్**
**అభిమానుల ఘన స్వాగతం**



వినేశ్ కంటతడి

న్యూఢిల్లీ: స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగట్ స్వదేశానికి చేరుకుంది. శనివారం ఉదయం ఇక్కడకు చేరుకున్న ఆమెకు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఇతర రెజ్లర్లు బజ్‌రంగ్ పూనియా, సాక్షి మాలిక్, కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ హుడా, ఖాప్ పంచాయతీ నాయకులతో పాటు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వినేశ్‌ను పూలదండలతో ముంచెత్తారు. 'నాకు మద్దతుగా నిలిచిన దేశ ప్రజలందరికీ కృతజ్ఞతలు' అని విమానాశ్రయంలో తనను స్వాగతించిన వారినుద్దేశించి వినేశ్ అంది. అక్కడినుంచి ఓపెన్ టాప్ జీపులో ర్యాలీగా బయలుదేరింది. 100 గ్రాముల అధిక బరువుందనే కారణంతో పారిస్ ఒలింపిక్స్ మహిళల 50 కిలోల ఫైనల్‌నుంచి వినేశ్‌ను అనర్హురాలిగా ప్రకటించిన సంగతి తెలిసిందే. నిర్వాహకుల నిర్ణయాన్ని ఆమె క్రీడా మధ్యవర్తిత్వ న్యాయస్థానంలో సవాలు చేస్తూ తనకు రజత పతకం ప్రకటించాలని కోరింది. దానిపై విచారణ, తీర్పు తదితరాల నేపథ్యంలో పారిస్ నుంచి వినేశ్ రాక ఆలస్యమైంది.

**'బంగారా'లు సాటిరావు..**

విమానాశ్రయం నుంచి తన అభిమానులు పలు వాహనాల్లో వెంటరాగా హరియాణాలోని స్వస్థలం బలాలీకి వినేశ్ బయలుదేరింది. ఢిల్లీలోని ద్వారకా ప్రాంతంలో గల ఓ ఆలయంలో వినేశ్ పూజలు నిర్వహించింది. మార్గమధ్యంలోపలు ప్రాంతాల్లో తనకోసం వేచివున్న మద్దతుదారులను ఆమె కలుసుకుంది. ఢిల్లీ సమీపంలోని బద్లీ గ్రామవాసులు వినేశ్‌కు అపూర్వ స్వాగతం పలికారు. అది చూసి తీవ్ర భావోద్వేగానికి లోనైన వినేశ్ కంటతడి పెట్టుకుంది. ఈ సందర్భంగా భర్త సోమ్‌వీర్ వినేశ్‌ను ఓదార్చాడు. 'పారిస్ క్రీడల నిర్వాహకులు నాకు బంగారు పతకం ఇచ్చి ఉండకపోవచ్చు. కానీ మీరు నాపట్ల చూపుతున్న ప్రేమ, అభిమానం వేయి ఒలింపిక్ స్వర్ణ పతకాలకు మించినది' అని ఆమె పేర్కొంది. 'ఒలింపిక్ స్వర్ణ పతకం నెగ్గినప్పటి కంటే ఎక్కువ ప్రేమాభిమానాలు వినేశ్‌కు లభిస్తున్నాయి' బజ్‌రంగ్ అన్నాడు. కాంగ్రెస్ నాయకుడు దీపిందర్ హుడా విజయానికి చిహ్నమైన గదను వినేశ్‌కు అందజేశారు. 'మా దృష్టిలో నీవు ఎప్పటికీ విజేతవే. ధైర్యం, పరాక్రమం, పట్టుదలతో కోట్లాదిమంది దేశ ప్రజల హృదయాలను గెలుచుకున్నావు. దేశ యువతకు నీవు స్ఫూర్తిప్రదాతవు' అని హుడా ప్రశంసించారు. 'చాలా కాలం తర్వాత వినేశ్ స్వదేశానికి వచ్చింది. అంతేకాదు..ఆమె తీవ్ర భావోద్వేగంతో ఉంది. కొంతకాలం కుటుంబంతో గడిపడితే వినేశ్ స్థిమితపడుతుంది. ఆమె పతకం గెలవలేకపోవచ్చు. కానీ మాకు ఆమె చాంపియనే' అని రియో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత సాక్షి మాలిక్ చెప్పింది. ఇక..పారిస్ క్రీడల్లో భారత బృందం డిప్యూటీ చెఫ్ డి మిషన్‌గా వ్యవహరించిన ఒలింపిక్ పతక విజేత, షూటర్ గగన్ నారంగ్ కూడా వినేశ్‌ను విజేతగా అభివర్ణించాడు. 'చాంపియన్‌గా క్రీడా గ్రామంలో అడుగుపెట్టింది. ఆమె ఎప్పటికీ చాంపియనే' అని వినేశ్‌తోపాటు ఢిల్లీ వచ్చిన నారంగ్ పేర్కొన్నాడు. 'వినేశ్‌ను కలిసేందుకు ఆమె గ్రామ ప్రజలు ఎంతో ఉద్వేగంగా, ఉత్సాహంగా ఎదురు చూశారు' అని ఆమె సోదరుడు హర్విందర్ తెలిపాడు.

### దేశంలో ఒలింపిక్ స్థాయి క్రీడా సౌకర్యాలు 10.4 శాతమే!

న్యూఢిల్లీ: 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు భారత్ సిద్ధంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ ఓవైపు విశ్వాసం వ్యక్తం చేస్తుంటే.. మరోవైపు విశ్వక్రీడల ప్రమాణాలను అందుకునే స్థాయిలో క్రీడల మౌలిక వసతులు దేశంలో లేవన్న విషయం వెలుగులోకి రావడం ఆందోళన కలిగిస్తోంది. దేశంలో క్రీడల మౌలిక వసతుల్లో ఒలింపిక్స్ ప్రమాణాలను అందుకొనేవి 10.4 శాతమే అని 'బిజినెస్ స్టాండర్డ్' చేసిన సర్వేలో తేలింది. భవిష్యత్ ప్రాజెక్టులను ఇందులో పరిగణనలోకి తీసుకోలేదు. ఖేలో ఇండియా లెక్కల ప్రకారం దేశ వ్యాప్తంగా 737 జిల్లాల్లో 15,822 క్రీడా మౌలిక నిర్మాణాలు పూర్తికాగా.. 20,832 పూర్తి క్రీడా సౌకర్యాలు ఉన్నాయి. కానీ, వీటిల్లో 1645 క్రీడా మౌలిక నిర్మాణాలు, 2473 పూర్తి క్రీడా సౌకర్యాలు మాత్రమే ఒలింపిక్స్ స్థాయిలో ఉన్నాయని నివేదిక లో బహిర్గతమైంది. ఇవన్నీ వివిధ రాష్ట్రాల్లోని 334 జిల్లాల్లో ఉన్నాయి. అంతర్జాతీయ క్రీడల నిర్వహణ స్థాయిలో బ్యాడ్మింటన్‌కు 314 కోర్టులు, ఫుట్‌బాల్‌కు 301 గ్రౌండ్‌లు, వాలీబాల్‌కు 270 కోర్ట్‌లు, అథ్లెటిక్స్‌కు 221 ట్రాక్‌లు అందుబాటు లో ఉన్నాయి. పూర్తయిన క్రీడా మౌలిక నిర్మాణాల్లో తమిళనాడులో అత్యధికంగా 390 ఉండగా.. 161తో ఢిల్లీ రెండో స్థానంలో నిలిచింది. ఇక, గుజరాత్‌లో 43 క్రీడా మౌలిక సదుపాయాలు, 18 మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. కాగా, మొతేరాలో సర్దార్ వల్లభాయ్ పటేల్ స్పోర్ట్స్ ఎన్‌క్లేవ్‌తో భారీ ప్రాజెక్టును ఆరంభించనున్నారు. మిషన్ ఒలింపిక్స్‌లో భాగంగా 'గుజరాత్ ఒలింపిక్ ప్లానింగ్, మౌలిక వసతుల కార్పొరేషన్'ను గుజరాత్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 2036 ఒలింపిక్స్ నిర్వహణ కోసం రూ.6వేల కోట్లతో ఆరు క్రీడా కాంప్లెక్సులు నిర్మించాలనేది ప్రణాళిక. అయితే, ఇదంతా ఒలింపిక్ బిడ్ నెగ్గితేనే!

### భారత కోచ్ పదవిపై దిగ్గజ షూటర్ ఆసక్తి



న్యూఢిల్లీ: భారత జట్టు కోచ్‌గా పని చేయడానికి బ్రిటన్‌కు చెందిన డబుల్ ట్రాప్ లెజెండరీ షూటర్ పీటర్ విల్సన్ (37) ఆసక్తి ప్రదర్శిస్తున్నాడు. ఈ మేరకు అతడు తన దరఖాస్తును ఈ-మెయిల్ చేసినట్టు చెప్పాడు. 2028 ఒలింపిక్స్‌ను దృష్టిలో ఉంచుకొని భారత షూటర్లకు శిక్షణ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిపాడు. పారిస్ ఒలింపిక్స్ ట్రాప్ ఈవెంట్‌లో స్వర్ణం సాధించిన నాథన్ హేల్స్‌కు కూడా ఇతడే కోచ్. విల్సన్ 2012 లండన్ ఒలింపిక్స్‌లో పసిడి పతకం సాధించాడు. కాగా, ఎంతో కాలంగా భారత జట్టు విదేశీ ట్రాప్ షూటింగ్ కోచ్ లేకుండానే బరిలోకి దిగుతోంది.




### డైమండ్ లీగ్ బరిలో నీరజ్

న్యూఢిల్లీ: గాయంతో ఇబ్బంది పడుతున్నా.. ఈ సీజన్‌ను వీలైనంత మెరుగ్గా ముగించాలని డబుల్ ఒలింపిక్ పతక జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా భావిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 22 నుంచి లాసన్నేలో జరిగే డైమండ్ లీగ్‌లో తాను పాల్గొంటున్నట్టు చోప్రా శనివారం ప్రకటించాడు. పారిస్ ఒలింపిక్స్‌లో రజతం సాధించిన తర్వాత.. వైద్యుల సలహా కోసం చోప్రా నేరుగా జర్మనీ వెళ్లాడు. గజ్జల్లో గాయానికి శస్త్రచికిత్స చేయించుకొంటాడనే వార్తలు వచ్చాయి. అయితే, స్విస్‌లో ప్రాక్టీస్ ఆరంభించిన చోప్రా.. డైమండ్ లీగ్‌లో పాల్గొంటున్నట్టు వర్చువల్‌గా జరిగిన మీడియా సమావేశంలో తెలిపాడు. గాయం మరింత తీవ్రం కాకుండా జాగ్రత్తలు తీసుకొంటూనే సాధన చేస్తున్నట్టు చెప్పాడు. వచ్చేనెల 12,13 తేదీల్లో బెల్జియంలో జరిగే సీజన్ చివరి డైమండ్ లీగ్ మీట్‌లో కూడా పాల్గొనాలని భావిస్తున్నాడు. ఇక, 90 మీటర్ల మార్క్‌ను చోప్రా ఇప్పటి వరకు దాటలేక పోవడం పెద్ద చర్చనీయాంశంగా మారింది. కానీ, దాన్ని దేవుడికే వదిలేస్తున్నానన్నాడు.

### అల్కారజ్‌కు కోపమొచ్చె.. రాకెట్ విరిగె

సిన్సినాటి: స్పెయిన్ టెన్నిస్ స్టార్, మాజీ వరల్డ్ నెంబర్‌వన్ కార్లోస్ అల్కారజ్‌లో ఆగ్రహం పెల్లుబికింది. దాంతో అతడు తన రాకెట్‌ను నేలకేసి కొట్టాడు. సిన్సినాటి ఓపెన్ టోర్నీలో అతడు ఇలా అనుచితంగా ప్రవర్తించాడు. గేల్ మోన్‌ఫిల్స్‌తో మ్యాచ్‌లో 6-4, 6-7 (7), 4-6తో వరుస సెట్లలో ఓడిన అల్కారజ్ ఆ కోపాన్ని తన రాకెట్‌పై చూపడంతో అదికాస్తా విరిగిపోయింది.



### విండీస్ విజయలక్ష్యం 263

- దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ 246.. జేడెన్‌కు 6 వికెట్లు

గయానా: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టులో వెస్టిండీస్ విజయం కోసం పోరాడుతోంది. 263 పరుగుల ఛేదన కోసం బరిలోకి దిగిన ఆతిథ్య జట్టు మూడోరోజు శనివారం కడపటివార్తలందేసరికి 29 ఓవర్లలో 3 వికెట్లకు 95 పరుగులతో ఉంది. క్రీజులో హాడ్జ్, అథనజె ఉన్నారు. అంతకుముందు దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో పేసర్ జేడెన్ సీల్స్ (6/61) ధాటికి 246 రన్స్‌కు ఆలౌటైంది. వెరెనె (59), మార్‌క్రమ్ (51) అర్ధసెంచరీలు చేశారు. రెండోరోజు ఆటలో 19 పరుగుల వ్యవధిలోనే 4 వికెట్లు కోల్పోయిన సఫారీలను శనివారం కూడా విండీస్ బౌలర్లు ఇబ్బందిపెట్టారు. దీంతో 223/5 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన దక్షిణాఫ్రికా మరో 23 పరుగులను జోడించి మిగిలిన వికెట్లన్నీ కోల్పోయింది. సఫారీలు తొలి ఇన్నింగ్స్‌లో 160 పరుగులు చేయగా, విండీస్ 144 పరుగులకే కుప్పకూలింది.



కొత్తవలస కొండపై శారదా పీఠానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న సిసోడియా

# 'ఫ్రీహోల్డ్'లో అవకతవకలు

- 22-ఏ మినహాయింపులపై ఫిర్యాదులు.. వీటిపై మరింత లోతైన విచారణ
- రెవెన్యూ సదస్సుల్లో రాజముద్రతో పట్టాదారు పుస్తకాలు: సిసోడియా

విశాఖపట్నం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీ అయిన 13లక్షల ఎకరాల్లో 25 వేల ఎకరాలకు రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా తెలిపారు. పలుచోట్ల ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు ఇచ్చిన భూముల కొనుగోలుకు అనధికార ఒప్పందాలు జరిగినట్టు తమ దృష్టికి వచ్చిందని, వాటిపై విచారణ జరిపిస్తామని ప్రకటించారు. ఉత్తరాంధ్ర పర్యటనకు వచ్చిన ఆయన శనివారం సాయంత్రం విశాఖ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో విలేకరులతో మాట్లాడారు. డీ-పట్టా భూములపై రైతులకు హక్కులు కల్పించేందుకు గత డిసెంబరులో జీవో(నం.596) జారీ చేసిన తర్వాత అనర్హులకు అనుమతులు ఇచ్చినట్లు తేలితే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఫ్రీహోల్డ్ అనుమతుల్లో అవకతవకలు, 22-ఎ నుంచి మినహాయింపు వంటి వాటిపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. దీనిపై మరింత లోతుగా విచారణ చేపట్టాల్సి ఉందని సిసోడియా అభిప్రాయపడ్డారు. ప్రభుత్వానికి చెందిన విలువైన భూములు కాపాడుకొనే దిశగా చర్యలు తీసుకుంటామని సిసోడియా వెల్లడించారు. భూముల రికార్డులు పక్కాగా ఉండేలా ఒక ప్రణాళిక ఖరారు చేస్తామని చెప్పారు. నగరంలో విలువైన దసపల్లా భూముల వ్యవహారంలో సుప్రీంకోర్టులో సకాలంలో అప్పీల్ చేయకపోవడంతో ఇబ్బందులు వచ్చిన మాట వాస్తవమేనని అంగీకరించారు. దసపల్లా ఎస్టేట్‌కు చెందిన వారసులు 60 ఎకరాలకు క్లెయిమ్ చేయగా వాటిలో పార్కులు, సర్వెంట్ హౌస్ పరిసరాలు కలిపి 14.5 ఎకరాలను 22-ఎలో చేర్చామని, ఇంకా ఈ భూములపై కొన్ని వివాదాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. డీపట్టా భూములకు ఫ్రీహోల్డ్ అనుమతులు జారీ, రిజిస్ట్రేషన్లు, 22-ఎ నుంచి మినహాయింపులు వంటివి 3నెలల పాటు నిలిపివేయాలని ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. కాగా త్వరలో చేపట్టనున్న రెవెన్యూ సదస్సుల ద్వారా భూ వివాదాల శాశ్వత పరిష్కారానికి వీలు కలుగుతుందని అన్నారు. ఈ సదస్సుల్లోనే రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు హక్కుదారులకు అందజేస్తామని తెలిపారు. భూముల రిజిస్ట్రేషన్లు కేవలం రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలోనే చేపడతామని, గ్రామ సచివాలయాల్లో చేసేది లేదని సిసోడియా స్పష్టం చేశారు. కాగా, శనివారం భీమిలి మండలంలో సిసోడియా విస్తృతంగా పర్యటించారు. బీచ్‌రోడ్‌లో ఉన్న ఎర్రమట్టి దిబ్బలను సందర్శించారు. కొత్తవలస కొండపై శారదా పీఠానికి కేటాయించిన 15 ఎకరాల స్థలాన్ని ఆయన పరిశీలించారు. భీమిలి మండల తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. భీమిలి ఆర్డీవో కార్యాలయంలో భూ బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.







ఢిల్లీలో శనివారం కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, రామ్మోహన్ నాయుడు, కుమారస్వామిలను కలిసిన ముఖ్యమంత్రి చంద్రబాబు

# మీదే బాధ్యత!

(మొదటి పేజీ తరువాయి)

బాధ్యత కేంద్రంపై ఉందని చంద్రబాబు పదేపదే గుర్తు చేశారు. రానున్న కేంద్ర కేబినెట్ సమావేశంలో పోలవరం ప్రాజెక్టుకు అవసరమైన నిధులను విడుదల చేస్తూ నిర్ణయం తీసుకోవాలని... కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన విధంగా అమరావతి పనులు ప్రారంభించేందుకు విదేశీ సంస్థల నుంచి నిధులు సత్వరం లభించేలా చూడాలని మోదీని కోరారు. పోలవరం పూర్తి చేసేందుకు సత్వర నిధులు మంజూరు చేయవలసిన బాధ్యత కేంద్రంపై ఉందని గుర్తు చేశారు. ఏపీలో మౌలిక సదుపాయాలకు సంబంధించి వివిధ మూలధన ప్రాజెక్టులకు ప్రత్యేక సహాయం అవసరమని అన్నారు. వెనుకబడినప్రాంతాలకు గ్రాంట్లు మంజూరు చేయాలని గుర్తు చేశారు. ఏపీలో పారిశ్రామిక అభివృద్ధి కోసం పారిశ్రామిక ప్రోత్సాహకాలకు నిధులను విడుదల చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని ప్రధాని మోదీకి చంద్రబాబు తెలిపారు.

## అమిత్ షాతోనూ భేటీ

మోదీని కలిసిన అనంతరం కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో చంద్రబాబు సమావేశమయ్యారు. ప్రధానితో చర్చించిన అంశాలను షా వద్ద పునరుద్ఘాటించారు. రాష్ట్ర విభజన చట్టానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలపై చర్చించారు. ఏపీ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఎన్డీయే ప్రభుత్వం చేసిన వాగ్దానాలను నెరవేర్చాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు.

## అమలు చేయండి...

చంద్రబాబు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి... ఇటీవల బడ్జెట్‌లో ఏపీకి సంబంధించి చేసిన ప్రకటనలకు కృతజ్ఞత తెలిపారు. ఈ ప్రకటనలు ఆచరణలో పెట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాజధాని అమరావతికి వివిధ బహుళజాతి సంస్థల నుంచి నిధులు వేగవంతంగా వచ్చేందుకు తోడ్పడాలని కోరారు. పోలవరం పూర్తిచేసేందుకు అవసరమైన నిధులను రానున్న కేబినెట్ సమావేశాలలోనే విడుదల చేయాలని కోరారు. వివిధ మూలధన ప్రాజెక్టులకు అవసరమైన పెట్టుబడుల కోసం ప్రత్యేక సాయం అవసరమని చంద్రబాబు గుర్తు చేశారు. వెనుకబడిన ప్రాంతాలకు గ్రాంట్లు విడుదల చేసి, రాయలసీమ, ప్రకాశం, ఉత్తర కోస్తా అభివృద్ధికి సహకరించాలన్నారు. తర్వాత... కేంద్ర ఉక్కుమంత్రి జేడీ కుమారస్వామితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.

## నడ్డాతో చర్చలు...

కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డాతో కూడా సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. ఏపీలో కొనసాగుతున్న అభివృద్ధి ప్రాజెక్టులను వేగవంతం చేయడం, అభివృద్ధిలో ఏపీని ఉన్నతస్థానానికి చేర్చడంపై చంద్రబాబు తనతో విలువైన అభిప్రాయాలను పంచుకున్నారని నడ్డా ఎక్స్ వేదికగా తెలిపారు. వికసిత్ ఆంధ్రా లక్ష్యంగా తమ మధ్య చర్చలు జరిగాయన్నారు. సీఎం చంద్రబాబు వెంట కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాసవర్మ, టీడీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణ దేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు ఉన్నారు. శుక్రవారం సాయంత్రం ఢిల్లీకి చేరుకున్న చంద్రబాబు కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో భేటీ అయిన సంగతి తెలసిందే. ఈ భేటీలో పోలవరం డయాఫ్రం వాల్ ఇతర విభాగాల నిర్మాణాలను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి సమన్వయం చేసుకోవాలని, కాంట్రాక్టు పనులను పూర్తి చేయాలని కోరారు. ఈసీఆర్ఎఫ్ డ్యాం సంబంధిత పనులను పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని సెంట్రల్ వాటర్ కమిషన్ అధికారులను కోరారు.

## ఎయిర్‌పోర్టులను విస్తరిస్తాం

- కేంద్ర మంత్రి రామ్మోహన్‌తో సీఎం చంద్రబాబు భేటీ

న్యూఢిల్లీ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఏడు విమానాశ్రయాలను 14కు పెంచే ఆలోచన ఉందని కేంద్ర విమానయాన మంత్రి కె. రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఈ ఉద్దేశంతోనే ఎయిర్‌పోర్టుల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలో కొత్త విమానాశ్రయాల అభివృద్ధి, ప్రస్తుతం వాడకంలో ఉన్న ఎయిర్‌పోర్టుల టెర్మినల్ సామర్థ్యం పెంచడంపై కేంద్ర మంత్రితో సీఎం చంద్రబాబు చర్చించారు. శనివారం ఢిల్లీలోని రాజీవ్‌గాంధీ భవన్‌లో వీరిద్దరూ భేటీ అయ్యారు. రెండు గంటలకు పైగా జరిగిన ఈ భేటీలో రాష్ట్రంలోని ప్రధాన నగరాలకు ఎయిర్ కనెక్టివిటీ, హెలీకాప్టర్, సీప్లేన్స్ సేవలు, వ్యవసాయం, వాణిజ్య రంగాల్లో డ్రోన్ల వినియోగం వంటి అంశాలపై చర్చించారు. రాష్ట్రాభివృద్ధిలో విమాన రంగం ముఖ్య భూమిక పోషిస్తుందని, అందుకు కావలసిన పూర్తి సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నామని కేంద్ర మంత్రి తెలిపారు. కాగా, కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడి సేవలను ఈ సమావేశంలో చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన ఎర్రన్నాయుడు టీడీపీ అభివృద్ధి కోసం అహర్నిశలూ కృషి చేశారని, అంచెలంచెలుగా ఎదిగి అగ్రస్థాయికి చేరుకున్నారని ప్రశంసించారు. కాగా, తన తండ్రి చనిపోయిన తర్వాత చంద్రబాబే తండ్రిగా, గురువుగా, మార్గదర్శకుడిగా అన్ని విధాల అండగా నిలిచారని రామ్మోహన్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో విమానయాన రంగ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై సీఎం చంద్రబాబుతో చర్చించినట్లు చెప్పారు. శ్రీకాకుళం, కుప్పం, దగదర్తి, నాగార్జునసాగర్‌తో పాటు తుని, అన్నవరం, తాడేపల్లిగూడెం వంటి ప్రాంతాల్లో కొత్త విమానాశ్రయాల ఏర్పాటు కోసం చర్చించినట్లు వివరించారు. ఏపీని లాజిస్టిక్ హబ్‌గా మార్చాలన్నదే చంద్రబాబు విజన్ అని, ఇందులో విమానాశ్రయాల పాత్ర కీలకమని, 20, 30ఏళ్ల తర్వాత ఏర్పడబోయే పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని సీఎం ఇప్పుడే ఆలోచిస్తున్నారని కేంద్రమంత్రి తెలిపారు.

## పనులు మేం చేస్తే... బిల్లులు వైసీపీ నేతలు కొట్టేశారు

- మంత్రి అనగానికి బాధితుడి ఫిర్యాదు
- భూమన వేధింపులపై టీడీపీ కార్యకర్తల ఆగ్రహం
- 'జోగి' అనుచరులపై మాజీ సర్పంచ్ జొన్నలగడ్డ కంప్లైంట్
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో వినతుల స్వీకరణ

అమరావతి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): 'సిమెంటు రోడ్ల పని మేం చేస్తే మాకు తెలియకుండా వైసీపీ నేతలు బిల్లులు చేయించుకొని డబ్బులు కొట్టేశారు' అని నూజివీడు మండలం సిద్ధార్థ నగర్ గ్రామానికి చెందిన యాదాల శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ శనివారం ఇక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో తమ పార్టీ నేతలు వర్ల రామయ్య, అశోక్ బాబు తదితరులతో కలసి ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. 'నేను రూ.44.50 లక్షల విలువైన పనులు చేశాను. వైసీపీ నేతలు నాకు తెలియకుండా అధికారులతో కుమ్మక్కై, నాకు రావాల్సిన డబ్బులు కొట్టేశారు. వారిపై చర్యలు తీసుకొని నా డబ్బులు నాకు ఇప్పించండి' అని శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. తిరుపతిలో వైసీపీ నేతల అరాచకాలను ప్రశ్నించినందుకు నాటి తిరుపతి వైసీపీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి తమపై అక్రమ కేసులు పెట్టించి రౌడీ షీట్ కూడా పెట్టించారని తిరుపతి మండలం శెట్టిపల్లి గ్రామానికి చెందిన జంపాల గోపి, ఇర్ల గౌతమ్ మంత్రికి ఫిర్యాదు చేశారు. భూమన వేధింపులు భరించలేక తమతోపాటు అనేక మంది ఊరు వదిలి పారిపోవాల్సి వచ్చిందని తెలిపారు. కృష్ణా జిల్లా గూడూరు మండలం కలపటం మాజీ సర్పంచి జొన్నలగడ్డ శ్రీనివాసరావు.. 'మాజీ మంత్రి జోగి రమేశ్‌తోపాటు గతంలో చంద్రబాబు ఇంటిపై దాడిలో పాల్గొన్న వైసీపీ నేతలు అయినాల నాగేశ్వరరావు, దేవ నాగ శ్రీనివాసరావు, అయినాల మణికంఠ నన్ను చంపడానికి కారుతో గుద్దించారు. నా ఇంటిని ధ్వంసం చేయడానికి ఏకంగా జేసీబీతో వచ్చారు. నాకు రావాల్సిన బిల్లులు ఆపేయడంతోపాటు నాపై దాడి చేయించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి' అని కోరారు. తాను కాళ్ల లేని దివ్యాంగుడినని, తన తల్లిదండ్రులకు ప్రభుత్వం కేటాయించిన భూమిని వారి మరణానంతరం గ్రామంలో కొంత మంది కబ్జా చేశారని, విచారణ జరిపించి న్యాయం చేయాలని తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి ఏర్పేడుకు చెందిన డబ్బా వెంకటేశ్వరరావు వినతిపత్రం సమర్పించారు. వైసీపీ నేతలు పెట్టిన అక్రమ కేసులతో తన కుమారుడు పైచదువులకు విదేశాలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని నెల్లూరు జిల్లా వలేటివారి పాలెం మండలం కొండ సముద్రం గ్రామానికి చెందిన టీడీపీ నేత ఘట్టమనేని శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. తమ భూములకు గతం మాదిరిగా రిజిస్ట్రేషన్ సదుపాయాన్ని పునరుద్ధరించాలని సింగరాయకొండ, సోమరాజు పల్లి గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేశారు. తిరుపతి జిల్లా కేవీబీ పురం మండలం దిగువ పుత్తూరు గ్రామానికి చెందిన పాఠశాల స్థలం ఆక్రమణలకు గురవుతోందని, దానికి ప్రహరీ నిర్మించాలని ఆ గ్రామస్థులు కోరారు. కొత్త అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. అంబులెన్స్ సేవకులుగా పనిచేస్తున్న తమకు అరబిందో సంస్థ శ్లాబ్ విధానం పేరుతో జీతభత్యాల చెల్లింపులు చేస్తామని చెప్పి మోసం చేశారని, తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. గ్రామ పంచాయితీల్లో పనిచేస్తున్న టైం స్కేల్ సిబ్బంది కోసం గతంలో టీడీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నంబర్ 142 అమలు చేయాలని, మూడేళ్లపాటు తమకు జీతం ఇవ్వకుండా పని చేయించుకోవడంపై విచారణ జరిపి న్యాయం చేయాలని వారు కోరారు.

## ఏపీకి మళ్లీ బ్రాండ్ ఇమేజ్!

- నూతన పారిశ్రామిక విధానంపై పరిశ్రమలశాఖ కసరత్తు

అమరావతి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): విశేష రాజకీయానుభవం, పాలనా దక్షత కలిగిన చంద్రబాబు నేతృత్వంలో మళ్లీ రాష్ట్రానికి ఎద్దఎత్తున పరిశ్రమలు వస్తాయని, నిరుద్యోగులకు లక్షలాది ఉద్యోగాలు వస్తాయని, నాన్ స్కిల్డ్ లేబర్‌కు కూడా చేతినిండా పని దొరుకుతుందనే ఆశాభావంతో యువత ఉంది. పారిశ్రామిక ప్రగతి పరుగులు తీస్తే.. ప్రభుత్వానికి భారీగా ఆదాయం రావడంతో రాష్ట్ర ఆర్థికాభివృద్ధి కూడా పరుగులు తీస్తుందని నిపుణులు కూడా లెక్కలు వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే.. రాష్ట్రాన్ని పెట్టుబడులకు స్వర్గధామంగా మలిచి.. ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను తిరిగి నిలబెట్టే సరికొత్త పారిశ్రామిక విధానాన్ని త్వరలోనే ప్రకటించేందుకు చంద్రబాబు ప్రభుత్వం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకువచ్చేవారికి బలమైన నమ్మకం కల్పించేలా నూతన పారిశ్రామిక విధానాన్ని రూపొందించే దిశగా కసరత్తును మరింత ముమ్మరం చేసింది. త్వరలోనే అమలులోకి తీసుకురానున్న ఈ నూతన పారిశ్రామిక విధానం (2024-29) రూపకల్పనపై ప్రత్యేక దృష్టి సారించిన సీఎం చంద్రబాబు.. ఇటీవల పరిశ్రమలశాఖ మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. దేశంలోని టాప్-5 రాష్ట్రాలతో పోటీ పడుతూ.. వాటిని తలదన్నే రీతిలో అత్యుత్తమ పాలసీని రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

### 2027 జాతీయ క్రీడల నిర్వహణకు
# రాష్ట్రం బిడ్..!

- ఉమ్మడి రాష్ట్రం స్థాయిలో నిర్వహణకు ఆలోచన

అమరావతి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): వచ్చేసారి జరగనున్న జాతీయ క్రీడలను రాష్ట్రంలో నిర్వహించడానికి బిడ్ వేసే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ఆ దిశగా ఇప్పటికే నిర్వాహకులతో కొంత మేర చర్చలు జరిపినట్లు సమాచారం. రెండేళ్లకు ఒకసారి జాతీయ క్రీడలను దేశంలో ఏదో ఒక రాష్ట్రంలో నిర్వహిస్తారు. జాతీయ ఒలంపిక్ అసోసియేషన్ దీని నిర్వహణ బాధ్యతలను చూస్తుంది. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లో జాతీయ క్రీడలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించారు. ఆ సమయంలో గచ్చిబౌలిలోని బాలయోగి స్టేడియంతోపాటు అనేక స్టేడియంలను హైదరాబాద్‌లో నిర్మించారు. ఆ క్రీడల నిర్వహణ కోసం ఏకంగా ఒక క్రీడా గ్రామాన్నే నిర్మించింది. ఇప్పుడు మళ్లీ రాష్ట్రంలో అదే మాదిరిగా జాతీయ క్రీడలు నిర్వహించాలన్న ఆలోచనలో సీఎం చంద్రబాబు ఉన్నట్లు సమాచారం. అమరావతి వేదికగా వీటిని నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది. నూతన రాజధాని దేశవ్యాప్తంగా ప్రచారం పొంద డానికి ఈ క్రీడల నిర్వహణ ఉపకరిస్తుందన్నది ప్రభుత్వం భావన. రాజధానిలో ప్రతిపాదించిన తొమ్మిది నగరాల్లో స్పోర్ట్స్ సిటీ కూడా ఒకటి. ఈ క్రీడా నగరంలో వివిధ క్రీడలకు సంబంధించిన అత్యాధునిక వసతులను అభివృద్ధి చేయాలని, మొత్తం ఎనిమిది స్టేడియంలు నిర్మించాలని అప్పట్లో ప్రతిపాదించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ప్రతిపాదనలు అన్నీ మూలనపడ్డాయి. ఇప్పుడు జాతీయ క్రీడల నిర్వహణ ద్వారా క్రీడా నగర నిర్మాణాన్ని ముందుకు తీసుకువెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అప్పటికి అమరావతిలో అంతర్గతంగా రహదారులు తదితర మౌలిక వసతుల నిర్మాణం పూర్తవుతుందని, కొత్త రాజధానిని దేశవ్యాప్తంగా పరిచయం చేయడానికి ఈ క్రీడల నిర్వహణ ఉపకరిస్తుందని అధికార వర్గాలు ఆశిస్తున్నాయి. క్రీడల సంబంధిత మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ 'ఖేలో ఇండియా' పథకాన్ని వినియోగించుకోవాలని ఆ వర్గాలు యోచిస్తున్నాయి. ఈ పథకం కింద రాష్ట్రానికి రూ.300 కోట్ల వరకూ వచ్చే అవకాశం ఉన్నా గత ప్రభుత్వం దానిని వాడుకోలేదు. కేంద్ర ప్రభుత్వ పథకం నుంచి భారీగా నిధులు రాబట్టి, దానికి రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్ కూడా కొంత కలిపి క్రీడా స్టేడియాలను నిర్మించాలన్నది ప్రభుత్వ ఆలోచన. ఇండియన్ ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా ఉన్న పీటీ ఉషను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ఇటీవల కలసి రాష్ట్రంలో జాతీయ క్రీడల నిర్వహించాలన్న ప్రభుత్వ యోచనను వివరించారు.

"ఆ అగ్రిగోల్డ్ ఏమిటో.. దాని ఆస్తుల గోలేమిటో మాకు తెలీదు. అందరూ ఎలా కొన్నారో మేం కూడా అలానే కొన్నాం. పత్రికల్లో ప్రకటనలు ఇచ్చి.. అధికారులు నివేదిక ఇచ్చిన తర్వాత ఆ భూమిని కొనుగోలు చేశాం"- ఈ నెల 13న జోగి రాజీవ్‌ను అరెస్టు చేసిన సమయంలోను, ఈ నెల 16న మంగళగిరి డీఎస్పీ కార్యాలయం వద్ద మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్ చేసిన వ్యాఖ్యలు ఇవి.



"అందరూ కొన్నట్టే మేం కూడా అగ్రి భూములు కొన్నాం. ప్రభుత్వం కక్ష సాధింపులో భాగంగానే నన్ను అరెస్టు చేయించింది" - ఈ నెల 13న ఇబ్రహీంపట్నంలో తనను అరెస్టు చేసిన సమయంలో జోగి రాజీవ్ చేసిన వ్యాఖ్యలు ఇవి. కానీ, వాస్తవాలు మాత్రం వేరుగా ఉన్నాయి. జోగి కుటుంబం అక్రమాలు బట్టబయలయ్యాయి.

# 'అందరూ' ఎవరు జోగి!?

- అగ్రి గోల్డ్ భూములు కొన్నది మీ కుటుంబం ఒక్కటే కదా?
- అన్నీ తెలిసి చక్కబెట్టింది నిజం కాదా?
- జోగి తండ్రీ తనయుల అక్రమాలు బట్టబయలు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

అగ్రిగోల్డ్ భూముల వ్యవహారంలో వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్, ఆయన తనయుడు రాజీవ్‌లు.. తమకు ఏ పాపం తెలియదని, అమాయకులమని, అందరూ కొన్నట్టే తాము కూడా ఆ భూములు కొన్నామని చెబుతున్నా.. వెలుగులోకి వచ్చిన వాస్తవాలు మాత్రం తండ్రీతనయులు అంత అమాయకులు కాదని, ఉద్దేశ పూర్వకంగానే అక్రమంగా అగ్రిగోల్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని స్పష్టమైంది. ఆ భూమిని కబ్జా చేయాలన్న దురాలోచనతో.. పక్కా ప్రణాళికతోనే జోగి కుటుంబ సభ్యులు 2,160 చదరపు గజాల అగ్రి భూములను రిజిస్టర్ చేయించుకున్నారని తేలిపోయింది. ఆ తర్వాత వాటిని విక్రయించారని రికార్డులే చెబుతున్నాయి.

## ఎక్కడి నుంచి ఎక్కడి దాకా!

ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గ్రామీణ ప్రాంతంలోని అంబాపురంలో రెవెన్యూ సర్వే(ఆర్ఎస్) నంబరు 87లో మొత్తం 18.33 ఎకరాల పట్టా భూమి ఉంది. ఈ భూవి ు యజమానుల్లో ఒకరైన గరికపాటి జయలక్ష్మికి 2.81 ఎకరాలు ఉండగా దీనిలో 3,120 గజాలను అల్లూరి కృష్ణమూర్తికి విక్రయించారు. ఆయన ఆ భూమిని అగ్రిగోల్డ్ యజమానులైన అవ్వ ఉదయభాస్కర్‌తోపాటు మరో 8 మందికి 2293.05 గజాలను 9 ప్లాట్లుగా విడగొట్టి విక్రయించారు. అగ్రి గోల్డ్ యజమానులు కొనుగోలు చేసిన 2293.05 గజాలను 2018, 2019ల్లో జీవో నంబర్లు 117, 133 ద్వారా సీఐడీ అటాచ్ చేసింది. సీఐడీ అటాచ్ చేసుకున్న భూములను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిషేధిత జాబితాలో పేర్కొంటారు. ఈ భూములను కొనుగోలు చేయడం సామాన్యులకు సాధ్యం కాదు. అలాంటి భూములపై జోగి కుటుంబ సభ్యులు కన్నేశారు.

## లేని భూమిని కొన్నట్టు

అంబాపురంలోని అగ్రిగోల్డ్ భూముల చెంత ఆర్ఎస్ నంబరు 88లో మొత్తం 7.47 ఎకరాల పట్టా భూమి ఉంది. దీనిలో 4 ఎకరాలను బొమ్ము వెంకట చలమారెడ్డి కొన్నారు. దీనిలో ఒక ఎకరాను 2001లో పోలవరపు మురళీ మోహన్‌కు బొమ్ము విక్రయించా రు. మురళీ మోహన్ 2003లో ప్లాట్లు వేసి విక్రయించారు. అయితే, 2014లో అదే భూమిని మహాలక్ష్మి ప్రాపర్టీస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ తరఫున అడుసుమిల్లి మోహనరామదాసు అనే వ్యక్తి తాను కొనుగోలు చేసినట్లు పత్రాలు సృష్టించారు. కానీ, మురళీమోహన్ తాను 2014లో ఎవరికీ విక్రయించలేదని, నకిలీ ఆధార్ కార్డుతో ఆ రిజిస్ట్రేషన్ జరిగిందని ఆరోపిస్తున్నారు. ఇక అడుసుమిల్లి మోహనరామదాసు నుంచే 2022లో జోగి వెంకటేశ్వరరావు, జోగి రాజీవ్ 2,160 చదరపు గజాల భూమిని కొన్నారు. భూమి కొనుగోలు చేసే సమయంలో సర్వే నంబరు 88కి సంబంధించి ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్(ఈసీ) పరిశీలిస్తే ఆ భూమికి ఎవరెవరు యజమానులన్నది స్పష్టంగా తెలిసిపోతుంది. అదేమీ చేయకుండా డబుల్ రిజిస్ట్రేషన్ జరిగిన భూమిని మంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఏ విధంగా కొనుగోలు చేస్తారన్నది ప్రశ్న.

## మోసపూరితంగానే..

సర్వే నంబరు 88లో 2,160 గజాల భూమిని కొనుగోలు చేస్తున్నామని, దానిపై ఏమైనా వివాదాలు ఉంటే తెలియజేయాలని జోగి రాజీవ్, జోగి వెంకటేశ్వరరావు పత్రికా ప్రకటన ఇచ్చారు. ఆ సమయంలోనైనా సర్వే నంబరు 88లో ఉన్న లొసుగులు వారికి తెలిసి ఉండాలి. అయితే, అగ్రిగోల్డ్ భూములపై కన్నేసిన వారు ఉద్దేశ పూర్వకంగానే సర్వే నంబరు 88లో భూవిని కొన్నారు. అక్కడి నుంచి ముందు అనుకున్న విధంగా స్వీయ సవరణ దస్తావేజు డ్రామాతో అగ్రిగోల్డ్ భూమికి ఎసరు పెట్టారు. సర్వే నంబరు 88లో 2160 గజాలను 2022లో రిజిస్టర్ చేయించుకున్న జోగి కుటుంబ సభ్యులు అనంతరం దస్తావేజుల్లో తప్పు దొర్లిందని పేర్కొంటూ 2023లో అగ్రి భూములున్న సర్వే నంబరు 87ను అసలు నంబరుగా పేర్కొన్నారు. ఇవి నిషేధిత జాబితాలో ఉన్న విషయాన్ని నున్న సబ్ రిజిస్ట్రార్.. జోగి కుటుంబానికి తెలియజేసి ఉంటారు. కానీ, అగ్రి గోల్డ్ భూములు కబ్జా చేయాలన్న ఆలోచనతో ఉన్న వారు సబ్ రిజిస్ట్రార్‌పై ఒత్తిడి తీసుకొచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నది స్పష్టంగా తెలుస్తోంది. అనంతరం అదే ఏడాది మేలో ఆ భూమిని వైసీపీ కార్పొరేటర్ చైతన్యరెడ్డి కుటుంబ సభ్యులకు విక్రయించారు.



జోగి రమేశ్ కుటుంబం కబ్జా చేసిన అగ్రిగోల్డ్ భూమి. దాని చుట్టూ నిర్మించిన ప్రహరీ

## ఈ ప్రశ్నలకు బదులేది?

1 'అందరూ కొన్నారు' అని వ్యాఖ్యానించిన జోగి ఎవరు ఇలా కొన్నారో చెప్పాల్సి ఉంది.
1 ఒక సర్వే నంబరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్న తర్వాత నిషేధిత సర్వే నంబరులోని భూమిని ఎందుకు మార్చాల్సి వచ్చింది?
1 'అగ్రిగోల్డ్ ఏమిటో..' అని దీర్ఘాలు తీసిన జోగికి సర్వే నంబరు 87లో ఉన్న భూముల విషయం తెలియదా?

## వైసీపీకి ఆళ్ల నాని గుడ్‌బై

- ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా.. ఈ నిర్ణయం వ్యక్తిగతమేనని వెల్లడి

ఏలూరు రూరల్, ఆగస్టు 17: వైసీపీ సీనియర్ నాయకుడు, ఏలూరు మాజీ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ అలియాస్ నాని ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. అయితే, ఈ నిర్ణయం వెనుక వ్యక్తిగత కారణాలే ఉన్నాయని నాని తెలిపారు. శనివారం ఏలూరులో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. వ్యక్తిగత కారణాలతోనే వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు చెప్పారు. భవిష్యత్తులో ఏ పార్టీలోనూ చేరబోనన్నారు. ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆరు సార్లు పోటీ చేస్తే మూడు సార్లు గెలిచానని తెలిపారు. ఏలూరులో వైసీపీ కార్యాలయం కూల్చివేతపై వచ్చిన ఆరోపణలు అపోహలేనని చెప్పారు. పార్టీ కార్యాలయం కోసం స్థలాన్ని ఇచ్చిన యజమాని ఏడాది కాలంగా తిరిగి ఇవ్వాలని కోరుతున్నారని, ఈ నేపథ్యంలోనే ఈ నెల 16న యజమాని స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్టు నాని వివరించారు.

## 24న విజ్ఞాన్ వర్సిటీ స్నాతకోత్సవం

గుంటూరు(విద్య), ఆగస్టు 17: గుంటూరు జిల్లా వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయ 12వ స్నాతకోత్సవం ఈ నెల 24న నిర్వహిస్తున్నట్టు వీసీ ఆచార్య పీ. నాగభూషణ్ తెలిపారు. శనివారం స్నాతకోత్సవ పోస్టర్లను ఆయన రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్‌తో కలిసి వర్సిటీలో ఆవిష్కరించారు. స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ హాజరుకానున్నట్టు తెలిపారు. వేడుకల్లో పాల్గొనే గౌరవ అతిథులు ఎస్ఈసీ ఇండస్ట్రీస్ ఛైర్మన్ దొంతినేని శేషగిరిరావు, లోకేశ్ మెషీన్స్ వ్యవస్థాపకులు లోకేశ్వరరావు, సంగీత దర్శకులు సాలూరి కోటేశ్వరరావు(కోటి) తదితరులకు గౌరవ డాక్టరేట్లు అందించనున్నారు. అదేవిధంగా డిగ్రీ పూర్తిచేసుకున్న 1526 మందికి సర్టిఫికెట్లు, చదువులో అత్యంత ప్రతిభ చూపిన 26 మంది విద్యార్థులకు బ్రాంచీల వారీగా గోల్డ్‌మెడల్స్ అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో విజ్ఞాన్ ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ ఛైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య నాగభూషణ్ తదితరులు

## జీఎస్ఎల్ సేవలు స్ఫూర్తిదాయకం

- సినీ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా

రాజానగరం, ఆగస్టు 17: వైద్య రంగంలో విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలు సమకూర్చడంతో పాటు ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి వెంట వచ్చే బంధువులకు అతి తక్కువ ధరలకు అల్పాహారం, భోజన సదుపాయాలు కల్పించడం స్ఫూర్తిదాయకమని సినీ దర్శకుడు సందీప్ రెడ్డి వం గా అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని జీఎస్ఎల్-స్వతంత్ర ఇన్‌స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన 38 వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసిన సందీప్ రెడ్డి మాట్లాడుతూ జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటుచేసిన స్మార్ట్ ల్యాబ్, లైబ్రరీ వంటి సదుపాయాలను చూస్తుంటే తాను విదేశాల్లో ఉన్నానన్న భావన కలిగిందన్నారు. తాను సినీ రంగంలోకి రాకముందు ఫిజియోథెరపీ కోర్సు చదివానని, ఈ కారణంగానే తమ సినిమాలలో మెడికల్ నాలెడ్జ్ కు సంబంధించిన అంశాలను అర్జున్‌రెడ్డి, కబీర్‌సింగ్ సినిమాల్లో తెరకెక్కించానన్నారు. విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ రూ.10కు అమ్మ భోజనం, రూ.5కు అమ్మ ఇడ్లీ సదుపాయాన్ని కల్పించామన్నారు.





సినీ దర్శకుడు సందీప్‌రెడ్డిని సత్కరిస్తున్న డాక్టర్ గన్ని భాస్కరరావు

## పరిహారం కాదు.. ప్రమాదాలను నివారించాలి

- విద్యుత్ అధికారులకు మంత్రి గొట్టిపాటి ఆదేశం

అమరావతి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో మృతి చెందిన వారి కుటుంబాలకు పరిహారం చెల్లించడం కాదని, ప్రమాదాలే జరగకుండా నివారించాలని ఇంధన సంస్థల అధికారులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. శనివారం ఆయన వర్చువల్‌గా అధికారులతో మాట్లాడారు. ఈ సమావేశం లో విద్యుదాఘాతంతో మృతి చెందినవారి గురించి ఆరా తీశారు. నేలకు వేలాడుతున్న వైర్ల కారణంగా ప్రజలు విద్యుత్తుషాక్‌కు గురవుతున్నారని మంత్రి అన్నారు. సిబ్బంది కూడా కరెంట్ షాక్‌కు గురవుతున్న ఘటనలు తన దృష్టికి వచ్చాయన్నారు.

(మొదటి పేజీ తరువాయి)

కూడా జారీ చేసింది. ఈ మార్గదర్శకాల ప్రకారం పురపాలక, గ్రామ, వార్డు సచివాలయాలు, రెవెన్యూ, పంచాయతిరాజ్, గనులు, పౌరసరఫరాలు, అన్ని ప్రభుత్వ శాఖల్లోని ఇంజనీరింగ్ ఉద్యోగులు, అటవీ, రవాణా, దేవదాయ, పరిశ్రమలు, వాణిజ్య పన్నులు, విద్యుత్, స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖల్లోని ఉద్యోగులు బదిలీ కానున్నారు. అయితే, ఉపాధ్యాయులు, వైద్యారోగ్యం, సంక్షేమ శాఖల్లో బదిలీలకు అవకాశం ఇవ్వలేదు. ఎక్సైజ్ శాఖలో బదిలీలకు ప్రభుత్వం సెప్టెంబరు 5 నుంచి 15వ తేదీ వరకు అనుమతించింది. ఈలోగా ఎక్సైజ్ పాలసీ, ఉద్యోగుల పనివిధానంలో మార్పులు చేయనుంది. ఇది పూర్తయిన తర్వాత ఆ శాఖలో బదిలీలు చేపడతారు.

# బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

మార్గదర్శకాలు ఇవీ..

- పాత 13 జిల్లాల ప్రాతిపదికన బదిలీలు జరుగుతాయి.
- జూలై 31 నాటికి ఒకే స్టేషన్(గ్రామం, పట్టణం, నగరం)లో అత్యధికంగా ఐదేళ్ల విధులు నిర్వహిస్తే తప్పనిసరి బదిలీకి అర్హులు. మిగిలిన వారు జీరో సర్వీస్ ప్రాతిపదికన వారి విజ్ఞప్తుల మేరకు బదిలీ చేస్తారు. అంటే ఉద్యోగులంతా బదిలీలకు అర్హులే.
- గుర్తింపు పొందిన వివిధ ఉద్యోగ సంఘాల్లో ఆఫీస్ బేరర్స్‌గా ఉన్న వారికి బదిలీల నుంచి 9 ఏళ్ల మినహాయింపు నిబంధన వర్తిస్తుంది. వీరి జాబితా సంబంధిత జిల్లాల కలెక్టర్ల నుంచి హెచ్‌వోడీల ద్వారా అందాల్సి ఉంది.
- రాష్ట్రస్థాయి సంఘాల్లోని ఆఫీస్ బేరర్ల జాబితా కేవలం సాధారణ పరిపాలనా శాఖ ద్వారా మాత్రమే ఆ ఉద్యోగుల పరిధిలోకి వచ్చే శాఖలకు చేరాలి. వేరే ఏ మార్గాల ద్వారా వచ్చినా జాబితాను పరిగణించరు.

బదిలీల్లో ప్రాధాన్యాలు

- దృష్టిలోపం ఉన్న ఉద్యోగులకు బదిలీల నుంచి మినహాయింపు ఉంది. అయితే, వారు బదిలీ కోరుకుంటే నిబంధనల మేరకు బదిలీ చేస్తారు.
- మానసిక వైకల్యంతో ఇబ్బంది పడుతున్న పిల్లలు ఉన్న తల్లిదండ్రులకు బదిలీల్లో ప్రాధాన్యం ఇస్తారు. గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లకు పైగా పనిచేసిన ఉద్యోగులకు బదిలీల్లో ప్రాధాన్యం ఇస్తారు.
- 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులకు ప్రాధాన్యం ఉంటుంది.
- దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్న ఉద్యోగులు, వారిపై ఆధారపడిన తల్లిదండ్రులకు మెరుగైన వైద్య సౌకర్యాలున్న ప్రాంతానికి బదిలీ చేయడానికి ప్రాధాన్యం ఇస్తారు.

### అవి వేస్ట్ ఫైళ్లు ఎందుకవుతాయి?

సమాచారం తెలిసి, విలేకరులు వెళ్లి చూస్తుండగా, ఆఫీసు లోపల ఉన్న వేదవల్లి, కుమారి తమ సిబ్బందితో సగం వరకూ తగలబడిన ఫైళ్ళను లోపలకు తెప్పించి, భద్రపరిచారు. ఇవి కేవలం చిత్తు కాగితాలని, ఆఫీసును శుభ్రం చేస్తూ, వేస్ట్‌గా ఉన్నవాటికి నిప్పు పెట్టినట్టు కుమారి తెలిపారు. ఈ క్రమంలో విలేకరులు కొన్ని పత్రాలు చూపించి, ఇవి వేస్ట్ ఫైళ్లు ఎందుకవుతాయి? అధికార్ల సంతకాలు కూడా ఉన్నాయి కదా? అని ప్రశ్నించగా... ఇన్‌చార్జి వేదవల్లి జోక్యం చేసుకున్నారు. 'వేస్ట్ కాగితాలైతే మాత్రం నాకు చెప్పకుండా ఎందుకు ఇలా చేయించావ'ని కుమారిపై ఆగ్రహించారు. 'నేను కొద్ది నెలల్లో ఉద్యోగ విరమణ చేస్తా, నాకు పెద్ద సమస్య తెచ్చిపెట్టావ'ని చీవాట్లు వేశారు. ఆ తర్వాత తాను కలెక్టర్ ఆఫీసుకు వెళుతున్నట్టు చెప్పి ఆమె వెళ్లిపోయారు.


కాలిపోయిన పత్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

# పోలవరం ఫైళ్లకు నిప్పు!

(మొదటి పేజీ తరువాయి)

విషయం తెలిసిందే. పోలవరం ప్రధాన ఎడమ కాలువ పనుల కోసం చేపట్టిన భూసేకరణ చెల్లింపుల్లో భారీ స్కామ్ జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయి. మొత్తం రూ. 19 కోట్లు దాకా మింగేశారని చెబుతున్నారు. ఇప్పుడు తగలబడింది సరిగ్గా ఆ ప్రధాన ఎడమ కాలువ భూసేకరణ కార్యాలయంలోని ఫైళ్లే! ఇంకా.. రైతులు, లబ్ధిదారుల ఆధార్ కార్డులు, కాకినాడ కలెక్టరేట్ నుంచి ఇక్కడకు వచ్చిన లెటర్లు, పోలవరం ఎడమ ప్రధాన కాలువకు సబంధించిన అవార్డు పత్రాలు, ఫొటోలు కూడా దహనమైన వాటిలో ఉన్నాయి. శనివారం మధ్యాహ్నం 2.30గంటల సమయంలో సమాచారం తెలిసి విలేకరులు అక్కడకు వెళ్లగా, సగం కాలిన ఫైళ్లను, పత్రాలను అక్కడి అధికారులు లోపలకు తీసుకుని వెళ్లి దాచేశారు. దీంతో ఈ ఘటనపై మరిన్ని అనుమానాలు ముసురుకున్నాయి. ఆ తర్వాతి పరిణామాలు కూడా సందేహాలను మరింత పెంచేలా ఉన్నాయి. ఫైళ్లను బయట పడేసినట్టు చెబుతున్న శ్రావణి అనే స్వీపరు..ఆకస్మికంగా విశాఖపట్నం వెళ్లారని చెప్పడం అనుమానాలకు తావిస్తోంది.

### అసలేం జరిగింది?

పోలవరం ప్రాజెక్టు భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలు అమలుచేసే కార్యాలయం ధవళేశ్వరంలో ఉంది. ఇక్కడ ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌గా ఐఏఎస్ అధికారి, భూసేకరణ స్పెషల్ కలెక్టర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ప్రధాన కాలువ భూసేకరణ విభాగం) ఉన్నారు. పోలవరం నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి మీదుగా విశాఖపట్నానికి నీటిని తీసుకెళ్లడానికి పోలవరం ప్రాజెక్టు నుంచి 212 కిలోమీటర్ల మేర ఎడమ ప్రధాన కాలువను నిర్మిస్తున్నారు. ఇందులో చాలా వరకూ భూసేకరణ జరిగింది. దానికి సంబంధించిన ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలుకు సంబంధించిన ఫైళ్లు, ఎవరి భూమిని ఎంతకు, ఎపుడు సేకరించామనే ఫైళ్లు కూడా ఇక్కడ ఉన్నాయి. గతంలో స్పెషల్ కలెక్టర్‌గా పనిచేసిన వి.మురళి దేవీపట్నం తదితర ప్రాంతాల్లో లబ్ధిదార్లకు దక్కకుండా రూ.19 కోట్లు కాజేశారు. ఆ తర్వాత 22మంది నకిలీ రైతులను సృష్టించి రూ.6 కోట్లు కాజేసిన గొడవలు, కేసులు కూడా ఉన్నాయి. రూ.6 కోట్ల కేసు కోర్టులో నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఏమైనా ప్రణాళిక ప్రకారమే నిప్పుపెట్టారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, ధవళేశ్వరంలోని భూసేకరణ కార్యాలయంలో ప్రస్తుతం ప్రాజెక్టు పరిపాలనాధికారిగా ఉన్న ఐఏఎస్ అధికారి ఇలాక్కియా కొద్దివారాల క్రితమే బాధ్యతలు తీసుకున్నారు. ఇటీవల ఆమె ఆరునెలల మెటర్నిటీ లీవ్ మీద వెళ్లారు. భూసేకరణ స్పెషల్ కలెక్టర్ ఎస్.సరళాదేవి కూడా ప్రస్తుతం సెలవులో ఉన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.మమ్మి కూడా రెండురోజుల పాటు సెలవు పెట్టారు. ఈలోపు ఆఫీసు ఇన్‌చార్జిగా స్పెషల్ కలెక్టర్ పీఏ వేదవల్లిని నియమించారు. ఆఫీసు సూపరింటెండెంట్‌గా కుమారి అనే ఉద్యోగిని ఉన్నారు. ఇక్కడ పనిచేసే శ్రావణి అనే స్వీపర్ శుక్రవారం రాత్రి బీరువా సర్ది, శుభ్రం చేసి, పలు ఫైళ్లను, పత్రాలను బయట పడేసినట్టు చెబుతున్నారు. ఆమె వాటిని దహనం చేసినట్టు ఒకసారి, సిబ్బందే తగలబెట్టారని మరోసారి చెబుతున్నారు. సమాచారం బయటకు పొక్కేసరికే ఫైళ్ల చాలావరకు పూర్తిగా దహనమై, బూడిదగా మారాయి.

### గోరంట్ల చొరవతో...

పోలవరం ఫైళ్ల దహనంపై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి...జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్‌కు దీనిపై సమాచారం ఇచ్చారు. తాను స్వయంగా కార్యాలయానికి వెళ్లి కాగిన ఫైళ్లను పరిశీలించారు. అధికారులను గట్టిగా నిలదీశారు. కాగా, కలెక్టరు, ఎస్పీ ఆదేశాలతో ఆర్డీవో లక్ష్మీ శివజ్యోతి, డీఎస్పీ భవ్యకిశోర్ ఘటనాస్థలికి చేరుకుని విచారించారు. రికార్డులు దహనం లేదని, జిరాక్స్‌లు, వేస్ట్ పత్రాలు మాత్రమే తగలబెట్టారని మీడియాకు తెలిపారు .అయితే, ఏ కాగితమైనా అధికారుల అనుమతి లేకుండా దహనం చేయరాదని, అందువల్ల బాధ్యులపై చర్య తీసుకుంటామని తెలిపారు. కాగా, పోలవరం ఫైళ్ల దహనం వెనుక అనేక అనుమానాలున్నాయని గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. "గత ప్రభుత్వంలో ఇరిగేషన్, ఇతర భూముల కుంభకోణాలు జరిగాయి. అసలెన్ని భూములు ఉన్నాయో, ఎక్కడ ఉన్నాయో సర్వే చేయాలని ఇటీవలే ఆదేశించాం. ఇంతలో ఇది జరిగింది. దీన్ని సీరియస్‌గా తీసుకుని సమగ్ర విచారణ జరపాలి" అని గోరంట్ల కోరారు.

# 'స్టాప్‌లాగ్' సక్సెస్

(మొదటి పేజీ తరువాయి)


స్టాప్‌లాక్ ఎలిమెంట్స్‌ను దించే సమయంలో కార్మికుడు


స్టాప్‌లాగ్ ఏర్పాటు అనంతరం తుంగభద్ర డ్యామ్. ఎలిమెంట్ల గ్యాప్‌ల నుంచి 50 క్యూసెక్కుల నీరు మాత్రం పోతోంది. దీనినీ ఆపుతామని ఇంజనీర్లు తెలిపారు.

ఉత్కంఠ నడుమ... స్టాప్‌లాగ్ తొలి ఎలిమెంట్‌ను డ్యామ్ స్పిల్‌వే బెడ్ మీద కూర్చోబెట్టిన సంగతి తెలిసిందే. శనివారం ఉదయం నుంచి మిగిలిన ఎలిమెంట్‌లను అమర్చే ప్రక్రియ మొదలుపెట్టారు. తొలి బ్లాక్ అమరికలో ఎదురైన అవాంతరాలను దృష్టిలో ఉంచుకుని రెండో ఎలిమెంట్ విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. నీళ్లలో 1617 అడుగుల వరకు ఉన్న ఫస్ట్ ఎలిమెంట్‌పై రెండో ఎలిమెంట్‌ను జాగ్రత్తగా కూర్చోబెట్టారు. దీని ప్రయాణం ఏడు అడుగులు నీళ్లలో సాగింది. ఈ మొత్తం ప్రక్రియకు మూడు గంటల సమయం పట్టింది. మధ్యాహ్నం 12 గంటలకు 3వ ఎలిమెంట్‌ను 19వ క్రస్ట్‌గేట్ వద్దకు తరలించి, నీటిలో దించడం ప్రారంభించారు. అప్పటికి నీటి ప్రవాహ ఒత్తిడి తగ్గిపోవడంతో దీనిని కొంత సులువుగానే అమర్చారు. సాయంత్రం మూడు గంటల సమయానికి మూడో ఎలిమెంట్ అమరిక పూర్తయింది. దీంతో క్రస్ట్‌గేట్ వద్ద నీటి నిల్వ సామర్థ్యం 1625 అడుగులకు పెరిగింది. నీటి నిల్వలు అంతకంటే దిగువనే ఉండటంతో 19వ క్రస్ట్ గేట్ గ్యాప్ నుంచి దిగువకు నీటి ప్రవాహం ఆగిపోయింది. మధ్యాహ్న భోజన విరామం తర్వాత నాలుగు, ఐదు ఎలిమెంట్లను రెండు గంటల వ్యవధిలో అమర్చారు. నాలుగో ఎలిమెంట్ అమర్చగానే డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 1629 అడుగులకు చేరింది. ఆ వెంటనే 32 క్రస్ట్‌గేట్లను దించేసి.. నదిలోకి వెళుతున్న 65 వేల క్యూసెక్కుల ప్రవాహాన్ని నిలిపి వేశారు. 5 స్టాప్‌లాగ్ ఎలిమెంట్ అమరిక ప్రక్రియ శనివారం సాయంత్రం 6.30 గంటలకు పూర్తయ్యింది. స్టాప్‌లాగ్ ఎలిమెంట్‌లను అమర్చేందుకు తొలగించిన కౌంటర్ వెయిట్, హాయిస్ట్ ప్లాట్‌ఫాంను ఆదివారం ఉదయం యథాస్థానానికి చేరుస్తామని అధికారులు తెలిపారు. స్టాప్‌లాగ్‌ను ఐదు భాగాలుగా అమర్చడంతో... జాయింట్‌ల వద్ద 50 క్యూసెక్కుల నీరు లీక్ అవుతోంది. దీనిని కూడా ఆదివారం పూర్తిగా కట్టడి చేసి, లీకేజీ లేకుండా చేస్తామని తెలిపారు.

### వారంలో మళ్లీ ఫుల్...

తుంగభద్ర జలాశయంలోకి శనివారం రాత్రికి ఎగువనుంచి 84వేల క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. డ్యామ్‌లో నీటినిల్వ 72 టీఎంసీలు దాటాయి. వారం రోజుల్లో జలాశయం నీటి నిల్వలు 105.78 టీఎంసీలకు చేరుకునే అవకాశం ఉందని అధికారులు అంచనావేశారు.

### సత్కరించిన టీబీ బోర్డు

నీటి పరిరక్షణ కోసం శ్రమించిన నిపుణులు కన్నయ్య నాయుడు, ఇంజనీరింగ్ అధికారులు, స్టాప్ లాగ్‌లను తయారు చేసిన జిందాల్, హిందూస్థాన్, నారాయణ ఇంజనీరింగ్ వర్క్ నిపుణులు, కార్మికులు, క్రేన్ ఆపరేటర్లు, డ్యాం వద్ద శ్రమించిన కార్మికులు.. మొత్తంగా ఈ ప్రక్రియలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ తుంగభద్ర బోర్డు అధికారులు సత్కరించారు.

### రియల్ హీరో కన్నయ్య

తుంగభద్ర జలాశయంలో కొట్టుకుపోయిన గేటు స్థానంలో వరద ప్రవాహ ఒత్తిడిలోనే స్టాప్‌లాగ్ ఎలిమెంట్లను విజయవంతంగా అమర్చడంలో కీలకపాత్ర పోషించిన ఎన్.కన్నయ్య నాయుడు రియల్ హీరో అంటూ ఇంజనీర్లు పొగడ్తలతో ముంచెత్తారు. చిత్తూరు జిల్లాకు చెందిన కన్నయ్య నాయుడు మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి చెన్నైలోని ఓ కంపెనీలో ఉద్యోగంలో చేరారు. ఆ తర్వాత భారత్ యంత్ర నిగమ్ లిమిటెడ్ సంస్థలో ఇంజనీర్‌గా చేరారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో క్రేన్ తయారీలో ప్రతిభ చూపారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో 260 పైగా ప్రాజెక్టులకు క్రస్ట్ గేట్లను డిజైన్ చేసి అమర్చిన అనుభవం ఆయన సొంతం. 80 ఏళ్ల వయస్సులో మండుటెండను సైతం లెక్క చేయకుండా... స్టాప్‌లాగ్ ఎలిమెంట్లను అమర్చడంలో ఆయన కీలక పాత్ర పోషించారు.

### రైతుల కోసమే ఆరాటం!

- నీటిని కాపాడాలని ఇద్దరు సీఎంలు కోరారు: కన్నయ్య నాయుడు

రాయదుర్గం, ఆగస్టు 17: తుంగభద్ర జలాశయంలో స్టాప్‌లాగ్ ఏర్పాటు విజయవంతంపై క్రస్టుగేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు హర్షం వ్యక్తం చేశారు. స్టాప్‌లాగ్ ఏర్పాటుకు రూపొందించిన 'ప్లాన్-ఏ'ను మూడంచెల్లో అమలు చేశామన్నారు. శనివారం ఈ ప్రక్రియ పూర్తయిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే... క్రస్ట్‌గేట్ కొట్టుకుపోయాక జలాశయంలో నీరు కాపాడాలని కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు కోరాయి. కర్ణాటక సీఎం సిద్దరామయ్య తనను కలిసి ఖరీఫ్ రైతులను కాపాడాలని కోరారు. సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకుని మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్‌ను పంపి పనులను వేగవంతం చేశారు. దీంతో మూడు సూత్రాల పద్ధతిని అమలు చేశాం. కొట్టుకుపోయిన క్రస్ట్‌గేట్ పరిస్థితిని పూర్తిగా అధ్యయనం చేయడం, దాని స్థానంలో స్టాప్‌లాగ్‌ను ఐదు భాగాలుగా విడగొట్టి గేట్లను తయారుచేయడం, గేట్లను అమర్చడం! ఇలా మూడు దశల్లో పని పూర్తి చేశాం. 60 అడుగులు ఉండాల్సిన స్టాప్‌లాగ్ తొలి ఎలిమెంట్... రెండు అంగుళాలు ఎక్కువ కావడంతో ఎంత ప్రయత్నించినా కూర్చోలేదు. దీంతో ఆ రోజు పూర్తి నిస్పృహకు లోనయ్యాను. కేంద్రం అనుమతితో హాయిస్ట్ ప్లాట్‌ఫాంను తొలగించడం, కౌంటర్ వెయిట్‌ను దించడం, చైన్‌లాగ్‌ను తొలగించడం లాంటివి చకచకా చేశాం. నీరంతా వృథాగా పోయి ఉంటే డ్యామ్‌లో 40 టీఎంసీలు మాత్రమే మిగిలేవి. ఖరీఫ్‌కు కనీసం 90 టీఎంసీలు అవసరమని చెప్పారు. దీంతో... స్టాప్‌లాగ్ ఏర్పాటును సీరియస్‌గా తీసుకున్నాం. జలాశయంలో 105 టీఎంసీల నిల్వ సామర్థ్యాన్ని పునరుద్ధరించగలిగాం. ఇలాంటి ఉపద్రవాలు పునరావృతం కాకుండా సమగ్ర నివేదికను బోర్డుకు సమర్పిస్తాను

## భారీగా పోలవరం నిధులు దారి మళ్లింపు

- కేంద్రం 8,382 కోట్లు రీయింబర్స్ చేసింది
- నాడు వైసీపీ ఖర్చుచేసింది రూ.4,167 కోట్లే
- మిగతా నిధులేమయ్యాయో జగన్ చెప్పాలి?
- పోలవరం ఫైళ్లు తగలబెట్టినవారిని వదలబోం
- మంత్రి నిమ్మల రామానాయుడు హెచ్చరిక

న్యూఢిల్లీ, హైదరాబాద్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం ఐదేళ్లలో రూ.4,167 కోట్లు ఖర్చు చేయగా, కేంద్రం నుంచి రీయింబర్స్‌మెంటు రూపంలో రూ.8,382 కోట్లు వచ్చాయని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మిగతా రూ.కోట్ల నిధులు ఎక్కడికి మళ్లించారో నాడు సీఎంగా ఉన్న జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పోలవరం ఫైళ్ల దహనం ఘటనలో ఎంత పెద్దవారున్నా వదలబోమని హెచ్చరించారు. శనివారం ఏపీభవన్‌లో నిమ్మల మీడియాతో మాట్లాడారు. "గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో కేంద్రం నిధుల కోసం ఎదురుచూడకుండా పోలవరం కోసం ఐదేళ్లలో రూ.11,762కోట్లు వెచ్చించాం. ఆ తర్వాత కేంద్రం నుంచి రూ. 6,764కోట్లు మాత్రమే వచ్చాయి. ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రతిక్షణం అమూల్యమని భావించి రూ.4,908కోట్లు రాష్ట్ర ఖజానా నుంచి ఖర్చుచేశాం. కానీ, జగన్ హయాంలో కేంద్రం అందించిన నిధులను కూడా దారి మళ్లించారు. వీరికి టీడీపీ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు ఉందా? డయాఫ్రం వాల్‌కు సంబంధించి నిపుణులు తుది నివేదిక ఇవ్వకముందే ప్రజలను తప్పుదారి పట్టించేందుకు జగన్ అవినీతి కరపత్రిక అబద్ధాలను ప్రచారం చేస్తోంది. 2019లో ఇదే తరహా అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన వైసీపీకి ప్రజలు 11సీట్లతో తగిన గుణపాఠం చెప్పారు. తీరు మార్చుకోకపోతే వచ్చే ఎన్నికలలో సింగిల్ డిజిట్‌కే వైసీపీ పరిమితమవుతుంది" అని మంత్రి హెచ్చరించారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును గోదావరిలో ముంచిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. "పోలవరాన్ని ముంచినోళ్లే సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారు. 2020 ఆగస్టులో వచ్చిన 23లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహానికి డయాఫ్రం వాల్ దెబ్బతిన్నదని ఐఐటీ హైదరాబాద్ నిపుణులు రిపోర్టు ఇచ్చిన మాట వాస్తవమా కాదా? ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలలో మిగిలిన 20-30శాతం పనులు పూర్తి చేయకపోవడం వల్లనే డయాఫ్రం వాల్ దెబ్బతిన్నదని ఐఐటీ హైదరాబాద్ నిపుణులు రిపోర్టు ఇచ్చిన మాట వాస్తవం కాదా? కమిటీ తుది రిపోర్టును కాకుండా, ముసాయిదా నివేదికను ఎడిట్ చేసి విడుదల చేయడం ద్వారా జగన్ తన ఫేక్ స్వభావాన్ని బయటపెట్టుకున్నారు" అని మంత్రి మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. "పోలవరం ప్రాజెక్టు పూర్తవ్వడానికి నాలుగు సీజన్‌లు పడుతుందని అధికారులు చెబుతున్నారు. ఆలోపే పనులు పూర్తి చేయాలని చిత్తశుద్ధితో ఉన్నాం. ఈ ఐదేళ్లలో పోలవరం పూర్తి చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది" అని మంత్రి వివరించారు. జగన్ హయాంలో జరిగిన పాపాలను తెరమరుగు చేసే ప్రయత్నాలకు వైసీపీ పాల్పడుతోందని విమర్శించారు. "సచివాలయం, ఇతర కార్యాలయాల్లో ఉన్న ఫైళ్లకు భద్రత లేదు. పుంగనూరు ఆర్డీవో కార్యాలయంలో ఫైల్స్ తగులబెట్టారు. గతంలో టీడీపీ ప్రభుత్వ ఐదేళ్ల మొత్తం బడ్జెట్ రూ.7లక్షల కోట్లు ఉంటే, అందులో రూ.72వేల కోట్లు సాగునీటి రంగానికి కేటాయించింది. వైసీపీ ఐదేళ్లలో రూ.12లక్షల కోట్ల బడ్జెట్‌లో రూ.32వేల కోట్లే కేటాయించింది. అందులో 50శాతం మేర నిధుల విషయంలో అవినీతికి పాల్పడ్డారు. ఆ అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు ఫైళ్లను కాల్చేస్తున్నారు. ఈ ఘటనలపై ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులను కఠినంగా శిక్షిస్తుంది" అని మంత్రి హెచ్చరించారు.




డయాఫ్రమ్‌వాల్ 2020లో దెబ్బతిన్నట్లు ఈ ఏడాది ఫిబ్రవరిలో కేంద్ర జల సంఘానికి కేంద్ర జల శక్తి శాఖ రాసిన లేఖ.

# నిజాలు 'ధమాల్'

- డయాఫ్రమ్ వాల్‌పై రోతపత్రిక రాతలు
- నిపుణుల బృందం నివేదిక వక్రీకరణ

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'రివర్స్' పేరుతో పోలవరం ఉసురు తీసింది జగన్ సర్కారే! మూడు నాలుగు వరద సీజన్లను అలా వదిలేయడంతో డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్నది ఆయన హయాంలోనే! కానీ... జగన్ రోత పత్రిక మాత్రం వంకర రాతలతో ఈ పాపాన్ని అంతకు ముందున్న టీడీపీ సర్కారుపైకి నెట్టేయడానికి ప్రయత్నించింది. 'అంతర్జాతీయ నిపుణుల నివేదిక'లోని అంశాలను వక్రీకరిస్తూ... వాల్ ధమాల్ అంటూ నిజాలను గోదావరి వరదలో కలిపేసింది. డయాఫ్రమ్‌వాల్ 2020లో దెబ్బతిన్నట్లు కేంద్రం ఎప్పుడో గుర్తించింది. అంటే... ఈ ఘోరం జరిగింది జగన్ హయాంలోనే! ఇది వాస్తవం. కానీ... 2018లోనే ఈ నష్టం జరిగినట్లుగా అంతర్జాతీయ నిపుణులు నివేదిక ఇచ్చారంటూ జగన్ పత్రిక ఓ తప్పుడు కథనాన్ని ప్రచురించింది. నిపుణుల నివేదికలోని అంశాలకు తన సొంత భాష్యాన్ని జోడించి వక్రీకరించింది. 2018, 2022 మధ్య కాలంలో వరద వెళ్లేందుకు ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్య ఖాళీలను వదిలారని ప్యానెల్ నివేదిక వెల్లడించింది. ఇందులో 2018 వరదలకు డయాఫ్రమ్‌వాల్ దెబ్బతిన్నదని నిపుణుల బృందం ఎక్కడా చెప్పలేదు. వరద వెళ్లేందుకు రెండు మార్గాలను వదిలేసినట్లుగా మాత్రమే నిపుణుల ప్యానెల్ పేర్కొంది. వరద ప్రభావంతో.. కాఫర్‌డ్యామ్ గ్యాప్‌ల వద్ద గుంతలు ఏర్పడ్డాయని వెల్లడించింది. అంతే తప్ప.. 2018లోనే డయాఫ్రమ్‌వాల్ దెబ్బతిన్నట్లుగా ప్యానెల్ నివేదికలో చెప్పలేదు. పోలవరం ప్రాజెక్టులోని ఎదురైన సాంకేతిక లోపాలను అధ్యయనం చేసి ముందుకు వెళ్లడంపైనే నిపుణుల బృందం దృష్టి సారించింది. కొత్త డయాఫ్రమ్‌వాల్ నిర్మాణాన్ని చేపట్టాలని తాము నిర్ణయం తీసుకున్నామని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ ఓరా వర్చువల్ మీటింగ్ ద్వారా నిపుణుల ప్యానెల్‌కు స్పష్టం చేశారు. అందువల్ల.. డయాఫ్రమ్ పటిష్టత, బలహీనతల జోలికి వెళ్లకుండా సీడబ్ల్యూసీ నిర్ణయం మేరకు కొత్త డయాఫ్రమ్‌వాల్‌ను నిర్మించుకోవచ్చునని ప్యానెల్ సూచించింది.

### మరి జగన్ ఏం చేసినట్లు?

రోత పత్రిక రాసినట్లుగా 2018లోనే డయాఫ్రమ్‌వాల్ దెబ్బతిని ఉంటే.. 2019 మే 30వ తేదీన అధికారపగ్గాలను చేపట్టిన జగన్ ఏం చేసినట్లు? ఐదేళ్లపాటు ఎందుకు ఉపేక్షించారు? జగన్ అధికారంలోకి రాగానే... 'రివర్స్ టెండర్ల' పేరుతో పోలవరంపై పగబట్టారు. అప్పటిదాకా పరుగులు తీసిన పనులు జగన్ రాకతో పడకేశాయి. 2019, 2020 సీజన్లలోనూ వరద కాఫర్ డ్యామ్ మీదుగానే వెళ్లింది. అంతకుముందు వేగంతోనే పనులు జరిగి ఉంటే.. ఈ పరిస్థితి వచ్చేది కాదు. 2019 ఆగస్టులో పోలవరం హెడ్‌వర్క్స్ కోసం జగన్ రివర్స్ టెండర్‌కు వెళ్లారు. అప్పటికే డయాఫ్రమ్‌వాల్ దెబ్బతిని ఉంటే.. టెండర్‌లో ఈ పనులను ఎందుకు చేర్చలేదన్నది మరో ప్రశ్న! 2019 నుంచి జల వనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్‌గా సి.నారాయణరెడ్డి, పోలవరం చీఫ్ ఇంజనీరుగా సుధాకరబాబు వ్యవహరించారు. మరి వారెందుకు వాస్తవాలను దాచారని నిపుణులు ప్రశ్నిస్తున్నారు.

### స్పష్టంగా చెప్పిన కేంద్రం...

జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలనే.. 2020లో డయాఫ్రమ్‌వాల్ దెబ్బతిన్నదంటూ రాష్ట్ర జల వనరుల శాఖకు కేంద్ర జలశక్తి శాఖ స్పష్టం చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 22వ తేదీన కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ సీడబ్ల్యూసీకి రాసిన లేఖలో ఈ విషయం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వమే పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు చేస్తున్నందున.. కొత్త డయాఫ్రమ్‌వాల్ నిర్మాణంపై దృష్టి సారించాలని సూచించింది. కేంద్ర జలశక్తి శాఖ ఈ లేఖ రాసేనాటికి జగనే ముఖ్యమంత్రిగా ఉన్నారు. వాస్తవం ఇలా ఉంటే.. అంతర్జాతీయ నిపుణుల ప్యానెల్ చంద్రబాబు హయాలోనే గోడ దెబ్బతిన్నదంటూ జగన్ పత్రిక వక్రీకరణ కథనాలు రాసి.. జనాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసింది.

## బావర్‌కే డయాఫ్రమ్‌వాల్ బాధ్యతలు

- కేంద్రాన్ని కోరిన రాష్ట్ర ప్రభుత్వం

అమరావతి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో అత్యంత సంక్లిష్టమైన డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ పనులను జర్మనీకి చెందిన బావర్‌కే అప్పగించాలన్న ప్రతిపాదనను కేంద్రం ముందు రాష్ట్ర ప్రభుత్వం ఉంచింది. మెయిన్‌డ్యామ్ పనుల్లో అంతర్భాగమైన డయాఫ్రమ్‌వాల్, ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనులు చేపడితే, ప్రాజెక్టు పూర్తయినట్లేనని ప్రభుత్వం స్పష్టంచేస్తోంది. ఢిల్లీలో శుక్రవారం కేంద్ర జలశక్తి కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీతో జరిగిన సమావేశంలో జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దీనిపై మాట్లాడారు. ప్రధాన డ్యామ్ పనులు మేఘా ఇంజనీరింగ్ సంస్థకు కేటాయించినా, డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ బాధ్యతలను మాత్రం బావర్ సంస్థకు అప్పగించాలని కోరారు. గతంలో, ఎల్ అండ్ టీ, బావర్ సంస్థలు సంయుక్తంగా డయాఫ్రమ్‌వాల్ నిర్మాణాన్ని రూ.460కోట్లతో 2018లో పూర్తిచేశాయి. 2019లో 14లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా డయాఫ్రమ్‌వాల్ తట్టుకుంది. 2020లో 23 లక్షల క్యూసెక్కుల వరద రావడంతో .. ఎగువ,దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్య భారీ గోతులు ఏర్పడ్డాయి. డయాఫ్రమ్‌వాల్ వద్ద సుడుల కారణంగా డ్యామ్ కొంతమేర దెబ్బతింది. డయాఫ్రమ్‌వాల్‌కు మరమ్మతులు చేపట్టవచ్చునని అంతర్జాతీయ నిపుణుల కమిటీ అభిప్రాయం వ్యక్తంచేసింది. అయితే.. భవిష్యత్తులో ఎలాంటి సందేహాలకూ తావివ్వకుండా ఉండేందుకు కొత్త డయాఫ్రమ్‌వాల్‌ను నిర్మించడమే మేలనే నిర్ణయానికి కేంద్ర జల సంఘం వచ్చింది. కేంద్ర జల సంఘం అభిప్రాయంతో అంతర్జాతీయ నిపుణుల కమిటీ కూడా ఏకీభవించింది. రాష్ట్ర ప్రభుత్వమూ ఇందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ బాధ్యతలను బావర్‌కు అప్పగించాలని కోరామని మంత్రి నిమ్మల రామానాయుడు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

# కరువు తీరేలా జలాలు

- నిండు కుండల్లా ప్రధాన జలాశయాలు

అమరావతి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): గడచిన రెండేళ్ల కరువుతో అల్లాడిపోయిన రాష్ట్రానికి ఊరట లభించింది. నదులు, ప్రాజెక్టుల్లో కరువు తీరేలా జలాలు పరవళ్లు తొక్కుతున్నాయి. జలాశయాల్లో రెట్టింపు నిల్వలున్నాయి. నాగార్జునసాగర్ గరిష్ఠ నీటినిల్వ 312.05 టీఎంసీలకుగాను దాదాపు 312.04 టీఎంసీల నిల్వఉంది. ఇది రికార్డే. కృష్ణా నదీ జలాలు ఈ ఏడాది రైతుకు గొప్ప ఊరటని ఇస్తున్నాయి. చంద్రబాబు అధికారంలోకి వస్తే కరువు వస్తుందంటూ జగన్‌తో పాటు .. ఆయన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గతంలో ఊదరగొట్టారు. గత జగన్ ప్రభుత్వంలో చివరి రెండేళ్లూ రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అయినా.. కరువు మండలాలను తొలుత ఆయన ప్రకటించలేదు. చివరి ఎన్నికల ఏడాది మొదట్లో తూతూమంత్రంగా అక్కడక్కడ కొన్నింటిని ప్రకటించారు. తన పాలనలో కరువు ఉండదని రాజకీయ ప్రకటనలు చేసుకునేందుకు జగన్ తాపత్రాయపడ్డారు. ఆ అవసరం కొత్త ప్రభుత్వానికి లేకుండా.. జలాశయాలు నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయి. ప్రాజెక్టు సామర్థ్యానికి దాదాపు సరిసమానంగా రికార్డుస్థాయిలో నిల్వలు ఉండటం అపురూపమేనని జలవనరుల శాఖ ఇంజనీర్లు కూడా అంగీకరిస్తున్నారు. మేజర్ రిజర్వాయర్లలో గరిష్ఠస్థాయిలో 865.64 టీఎంసీలకుగాను 641.13 టీఎంసీల నిల్వ కనిపిస్తోంది. మీడియం ప్రాజెక్టుల్లో 115.09 టీఎంసీల గరిష్ఠ నిల్వకు గాను 51.72 టీఎంసీల జలం అందుబాటులో ఉంది. ఇతర నీటి వనరుల్లో 1.62 టీఎంసీలకుగాను ..0.16టీఎంసీలున్నాయి. మొత్తంగా 983.49 టీఎంసీలకుగాను 693.02టీఎంసీలు అందుబాటులో ఉన్నాయి.

### నదుల వారీగా...

గోదావరి జలాలు 5.8టీఎంసీలకుగాను శనివారం నాటికి 4.59 టీఎంసీలు ఉన్నాయి. కృష్ణాలో గరిష్ఠంగా 589.67 టీఎంసీలకుగాను దాదాపు 559.67 టీఎంసీల నిల్వ ఉంది. పెన్నాలో 239.59 టీఎంసీలకుగాను 77.57 టీఎంసీల నిల్వలు కనిపిస్తున్నాయి. ఇతర నదుల్లో 148.33 టీఎంసీలకు గాను శనివారం నాటికి 51.18 టీఎంసీల నిల్వ ఉంది.

### జలాశయాల వారీగా..

శ్రీశైలం డ్యాంలో 215టీఎంసీలకుగాను శనివారం నాటికి 195.21 టీఎంసీల నిల్వఉంది. ఎగువ నుంచి 86,517 క్యూసెక్కులు వస్తుండగా, దిగువన సాగర్‌కు 1,00,972 క్యూసెక్కులు వదులుతున్నారు. సాగర్‌కు చేరుతున్న వరద 63,369 క్యూసెక్కులను బయటకు వదిలేస్తున్నారు. పులిచింతల ప్రాజెక్టు గరిష్ఠ నీటినిల్వ 45.77టీఎంసీలకుగాను 44..69 టీఎంసీల నిల్వ ఉంది. ప్రకాశం బ్యారేజీ గరిష్ఠ నిల్వ 3.07 టీఎంసీలకుగాను పూర్తి నీటినిల్వలు ఉన్నాయి. ఈ బ్యారేజీలోకి 32,305క్యూసెక్కులు వస్తుంటే.. 32,226 క్యూసెక్కులను కిందకు వదులుతున్నారు. తుంగభద్ర నుంచి సుంకేశుల బ్యారేజీకి 62,820క్యూసెక్కులు వస్తుంటే.. 62799 క్యూసెక్కులు వదిలేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద గోదావరినదిపై నిర్మించిన సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ గరిష్ఠ నీటి నిల్వ 2.93 టీఎంసీలు పూర్తిగా నిండిపోయాయి. బ్యారేజీలోకి వస్తున్న 2,16,001 వరదను పూర్తిగా వదిలేస్తున్నారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

# కామాంధులను కఠినంగా శిక్షించాలి

● ప్రభుత్వాసుపత్రి జూడాల ఆందోళన

**ప్రభుత్వాసుపత్రి, ఆగస్టు 17:** కోల్‌కత్తాలోని వైద్య కళాశాలలో శిక్షణ వైద్యురాలిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ నగరంలోని ప్రభుత్వాసుపత్రి జూడాలు శనివారం ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు చేతపట్టి నిందితులను కఠినంగా శిక్షించాలని నిరసన ప్రదర్శనలు చేపట్టారు. జూనియర్ డాక్టర్ల నిరసనలకు రాష్ట్ర మహిళా సమాఖ్య నగర కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి సాయికుమార్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోల్‌కత్తా మెడికో విద్యార్థిని హత్యాచార ఘటనపై పూర్తి విచారణ జరిపించి ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా కామాంధులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

**మహిళా సమాఖ్య, ఏఐఎస్ఎఫ్ నేతల మద్దతు**

**ధర్నాచౌక్:** మహిళలు, విద్యార్థినులపై నానాటికీ పెరుగుతున్న అత్యాచారాలు, హత్యల నేపథ్యంలో వారి భద్రతకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా సమాఖ్య నగర కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కోల్‌కత్తాలో వైద్య విద్యార్థిని అత్యంత దారుణంగా హింసించి అత్యాచారం చేసి హత్య చేయడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక దాసరిభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆమె మాట్లాడారు. కోల్‌కత్తా ఘటనలో కళాశాల ప్రిన్సిపల్, పోలీసులు వాస్తవాన్ని పక్కదారి పట్టించేలా మృతురాలు ఆత్మహత్య చేసుకుందని ఆమె తల్లిదండ్రులకు చెప్పడం దుర్మార్గమన్నారు. ప్రిన్సిపల్‌ను అదుపులోకి తీసుకుని విచారించాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్ మాట్లాడుతూ మహిళలకు ప్రత్యేక కేంద్ర రక్షణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కోల్‌కత్తా ఘటనపై ప్రధానీ మోదీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. వైద్యురాలి మృతికి తమ సంఘీభావం తెలిపారు. సమాఖ్య నాయకురాళ్లు దుర్గాసి రమణమ్మ, డి.సీతారావమ్మ, ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రంజిత్, ఎ.జగదీష్, ఉపాధ్యాక్షుడు అయ్యప్ప పాల్గొన్నారు.

**ఆయుర్వేద కళాశాల విద్యార్థుల నిరసన**

**గవర్నర్‌పేట:** కోల్‌కత్తా వైద్య విద్యార్థినిపై అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ ఎంజీ రోడ్డులోని నోరి రామశాస్త్రి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల వైద్య విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్లకార్డులు పట్టుకుని హత్యాచారానికి గురైన విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలని విద్యార్థులు నినాదాలు చేశారు. తన అనుమతి లేకుండా నిరసన చేపట్టడాన్ని తప్పుపట్టిన ప్రిన్సిపాల్ సాయి సుధాకర్ విద్యార్థులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసనను షూట్ చేస్తున్న మీడియాపైనా ప్రిన్సిపాల్ దురుసుగా ప్రవర్తించడంతో కొంత ఉద్రిక్తత ఏర్పడింది. ప్రిన్సిపాల్ వైఖరిని ఆందోళన చేస్తున్న విద్యార్థులు తప్పుపట్టారు. మెడికో అత్యాచార ఘటనపై నిరసన తెలియజేస్తే తప్పేముందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

**ఫార్మా డీలర్ల ర్యాలీ**

**వన్‌టౌన్:** కోల్‌కతాలో అత్యాచారం, హత్యకు గురైన మెడికల్ విద్యార్థిని కేసులో న్యాయం జరగాలని కోరుతూ నగరంలో కృష్ణాజిల్లా ఫార్మా డీలర్ల సంఘం ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. విద్యార్థిని కిరాతకంగా హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేస్తూ డీలర్లు ర్యాలీ నిర్వహించారు. వన్‌టౌన్‌లోని చల్లంరాజువారి వీధి, చిప్పాడవారి వీధి, కోటంరాజువారి వీధి, ఆర్ఆర్ అప్పారావు వీధుల గుండా సమ్మెట వారి వీధి వరకు ర్యాలీ నిర్వహించారు. మహిళలకు భద్రత కల్పించాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రత్యేక సెక్షన్లు పెడుతూ చట్టసభలలో చట్టం తేవాలని నిర్వాహకులు కోరారు. సంఘాధ్యక్షుడు ఎ.రవీంద్రనాథ్ రెడ్డి, కార్యదర్శి డీవీ నారాయణ, ట్రెజరర్ వీ చిరంజీవి, సభ్యులు, డీలర్లు పాల్గొన్నారు.

**డాక్టర్ మాధవి ఆధ్వర్యంలో నిరసన**

కోల్‌కతాలోని జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం చేసినవారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ వన్‌టౌన్‌లో అనురాగ్ పిల్లల హాస్పిటల్ నిర్వాహకురాలు డాక్టర్ మాజేటి మాధవి ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఆసుపత్రి వద్ద సిబ్బందితో పాటు ఆమె నిరసన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా అన్ని ఆసుపత్రుల్లోనూ వైద్య సేవలను నిలుపుదల చేసి నిరసన తెలపాలన్న ఐఎంఏ పిలుపు మేరకు ప్రదర్శన నిర్వహించామని మాధవి తెలిపారు. అత్యవసర సర్వీసులు తప్ప మిగతా అన్ని సేవలను బంద్‌చేసి నిరసన తెలిపినట్టు ఆమె పేర్కొన్నారు.



కోల్‌కతా వైద్యురాలికి న్యాయం జరగాలని కోరుతూ ఆందోళన చేస్తున్న ప్రభుత్వాసుపత్రి జూడాలు, రామశాస్త్రి ఆయుర్వేద విద్యార్థులు, ఫార్మా డీలర్ల సంఘం నేతలు

## నూతన క్రిమినల్ చట్టాలను ఉపసంహరించాలి

● ఇది న్యాయవ్యవస్థ అధికారాలను కుదిస్తూ.. పోలీసులకు అధికారాలను పెంచేలా ఉంది
● ఐలూ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్ ● 24న రాష్ట్రవ్యాప్త న్యాయవాదుల ధర్నా

**విజయవాడ లీగల్, ఆగస్టు 17:** కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన నూతన క్రిమినల్ చట్టాలు 90 శాతం పైగా పాత చట్టాలనే మక్కీకి మక్కీగా ఉంచి పేర్లు, సెక్షన్లు మార్చడం వల్ల వలసవాద చట్టాలను మార్చినట్టు కాదని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలూ) జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ సుంకర రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం గవర్నరుపేటలోని బాలోత్సవ భవన్‌లో ఏఐఎల్‌యూ, ఐఏఎల్, ఏపీసీఎల్ఏ, సీఎల్‌సీ, ఐఏపీఎల్, కాంగ్రెస్ లీగల్‌సెల్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సుంకర మాట్లాడుతూ నూతన చట్టాలలో వ్యవస్థీకృత నేరాలు, ఉపా యాక్ట్, టెర్రరిస్ట్ యాక్ట్, దేశద్రోహానికి సంబంధించిన సెక్షన్లలో పేర్కొన్న నిర్వచనాలతో.. సాధారణ ప్రజలపై కూడా తీవ్రమైన నేరాలను మోపి అరెస్టు చేసే అధికారం పోలీసులకిచ్చారని మండిపడ్డారు. ప్రజల కోసం పనిచేసే ప్రతి రాజకీయ పార్టీ, సంఘాలు ఈ చట్టాల వల్ల వ్యవస్థీకృత నేరాలు చేసే సిండికేట్లుగా మారిపోతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. హైకోర్టు న్యాయవాది వైకే మాట్లాడుతూ స్టేట్ టెర్రరిజాన్ని చట్టబద్ధం చేయడానికి ఈ మార్పులు తీసుకొచ్చారని, వీటి వల్ల పౌర హక్కులకు విఘాతం కలుగుతుందని పేర్కొన్నారు. బెజవాడ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అరిగెల శివరాంప్రసాద్ (రాజా) మాట్లాడుతూ, ఈ చట్టాల అమలు వల్ల పోలీసు రాజ్యం ఏర్పడుతుందని, భవిష్యత్తులో ఉద్యమాన్ని బెజవాడ బార్ బలపరుస్తుందని పేర్కొన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, సీపీఐ నాయకురాలు అక్కినేని వనజ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు, న్యాయవాది నరహరిశెట్టి నర్సింహారావు మాట్లాడుతూ ఈ చట్టాల అమలు ద్వారా పోలీసులు యథేచ్ఛగా ప్రజాపోరాటాల పైనా కార్మిక పోరాటాల పైన ఉక్కుపాదం మోపే అవకాశం ఉందని, ఈ ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయాల్సిన అవసరం వుందని చెప్పారు. భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ఈ నెల 24వ తేదీ విజయవాడ ధర్నా చౌక్‌లో రాష్ట్రవ్యాప్త న్యాయవాదుల ధర్నా నిర్వహించాలని ఈ సమావేశం తీర్మానించింది. కోల్‌కతాలో జరిగిన మెడికో హత్యాచారాన్ని సమావేశం ఖండించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ సమావేశానికి ఐలూ జనరల్ సెక్రటరీ నల్లూరి మాధవరావు అధ్యక్షత వహించగా ఐలూ జిల్లా అధ్యక్షుడు వేము కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సుంకర రాజేంద్రప్రసాద్, చిత్రంలో ఐలూ జనరల్ సెక్రటరీ నల్లూరి మాధవరావు

## అన్న క్యాంటీన్లను నిరంతరం పర్యవేక్షించాలి

● కమిషనర్ ధ్యానచంద్ర ● 11 క్యాంటీన్లకు 11 మంది నోడల్ అధికారులు, 11 మంది పరిశీలనాధికారులు

**చిట్టినగర్, ఆగస్టు 17:** ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్న క్యాంటీన్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన తన చాంబర్‌లో అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నగర పరిధిలోని 11 అన్న క్యాంటీన్లను నిరంతరం పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేసిన 11 మంది నోడల్ ఆఫీసర్లను, 11 మంది పరిశీలన ఆఫీసర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలన్నారు. అన్న క్యాంటీన్లలో ఎటువంటి ఇబ్బందులున్నా వెంటనే తెలియజేయాలన్నారు. సమస్యను తెలిపిన 15 నిమిషాల్లో శాఖాధిపతులు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి రోజు ఉదయం అధికారులు ఆహారంలో నాణ్యతను, అక్కడకు వచ్చేవారికి టోకెన్లు ఎలా అందజేస్తున్నారు అనే వాటిని పరిశీలించాలన్నారు. సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు.

**నోడల్ ఆఫీసర్లు వీరే..**

1. హెచ్‌బీ కాలనీ అన్న క్యాంటీన్ నోడల్ ఆఫీసర్‌గా డీఈఈ సతీష్‌కుమార్, పరిశీలనాధికారిగా వెల్ఫేర్ సెక్రటరీ రమ్యకృష్ణ
2. ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్డు అన్న క్యాంటీన్ నోడల్ ఆఫీసర్‌గా డీఈఈ సతీష్‌కుమార్, పరిశీలన అధికారిగా వెల్ఫేర్ సెక్రటరీ సురేష్
3. గాంధీజీ మహిళా కళాశాల అన్న క్యాంటీన్ నోడల్ అధికారిగా టౌన్ ప్లానింగ్ టీపీఎస్ జీ ప్రసాద్, పరిశీలన అధికారిగా వెల్ఫేర్ సెక్రటరీ అశోకరాణి
4. గాంధీనగర్ ధర్నాచౌక్ అన్న క్యాంటీన్ నోడల్ అధికారిగా అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామకోటేశ్వరరావు, పరిశీలనాధికారులుగా వెల్ఫేర్ సెక్రటరీలు రామకృష్ణ, పతంగి
5. బావాజీపేట అన్న క్యాంటీన్ నోడల్ అధికారిగా సర్కిల్-2 ఈఈ వీ.శ్రీనివాస్, పరిశీలనాధికారులుగా వెల్ఫేర్ సెక్రటరీలు షేక్ ఖాసింబీ
6. అయోధ్యనగర్ అన్న క్యాంటీన్ నోడల్ అధికారిగా అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఎం జగదీష్, పరిశీలనాధికారిగా వెల్ఫేర్ సెక్రటరీ రాంబాబు
7. సింగ్‌నగర్ అన్న క్యాంటీన్ నోడల్ అధికారిగా శానిటరీ సూపర్‌వైజర్ రమేష్‌బాబు, పరిశీలనాధికారిగా వెల్ఫేర్ సెక్రటరీ బాబు ప్రభాకరరావు
8. ఏపీఎస్ఆర్ఎంసీ హైస్కూల్ అన్న క్యాంటీన్ నోడల్ అధికారిగా సీడీవో ఉమామహేశ్వరి, పరిశీలనాధికారిగా వెల్ఫేర్ సెక్రటరీ వెంకటేశ్వర్లు
9. రాణిగారితోట అన్న క్యాంటీన్ నోడల్ అధికారిగా డిప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్, పరిశీలన అధికారిగా వెల్ఫేర్ సెక్రటరీ పద్మ
10. నేతాజి బ్రిడ్జి సాయిబాబా టెంపుల్ అన్న క్యాంటీన్ నోడల్ అధికారిగా డీఈఈ ప్రవీణ్ చంద్ర, పరిశీలన అధికారిగా వెల్ఫేర్ సెక్రటరీ జస్వంత్
11. పటమట హైస్కూల్ అన్న క్యాంటీన్ నోడల్ అధికారిగా శానిటరీ సూపర్‌వైజర్ సలీం ఆహ్మద్, పరిశీలనాధికారిగా వెల్ఫేర్ సెక్రటరీ రాగిణి.

నోడల్ అధికారులు, పరిశీలనాధికారులు ఎప్పటికప్పుడు ఆయా క్యాంటీన్లను పరిశీలిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కమిషనర్ ఆదేశించారు. క్యాంటీన్ల నివేదికను ఇవ్వాలన్నారు. ఎన్ని టోకెన్లు ఇస్తున్నారు. ఏ సమయానికి ఆహారం వస్తుంది.. మంచినీరు, మరుగుదొడ్ల నిర్వహణ వంటి మౌలిక సదుపాయాలెలా ఉన్నాయని పరిశీలిస్తూ నివేదికను అందించాలని ఆదేశించారు.

బాలికా సాధికారతకు స్కూల్ స్థాపించిన

## మహనీయుడు అజరయ్య: బొండా

**లబ్బీపేట, ఆగస్టు 17:** నగరంలో బాలిక సాధికారత కోసం 1927లో ఈ పాఠశాల స్థాపించిన మహనీయులు వేదనాయగం సామ్యూల్ అజరయ్య అని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. బిషప్ అజరయ్య పాఠశాల వ్యవస్థాపకులు బిషప్ వీఎస్ అజరయ్య 150వ జయంతిని పాఠశాల ఆవరణలో శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ అజరయ్య ఫైలాన్ ఆవిష్కరించిన ఉమ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని, ఈ పాఠశాలతో తనకు ఎంతో అవినాభావ సంబంధం ఉందని, పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. విద్యతో మాత్రమే సామాజిక ఆర్థిక, ఉన్నత స్థితులు ఏర్పడతాయని నాడే గ్రహించిన మేధావి అజరయ్య అని, రాష్ట్రంలో నగరంతో పాటు అనేకచోట్ల విద్యాసంస్థలు ఏర్పాటు చేసి ఎంతోమంది విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అందించిన వ్యక్తి బిషప్ అజరయ్య అని అన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు, ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. బొండా సుజాత, కృష్ణా గోదావరి అధ్యక్ష అఖండ కార్యదర్శి డా.టి.రవికుమార్, ఉప కార్యదర్శి డి.డి.సుధాకర్, కోశాధికారి అలెగ్జాండర్ ప్రాపర్టీ సెక్రటరీ టి.జె.సుధీర్ దత్తు, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు, కౌన్సిల్ మెంబర్లు పాల్గొన్నారు.



తాడిగడప మునిసిపాలిటీ

## సమస్యలను పరిష్కరించండి

● మంత్రి నారాయణను కోరిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్

**పెనమలూరు, ఆగస్టు 17:** మునిసిపాలిటీగా ఆవిర్భవించిన తర్వాత నిధుల లేమితో కనీస మౌలిక వసతులు లేక తాడిగడప ప్రజలు పడుతున్న ఇబ్బందులను స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. శనివారం భారతీనగర్‌లోని మంత్రి అతిథి గృహంలో ఆయన్ని కలిసిన ఎమ్మెల్యే పలు సమస్యలను నివేదించారు. కానూరు పరిధిలోని ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. మునిసిపాలిటీ పరిధిలోని డ్రైనేజీ వ్యవస్థ మరమ్మతులు, కొత్త డ్రైన్ల నిర్మాణాలకు రూ.4 కోట్ల నిధులకు పరిపాలనా అనుమతులు వేగవంతం చేయాలని కోరారు. తాడిగడప మునిసిపాలిటీగా మారినప్పటి నుంచి నీటి పన్నుల బైలా రిలీజ్ చేయకపోవడంతో కనీసం రూ.6కోట్ల పన్నులు వసూలు చేయలేకపోయారని, బైలా రిలీజ్ ప్రక్రియను వెంటనే చేయాలని కోరారు. మునిసిపాలిటీకి శానిటేషన్ సిబ్బంది కొరత కారణంగా పూర్తిస్థాయి పనులు సాగడంలేదనీ, శానిటేషన్ సిబ్బంది కోసం మునిసిపల్ భవనం నిర్మించుకోవడానికి ఎండోమెంటు భూమిని కేటాయించమని మంత్రి నారాయణ ద్వారా దేవదాయ శాఖ మంత్రిని అభ్యర్థించారు. తాడిగడప ప్రజల మనోభావాలను పట్టించుకోకుండా మునిసిపాలిటీకి వైఎస్సార్ తాడిగడప మునిసిపాలిటీగా నామకరణం చేయడంపై మంత్రితో చర్చించారు. ఎమ్మెల్యే బోడె వెంట నేతలు అనుమోలు ప్రభాకరరావు ఉన్నారు.



## అధికారులు తొలగిస్తే నాకేం సంబంధం?: కార్పొరేటర్ బాలస్వామి

**గవర్నర్‌పేట, ఆగస్టు 17:** హాకర్ల పేరుతో ఆక్రమించి అద్దెలకిస్తున్న కబ్జాదారుల షాపులను కార్పొరేషన్ అధికారులు తొలగిస్తే అందులో తన ప్రమేయమున్నట్టు సీపీఐటీయూ నేతలు ఆరోపించడాన్ని 23వ డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి తీవ్రంగా ఖండించారు. బీసెంట్ రోడ్డులో పబ్లిక్ టాయిలెట్స్‌కు అడ్డంగా ఏర్పాటు చేసిన హాకర్ల షాపులను తొలగించడంలో తనకెలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. శనివారం సూర్యారావుపేటలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ పబ్లిక్ టాయిలెట్స్‌లోకి మహిళలు వెళ్లకుండా అడ్డంగా షాపులు పెట్టి ఆటంకం కలిగిస్తుంటే అధికారులు వాటిని తొలగించడాన్ని తప్పు పడుతున్న సీఐటీయూ నేతలు ఎవరి ప్రయోజనాలు కాపాడుతున్నారో ప్రజలకు చెప్పాలన్నారు. 23వ డివిజన్ పరిధిలో ఏ పార్టీ నేతలు ఎన్ని షాపులు ఏర్పాటు చేయించి రోజువారీ వసూళ్లకు పాల్పడుతున్నదీ నిర్ధారించేందుకు కమిటీ ఏర్పాటుకు సిద్ధమని, సీఐటీయూ నేతలు సవాల్‌కు ముందుకు రావాలని కోరారు. తమ ప్రభుత్వం వచ్చాక వారి ఆటలు సాగవన్న ముందస్తు భయంతో తనపై బురదజల్లుతున్నారన్నారు.

పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు

## జర్నలిస్టులు కృషి చేయాలి

ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్

**ధర్నాచౌక్:** జర్నలిస్టులందరూ పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు ఐక్యంగా కృషి చేయాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధానకార్యదర్శి చందు జనార్ధన్ పిలుపునిచ్చారు. జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల సాధనలో దేశంలో తమ యూనియన్ రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. యూనియన్ 68వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రెస్‌క్లబ్ వద్ద యూనియన్ పతకాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం స్థానిక నిర్మల హృదయ భవన్‌లో వృద్ధులకు పళ్లు పంపిణీ చేశారు. నగర యూనిట్ అధ్యక్షుడు చావా రవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంచల జయరాజ్, నగర యూనిట్ కార్యదర్శి దారం వెంకటేశ్వరరావు, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి దాసరి నాగరాజు, సామ్నా రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్ రమణారెడ్డి, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు షేక్ బాబు, ఎస్.సాంబశివరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జి.రామారావు, సామ్నా నగరాధ్యక్షుడు ఎంవీ సుబ్బారావు, నేతలు టి.శివరామకృష్ణ, సి.శ్రీనివాసకుమార్, ఆకుల తిరుమలరావు, జి.రఘురామ్, సురేష్, దారం నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

## తల్లీ, కుమార్తె అదృశ్యం

**విద్యాధరపురం:** ఓవ్యక్తితో మాట్లాడవద్దని భర్త మందలించినందుకు వివాహిత, కుమార్తెను వెంట తీసుకుని అదృశ్యమైనట్టు శనివారం భవానీపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. భవానీపురం, బ్యాంక్ సెంటర్ కరకట్ట ప్రాంతంలో ఓ వ్యక్తి ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ భార్య, కుమారుడు, కుమార్తెతో నివాసం ఉంటున్నాడు. ఆటోడ్రైవర్ భార్య (29) అదేప్రాంతంలో ఉంటున్న కొమ్ము విజయ్‌కుమార్ అనే వ్యక్తితో తరచూ మాట్లాడుతుంది. దీంతో అతడు భార్య, విజయకుమార్‌ను మందలించాడు. అయినా ఆమె పట్టించుకోకుండా ఈనెల 14న మధ్యాహ్నం 3 గంటలకు భర్త ఇంటిలో లేని సమయంలో నాలుగేళ్ల కుమార్తెను తీసుకుని ఇంటిలో నుంచి వెళ్లిపోయింది. ఆరోజు సాయంత్రం వరకు ఆమె ఇంటికి రాకపోవటంతో బంధువులు, స్నేహితుల వద్ద వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కొమ్ము విజయ్‌కుమార్‌పై అనుమానం ఉన్నట్లు ఆటో డ్రైవర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

## వేధింపులు తట్టుకోలేక ఒకరి ఆత్మహత్య

**పెనమలూరు:** అప్పులిచ్చిన వారి వేధింపులు తట్టుకోలేక ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకొన్న ఘటన పెనమలూరులో జరిగింది. గ్రామానికి చెందిన సోమశేఖర వరప్రసాద్ అదే గ్రామానికి చెందిన దుర్గారావు, చీటీల భాస్కర్ అనే వ్యక్తుల వద్ద కొన్ని రోజుల క్రితం అప్పు తీసుకొన్నాడు. ఇటీవల అప్పులిచ్చిన వారు ఎక్కడబడితే అక్కడ అప్పు తీర్చమని అడగడం, ఇంటికొచ్చి బెదిరిస్తుండడంతో దిగులు చెంది కొన్నాళ్ల నుంచి బాధపడుతున్నాడు. శుక్రవారం సాయంత్రం అప్పులిచ్చిన వారు మళ్లీ వేధించడంతో ఇంట్లోని సీలింగ్ ఫ్యానుకు ఉరేసుకొని మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## ఔషధ పరిశోధనలో కొత్త మార్పులు

**మొగల్రాజపురం:** ఔషధ పరిశోధన మనిషి జీవన సరళిని బట్టి కొత్త కొత్త మార్పులు వస్తున్నాయని వాటిని అందిపుచ్చుకుని కొత్త ఆవిష్కరణలకు విద్యార్థులు తగిన అవగాహన పెంచుకోవల్సిన అవశ్యకత ఉందని కేంద్ర ఔషధ నియంత్రణ మండలి డిప్యూటీ డ్రగ్ కంట్రోలర్ డాక్టర్ ఏ రామకిషన్, డాక్టర్ ఎం.శ్రావణ్‌కుమార్ చెప్పారు. ఔషద పరిశోధనలో నూతన ఆవిష్కరణలపై విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మశీ కళాశాల ఫార్మకాగ్నసీ విభాగం జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయనతో పాటు ఐపీఏ ఎడ్యుకేషన్ ఛైర్మన్ ఎస్. విద్యాధర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అధ్యక్షత వహించిన సిద్ధార్థ అకాడమీ అధ్యక్షులు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ మనిషి మెరుగైన జీవన ప్రమాణాలకు ఔషధ రంగంలో నూతన పరిశోధనలు అవసరం అని చెప్పారు. పరిశోధనా రంగంలో నిపుణులైన డాక్టర్ డాక్టర్ జి.ఈశ్వర్ రిటైర్డ్ ప్రొఫెసర్ తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. పరిశోధన రంగంపై డిపార్టుమెంట్ వారీగా 75మంది విద్యార్థులు రూపొందించిన పోస్టర్లకు బహుమతులు అందించారు. కళాశాల కన్వీనర్ చుక్కపల్లి అరుణ్‌కుమార్, డాక్టర్ వి.కరుణ శ్రీ, వివిధ కళాశాలల నుంచి 375 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## వలవల మృతికి సంతాపం

**గవర్నర్‌పేట:** సీపీఎం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పూర్వ కార్యదర్శి వర్గ సభ్యుడు, రైతు సంఘం పూర్వ జిల్లా అధ్యక్షుడు వలవల శ్రీరామ్మూర్తి (90) మృతి పట్ల సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించారు. శుక్రవారం రాత్రి రాజమండ్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన శ్రీరామ్మూర్తి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రామ్మూర్తి మరణం తీరని లోటని, వృద్ధాప్యంలోనూ పార్టీ పట్ల అచంచల విశ్వాసంతో ఉన్నారని రామ్మూర్తి సేవల్ని గుర్తు చేశారు.

## రాజధాని ప్రాంత భూముల వివరాలివ్వండి

● స.హ.చట్టం కింద కోరిన అడ్వకేట్

**విజయవాడ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి):** రాజధాని అమరావతి పరిధిలోని 29 గ్రామాల పరిధిలోని భూముల సర్వే నెంబర్ల వివరాలు, విస్తీర్ణం ఇవ్వాల్సిందిగా న్యాయవాది ఎం రాజేశ్వరి దేవి సీఆర్డీయే అధికారులను కోరారు. సమాచార హక్కు చట్టం 2005, సెక్షన్ ఏ కింద సమాచారాన్ని ఇవ్వాల్సిందిగా ఆమె దరఖాస్తు చేశారు. రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లోని ప్రభుత్వ భూములు, కుంట లు, పుంతలు కాల్వలు, ఎవరివో తెలియని భూములు, భూసమీకరణకు ఇచ్చిన వివరాలు అందజేయాల్సిందిగా ఆమె దరఖాస్తులో పేర్కొన్నారు. న్యాయవాది సమాచార హక్కు చట్టం కింద పంపిన దరఖాస్తు అందినట్లు సీఆర్డీయే అధికారులు తెలిపారు. అడ్వకేట్ రాజేశ్వరి కోరిన సమాచారాన్ని సీఆర్డీయే అధికారులు ఇవ్వాల్సి ఉంది. అడ్వకేట్ రాజేశ్వరి లేఖ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

## అసలైన జూడో అసోసియేషన్ మాదే

జూడో జనరల్ బాడీ సమావేశంలో నిర్ణయం

**విజయవాడ స్పోర్ట్సు:** జూడో అసోసియేషన్ తమదేనని, గతంలో ఏపీ జూడో అధ్యక్షుడిగా పనిచేసిన ఆనం రామకిషోర్‌రెడ్డి, ఇతర సభ్యులు కేఎస్ బాబు, బీ శ్రీధర్, సి.కిరణ్‌కుమార్, రాంబాబు అనే వ్యక్తులపై చీటింగ్ కేసులు పెట్టి శిక్షించాలని రాష్ట్ర జూడో సంఘం జనరల్ బాడీ సమావేశం తీర్మానించింది. ఐజీఎంసీలో ఈ సమావేశం శనివారం జరిగింది. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏపీ జూడో అసోసియేషన్ సీఈవో నామిశెట్టి వెంకట్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పవన్ సందీప్ మాట్లాడుతూ 2024 జనవరి నెలలోనే తమదే అసలైన సంఘమని, జేఎఫ్ఐ, శాయ్, శాప్‌ను తప్పుదారి పట్టించారని రికార్డులతో సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించగా అన్ని రికార్డులను పరిశీలించి ఈ నెల 12న ఏపీ జూడో అసోసియేషన్ రిజిస్టర్ నెంబర్ 268/2014ను సుబ్బారావు అధ్యక్షుడిగా జనరల్ సెక్రటరీ పవన్ సందీప్, ట్రెజరర్‌గా టీవీవీ రమణ ఉన్న కమిటీనే అసలు సంఘం అని వారితోనే కలిసి ప్రయాణం చేయాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అసలైన సంఘం మాదేనని సీఈవో వెంకట్ స్పష్టం చేశారు.


ఎగ్జిబిషన్ స్టాల్స్‌లో వస్త్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన

## కళాత్మక చేనేతను ప్రోత్సహిద్దాం

కలెక్టర్ సృజన పిలుపు

**వన్‌టౌన్, ఆగస్టు 17:** చేనేత ఉత్పత్తులను ఆదరించి తద్వారా నేతన్నలకు చేయూతనిచ్చి, ఈ గొప్ప కళ విశిష్టతను భావితరాలకు అందించేందుకు కలిసికట్టుగా కృషిచేద్దామని కలెక్టర్ జి.సృజన పిలుపునిచ్చారు. నగరంలోని మేరిస్ స్టెల్లా కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ శనివారం సందర్శించారు. మన రాష్ట్రంతోపాటు వివిధ రాష్ట్రాలకు సంబంధించిన చేనేత ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలించారు. గాంధీ బునకర్ మేళా పేరుతో చేనేత వస్త్ర ప్రదర్శనను సీఎం చంద్రబాబు ప్రారంభించారన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకుని చేనేతను ప్రోత్సహించాలన్నారు. ప్రతి ఒక్కరు చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి చేనేతకు ఊతమిద్దామన్నారు. చేనేత ఉత్పత్తులను ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇలాంటి ప్రదర్శనలు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేస్తుందన్నారు. కలెక్టర్ వెంట చేనేత, జౌళి శాఖ, ఆప్కో అధికారులు ఉన్నారు.


సెమినార్‌లో ప్రసంగిస్తున్న డాక్టర్ అరుణ, పాల్గొన్న విద్యార్థినులు

## విద్యతో సమతుల్య జీవనం అనుసంధానం

● మనస్తత్వవేత్త డాక్టర్ అరుణ

**వన్‌టౌన్, ఆగస్టు 17:** విద్యతో సామాజిక సమతుల్య జీవనాన్ని అనుసంధానం చేయటం ద్వారా సంతోషంతో పాటు సరైన పరిష్కారం లభిస్తుందని పూజా మానసిక వ్యాధుల చికిత్స ఆసుపత్రి మనస్తత్వవేత్త డాక్టర్ బి.అరుణ అన్నారు. పొట్టిశ్రీరాములు చలువాది మల్లిఖార్జునరావు ఇంజనీరింగ్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ విభాగం శనివారం బాలెన్సింగ్ సోషల్ లైఫ్ విత్ స్టడీస్ అన్న అంశంపై సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ పరీక్షలకు ముందు విద్యార్థులు షెడ్యూల్‌ను రూపొందించుకోవాలన్నారు. విద్య ఎంత అవసరమో, సామాజిక జ్ఞానం కూడా అంతే అవసరమన్నారు. కళాశాల కార్యదర్శి సీఏ చిట్టా అమర్‌సుధీర్, ట్రెజరర్ కె రాఘవయ్య, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.పతంజలి శాస్త్రి, ఐసీసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.మనస్విని, కన్వీనర్ డాక్టర్ ఎ.రమాదేవి, మహిళా అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉత్కంఠగా రాష్ట్ర టీటీ పోటీలు

**విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 17:** ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ పర్యవేక్షణలో స్థానిక కేఎల్ డీమ్డ్ వర్శిటీ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న ఏపీ టీటీ ర్యాంకింగ్ టోర్నీలో మ్యాచ్‌లు ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. పురుషుల విభాగంలో టి.సూర్యతేజ, కుషాల్ దాస్, మహిళల విభాగంలో ఆర్ కాజోల్ సునార్, వీ గుణ సంయుక్త ఫైనల్స్‌కు చేరుకున్నారు. అండర్ -17 లో టీ సంవేద్, పీ జతిన్‌రెడ్డి, బాలికల విభాగంలో రేణుక సత్య, పీ హాసిని ఫైనల్స్‌కు అర్హత సాధించారు. ఆదివారంతో పోటీలు ముగియనున్నాయి. పోటీలను ఏపీటీటీఏ కార్యదర్శి పీ విశ్వనాథరావు, టోర్నీ కార్య నిర్వాహక కార్యదర్శి వై దామోదర్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## చేతిరాతలో రాష్ట్రానికే మొదటి స్థానం

● మరోసారి సత్తాచాటిన నగర విద్యార్థులు

**కృష్ణలంక, ఆగస్టు 17:** చదవడం ఎంత ముఖ్యమో పరీక్షల్లో అందంగా రాయడం కూడా ము ఖ్యమే. ఈ కాలిగ్రఫీ పోటీలు వి ద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని జాతీయ కాలిగ్రఫీ చేతిరాత ప్రత్యేక నిపుణులు పి.భువనచంద్ర శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలు జూలై 14న ఆన్‌లైన్‌లో ఎన్ఆర్ఐ నేషనల్ హ్యాండ్ రై టింగ్ అకాడమీ, అమ్మఒడి హ్యాండ్ రైటింగ్ ఇన్‌స్టిట్యూట్, అఖిల భారత హ్యాం డ్ రైటింగ్ ట్రైనర్స్ ప్రతి రెండేళ్ళకోసారి నిర్వహిస్తారన్నారు. ఈ పోటీల్లో సూపర్ సీనియర్ లెవల్లో నగరంలోని శ్రీ శారద జూనియర్ కాలేజీలో చదువుతున్న పె ద్ది తేజశ్రీ జాతీయ చాంపియన్‌గా, సౌతిండియా జూనియర్ లెవల్‌లో భవానీపు రం రాయల్ విద్యానికేతన్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్న ఎస్.జ్యోత్స్న వెం కటసాయి ప్రథమస్థానం సాధించినట్టు తెలిపారు. కొద్దిరోజుల్లో పి.తేజశ్రీ, ఎస్.జ్యోత్స్న వెంకట సా యి విద్యార్థినులకు ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా అవార్డులను అందిస్తామని భువనచంద్ర తెలిపారు.

## పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి: డీఎస్పీ

**ఉంగుటూరు, ఆగస్టు 17:** పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టిసారించాలని గన్నవరం సబ్ డివిజినల్ పోలీస్ అధికారి (డీఎస్పీ) చలసాని శ్రీనివాసరావు ఎస్సైలకు సూచించారు. హనుమాన్‌జంక్షన్ సర్కిల్ పరిధిలోని ఎస్సైలకు శనివారం ఆత్కూరు పీఎస్‌లో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నేరాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై దిశా-నిర్దేశం చేశారు. గ్రామాల్లో పేకాట, కోడిపందాల వంటి జూద క్రి యలకు అడ్డుకట్టవేయాలని, గంజాయి, హెరాయిన్ వంటి మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాల నియంత్రణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. చెక్‌పోస్టులు, టోల్‌గేట్ల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీచేయాలన్నారు. అపరిష్కృత కేసులపై దృష్టి పెట్టి దర్యాప్తు వేగవంతంగా పూర్తిచేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులను ఉపేక్షించకుండా ముందస్తుగా బైండోవర్ చేయాలని సూచించారు. హనుమాన్‌జంక్షన్ సీఐ కేవీవీఎన్ సత్యనారాయణ, ఎస్సైలు చావా సురేష్ (ఆత్కూరు) ఎం.చిరంజీవి (వీరవల్లి), ఏడీఎల్ జనార్ధన్ (హనుమాన్‌జంక్షన్) పాల్గొన్నారు.

# కల్లోల బంగ్లాలో తెలుగు పరిమళం!

(గల్ఫ్ నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

బంగ్లాదేశ్‌లో నెలకొన్న అల్లకల్లోల పరిస్థితుల కారణంగా అక్కడి మైనారిటీలైన హిందువుల భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దేశవిభజన సమయంలో ఉన్న ప్రాంతాన్ని వదలి భారత్‌కు రాలేక ఎంతోమంది హిందువులు బంగ్లాదేశ్ (అప్పటి తూర్పు పాకిస్థాన్)లోనే ఉండిపోయారు. ఢాకా, సిలేటు ప్రాంతాల్లో కొన్ని తెలుగు కుటుంబాలూ ఉన్నాయి. ఇప్పుడు అక్కడ తెలుగువారి సంఖ్య వేలల్లోకి చేరింది. వీరిలో ఎక్కువగా ఏపీలోని విశాఖపట్నం, శ్రీకాకుళం ప్రాంతాలకు చెందిన వారే ఉన్నారు. తమ రక్తంలో ఇప్పటికీ తెలుగు సంస్కృతి ఉందని, ఇంట్లోనూ తెలుగులోనే మాట్లాడతామని చెప్పారు. అయితే తాము ముమ్మాటికీ బంగ్లాదేశ్ జాతీయులమేనని, బంగ్లాదేశ్ పౌరులమని చెప్పుకొనేందుకు గర్వపడతామని తెలుగు సంతతికి చెందిన ఏసు రత్నం పేర్కొన్నారు. చివరిసారిగా 2017లో ఏపీని సందర్శించినట్లు ఆయన చెప్పారు. సుందర్బన్ తీరంలోని సీలేటులో ఉంటున్న చొంప నాయుడు అనే మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ భారత దౌత్యకార్యాలయంలో నిర్వహించే స్వాతంత్ర్య వేడుకలకు ప్రతి ఏడాది తప్పకుండా హాజరవుతుంటారు. శ్రీ వేంకటేశ్వర స్వామిని ఆరాధించే ఆమె, కొద్దికాలం క్రితమే తిరుమలకు వచ్చి వెళ్లారు. దుబాయిలో డ్రైవర్‌గా పనిచేసే రాజు, సౌదీలో డాక్టర్‌గా పనిచేస్తున్న శశిధర్ తమ తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూనే తాము బంగ్లాదేశీయులమని చెప్పుకొంటారు. ఇలా దేశ విభజన సమయంలో కొన్ని కుటుంబాలు బంగ్లాదేశ్‌లోనే ఉండిపోగా.. మరికొన్ని హిందూ కుటుంబాలు మాత్రం పాక్ సైన్యం దాష్టీకాలను భరించలేక తెలంగాణ రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లా సిర్పూర్‌కు శరణార్థులుగా వచ్చారు. ఆహారపు అలవాట్లు, సంస్కృతి, సంప్రదాయాల పరంగా వీరు బెంగాల్ వారే. ఇప్పుడు వీరు అచ్చమైన భారతీయులు.

## మంత్రివర్గ సమావేశం 28కి వాయిదా

అమరావతి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గ సమావేశం తేదీ వాయిదా పడింది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం 27న మంత్రివర్గ సమావేశం నిర్వహించాల్సి ఉంది. అయితే ప్రభుత్వం సమావేశాన్ని 28కి వాయిదా వేసింది. ఆరోజు ఉదయం 11 గంటలకు సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో మంత్రివర్గ సమావేశం జరగనుంది. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులు, ఆయా విభాగాలకు సంబంధించిన అంశాలపై పూర్తి వివరాలతో కూడిన నోట్‌ను 23 నాటికి అందించాలని తాజా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు ఆదేశాల మేరకు తొలిసారి ఈ - కేబినెట్‌ను నిర్వహిస్తుంది. మంత్రి మండలి సభ్యులందరికీ ప్రభుత్వం ట్యాబ్‌లను అందిస్తుంది. కేబినెట్‌కు సంబంధించిన అజెండా, టేబుల్ అజెండాలను ఆన్‌లైన్‌లోనే అందిస్తారు.

## విశాఖ ఉక్కుకు మాంగనీస్ మైన్స్

- లీజు పొడిగించిన రాష్ట్ర ప్రభుత్వం

ఉక్కు టౌన్‌షిప్, ఆగస్టు 17: విశాఖ స్టీల్‌ప్లాంటుకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. గడిచిన రెండేళ్లుగా వైసీపీ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన విజయనగరం జిల్లా గర్భాం మాంగనీసు ఖనిజ తవ్వకాలకు సంబంధించిన లీజును 2032 సంవత్సరం వరకూ పొడిగిస్తూ శనివారం జీవో జారీ చేసింది. స్టీల్‌ప్లాంటుకు మాంగనీస్ కోసం మెరకముడిదాం మండలం గర్భాం గ్రామంలో 264.54 హెక్టార్లు ఎప్పుడో లీజు ప్రాతిపదికన కేటాయించారు. ఆ లీజు రెండేళ్ల క్రితం ముగిసింది. అయితే అప్పటి వైసీపీ ప్రభుత్వం లీజును పొడిగించలేదు. ఈ విషయమై మంత్రులను ఉద్యోగ, కార్మిక సంఘాల ప్రతినిధులు కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఎన్నికల ముందు స్వయంగా నాటి సీఎం జగన్ వద్ద ప్రస్తావించినా ఫలితం లేకపోయింది. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఎంపీ శ్రీభరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావులను ఉక్కు అధికారుల సంఘం, కార్మిక నాయకులు కలిసి మాంగనీస్ లీజు పొడిగించాలని విన్నవించారు. ఈ నేపథ్యంలో శనివారం ఉత్తర్వులు వచ్చాయని ఉక్కు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## 'అస్కి' డీజీగా నిమ్మగడ్డ రమేశ్‌కుమార్

హైదరాబాద్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(అస్కి) డైరెక్టర్ జనరల్‌గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ నియమితులయ్యారు. ఐఏఎస్ అధికారిగా రిటైర్ అయ్యాక ఆయన 'సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ' సంస్థను ఏర్పాటు చేసి, ఓటర్లలో ఎన్నికల పట్ల అవగాహన కల్పించారు. అస్కి డైరెక్టర్ జనరల్‌గా రమేశ్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

## జగన్ చెయ్యెత్తినా అవకాశమిస్తా: అయ్యన్న

మంగళం(తిరుపతి), ఆగస్టు 17: మాజీ ముఖ్యమంత్రి జగన్ అసెంబ్లీ సమావేశాలకు హాజరై చెయ్యి పైకి ఎత్తినా ఆయనకు మాట్లాడే అవకాశం ఇస్తానని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చెప్పారు. తిరుపతిలోని ఎస్వీ జూపార్కును శనివారం సందర్శించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ ఎమ్మెల్యేలు కూడా శాసనసభ సమావేశాలకు హాజరై ప్రజల సమస్యలను తెలియజేయడానికి ముందుకు వస్తే వారికి కూడా మాట్లాడేందుకు అవకాశం ఇస్తామని స్పీకర్ స్పష్టం చేశారు.

## గ్రీన్ ఎనర్జీలో ఏపీ చాంపియన్

అమరావతి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఎనర్జీలో ఏపీ చాంపియన్‌గా నిలిచింది. శనివారం తమిళనాడు కోయంబత్తూర్ వేదికగా జరిగిన ఇండియన్ విండ్ పవర్ అసోసియేషన్ మీటింగ్‌లో ఏపీ కీలక అవార్డును సొంతం చేసుకుంది. 2023-24కు సంబంధించి ఏపీని గ్రీన్ ఎనర్జీ చాంపియన్‌గా ఇండియన్ విండ్ పవర్ అసోసియేషన్ ప్రకటించింది. ఈ అవార్డును విండ్ ఎనర్జీ జాయింట్ సెక్రటరీ లలిత్ బోరా చేతుల మీదుగా రాష్ట్ర సోలార్ కార్పొరేషన్ ఎండీ కమలాకరబాబు అందుకున్నారు.

## పీఏసీ చైర్మన్‌గా కేసీ వేణుగోపాల్

న్యూఢిల్లీ, ఆగస్టు 17: పార్లమెంట్‌లో ప్రజాపద్దుల సంఘాన్ని(పీఏసీ) ఏర్పాటు చేస్తూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా శుక్రవారం ప్రకటన జారీ చేశారు. కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ ఈ సంఘానికి నేతృత్వం వహిస్తారు. 2024-25 సంవత్సరానికి గానూ కేంద్ర ప్రభుత్వ వ్యయానికి సంబంధించి ఈ కమిటీ ఆడిట్ నిర్వహిస్తుంది. లోక్‌సభ, రాజ్యసభ నుంచి 29 మంది సభ్యులు ఇందులో ఉంటారు. నలుగురు తెలుగు ఎంపీలకు ఈ కమిటీలో స్థానం లభించింది. లోక్‌సభ నుంచి బీజేపీ ఎంపీ సీఎం రమేశ్, టీడీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులు, జనసేన నుంచి ఎంపీ బాలశౌరీ అలాగే రాజ్యసభ నుంచి డా.కె లక్ష్మణ్‌లకు అవకాశం దక్కింది. సాధారణంగా ప్రధాన ప్రతిపక్షానికి చెందిన సీనియర్ ఎంపీ పీఏసీ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. అధీర్ రంజన్ చౌధురి గత చైర్మన్‌గా ఉన్నారు. పీఏసీతో పాటు మరో నాలుగు పార్లమెంట్ కమిటీలను కూడా లోక్‌సభ సెక్రెటరియేట్ ప్రకటించింది.

# రోజుల బిడ్డకు జీజీహెచ్‌లో శస్త్రచికిత్స

- పుట్టుకతోనే ఉదర భాగంలో చర్మంలేని వైనం
- విజయవంతంగా పూర్తయిన ఇలియాస్టమీ సర్జరీ
- పరామర్శించిన హెన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

జీజీహెచ్(కాకినాడ), ఆగస్టు 17: నెలలు నిండకుండానే జన్మించిన రోజుల చంటిబిడ్డకు కాకినాడ జీజీహెచ్ వైద్యులు శస్త్రచికిత్స చేసి పునర్జన్మను అందించారు. ఆ బిడ్డను హెన్(హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్) స్టేట్ ప్రాజెక్టు చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీఎస్ మూర్తి శనివారం పరామర్శించి మెరుగైన వైద్యసేవలు అందించాలని జీజీహెచ్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారికి సూచించారు. వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం తీగలమెట్ట గ్రామానికి చెందిన గిరిజన మహిళ బోనంగి జానకి నెలలు నిండకుండానే స్థానిక పీహెచ్‌సీలో ఈనెల 15న మగశిశువుకు జన్మనిచ్చింది. కాగా, శిశువు ఉదర భాగంపై చర్మం ఏర్పడకపోవడంతో పేగులు బయటకు వచ్చి శిశువు ప్రాణాపాయస్థితిలోకి వెళ్లాడు. దీంతో అక్కడ వైద్యులు మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించాల్సిందిగా సూచించారు. ఆ సూచన మేరకు కాకినాడ జీజీహెచ్‌కు రాగా పీడియాట్రిక్ సర్జరీ వైద్య బృందం శిశువుకు ఇలియాస్టమీ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి పునర్జన్మను ప్రసాదించారు. జీజీహెచ్‌లోని గిరిజన నిరీక్షణ కేంద్రంలో ఉన్న తల్లి జానకిని, డీఎస్ మూర్తి పరామర్శించి చంటిబిడ్డకు అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమెను బాలింతల సంరక్షణ వార్డులో చేర్చేందుకు ఆదేశాలు జారీ చేశారు.



సర్జరీ అనంతరం చంటిబిడ్డ

# ప్రభుత్వ కాలేజీల జోరు!

- ఇంటర్‌లో గతేడాదితో పోలిస్తే పెరిగిన అడ్మిషన్లు 5,663
- ప్రైవేటు కాలేజీల్లో 36,795 తగ్గుదల నమోదు
- ఈ ఏడాది విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు
- వాటితోపాటు నోట్‌బుక్స్, బ్యాగులు కూడా...
- పాఠ్యపుస్తకాలూ ఇవ్వని గత జగన్ ప్రభుత్వం
- అడ్మిషన్ల పెంపునకు ఇంటర్ విద్యాశాఖ చర్యలు
- హైస్కూల్ ప్లస్‌ల్లో ప్రవేశాలు అంతంతమాత్రమే

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఈ ఏడాది అనూహ్యంగా అడ్మిషన్లు పెరిగాయి. అయితే ప్రైవేటు కాలేజీల్లో మాత్రం ప్రవేశాలు భారీగా తగ్గాయి. 2023-24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ కాలేజీల్లో ఇంటర్మీడియట్‌లో 67,525 మంది అడ్మిషన్లు పొందగా, ఆ సంఖ్య ఈ సంవత్సరంలో 73,118కి చేరింది. అంటే 5,663 మంది విద్యార్థులు ప్రభుత్వ కాలేజీల్లో పెరిగారు. ఓవైపు ఉన్నత విద్యలో, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. ప్రభుత్వ విద్యాసంస్థలపై నమ్మకం తగ్గడం, గత జగన్ ప్రభుత్వంలో చూపిన నిర్లక్ష్యం ఈ పరిస్థితిని ఇంకా దిగజార్చింది. అయితే ఈ ఏడాది నుంచి ప్రభుత్వ ఇంటర్మీడియట్ కాలేజీల విద్యార్థులకూ ఉచితంగా పాఠ్యపుస్తకాలు ఇచ్చారు. గతంలోనూ ఈ విధానం ఉన్నా కొన్నేళ్లుగా ఆగిపోయింది. దానిని ఇప్పుడు పునరుద్ధరించడంతోపాటు కొత్తగా నోట్ పుస్తకాలు, బ్యాగులు కూడా ఉచితంగా పంపిణీ చేశారు. దీంతోపాటు ఇంటర్ విద్యాశాఖ అడ్మిషన్ల పెంపుపై తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇవ్వడంతో విద్యార్థుల సంఖ్య పెరిగింది.

### అక్కడ భారీగా తగ్గిపోయారు

రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు 475 ఉంటే, ప్రైవేటు కాలేజీలు ఏకంగా 1,876 ఉన్నాయి. ఎయిడెడ్ కాలేజీలు 46, ఏపీఆర్‌జేసీలు 10, కేజీబీవీలు 351, బీసీ సంక్షేమ జూనియర్ కాలేజీలు 12, మోడల్ స్కూళ్లు 162 ఉన్నాయి. వీటితో పాటు 300కు పైగా హైస్కూల్ ప్లస్‌ల్లోనూ ఇంటర్మీడియట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. 2023-24లో ప్రైవేటు కాలేజీల్లో 3,90,047 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ఈ ఏడాది ఆ సంఖ్య 3,53,252కు పడిపోయింది. అంటే 36,795 అడ్మిషన్లు తగ్గిపోయాయి. ఎయిడెడ్ కాలేజీల్లో గతేడాది 7,428 మంది చేరితే, ఈ సంవత్సరం 7,140 మంది చేరారు. వీటిలో విద్యారుల చేరిక స్వల్పంగా తగ్గింది. మిగిలిన అన్ని మేనేజ్‌మెంట్ కాలేజీల్లో కలిపి గతేడాది 52,617 మంది చేరగా, ఇప్పుడు 51,585 మంది చేరారు.

### మెరుగ్గా ప్రభుత్వ కాలేజీలు

అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో మాత్రమే గతేడాది కంటే స్వల్పంగా అడ్మిషన్లు తగ్గాయి. మిగిలిన 22 జిల్లాల్లోనూ విద్యార్థులు పెరిగారు. ఒక్క నంద్యాల జిల్లాలోనే 1,132 మంది పెరిగారు. అనంతపురంలో 1,084, అల్లూరి సీతారామరాజులో 1,043, ఏలూరులో 757, శ్రీసత్యసాయిలో 643 చొప్పున అడ్మిషన్లు పెరిగాయి. కాగా, హైస్కూల్ ప్లస్‌ల పరిస్థితి దారుణంగా ఉంది. మండలానికో బాలికల జూనియర్ కాలేజీ ఉండాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో ఇంటర్ ప్రారంభించి, వాటికి హైస్కూల్ ప్లస్‌గా పేరు పెట్టింది. కానీ ల్యాబ్‌లు, ఇతరత్రా సౌకర్యాలు లేకపోవడంతో అడ్మిషన్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి.

# పార్టీ బలోపేతంపై కమలనాథుల చర్చ

- నడ్డా నేతృత్వంలో జాతీయ కార్యవర్గ సమావేశం
- పురందేశ్వరికి 3 రాష్ట్రాల సభ్యత్వ నమోదు బాధ్యతలు
- తెలుగు రాష్ట్రాలకు ఇన్‌చార్జిగా అరవింద్ మీనన్

న్యూఢిల్లీ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో బీజేపీ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జిగా అరవిండ్ మీనన్ నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరికి మూడు రాష్ట్రాల బాధ్యతలు అప్పగించారు. బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు అధిష్ఠానం కసరత్తు చేస్తున్నది. దీనిలో భాగంగా శనివారం ఢిల్లీలోని బీజేపీ కేంద్ర ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అధ్యక్షతన జాతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. లోక్‌సభ ఎన్నికల తర్వాత జరిగిన అతిపెద్ద సమావేశం ఇదే. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర ఇన్‌చార్జులు, సహ ఇన్‌చార్జులు, రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సమావేశానికి హాజరయ్యారు. బీజేపీ సభ్యత్వ నమోదుపై ప్రధానంగా చర్చించారు. రాబోయే సంస్థాగత ఎన్నికలు, కొన్ని రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కీలక సూచనలు చేశారు. పార్టీని మరింత బలోపేతం చేయాలని, గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరిని కలవాలని సూచించినట్టు తెలిసింది. ఇంటింటికీ వెళ్లి పదేళ్లలో దేశంలో బీజేపీ సారథ్యంలోని ప్రభుత్వం సాధించిన ప్రగతి, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించాలని చెప్పినట్టు సమాచారం. ఈ నెల 31న కేరళలోని పాలక్కాడ్‌లో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌ల సంయుక్త సమావేశం జరగనుంది. మూడురోజుల పాటు జరిగే ఈ సమన్వయ సమావేశంపై చర్చ జరిగినట్టు తెలిసింది. ఆ తర్వాత దేశంలోని అన్ని రాష్ట్రాలకు సభ్యత్వ నమోదు కోసం ఇన్‌చార్జిలను నియమించారు. తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల్లో సభ్యత్వ నమోదు ఇన్‌చార్జిగా ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరికి బాధ్యతలు అప్పగించారు. ఈ సమావేశానికి బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి, ఎంపీలు డీకే అరుణ, రఘునందన్ రావుతోపాటు ఎమ్మెల్యే పాయల్ శంకర్ తదితరులు హాజరయ్యారు.



అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణం ఆర్డీటీ కాలనీలో నిలిచిన వర్షం నీరు

# అనంతలో భారీ వర్షం

- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు
- గంటల తరబడి నిలిచిన వాహనాల రాకపోకలు
- 226.86 హెక్టార్లల్లో పంటనష్టం

అనంతపురం అర్బన్, ఆగస్టు 17: ఉమ్మడి అనంతపురం జిల్లాలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. పుట్లూరులో అత్యధికంగా 138.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. అమరాపురంలో 98.2, గోరంట్ల 95.4, మడకశిర 88.4, ఆత్మకూరు 88.2, బుక్కరాయసముద్రం 88.0, రాప్తాడు, చెన్నేకొత్తపల్లి 86.4, శింగనమల 85.4, ముదిగుబ్బ 82.4, యాడికిలో 82 మి.మీ. వర్షపాతం నమోదైంది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పలు పట్టణాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. యల్లనూరు మండలం 85-నిట్టూరు గ్రామం వద్ద వంక రోడ్డుపై ప్రవహించడంతో తాడిపత్రి నుంచి యల్లనూరుకు శనివారం తెల్లవారుజాము నుంచి ఉదయం 11 గంటల వరకూ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పలు గ్రామాల్లోనూ వంకలు పొంగిపొర్లడంతో వాహనాల రాకపోకలు గంటల తరబడి నిలిచిపోయాయి. ఉరవకొండ, ధర్మవరం పట్టణాల్లో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షంనీరు చేరింది. ధర్మవరం-అనంతపురం ప్రధాన రహదారిపై చిత్రావతినది ఉధృతంగా పారుతోంది. కొత్తచెరువు-ధర్మవరం రోడ్డులో కొడపగానిపల్లి వద్ద వంగపేరు నది బ్రిడ్జి పైనుంచి పారుతుండటంతో వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. జిల్లాలో భారీ వర్షానికి 226.86 హెక్టార్లల్లో రూ.1.07 కోట్లకుపైగా పంటనష్టం జరిగినట్టు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇందులో అత్యధికంగా వేరుశనగ పంట ఉంది. కంది, మొక్కజొన్న, మినుము, పత్తి, వరి, సోయాబీన్ తదితర పంటలు దెబ్బతిన్నాయి. 30.86 హెక్టార్లల్లో అరటి, ఎండు మిరప, టమోటా, కళింగర, కాకర తదితర ఉద్యాన పంటలు దెబ్బతినడంతో రూ.54.65 లక్షల నష్టం జరిగింది.

# రాజధానికి త్వరలో ప్రపంచ బ్యాంకు బృందం!

- 14 మంది సభ్యులతో కూడిన అత్యున్నతస్థాయి బృందం వస్తున్నట్లు సీఆర్‌డీఏకు సమాచారం
- కీలక సమావేశాలు నిర్వహిస్తున్న కమిషనర్
- నిధుల కోసం ప్రతిపాదనల రూపకల్పన



విజయవాడ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మరికొద్ది రోజుల్లో అమరావతి రాజధానికి అత్యున్నతస్థాయి ప్రపంచ బ్యాంకు బృందం రాష్ట్రానికి రాబోతోంది. మొత్తం 14 మంది సభ్యులతో కూడిన బృందం రానున్నట్లు సీఆర్‌డీఏకు సమాచారం వచ్చింది. అమరావతి రాజధానికి ప్రాజెక్టుల వారీగా ఎంత మేర రుణం ఇవ్వగలుగుతామన్నది ఈ బృందం నిర్ణయిస్తుంది. దీంతో ఈ బృందానికి సవివర నివేదికలను అందించేందుకు వీలుగా సీఆర్‌డీఏ కమిషనర్ భాస్కర్ కొద్ది రోజులుగా వివిధ శాఖల అధికారులతో కీలక సమావేశాలు నిర్వహిస్తున్నారు. సీఆర్‌డీఏ విభాగాలను సమీక్షిస్తున్నారు. ఈ సమీక్షల్లో అమరావతిలో శాశ్వత ప్రభుత్వ కాంప్లెక్స్‌లో భాగంగా నిర్మించే సచివాలయ టవర్లు, హైకోర్టు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఐఏఎస్, ఎన్‌జీఓ, సెక్రటరీలు, జడ్జీల భవనాలు, ప్రభుత్వ టైప్ - 1, టైప్ - 2 భవనాలు, ఎల్‌పీఎస్ ఇన్ఫ్రా, ట్రంక్ ఇన్ఫ్రా, రాజధాని సంబంధిత ప్రాజెక్టులు, ప్రతిపాదిత ప్రాజెక్టులన్నింటిపైనా సమగ్ర సమాచారాన్ని ఆయా విభాగాలు సిద్ధం చేసేలా నిర్దేశించారు. దాదాపుగా ఆయా శాఖలు నివేదికలన్నీ సిద్ధం చేసినట్టుగా తెలుస్తోంది. అమరావతి రాజధాని ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులను ఇంతకు ముందు వచ్చిన ప్రపంచ బ్యాంకు ఫోర్‌మెన్ బృందం రెండు రోజుల పాటు అమరావతిలో పర్యటించి ప్రాథమిక పరిశీలన జరిపింది. ఆ తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబుతో కూడా భేటీ అయ్యింది. అమరావతి రాజధానిని అంతర్జాతీయ నగర నిర్మాణం దిశగా ఏ విధంగా ప్రణాళిక రూపొందించారు? కిందటి ప్రభుత్వ విధానాల కారణంగా ఏ విధంగా నష్టం వాటిల్లింది? మళ్లీ వీటిని పునర్నిర్మించటానికి ఎంచుకున్న ప్రాధాన్యతలు, ఆర్థిక అవసరాల గురించి ఆయన సమగ్రంగా బృంద సభ్యులకు వివరించారు. ఈ బృందం వెళ్లిపోయిన వెంటనే రుణాన్ని నిర్ణయించే కీలక బృందం రాకకు సంబంధించిన సమాచారం వచ్చింది. ఈ కమిటీకి సీఆర్‌డీఏ నుంచి ఆయా ప్రాజెక్టుల వారీగా ఎంతెంత నిధులు అవసరమన్న లెక్కలు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రాజెక్టుల వారీగా సీఆర్‌డీఏ కూడా రుణం ఎంత అవసరమన్న లెక్కలను కూడా సంబంధిత విభాగాలతో సిద్ధం చేయిస్తోంది. అమరావతి రాజధానిలోని కీలక ప్రాజెక్టులకు లోన్ కాంపోనెంట్ ఎంతెంత ఇవ్వాలన్నది 14 మంది సభ్యులతో కూడిన అత్యున్నత కమిటీ నిర్ణయిస్తుంది.

అమరావతి రాజధానిలో సీడ్ యాక్సెస్ రోడ్డును రెండవ దశలో పొడిగించి జాతీయ రహదారి - 16 కు అనుసంధానం చేయటానికి వీలుగా దాదాపుగా 40 ఎకరాలు కావాల్సి ఉండగా.. 30 ఎకరాల వరకు సాకారమైనట్టుగా తెలుస్తోంది. చర్చి తొలగింపు, 17 రిట్ పిటిషన్ల సమస్యను ఎంత త్వరగా పరిష్కరించుకోగలిగితే అంత త్వరగా మిగిలిన భూములు కూడా స్వాధీనమయ్యే అవకాశం ఉంది.

# గంజాయిపై పంచ వ్యూహం

- మన్యంలో సాగుపై ఉత్తరాంధ్ర పోలీసు ఉక్కుపాదం
- మొక్కేకదా అని వదిలేస్తే ఊరుకోం
- మొలకెత్తగానే పీకిపారేయండి
- ఎస్పీలకు డీఐజీ గోపీనాథ్ జెట్టి దిశానిర్దేశం

అమరావతి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): 'చిన్న మొక్కేకదా అని వదిలేస్తే ఊరుకోం.. మొలక కనిపిస్తే పీకి పారేయండి.. సాగు దశలోనే గంజాయిని పూర్తిగా నిర్మూలించాలి.. ఏజెన్సీ నుంచి దేశమంతా వెళుతోంది.. ఇకపై జిల్లా దాటి వెళ్లడానికి వీల్లేదు' అని తీర్మానించారు. ఉత్తరాంధ్ర పోలీసు ఉన్నతాధికారులు. గంజాయి మొలకెత్తే చోటు నుంచి చివరి గమ్యం వరకూ మొత్తం మూలాలను తుంచేసేందుకు ఐదు జిల్లాల ఎస్పీలు పంచ వ్యూహాలకు శ్రీకారం చుట్టారు!. అల్లూరి జిల్లాలో గంజాయి సాగును గుర్తించేందుకు డ్రోన్లతో వీడియోలు, శాటిలైట్ ఫొటోలతో ఆరా తీసి అంతర్ పంటల వైపు గిరిజనుల్ని మళ్లించేందుకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం వరకూ పలు తీర్మానాలు చేశారు. విశాఖపట్నంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో డీఐజీ గోపీనాథ్ జెట్టి ఆధ్వర్యంలో సమావేశమైన ఎస్పీలు దీపికా పాటిల్(అనకాపల్లి), అమిత్ బర్దార్(అల్లూరి జిల్లా), వకుల్ జిందాల్(విజయ నగరం), మాధవ రెడ్డి(పార్వతీపురం మన్యం), మహేశ్వర రెడ్డి(శ్రీకాకుళం) గంజాయి నిరోధానికి అనుసరించాల్సిన వ్యూహాలపై సుదీర్ఘంగా చర్చించారు.

### జగన్ పాలనలో గంజాయి కేంద్రంగా విశాఖ..

విశాఖను పరిపాలనా రాజధాని చేస్తానంటూ బీరాలు పలికిన జగన్ రెడ్డి పాలనలో విశాఖ పేరు గంజాయి కేంద్రంగా మారింది. గడచిన ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌ను గంజాయి ఉపద్రవం కమ్మేసింది. రాష్ట్రంలోని నగరాలు, పట్టణాలు, మండల కేంద్రాలకు సైతం వ్యాప్తి చెందిన గంజాయి ఘాటు విద్యాసంస్థల్ని సైతం వదల్లేదు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రపంచ ఐటీకి.. విభజిత రాష్ట్రంలో అమరావతికి బ్రాండ్‌గా ఉన్న ఏపీ 2019తర్వాత గంజాయికి బ్రాండ్‌గా మారింది. చాక్లెట్లు దొరికినంత సులువుగా గంజాయి లభిస్తుండటంతో నిరుద్యోగ యువత గంజాయికి లక్షల్లో బానిసలై వందల్లో ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఒక్క విశాఖ మన్యంలోనే ఏటా పదివేల కోట్ల విలువైన గంజాయి సాగై దేశ నలుమూలలకు అక్రమంగా సరఫరా అవుతున్నట్లు కేంద్ర సంస్థలు వెల్లడించాయి. ఇలాంటి దారుణ పరిస్థితుల్లో గంజాయిపై ఉక్కుపాదం మోపేందుకు కొత్తగా అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం.. ఐదుగురు మంత్రులతో కమిటీ వేసింది. ఆ కమిటీ సభ్యులు ఇటీవల సమావేశమై కీలక సూచనలు చేశారు. అందులో భాగంగా వంద రోజుల్లో గంజాయి కట్టడికి పోలీసు శాఖ యాంటీ నార్కోటిక్ టాస్క్ ఫోర్స్(ఏఎన్‌టీఎఫ్)ను ఏర్పాటు చేసింది.

### ఇదీ వ్యూహం!

- రాష్ట్ర, రాష్ట్రేతర గంజాయి స్మగ్లర్లను పట్టుకోవడానికి 27 ప్రత్యేక బృందాల ఏర్పాటు...
- అంతర్రాష్ట్ర అక్రమ రవాణా మార్గాలు గుర్తించి తొమ్మిది చెక్ పోస్టులు, సీసీ కెమెరాలు, డైనమిక్ వాహనాలు సిద్ధం.
- పేరు మోసిన 59మంది గంజాయి స్మగ్లర్లపై పీడీ యాక్టు అమలు, కింగ్ పిన్‌ల కదలికలపై నిఘా, సస్పెక్ట్ షీట్లు.
- కంటైనర్లలో దాచిన గంజాయిని పసిగట్టేందుకు అనకాపల్లి, నర్సీపట్నంలో ప్రత్యేక జాగిలాలు.
- ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టి మూలాల నుంచే గంజాయిపై ఉక్కుపాదం మోపడం.

### చట్టపరమైన చర్యలు: గోపీనాథ్ జెట్టి

గంజాయి కట్టడికి చట్టపరమైన చర్యలతోపాటు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు కల్పిస్తున్నట్లు విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ ఏవోబీ నుంచి గంజాయి స్మగ్లింగ్‌కు సంబంధించి 223 కేసులు నమోదు చేసి రూ.4.75కోట్ల విలువైన 9517కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. గంజాయి స్మగ్లర్లు, సాగుదారులు అందరినీ కలిపి 545మందిని అరెస్టు చేసి 155వాహనాలను సీజ్ చేసినట్లు వివరించారు. మన్యంలోని 11 మండలాల్లో 416అవగాహన కార్యక్రమాలు నిర్వహించి 26వేల మందిలో చైతన్యం తెచ్చామన్నారు.


# విస్తరిస్తున్న ఎంపాక్స్

### ఆఫ్రికా నుంచి ఇతర దేశాలకు వ్యాప్తి.. డబ్ల్యూహెచ్‌వో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటన

### కాంగోలో ఈ ఏడాది 350 మంది మృతి.. వైరస్‌కు మశూచి టీకాతో ఉపశమనం

జెనీవా/న్యూఢిల్లీ, ఆగస్టు17: ఆఫ్రికా దేశాలను వణికిస్తున్న ఎంపాక్స్(కోతుల నుంచి వ్యాపించే అరుదైన వ్యాధి) ఇప్పుడు పాకిస్థాన్‌కూ వ్యాపించింది. ముగ్గురు వ్యక్తుల్లో ఎంపాక్స్ లక్షణాలు ఉన్నట్టు పాక్ వైద్యులు నిర్ధారించారు. వారిని ఐసోలేషన్‌లో ఉంచారు. కొన్నాళ్లుగా ఆఫ్రికా దేశాల్లో ఎంపాక్స్ విస్తరించింది. దీంతో గతంలోనే ఓసారి ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఆరోగ్య అత్యయిక స్థితిని ప్రకటించింది. ఇప్పుడు మరోసారి హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించడం గమనార్హం. ఎంపాక్స్ సోకిన వారితో కలివిడిగా ఉండే వ్యక్తులకు ఇది వ్యాపిస్తోందని డబ్ల్యూహెచ్‌వో తెలిపింది. ఎంపాక్స్‌కు అడ్డుకట్ట వేసేందుకు అంతర్జాతీయ సమాజం సహకరించాలని డబ్ల్యూహెచ్‌వో డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అథనామ్ ఘెబ్రెయాసస్ పిలుపునిచ్చారు. ఇప్పటికే కాంగో సహా చుట్టుపక్క దేశాల్లో ఎంపాక్స్ తీవ్రంగా విస్తరించినట్టు తెలిపారు.

- ఆఫ్రికా దేశాలకు వెలుపల తొలి కేసు స్వీడన్‌లో నమోదైనట్టు ఆదేశం ప్రకటించింది. వైరస్ సోకిన వ్యక్తి కొన్ని రోజులు ఆఫ్రికాలో పర్యటించి వచ్చినట్టు స్వీడన్ ఆరోగ్య శాఖ డైరెక్టర్ జనరల్ విగ్‌జెల్ ప్రకటించారు.
- పాకిస్థాన్‌లో ఒకే రోజు 3ఎంపాక్స్ కేసులు నమోదైనట్టు ఖైబర్ ఫఖ్తున్వా ప్రావిన్స్ ఆరోగ్య విభాగం ప్రకటించింది. యూఏఈ నుంచి వచ్చిన వారు అనారోగ్యంతో ఇబ్బంది పడగా పరీక్షిస్తే లక్షణాలు కనిపించినట్టు తెలిపింది.



- తమ దేశంలోకి వచ్చే విదేశీ పౌరులు, వస్తు సామాగ్రిని వచ్చే 6మాసాల వరకు నిశితంగా పరీక్షించాలని నిర్ణయించుకున్నట్టు చైనా తెలిపింది. ఎంపాక్స్ విస్తరించిన దేశాల నుంచి వచ్చే వారిని స్క్రీనింగ్ చేయనున్నట్టు పేర్కొంది.
- గత ఏడాదే ఎంపాక్స్‌పై చైనా అప్రమత్తమైంది. దీన్ని కేటగిరీ-బీ అంటువ్యాధిగా పేర్కొంటూ కొన్ని ఆదేశాలు జారీచేసింది. దీని ప్రకారం అవసరమైతే పాఠశాలలు, కార్యాలయాలను మూసివేయాలని పేర్కొంది.
- ఆఫ్రికాలో ఈ ఏడాది తొలి 6 మాసాల్లోనే 17 వేల కేసులు నమోదైనట్టు డబ్ల్యూహెచ్‌వో వెల్లడించింది. ఇప్పటి వరకు 500మంది మృతి చెందినట్టు తెలిపింది. ఈ నేపథ్యంలోనే మరోసారి హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించినట్టు పేర్కొంది.
- ఎంపాక్స్ తొలినాళ్లలో ఆఫ్రికాకే పరిమితమైనా 2022 ద్వితీయార్థం నుంచి నైజీరియాకు, అక్కడ నుంచి ఇతర దేశాలకు విస్తరించింది.
- ఆఫ్రికా ఖండంలోని దాదాపు అన్ని దేశాల్లో ఎంపాక్స్ కేసులు నమోదైనట్టు డబ్ల్యూహెచ్‌వో పేర్కొంది. ఎంపాక్స్ లక్షణాలు, తీవ్రతను బట్టి 2 కేటగిరీలుగా విభజించారు. ఆఫ్రికాలో తీవ్రమైన లక్షణాలున్న కేసులను కేటగిరీ-1గా పేర్కొన్నారు. ఇవి మరణాలు పెరగడానికి దారితీస్తున్నట్టు తెలిపింది. స్వల్పలక్షణాలు, విస్తరణ వేగం ఉన్న కేటగిరీ-2 ప్రపంచ దేశాల్లో విస్తరిస్తున్నట్టు పేర్కొంది. ఎంపాక్స్‌గా పేర్కొనే అంటువ్యాధి కోతుల నుంచి ఇతర జీవులకు, మనుషులకు వ్యాపిస్తుంది. ఇది మశూచి తరహా అంటువ్యాధి. గత ఏడాది జనవరి నుంచి కాంగోలో 27 వేల కేసులు నమోదు కాగా 11వందల మంది మృతి చెందిన రాయిటర్స్ వెల్లడించింది. ఈ ఏడాది తొలి 6మాసాల్లో 8వేల కేసులు నమోదు కాగా 350 మంది మృతి చెందారని పేర్కొంది. చిన్నారుల్లో మంకీపాక్స్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. కోతుల నుంచి వ్యాపిస్తున్న వైరస్ కావడంతో తొలినాళ్లలో దీనికి 'మంకీ పాక్స్'గా పేరు పెట్టారు. 2022 నవంబరులో మంకీ పాక్స్ పేరును 'ఎంపాక్స్'గా నిర్ధారించారు.

### లక్షణాలు ఇవీ..

ఎంపాక్స్ వైరస్ సోకిన వారు జ్వరం, చలి, శారీరక, కండరాల నొప్పులతో ఇబ్బంది పడతారు. అరచేతులు, పాదాలు, ముఖం, జననేంద్రియాలు, నోటిపై కురుపుల వంటి దద్దుర్లు ఏర్పడతాయి. కొన్ని తీవ్ర కేసుల్లో మెదడు ఉబ్బడం, ఊపిరితిత్తుల్లోకి నీరు చేరడం, రక్త ప్రసరణలో ఇన్‌ఫెక్షన్, అంధత్వం వంటివీ కనిపిస్తాయి. వైరస్ సోకిన వారు దాదాపు 2 నుంచి 4 వారాల్లో కోలుకునే అవకాశం ఉంది. ఎంపాక్స్ నుంచి కోలుకునేందుకు ఎంవీఏ-బీఎన్ టీకాను తీసుకోవాల్సి ఉంటుంది. ఇది మశూచి కోసం తయారు చేసిందే అయినా ఎంపాక్స్ మశూచి కుటుంబానికి చెందిన వైరస్ కావడంతో ఈ టీకా ప్రభావవంతంగా పనిచేస్తుందని వైద్యులు చెబుతున్నారు.

### ఎలా విస్తరిస్తుంది?

వైరస్ సోకిన జంతువుల, మనుషులను స్పృశించినా, శృంగారం చేసినా, వైరస్ సోకిన జంతువు మాంసాన్ని భుజించినా ఎంపాక్స్ సోకుతుంది. అదేవిధంగా వైరస్ సోకిన జంతువులు కరిచినా, గోటి గీతలు పడినా వైరస్ అంటుకుంటుంది. అమెరికా సహా పలు దేశాల్లోని కుక్కల్లోనూ ఈ వైరస్ కనిపించినట్టు నివేదికలు చెబుతున్నాయి.

## దేశంలో మంకీపాక్స్ కేసులు లేవు

న్యూఢిల్లీ, ఆగస్టు 17: మంకీపాక్స్ వ్యాప్తిని హెల్త్ ఎమర్జెన్సీగా డబ్ల్యూహెచ్‌ఓ ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో.. దేశంలో పరిస్థితులపై కేంద్ర ఆరోగ్యశాఖమంత్రి జేపీ నడ్డా శనివారం సమీక్ష నిర్వహించారు. దేశంలోని అన్ని విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, సరిహద్దుల వద్ద ఉన్న ఆరోగ్య కేంద్రాలను అప్రమత్తం చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. దేశవ్యాప్తంగా పరీక్ష కేంద్రాలను సన్నద్ధం చేయాలని, కేసులు బయటపడితే వ్యాప్తి జరగకుండా రోగిని ఐసోలేషన్‌లో ఉంచి చికిత్స అందించటానికి వీలుగా ఆస్పత్రులను సంసిద్ధం చేయాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం దేశంలో మంకీపాక్స్ కేసులు లేవని కేంద్ర ఆరోగ్య శాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. రానున్న రోజుల్లో మంకీపాక్స్ కేసులు బయటపడ్డా దేశంలో అది ఒక మహమ్మారిలా వ్యాప్తి చెందే అవకాశాలు లేవని అందులో పేర్కొంది. మంకీపాక్స్‌పై డబ్ల్యూహెచ్‌ఓ తొలిసారిగా 2022లో హెల్త్ ఎమర్జెన్సీ హెచ్చరికను జారీ చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ.. నాటి నుంచి ఈ ఏడాది మార్చి వరకు దేశంలో 20 కేసులు నమోదయ్యాయని తెలిపింది.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● ఆదివారం 18 ఆగస్టు 2024
diksuchi@andhrajyothy.co

## డా.వైఎస్సార్‌ఏఎఫ్‌యూలో
# బీఆర్క్‌

కడపలోని డా.వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ(డా.వైఎస్సార్‌ఏఎఫ్‌యూ)- బీఆర్క్ డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, నాన్ మైనారిటీ, మైనారిటీ కళాశాలల్లో నాటా 2024 స్కోర్ ఆధారంగా లోకల్, నాన్ లోకల్ కేటగిరీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు.



కళాశాలలు-సీట్లు

- ఆంధ్ర యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, విశాఖపట్నం-44 కన్వీనర్ కోటా సీట్లు
- డా.వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ, కడప-44 కన్వీనర్ కోటా సీట్లు
- ఏఎన్‌యూ కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్, గుంటూరు-44 కన్వీనర్ కోటా సీట్లు
- ఎంఆర్‌కే కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్, భీమవరం- 15 కన్వీనర్ కోటా సీట్లు, 6 మేనేజ్‌మెంట్ కోటా సీట్లు
- చదలవాడ అరుణ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్, తిరుపతి-28 కన్వీనర్ కోటా సీట్లు, 12 మేనేజ్‌మెంట్ కోటా సీట్లు

**అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ/బయాలజీ/టెక్నికల్ ఒకేషనల్ సబ్జెక్ట్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మాటిక్స్ ప్రాక్టీసెస్/ఇంజనీరింగ్ గ్రాఫిక్స్/బిజినెస్ స్టడీస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. ఏ కోర్సులోనైనా కనీసం 45 శాతం మార్కులు ఉండాలి. నాటా 2024 అర్హత తప్పనిసరి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1500; బీసీ అభ్యర్థులకు రూ.1300; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 19
- **సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 20
- **ఈ మెయిల్ ద్వారా కరెక్షన్స్:** ఆగస్టు 21 నుంచి 22 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** ఆగస్టు 26 నుంచి 27 వరకు
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 29
- **ఎంపికైన అభ్యర్థుల రిపోర్టింగ్:** ఆగస్టు 30 నుంచి సెప్టెంబరు 2 వరకు
- **మిగిలిన సీట్ల వివరాలు వెల్లడి:** సెప్టెంబరు 2
- **వెబ్‌సైట్:** www.ysrafu.ac.in, https://apsche.ap.gov.in/arch/

విజయవాడలోని డా.ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(డా.ఎన్‌టీఆర్‌యూహెచ్‌ఎస్)- మెడికల్, డెంటల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో మేనేజ్‌మెంట్, ఎన్‌ఆర్‌ఐ కోటా సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వర్సిటీకి అనుబంధంగా ఉన్న ప్రైవేట్ అన్ ఎయిడెడ్ నాన్ మైనారిటీ, మైనారిటీ మెడికల్&డెంటల్ కళాశాలల్లో బీ కేటగిరీ, సీ కేటగిరీ(ఎన్‌ఆర్‌ఐ) సీట్లు; తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలోని శ్రీ పద్మావతీ మెడికల్ కాలేజ్ ఫర్ ఉమెన్‌లోని ఎన్‌ఆర్‌ఐ సీట్లు; నూతనంగా అనుమతించిన ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లోని కాంపిటెంట్ అథారిటీ కోటా(సెల్ఫ్ ఫైనాన్సింగ్/ఎన్‌ఆర్‌ఐ) సీట్లు భర్తీ చేయనున్నారు. ప్రభుత్వ/ప్రైవేట్ కళాశాలలు, సీట్ల వివరాల కోసం సంస్థ వెబ్‌సైట్‌లో చూడవచ్చు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

## డా.ఎన్‌టీఆర్‌యూహెచ్‌ఎస్ అనుబంధ కళాశాలల్లో
# మేనేజ్‌మెంట్ కోటా



**అర్హత:** అభ్యర్థులు గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ(బోటనీ, జువాలజీ)/బయోటెక్నాలజీ ఉత్తీర్ణులై ఉండాలి. ఓబీసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. నీట్ యూజీ 2024 అర్హత పొంది ఉండాలి. ఇందులో జనరల్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 720-162; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 161-127; జనరల్/ఈడబ్ల్యూఎస్ దివ్యాంగులకు 161-144 స్కోర్‌ను కటాఫ్‌గా నిర్దేశించారు. విద్యార్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి.

- ఎన్‌ఆర్‌ఐలు, ఎన్‌ఆర్‌ఐల రక్త సంబంధీకులు మాత్రమే ఎన్‌ఆర్‌ఐ కోటా సీట్లకు అప్లయ్ చేసుకోవాలి. నూతన మెడికల్ కళాశాలల్లోని సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లకు స్థానికులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.10,620
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 21
- **వెబ్‌సైట్:** https://drntr.uhsap.in

## నేషనల్ లా స్కూల్లో
# లీగల్ ప్రోగ్రామ్‌లు

బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ(ఎన్‌ఎల్‌ఎస్ఐయూ)- మాస్టర్ ఆఫ్ బిజినెస్ లాస్(ఎంబీఎల్), పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. వీటిని ప్రొఫెషనల్ అండ్ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్(పీఏసీఈ) కింద బ్లెండెడ్ లెర్నింగ్ ఫార్మాట్‌లో నిర్వహిస్తారు. ఆన్‌లైన్ సెషన్స్, హైబ్రిడ్ ప్రోగ్రామ్స్ ఉంటాయి.

**మాస్టర్ ఆఫ్ బిజినెస్ లాస్(ఎంబీఎల్):** ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో పది కోర్సులు ఉంటాయి. మొదటి ఏడాది కాంట్రాక్ట్ లా, బ్యాంకింగ్ లా, కార్పొరేట్ లా, ఇండస్ట్రియల్ రిలేషన్స్ లా, ఎన్విరాన్‌మెంటల్ లా కోర్సులు; రెండో ఏడాది ఇన్వెస్ట్‌మెంట్ లాస్, ఇన్సూరెన్స్ లాస్, ఇంటర్నేషనల్ కమర్షియల్ ట్రాన్సాక్షన్స్ అండ్ ఫారిన్ ట్రేడ్, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లాస్, టాక్సెస్ ఆన్ కార్పొరేషన్స్ కోర్సులు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు లా ఆఫీసర్, లీగల్ అసిస్టెంట్, లీగల్ అడ్వైజర్‌గా రాణించవచ్చు.

**పీజీ డిప్లొమా:** ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో ఆర్బిట్రేషన్ లా, చైల్డ్ రైట్స్ లా, కన్జ్యూమర్ లా అండ్ ప్రాక్టీస్, సైబర్ లా అండ్ సైబర్ ఫోరెన్సిక్స్, ఎన్విరాన్‌మెంటల్ లా, హ్యూమన్ రైట్స్ లా, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ లా, మెడికల్ లా అండ్ ఎథిక్స్, టాక్సేషన్ లా స్పెషలైజేషన్‌లు అందుబాటులో ఉన్నాయి. స్పెషలైజేషన్‌ను అనుసరించి ఈ ప్రోగ్రామ్ జర్నలిస్టులు, అడ్వకేట్‌లు, రైట్స్ యాక్టివిస్ట్‌లు, డాక్టర్‌లు, నర్స్‌లు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్‌లు, హెల్త్ వర్కర్‌లు, ఎన్విరాన్‌మెంటల్ ప్రొఫెషనల్స్, ఎన్‌జీఓలు, లీగల్-ఎడ్యుకేషనల్-రీసెర్చ్ విభాగాలకు చెందిన ప్రొఫెషనల్స్‌కు ఉపయుక్తంగా ఉంటుంది. పూర్తి సమాచారం కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

**అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. సీఏ, సీఎస్, ఐసీడబ్ల్యూఏఐ కోర్సులు పూర్తిచేసినవారు; ఓపెన్ యూనివర్సిటీలలో చదివినవారు; డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా డిగ్రీలు పొందిన వారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 10
- **వెబ్‌సైట్:** https://pace.nls.ac.in/



ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- 'సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఇన్ ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ మేనేజ్‌మెంట్'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీని వ్యవధి నాలుగు నెలలు. ఇది ఆన్‌లైన్ వీకెండ్ ప్రోగ్రామ్. ఇందులో ఆరు మాడ్యూల్స్ ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా ఎక్స్‌పోర్ట్/ఇంపోర్ట్ డాక్యుమెంటేషన్, లాజిస్టిక్స్, ఫైనాన్స్, ఇంటర్నేషనల్ మార్కెటింగ్, లీగల్ యాస్పెక్ట్స్ ఆఫ్ ట్రేడ్ తదితర అంశాలు వివరిస్తారు. ఆన్‌లైన్ అసెస్‌మెంట్స్, అసైన్‌మెంట్స్, ప్రజంటేషన్స్, ప్రాజెక్ట్ వర్క్ ఉంటాయి. లెర్నింగ్ వెబ్ పోర్టల్‌కు లైఫ్ టైం యాక్సెస్, కోర్సు మెటీరియల్ ఇస్తారు. కోర్సు చివరలో ఫైనల్ ఎగ్జామ్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ప్రతి సబ్జెక్టులో కనీసం 50 శాతం మార్కులు వస్తేనే సర్టిఫికెట్ ఇస్తారు. ఎంట్రీ/మిడిల్/సీనియర్ లెవెల్ ఎగ్జిక్యూటివ్‌లు, ఆంత్రప్రెన్యూర్స్, వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఈ ప్రోగ్రామ్ ఉపయోగకరంగా ఉంటుంది.

# ఐఐఎఫ్‌టీలో సర్టిఫికెట్ కోర్సు

**కోర్సు వివరాలు:** వారాంతాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల పదిహేను నిమిషాల వరకు మరల సాయంత్రం రెండు గంటల నుంచి అయిదు గంటల పదిహేను నిమిషాల వరకు ఆన్‌లైన్ సెషన్స్ నిర్వహిస్తారు. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి.

**మాడ్యూల్స్:** గ్లోబల్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్ 30 గంటలు, ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆపరేషన్స్ అండ్ డాక్యుమెంటేషన్ 30 గంటలు, ఇంటర్నేషనల్ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్ 20 గంటలు, ఇండియాస్ ఫారిన్ ట్రేడ్ పాలసీ 20 గంటలు, ఇంటర్నేషనల్ ట్రేడ్ లాజిస్టిక్స్ 30 గంటలు, ఎగ్జిమ్ ఫైనాన్స్ 20 గంటలు సెషన్స్ నిర్వహిస్తారు.

**అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ/తత్సమాన కోర్సు పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

**ముఖ్య సమాచారం**

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.75,000+18 శాతం జీఎస్టీ(దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం వరకు ఫీజు రాయితీ లభిస్తుంది)
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** సెప్టెంబరులో
- **వెబ్‌సైట్:** iift.ac.in



జాబ్ కార్నర్

## ఝజ్జర్ ఎయిమ్స్‌లో
# డేటా ఎంట్రీ ఆపరేటర్లు

మొత్తం ఖాళీలు 34

ఝజ్జర్(హరియాణా)లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ దరఖాస్తులు కోరుతోంది.

1. డేటా ఎంట్రీ ఆపరేటర్: **7 పోస్టులు**
2. ల్యాబ్ టెక్నీషియన్: **7 పోస్టులు**
3. మల్టీ టాస్కింగ్ స్టాఫ్: **6 పోస్టులు**
4. టెక్నాలజిస్ట్(ఓటీ): **5 పోస్టులు**
5. పేషెంట్ కేర్ మేనేజ్‌మెంట్: **2 పోస్టులు**
6. రేడియోగ్రాఫర్: **7 పోస్టులు**

**అర్హత:** ఇంటర్మీడియట్, పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ(మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ/మెడికల్ ల్యాబొరేటరీ సైన్స్/అనస్తీషియా/ఆపరేషన్ థియేటర్ టెక్నాలజిస్ట్/రేడియోగ్రఫీ) ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

**వయోపరిమితి:** 18-40 ఏళ్లు మించకూడదు

**దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ దరఖాస్తులను ప్రాజెక్ట్ మేనేజర్(హెచ్ఆర్), బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్(బీఈసీఐఎల్), బీఈసీఐఎల్ భవన్, సీ-56/ఏ-17, సెక్టార్-62, నోయిడా చిరునామాకు పంపాలి.

**ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** ఆగస్టు 27

**వెబ్‌సైట్:** https://www.becil.com/vacancies

BECIL బేసిల

## పీజీడీఏవీ కాలేజీలో
# అసిస్టెంట్ ప్రొఫెసర్లు

మొత్తం ఖాళీలు 8

ఢిల్లీలోని పన్నాలాల్ గిరిధర్‌లాల్ దయానంద్ ఆంగ్లో-వేద కళాశాల(పీజీడీఏవీ)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

**విభాగాలు:** ఆర్ట్స్, కామర్స్, లా, సోషల్ సైన్సెస్, లైబ్రరీ సైన్స్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ తదితరాలు

**అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో డిగ్రీ, పీజీ, నెట్ లేదా పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి

**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 24

**వెబ్‌సైట్:** https://www.pgdavcollege.in/



## వెస్ట్రన్ రైల్వేలో
# స్పోర్ట్స్ కోటా పోస్టులు

మొత్తం ఖాళీలు 64

ముంబయిలోని భారత ప్రభుత్వ రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్ - వెస్ట్రన్ రైల్వే... స్పోర్ట్స్ కోటాలో గ్రూప్ 'సి'/గ్రూప్ 'డి' పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. లెవెల్-4/5: **5 పోస్టులు**
2. లెవెల్-2/3: **16 పోస్టులు**
3. లెవెల్-1: **43 పోస్టులు**

**అర్హత:** లెవెల్-4/5 పోస్టులకు ఏదైనా డిగ్రీ; లెవల్-2/3 పోస్టులకు ఐటీఐ, పన్నెండో తరగతి; లెవల్-1 పోస్టులకు పదో తరగతి, ఐటీఐ/డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు క్రీడాంశాల్లో వివిధ స్థాయుల్లో విజయాలు సాధించి ఉండాలి.

**క్రీడాంశాలు:** బాస్కెట్‌బాల్, క్రికెట్, రెజ్లింగ్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్, బాడీ బిల్డింగ్, సైక్లింగ్, హాకీ, ఖో-ఖో, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్

**వయోపరిమితి:** 2025 జనవరి 1 నాటికి 18 నుంచి 25 సంవత్సరాల మధ్య ఉండాలి.


**ఎంపిక విధానం:** విద్యార్హత, క్రీడా విజయాలు, గేమ్ స్కిల్, ఫిజికల్ ఫిట్‌నెస్, ట్రయల్స్ సమయంలో కోచ్ పరిశీలించే అంశాలు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా.

**దరఖాస్తు రుసుము:** రూ.500. ఎస్సీ/ఎస్టీ/ఈఎస్‌ఎం/దివ్యాంగులు/మహిళలు/మైనార్టీలు/ఈబీసీ అభ్యర్థులకు రూ.250.

**ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** సెప్టెంబరు 14

**వెబ్‌సైట్:** https://www.rrcwr.com/

లిటిల్స్



# తెలివైన నక్క

ఒక అడవిలోని చెరువులో ఉండే మొసలికి చాలా రోజులుగా అదే చెరువులోని చేపలను తినీతినీ విసుగు పుట్టింది. వేరే ఏదైనా జంతువు ఆహారంగా దొరికితే బాగుండు అనుకున్నది. వెంటనే తన మిత్రుడైన పీతను పిలిచి, 'నువ్వు అడవిలోకి వెళ్లి., అన్ని జంతువులకు మొసలి చనిపోయింది అని చెప్పు. అపుడు అవి భయం లేకుండా ఇక్కడికి నీళ్ల తాగడానికి వస్తాయి. సమయం చూసి, నేను ఏదో ఒక జంతువును పట్టుకుని తింటాను' అని చెప్పింది. పీత వెళ్లి మొసలి చెప్పినట్టే అడవిలో చెప్పింది. దాని మాటలు ఒక నక్క తప్ప మిగతా అన్ని జంతువులు నమ్మాయి.




నక్క మాత్రం 'మిత్రులారా.. దీని మాటలు నమ్మవద్దు. మనమే స్వయంగా చెరువు దగ్గరికి వెళ్లి చూద్దాం పదండి'అని జంతువులను బయల్దేరదీసింది. చెరువు దగ్గరికి చేరగానే, నక్కమిగతా జంతువులతో ఇలా అన్నది. మిత్రులారా.. నేను విన్న దాని ప్రకారం మొసలి చనిపోయినా దాని తోక మాత్రం కదులుతూనే ఉంటుందట. కాబట్టి ఈ మొసలి తోక కదిలితే మనం నమ్మవచ్చుఅన్నది. ఆ మాటలు విన్న తెలివి తక్కువ మొసలి తాను చనిపోయానని నమ్మించడానికి మెల్లగా తన తోకను కదిలించడం మొదలు పెట్టింది. అదిచూసిన నక్క మిత్రులారా.. నేను ఊహించింది నిజమే. ఈ మొసలి చావలేదు నాటకమాడుతుంది. మనం చెరువు దాకా వస్తే మనలో ఎవరినైనా చంపవచ్చని దీని పన్నాగం.అందుకే నా మాట వినగానే తోక కదిలిస్తోంది పదండి ఇక్కడినుండి పోదాం' అంటూ అన్ని జంతువులప్రాణాలు ఆ రోజు తన ఉపాయంతో కాపాడింది తెలివైన నక్క. మిగతా జంతువులన్నీ దానికి ఆ రోజు కృతజ్ఞతలు చెప్పాయి.

## దారి కనుక్కోండి



## 10 తేడాలు గుర్తించండి



## సరైన నీడ కనుక్కోండి



## ఏవి ఎన్ని



## డైలీ సుడోకు - 387

| | | | | | |
|---|---|---|---|---|---|
| | 2 | | | | 4 |
| | | | 3 | | |
| 5 | 4 | | | | 1 |
| 2 | | | | 4 | 3 |
| | | 5 | | | |
| 1 | | | | 3 | |

సుడోకు - 386 సమాధానం

| | | | | | |
|---|---|---|---|---|---|
| 3 | 6 | 5 | 2 | 4 | 1 |
| 2 | 4 | 1 | 3 | 6 | 5 |
| 1 | 2 | 4 | 6 | 5 | 3 |
| 5 | 3 | 6 | 4 | 1 | 2 |
| 6 | 5 | 2 | 1 | 3 | 4 |
| 4 | 1 | 3 | 5 | 2 | 6 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.